వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 18 సంచిక : 4 - 5 హైదరాబాద్ 225 ఏప్రిల్-మే 2020 పేజీలు : 82 రు. 25

- కోవిడ్ - 19పై 11 ప్రత్యేక వ్యాసాలు
- తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ - ఒక పరిశీలన
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికలు
- సామాజిక న్యాయానికి సుప్రీం గొడ్డలిపెట్టు
- కార్పొరేట్ల గుత్తాధిపత్యంలోకి మహారత్న
- ఆనంద్ తేల్తుంబ్డే, గౌతమ్ నవ్లాఖా లేఖలు
- ఐక్య సంఘటన ఎత్తుగడలు - లెనిన్

వీక్షణం విస్తరణ కోసం కృషి చేద్దాం

వీక్షణం ప్రజాపక్షం వహించిన నాటి నుండి నేటి వరకు చెక్కు చెదరని చూపుతో సమకాలీన ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులకు అద్దం పడుతూ పాఠకలోకానికి కరదీపికగా నిలబడి ప్రత్యేకతను చాటుతున్న మాసపత్రిక. ప్రజలకోసం నిరంతరం పరితపించేవారు ప్రభుత్వ అనాలోచిత, అక్రమ విధానాలపై, విధ్వంసకర పోకడలపై ఎక్కుపెట్టిన వ్యాసాస్త్రాలతో పలువురి మేధావుల ఆలోచనాక్షరాలకు వేదికైంది. కాని అదే సందర్భంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో అడుగులేస్తుందని తెలిసి ఇటీవలి కాలంలో సూర్యాపేట పాఠకలోకం ప్రజల చూపుగా మారిన వీక్షణం రెప్పలు వాల్చకూడదని వీక్షణాన్ని కంటికి రెప్పలా కాపాడుకుందామని ప్రతిజ్ఞ చేసి ముందుకు రావడం జరిగింది.

పత్రిక మనుగడకోసం ప్రాథమికంగా పాఠకలోకాన్ని పెంచడానికి కృషి చేస్తూ, మరోవైపు విరాళాల కోసం చైతన్య హృదయాలు ప్రకటనల చేయుత కోసం బయలుదేరింది. 5 సంవత్సరాల కాలవ్యవధి గల సభ్యత్వాలతో 50 పత్రికలు, సంవత్సరం, రెండు సంవత్సరాల వ్యవధితో మరికొన్ని సభ్యత్వాలను చేర్పించాం. వీక్షణానికి ఉన్న ఇమేజ్ వల్ల అడిగిన ప్రతివారు అంగీకరించడాన్ని గమనించాలి. దీనికి తోడు వీక్షణం అభిమానులు విరాళాలను అందించారు. మొత్తంగా రు. 1,00,000 వీక్షణం నిధిని యాజమాన్యానికి అందించాం.

పాఠకులుగా వీక్షణం పరిరక్షణా కార్యకర్తలుగా ఈ పని మాకెంతో ఆనందానిచ్చింది. ఈ కర్తవ్యం మిగిలిన జిల్లాల, పెద్దపెద్ద పట్టణాల్లోని వీక్షణం మిత్రులు, ఆలోచనాపరులు, మేధావి వర్గం, ప్రజాస్వామిక వాదులు, ముఖ్యంగా పాఠకులు ఆయా ప్రాంతాల్లో శక్తి మేరకు, చేతనైనంత ప్రయత్నం చేస్తే వీక్షణం పదికాలాల మనుగడకు మరింత ఉపయోగపడిన వారవుతారని మా ఆశ.

ఈ కర్తవ్య నిర్వహణలో వీక్షణం ఎడిటోరియల్ కలెక్టివ్ మెంబర్ డా. ఎ. పున్నయ్య, సూర్యాపేట జిల్లా డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు ఎం. దశరథరామారావు, ప్రధాన కార్యదర్శి ఆరే లింగయ్య, స్టేట్ కౌన్సిలర్స్ పబ్బతి వెంకటేశ్వర్లు, సి. హెచ్. వెంకటేశ్వర్లు, కె. యోగానంద్, సి. హెచ్. యాదగిరి, సింహాద్రి, శ్రవణ్‌కుమార్, నర్సయ్య, ఆనంద భాస్కర్, బి. వెంకటేశ్వర్ రావు, కవిత, మాధవి, ప్రభాకర్, సిద్దిక్ పాషా తదితరులు ఈ సేకరణలో ఎంతో సహకరించారు. ఈ మొత్తం కార్యచరణ వీక్షణం పాఠకునిగా పరిచయమై వ్యాసకర్తైన గొడిశాల వెంకటేశ్వర్లు నేతృత్వంలో జరిగింది. వెంకటేశ్వర్లు గారు వీక్షణం విస్తరణ కోసం చేస్తున్న ప్రయత్నం పలు జిల్లాలకు స్ఫూర్తి కావాలని కోరుకుంటున్నారు. అరుదయిన పత్రిక వీక్షణం ఆగిపోకుండా కొనసాగేందుకు మనమంతా సహాయానందిద్దాం.

ఇట్లు

వీక్షణం మిత్ర బృందం

సూర్యాపేట

225

ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

ఏప్రిల్–మే 2020
సంపుటి : 18
సంచిక : 4 – 5

కోవిడ్ 19 - ప్రత్యేక వ్యాసాలు

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ ఆంధ్రబ్యాంక్ ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై '**VEEKSHANAM**' అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 0000139** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

వీక్షణం ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ వీక్షణంను నిలబెట్టుకోవాలనే తపనతో ఆర్థిక సహాయం అందించిన కొమ్మన బాబు,వైరా,ఖమ్మం - రు. 5,000; కోరుకొండ సత్తిబాబు, తూర్పుగోదావరి - రు. 1,000; మిత్రులకు కృతజ్ఞతలు - సం.

వీక్షణం మార్చ్ సంచికలో వచ్చిన అన్ని వ్యాసాలు బాగున్నాయి. బి.ఎస్. రాజు రాసిన 'బిఎస్ఎన్ఎల్ అధోగతికి కారకులెవరు' వ్యాసంలో ఇప్పటి పాలకులు ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ సంస్థలకు ఎలా కట్టబెడుతున్నారో చక్కగా వివరించారు. ఎప్పటి నుంచో గ్రామీణ ప్రజలకు, పట్టణ ప్రజలకు సేవలనందిస్తున్న టెలికాం రంగం (బిఎస్ఎన్ఎల్) ను ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పి ఆ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల, ప్రజల జీవితాలను ఎలా సంక్షోభంలో తీసుకుపోతుందో చక్కగా వివరించారు. అలాగే 'సమ్మక్క – సారలమ్మ' జాతర గురించి అరుణ్‌కుమార్ రాసిన వ్యాసంలో అక్కడి ఆదివాసుల గురించి, వారు కొలిచే సమక్క – సారలమ్మల గురించి, వారి సంస్కృతి, సాంప్రదాయాల గురించి వివరంగా రాశారు. ఇప్పటి ప్రభుత్వం సమ్మక్క – సారలమ్మ జాతరలో ఆదివాసుల పాత్రను తగ్గించి, ఆదివాసేతరులను ప్రోత్సహించి అక్కడి అటవీ సంపదను ఎలా కొల్లగొట్టాలని చూస్తున్నదో వివరంగా తెలిపారు. ఆదివాసులు వారి సంస్కృతి, సాంప్రదాయాలతో సమ్మక్క – సారలమ్మలను కొలుస్తారు. కాని ఇప్పటి పాలకులు ఆ జాతరను ఎలా వ్యాపారమయం చేస్తున్నారో చక్కగా వివరించారు.

– కృష్ణహరి
మహబూబ్‌నగర్

గత ఏడు సంవత్సరాలుగా క్రమం తప్పకుండా వీక్షణం పత్రికను చదువుతున్నాను. వీక్షణంలో వచ్చిన ప్రతి వ్యాసం ఆయా కాలంలో జరుగుతున్న పరిణామాల గురించి వివరంగా ఉంటాయి. అలాగే మార్చ్ సంచికలో కేంద్ర బడ్జెట్‌పై వచ్చిన రెండు వ్యాసాలు వివరంగా ఉన్నాయి. సామాన్య ప్రజల జీవితాలను చీకట్లోకి నెట్టేసి, కార్పొరేట్లకు పెద్ద ఎత్తున రాయితీలు ఇవ్వడం చూస్తుంటే కేంద్ర ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తుందో అర్థం చేసుకోవచ్చు. విజయ్ మాల్యా లాంటి వారు బ్యాంకుల నుండి వేల కోట్లు కొల్లగొట్టి విదేశాలలో జల్సాలు చేస్తుంటే పట్టించుకోని కేంద్రం, అన్ని ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టి సామాన్య ప్రజల జీవితాలను ఛిద్రం చేయాలని చూస్తున్నది. కరోనా మహమ్మారి కారణంగా ఏప్రిల్, మే పత్రికలు ఇప్పటి వరకు రాలేవు. ఎప్పటికప్పుడు ఎన్నో కొత్త విషయాలు అందిస్తున్న వీక్షణం పత్రిక సమాజానికి ఎంతో అవసరం. ఇప్పటికైనా పత్రికను ఎప్పటిలాగే కొనసాగిస్తారని అనుకుంటున్నాను..

– మాధవ్‌కుమార్
జహీరాబాద్

వీక్షణం మార్చ్ సంచికలో కేంద్ర బడ్జెట్‌పై వచ్చిన రెండు వ్యాసాలు ఇరువురు రచయితలు బడ్జెట్‌ను వివిధ రంగాల వారిగా ప్రభుత్వం కేటాయించిన తీరుపై సమగ్ర విశ్లేషనను అందించారు. సాధారణంగా బడ్జెట్ మార్చ్‌లో ప్రవేశపెడతారు. కాని ఈ సారి మాత్రం ప్రభుత్వం ఒక నెల ముందే బడ్జెట్‌ను ప్రవేశపెట్టి తన అసమర్థతను కప్పిపుచ్చుకున్న తీరును రచయితలు బయట పెట్టారు. అసలే ఆర్థిక సంక్షోభం, సంవత్సర కాలంలో రాని ఆదాయాన్ని రానున్న ఒక్క నెల రోజుల్లోనే వస్తుందని చూపించిన కాకి లెక్కలను బహిర్గతపరిచారు. సామాన్యులకు ప్రాధాన్యత రంగాలైన వ్యవసాయ, గ్రామీణాభివృది, విద్య, వైద్యానికి బడ్జెట్‌లో నామమాత్రపు కేటాయింపులు చేస్తూ, ప్రభుత్వ సంస్థలను మూసివేస్తూ కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇస్తున్న తీరును తేటతెల్లం చేశారు. బడ్జెట్ పేరుతో ప్రభుత్వం చేసే అంకెల గారడీని వివరించారు. దేశం తీవ్ర ఆర్థిక మాంద్యంలో కొట్టుమిట్టాడుతున్న సందర్భంలో అందులో నుంచి బయటపడే విధానాలకన్నా కూరుకుపోయే విధంగానే ఈ సందర్భంగా ప్రభుత్వం వ్యవహరించిన తీరును వివరించిన రచయితలకు అభినందనలు.

– స్వరూప్‌కుమార్
కరీంనగర్

ఈ కరోనా సంక్షోభ కాలంలో వీక్షణం పత్రికను చాలా మిస్ అవుతున్నాం. నెల నెలా స్థానిక, ప్రాంతీయ, దేశీయ, అంతర్జాతీయ వేదికలపై సామాజికార్థిక, రాజకీయ అంశాల గురించి విశ్లేషణాత్మకమైన వ్యాసాలు అందించే వీక్షణం పత్రిక ఏప్రిల్, మే సంచికలు రాకపోవడంతో ఎంతో వెలితి అనిపించింది. అయితే కరోనా వల్ల ఉన్న పరిస్థితుల వల్ల ఎవరు కూడా ఏమీ చేయలేని పరిస్థితి. అయితే వీక్షణం వెబ్‌సైట్‌పై పత్రికను అందిస్తామని చేసిన ప్రకటన ఎంతో సంతోషాన్నిచ్చింది. దినపత్రికలు, సోషల్ మీడియాలో, టివిలు, ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా ఏరోజుకారోజు వార్తలు, విశేషాలు చదువుకోవడం, చూడడం, వినడం జరుగుతుంది. కాని వాటిల్లో రాజకీయార్థిక విషయాలపై విశ్లేషణ చేస్తూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ వ్యాసాలు ఎక్కువగా కనబడవు. ప్రభుత్వ విధానాలపై సమగ్రంగా అధ్యయనం చేసి వీక్షణంలో అందించేవారు. రాష్ట్ర, కేంద్ర బడ్జెట్లు వచ్చాయి వాటి పై ప్రతి ఏడాది వీక్షణంలో మంచి వ్యాసాలు అందేవి. కరోనా కాలంలో ప్రభుత్వ విధానాలు, వైఫల్యాలు, ప్రజల గోస, ముఖ్యంగా వలస కార్మికుల దీనస్థితి చూస్తుంటే సమాజ దుస్థితి కళ్లకు కనిపిస్తుంది. ప్రభుత్వాలు ప్రజల మధ్య ఉంచాల్సిన భౌతిక దూరాన్ని నిజంగానే సామాజిక దూరంగా మార్చివేశాయి. వీక్షణం ఈ విషయాలన్నిటిపై వ్యాసాలు ప్రచురించేది. వీక్షణం పత్రికవారు వచ్చే సంచికలో ఈ విషయాలను అన్నిటిపై సమగ్రంగా వ్యాసాలు ప్రచురించాలని కోరుతున్నాను. అలాగే సంక్షోభ కాలంలో ఎన్నో పత్రికలు మూతపడుతున్న సందర్భంలో ఆర్థిక పరిస్థితి ఎంతో క్లిష్టంగా ఉన్నా క్రమం తప్పకుండా తెస్తున్న వీక్షణం బృందానికి పాఠకులుగా మనవంతు బాధ్యతగా వారికి అండగా ఉందాం. ప్రతి ఒక్క పాఠకులు ఈ విషయం గురించి ఆలోచిస్తారని ఆశిస్తూ..

– టి. కృష్ణకుమార్
నల్లగొండ

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

(ఈ సంచికలోని హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం, ప. గోదావరి జిల్లాల అసహజ మరణాల వివరాలు అందిస్తున్నవారు ఎస్. వెంకటేశ్)

ప్రకృతి విపత్తును మించిన పాలక దుర్మార్గం

కరోనా వైరస్ పుట్టుకకూ వ్యాప్తికీ, ఆ మహావిపత్తు దుష్పరిణామాలకూ కారణాలను కొంతవరకు ప్రకృతి మీదికి నెట్టడానికి మార్చ్ దాకానైనా వీలున్నదేమో గాని, మార్చ్ నుంచి ఎనిమిది పది వారాలుగా జరుగుతున్న పరిణామాలన్నీ ఈ దురాగతంలో పాలకుల, ప్రభుత్వాల దుర్మార్గాల పాత్ర ఎంత ఎక్కువో చెప్పడానికే నిదర్శనంగా ఉన్నాయి. జనవరి మొదటి వారానికే ప్రపంచదేశాలలో ఈ వైరస్ గురించి చర్చ మొదలైనప్పటికీ, ప్రపంచ ఆరోగ్య సంస్థ జనవరి 30న రానున్న మహావిపత్తు తీవ్రత గురించి తొలి హెచ్చరిక చేసినప్పటికీ, భారత పాలకులు ఆ తర్వాత ఏడువారాల పాటు నిమ్మకు నీరెత్తినట్టు కూచున్నారు. ఈ వైరస్ విదేశీ ప్రయాణికుల ద్వారా తప్ప మరొక రకంగా రావడానికి వీలులేదని స్పష్టమైన ఆధారాలున్నప్పటికీ, కనీసం అంతర్జాతీయ విమానాశ్రయాలలో ప్రయాణికుల రాక మీద ఆంక్షలు, నియంత్రణ, ప్రయాణికుల వైద్య పరీక్షలు, క్వారంటైన్ వంటి చేయవలసిన పనుల్లో ఏ ఒక్కటీ చేయలేదు. పైగా ఈ ఏడు వారాలలోనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ను ఆహ్వానించి, లక్షలాది మందితో సభలు నిర్వహించడం దగ్గరి నుంచి, మధ్యప్రదేశ్ లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చి భారతీయ జనతా పార్టీ ప్రభుత్వాన్ని గద్దెనెక్కించే కుట్రల దాకా సాగించారు. కేంద్ర ప్రభుత్వ ప్రవర్తనే ఇలా ఉన్నప్పుడు, రాష్ట్ర ప్రభుత్వాలన్నీ తలచుకున్నా భిన్నమార్గం పట్టే అవకాశం లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే, జనవరి 30 నుంచి మార్చ్ 22 దాకా భారత ప్రజల ఆరోగ్య భద్రత పట్ల పాలకులు అనుసరించినది కేవలం అలక్ష్యం, క్రియాశూన్యత, బాధ్యతారాహిత్యం మాత్రమే. సరిగ్గా ఈ ఏడు వారాల కాలమే వైరస్ ప్రవేశాన్ని, వ్యాప్తిని అడ్డుకోవడానికి కీలకమైన కాలం.

మార్చ్ 22న జనతా కర్ఫ్యూతో ప్రారంభించి ఇది రాస్తున్న మే 10న సాగుతున్న మూడో లాక్‌డౌన్ దాకా సాగిన ఏడు వారాల్లో కూడ పాలకుల స్పందన యథాలాపంగా, హాస్యాస్పదంగా, బాధ్యతారహితంగా, నిర్లక్ష్యంగా, దుర్మార్గంగా ఉన్నది. వైద్య ఆరోగ్య వ్యవస్థలను మెరుగుపరచడం, ఎక్కువ సౌకర్యాలు కల్పించడం, ఎక్కువ ఆసుపత్రులను నెలకొల్పడం, ఎక్కువ పరీక్షలు చేయడం, వ్యాధి సోకగల, వ్యాపించగల ప్రాంతాలను గుర్తించి కట్టడి చేయడం, వ్యాధి సోకినవారిని వేరు చేసి మిగిలిన వారికి వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవడం, వైరస్ గురించి ప్రజల్లో అవగాహన పెంచడం వంటి అత్యవసర చర్యల గురించి ప్రభుత్వాలు ఆలోచించనే లేదు. బాల్కనీల్లో నిలబడి చప్పట్లు కొడితే, పళ్లాలు మోగిస్తే, శంఖాలు ఊదితే కరోనా వైరస్ పారిపోతుందన్న మూఢనమ్మకాన్ని ప్రచారం చేయడం పాలకుల మొట్టమొదటి స్పందన. అది అసలు వైరస్ పట్ల స్పందించవలసిన తీరే కాదని విమర్శలు రాగానే మర్నాటికల్లా హఠాత్తుగా ఎటువంటి హెచ్చరిక లేకుండా, సమయం ఇవ్వకుండా, ముందస్తు ఏర్పాట్లు లేకుండా లాక్‌డౌన్ ప్రకటన రెండో స్పందన. వైరస్ బారిన పడిన విదేశాలు లాక్‌డౌన్ ప్రకటించాయి గనుక ఇక్కడ కూడ పాటించవలసిందే అనే అనుకరణ ధోరణి తప్ప, భారత సమాజపు వాస్తవ స్థితి ఏమిటి, ఇక్కడ ఎటువంటి వైద్య ఆరోగ్య వ్యూహం అనుసరించవలసి ఉన్నదనే ఆలోచనే లేదు. ఆ లాక్‌డౌన్ ను విదేశాలు డెబ్బై రోజుల వరకూ కొనసాగించాయి కాబట్టి ఇక్కడ కూడ మార్చ్ 24న ప్రకటించిన లాక్‌డౌన్ సమయాన్ని ఏప్రిల్ 14న, మే 3న పొడిగిస్తూ వచ్చి, ఇది రాస్తున్న సమయానికి మే 17 దాకా చేశారు. నీకంటే నేనొకటి ఎక్కువ అనదలచుకున్న రాష్ట్రపాలకులు, తెలంగాణాధీశుల లాగ, దాన్ని మే 29 దాకా పొడిగించారు. లాక్‌డౌన్ పేరుతో పరిశ్రమలు, కార్యాలయాలు, వ్యాపారాలు, రవాణా మూసివేస్తే వాటి మీద ఆధారపడిన కోట్లాది మంది ఏమైపోతారని, వారిని ఎట్లా ఆదుకోవాలని కనీస ఆలోచన కూడ పాలకులకు లేదు. అంతరాల సమాజంలో లాక్‌డౌన్ ఏ అంతస్తు ప్రజల మీద ఎటువంటి ప్రభావం వేస్తుంది, హానికరమైన ప్రభావం పడగల వర్గాలకు ఎటువంటి సహాయం అవసరమవుతుంది వంటి కనీస ఆలోచనలు పాలకులకు తట్టనైనా లేదు. దేశంలోని మొత్తం శ్రామిక, ఉద్యోగ జనాభాలో పది శాతం కూడ సంఘటిత రంగంలో లేరు. వారిలో కొందరికి మాత్రమే ఇంటి నుంచి పని చేయడానికి వీలుంటుంది. మిగిలిన అశేష శ్రామిక జనానికి లాక్‌డౌన్ ఒక్క కలం పోటుతో పని పోగొట్టింది. అంటే భుక్తి పోగొట్టింది. రోజువారీ పని వెతుక్కునే స్థితిలో ఉన్న కోట్లాది మందికి పని దొరకని స్థితి తలెత్తింది. పనులు ఆగిపోయి, కాంట్రాక్టర్లు చేతులు ఎత్తేసి దేశవ్యాప్తంగా పదిహేను కోట్ల వలస శ్రామికుల్లో అత్యధికులు బిచ్చగాళ్లుగా మారిపోయారు. లాక్‌డౌన్ ప్రకటించిన నాలుగైదు రోజులకు మేలుకొని ఈ సమస్యలు ఉన్నాయని గుర్తించి, వాటిని తీర్చడానికనే పేరుతో ప్రకటించిన మొదటి ఆర్థిక ప్యాకేజి పాత పథకాల్లోంచి అది కొంతా ఇది కొంతా చింపి కలిపి హడావుడిగా తయారుచేసిన కలగూరగంప. నిజంగా లాక్‌డౌన్ బాధితులకు ఉపయోగపడేదేదీ అందులో లేదు. నాలుగు వారాలు పోనిచ్చి రిజర్వ్ బ్యాంక్ చేత ప్రకటింపజేసిన రెండో ప్యాకేజీలో సంపన్నులకూ, బడా రుణగ్రహీతలకూ తప్ప లాక్‌డౌన్ బాధితులకు పనికొచ్చేదేదీ లేదు. తమను తమ గ్రామాలకు వెళ్లనిస్తే చాలునని వలస శ్రామికులు గగ్గోలు పెడితే, చివరికి వాళ్లంతట వాళ్లే రహదారులెక్కి వందల కిలోమీటర్లు నడుస్తుంటే, వాళ్లకోసం రైళ్లు వేస్తున్నామని ప్రకటించి, కోట్ల మంది శ్రామికుల కోసం వేసిన, నడిపిన రైళ్లు ఇప్పటికి ఒక లక్ష మందికి కూడ చోటివ్వలేదు. ఈలోగా ఈ వలస శ్రామికులు వెళ్లిపోతే, ఈ చౌక శ్రామికులు, వెట్టిబానిసలు మాకెక్కడ దొరుకుతారు అని యజమానులు గద్దించగానే శ్రామికుల ప్రయాణాల మీద లెక్క లేనన్ని ఆటంకాలు.... ఇలా చెపుతూ పోతే, భారత పాలకవర్గాలు ఈ ఏడు వారాలలోనే చూపిన అలక్ష్యం, చేసిన అక్రమాలు లెక్కలేనన్ని. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ పాలకులు ఎంత దుర్మార్గమైనవారో చూపడానికి ఈ ఏడువారాల గాథలు చాలు. అంతమాత్రమే కాదు, లాక్‌డౌన్ అడ్డం పెట్టుకుని పాలకులు చెపుతున్న అబద్ధాలు, తీసుకువస్తున్న అక్రమ విధానాలు, ప్రజావ్యతిరేక చట్టాలు, సాగిస్తున్న కేంద్రీకరణ, ప్రజా ఉద్యమాలపై నిర్బంధం, విస్తరిస్తున్న పోలీసు రాజ్యం ఈ పాలన ఎంత కుళ్లిపోయిందో అడుగడుగునా చూపుతున్నాయి. ఈ పాలన రద్దు కావలసిన అవసరం ఎంత బలంగా ఉన్నదో చూపుతున్నాయి. ప్రజా ప్రత్యామ్నాయాన్ని చూపి, అది సాధించడానికి చిత్తశుద్ధితో, దీక్షతో కృషి సాగించవలసిన శక్తుల బలహీనతే ఈ మరణశయ్య మీద ఉన్న పుచ్చిపోయిన రాజ్యం ఇంకా మనుగడలో ఉండేలా చేస్తున్నది. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

పచ్చి అబద్ధం గుడ నిజం తీర్గ ఇనవడవట్టె!

దొరవారు ఏయాళన మాట్లాడుడు మొదలు పెట్టింగ్రో గని, ఆయినె ఏది మాట్లాడిన ముచ్చట బెట్టినట్టు, తీగ సాగినట్టు, పూసగుచ్చినట్టు కమ్మగుంటది. అందునా ఆయినె వాడే తెలంగాణ పలుకుబడి ఎంత కటిక చేదు మాత్రకైనా చెక్కెర పూత పూస్తది. అసలే తెలంగాణ బిడ్డలు ఉబ్బుచ్చులోల్లు, ఆ మాట తీరుకె పడిపోతరు. ఇంతకు ఇదంత ఎందుకంటే దొరవారి నోట్లె పచ్చి అబద్ధం గుడ అంతకన్న నిజం లేదన్నట్టు ఇనబడ్తది. నిజమేందో పురాగ తెలిసిన మనిషి ముంగట గుడ అబద్ధం జెప్పి, దబాయించి, ఆ మనిషికే అనుమానం ఒచ్చేతట్టు జేసే ఇజ్జేదో దెలుసు మా దొరకు. గిప్పుడు గీ పెద్ద రోగం సంగతే చూడుగ్రి. మొట్టమొదాలుగా ఏమన్నడు దొర? ఎహె, ఒక్క జరం గోలి ఏస్కుంటె అంత సక్కగైపోతది. లేనిపోని పరిషాన్ బెట్టుకోకుండ్రి. కావాల్నంటే నన్ను జూడుండ్రి. నేను మూతికి గుడ్డ గట్టుకున్ననా, అంత ఉట్టిమాటలు అని కొట్టి పారేశె. రెండు నెల్లాయెనా? ఈ రెండు నెల్లల్ల ఆయినె ఎన్ని మాటలన్నడో లెక్క బెట్టు. ఒక మాటకు ఇంకో మాటకు పోలిక ఉన్నదా. నిన్న ఔనన్నది, ఇయాల కాదన్నది, రేపు మల్ల ఔనన్నది, నాలికెను ఎన్ని సుట్లు దిప్పిండో జూడు.

గదొక్కటే గాదు, ఇంకో రెండు ముచ్చెట్లున్నయి ఇను. మనకాడ ఎగుసప్పునులు చేయనీకో, బంగ్లలు గట్టనీకో, దుకాన్లల్ల, వోటల్లల్ల పనికో మస్తుమంది వస్తరు గద, గటు తూర్పు దేశం నుంచి, గిటు గంగ అవతలి నుంచి. తీరొక్క బాసలు మాట్లాడేటోల్లు. ఆల్లు ఎంత మందుంటరు? గుత్తెదారు బోయి తీస్కచ్చె, ఒక్క గుత్తెదారా, మేస్త్రీ, ముఠా మేస్త్రీ, గుంపు మేస్త్రీ, ఎన్ని తీర్ల చిన్నా పెద్దా గుత్తెదార్లున్నరు! గీ మజ్దూర్ల లెక్క యాడ్నన్న ఉన్నదా? అసలు సర్కారుకు దెలుసా? కాని, గీ పెద్దరోగం దగిలి, పనులన్ని బందువెట్టాల్నంటనంగనె, పాపం గీ మజ్దూర్ల బతుకులెవడన్న జూసెనా? దొరవారు కొలువు దీర్చి, ఈ మజ్దూర్లను మేం కడుపుల బెట్టుకుంటం, మూడు లక్షల ముప్పై ఆరు వేల ఇన్నూట ముప్పై ఒక్క మందున్నరు అని సుక్కలు లెక్కబెట్టినట్టె చెప్పె. సుక్కల లెక్కంతే గదా. నేనేదో ఒకటి చెప్త. కాదంటవా, నువ్వు లెక్కబెట్టి చూపెట్టు. కాని గీ మజ్దూర్ల లెక్క ఎటమటమైంది. మర్నాడే చిన్నదొరొచ్చి తొమ్మిది లక్షల మంది ఉన్నరన్నడు. అసలు పదిహేను లక్షల మంది ఉన్నరని సర్కార్ ఇంకోసోట రాసిపెట్టిందని ఇంకెవలో అన్నరు. ఏది నిజం, ఏది అబద్ధం, దేవునికెర్క! దొర మాట్లాడేది నిజం, ఇంకెవ్వడు మాట్లాడినా అబద్ధం అని ఒక ఖానూను దెస్తె సరిపోతది గద. నిజాం ప్రభువు అన్నడట, నా నోట్ల నుంచి మాటొస్తే ఖానూనే అని. గట్లనే ఉన్నది కత.

ఇంకొక్క ముచ్చట గుడున్నది. యాసంగి పంటలు అవ్వల్ దర్జగ పండినయి గద. ఒక్క గింజ గుడ బోనియ్యం, ప్రతొక్క గింజ కొంటం అన్నడు దొర. మీ ఊరి సంగతి నాకు దెల్వది గని, మా ఊళ్లనైతే గొనలే. అరిగోస పడ్డం. అఫ్సర్ల కాల్లు ఏల్లు మొక్కినం. కాలికేస్తె మెడకేసిరి, మెడకేస్తె కాలికేసిరి, అడ్డికి పావు సేరడిగిరి. తాలనిరి, తప్పరనిరి. మొత్తానికి సున్న జుట్టిరి. మా ఒక్క ఊళ్లనే గాదు, అన్ని ఊళ్లల్ల గిదే కత అని పోరలనబట్టి మరి నిజమంటేంది, అబద్ధమంటేంది గిప్పుడైన జెప్పు... వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్


ప్రజా హంతక ప్రభుత్వాలివి!

'శిశు హంతక రాజ్యం ఇది, పశు సంతతి పాలన ఇది' అని చెరబండరాజు రాసి యాభై ఏళ్లు కావస్తున్నది. శిశువులను మాత్రమే కాదు, మనుషులందరినీ చంపే హంతక నిర్లక్ష్య ప్రభుత్వాలు, పశు సంతతి అని పశువులను అవమానించగూడదని అనిపించేంత దుర్మార్గ ప్రభుత్వాలు ఇవాళ రాజ్యం చేస్తున్నాయి. విశాఖపట్నంలో ఎల్ జి పాలిమర్స్ నుంచి విషవాయువు బైటపడి అప్పటికప్పుడు పదకొండు మంది ప్రాణాలు తీసింది. కొన్ని వందల మందిని అనారోగ్యం పాలు చేసింది. దాదాపు లక్ష మందిని తక్షణం తరలించవలసి వచ్చింది. ఆ విషవాయువు దీర్ఘకాలిక ప్రభావాలు ఎలా ఉంటాయో ఇప్పటికింకా తెలియదు. ఆ కర్మాగారం పెట్టినప్పుడు ఊరికి దూరంగా ఉన్నదే కావచ్చు, కాలక్రమంలో ఊరు పెరిగి ఉండవచ్చు. కాని ఆ కాలక్రమంలో ప్రభుత్వాలు వహించిన నిర్లక్ష్యం, బాధ్యతా రాహిత్యం ఈ మరణాలకు, అనారోగ్యానికి బాధ్యత వహించాలి. కార్పొరేట్ కంపెనీలకు దాసోహం అంటూ వారు కోరినదల్లా ఇచ్చిన ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యాల, ప్రాణాల భద్రతను లెక్క చేయలేదని స్పష్టంగా కనబడుతున్నది. ఆ కంపెనీ పెట్టిన 1961లో గాని, అది విజయ్ మాల్యా చేతికి మారిన 1978 నాటికి గాని పర్యావరణ స్పృహ, కాలుష్యవాయువుల మీద అవగాహన అంతగా లేకపోవచ్చు. కాని విజయ్ మాల్యా కొరియన్ బహుళజాతి సంస్థ ఎల్ జి కి దాన్ని అమ్మకానికి పెట్టిన 1998 నాటికి పర్యావరణం గురించి పూర్తి అవగాహన ఉంది. అప్పటికే ఊరు పెరిగి, ఆ కర్మాగారం చుట్టూ జనావాసాలు వచ్చాయి. కాని ప్రభుత్వం కొరియన్ పెట్టుబడులు రావడమే ఘనకార్యమన్నట్టు పర్యావరణ అనుమతులను తుంగలో తొక్కి ఆ కంపెనీని ఆమోదించింది. ఆ కంపెనీ లోపల ఏమి జరుగుతున్నదో కూడ పట్టించుకోలేదు. ప్రతి విస్తరణకూ పర్యావరణ అనుమతి తీసుకోవాలనే నిబంధనలు 2006లో రూపొందాయి గనుక ఆ అనుమతులు తీసుకోకుండానే తాను చిన్నచిన్న విస్తరణలు సాగించుకుంటూ వచ్చానని, 2018లో కంపెనీయే స్వయంగా ఒక పత్రంలో చెప్పుకుంది. కాని అవేవీ చిన్న చిన్న విస్తరణలు కావు. విష రసాయనాలను భారీగా నిలువ ఉంచడానికి అవసరమైన విస్తరణలు. అవన్నీ అమలులో ఉన్న చట్టాల ఉల్లంఘనలేనని ఇప్పుడు ప్రభుత్వాధికారులు అంటున్నారు. కేవలం లాభాపేక్షతో నడిచే కార్పొరేట్ సంస్థ పర్యావరణ నిబంధనలకు కట్టుబడడం అనవసర వ్యయం అనుకుని ఉంటుంది. కాని, ప్రజల పేరు మీద అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, దాని అధికారులు అన్ని ఉల్లంఘనలతో పెరుగుతున్న ఈ విషకుంభాన్ని, నిప్పుల గుండాన్ని జనావాసాల మధ్య కొనసాగించడానికి ఎటువంటి అభ్యంతరం చెప్పలేదు. అంటే వారికి ప్రజల ప్రాణాల మీద శ్రద్ధ లేదని అర్థం. ఇప్పుడు విషవాయు ప్రభావంతో మరణించినవారికీ, అనారోగ్యం పాలైనవారికీ నష్టపరిహారం చెల్లించడం ఒక ఎత్తు. అంతకన్న ముఖ్యంగా, ఈ మరణాలకు మూల కారణమైన అభివృద్ధి నమూనా గురించి, బహుళజాతి సంస్థ అనగానే భూమి కట్టబెట్టి, చౌక శ్రమకూ, సకల సౌకర్యాలకూ హామీ ఇచ్చి, స్థానిక ప్రజల ప్రాణాలు తీసే హక్కు కూడ ఇచ్చే పాలకుల గురించి, పాలనా విధానాల గురించి ఆలోచించవలసి ఉంది. ఆ అవగాహనలతో ఈ అభివృద్ధి నమూనా మీద పోరాడే చైతన్యాన్ని ప్రజలకు అందించకుండా ఇటువంటి హంతక విష వాయు దాడులను అడ్డుకోలేం. వీ

ఇజ్రాయిల్ ప్రధానిగా నెతన్యాహు

- ఎ. నర్సింహారెడ్డి

ఇజ్రాయిల్ పార్లమెంట్ (నెస్సెట్) కు సంవత్సర కాలంలో మూడుసార్లు (2019 ఏప్రిల్, 2019 సెప్టెంబర్, 2020 మార్చ్) ఎన్నికలు జరిగాయి. మార్చ్ 2న జరిగిన ఎన్నికల్లోనూ ఏ పార్టీకీ ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన (61 స్థానాలు) మెజార్టీ రాలేదు. ప్రస్తుత ప్రధాని నెతన్యాహు నేతృత్వంలోని లికుడ్ పార్టీకి 36 స్థానాలు వచ్చాయి. ఆయన కూటమిలోని మితవాద పార్టీలైన షాప్ 9, యమీనా 5, తోరా జుడాయిజం 7 స్థానాలు గెలుచుకున్నాయి. నెతన్యాహు ప్రత్యర్థి బ్లూ అండ్ వైట్ నేత జెన్నీగాంట్ 33 స్థానాలతో రెండవ స్థానంలో నిలిచాడు. ఇతర మధ్యేవాద, అతివాద పార్టీలైన ఇజ్రాయిల్ బీటీస్ 7 స్థానాలు, 1969 నుంచి 1977 వరకు ఏకఛత్రాధిపత్యం వహించిన లేబర్ పార్టీ 7 సీట్లకే పరిమితమైంది. ఇక అరబ్ వర్కర్స్, మహిళలు, ఇతర అణగారిన వర్గాల ప్రజల ప్రయోజనాల కోసం పోరాడుతున్న అరబ్ జాయింట్ లిస్టు 15 స్థానాలు గెలుచుకుని మూడో స్థానంలో ఉంది. ఈ ఎన్నికల ప్రచారంలో ఎప్పటిలాగే నెతన్యాహు పాలస్తీనాపై నిప్పులు కక్కాడు. ఎన్నికల్లో గెలిస్తే వెస్టుబ్యాంకు ప్రాంతాన్ని ఇజ్రాయిల్‌లో విలీనం చేస్తానని ప్రచారం చేశారు. ట్రంప్ నెతన్యాహులు కలిసి పాలస్తీనా శాంతి ఒప్పందాన్ని ఏకపక్షంగా జనవరి 28న పాలస్తీనాపై ఐక్య రాజ్యసమితి చేసిన తీర్మానాలకు వ్యతిరేకంగా రూపొందించారు. ఈ ఒప్పందంలో పాలస్తీనియన్లకు భాగస్వామ్యం లేదు. ఈ శాంతి ఒప్పందం సారాంశాన్ని గమనిస్తే పాలస్తీనియన్లను పూర్తిగా జోర్డాన్ నది పశ్చిమతీరం నుండి తరిమివేయడానికి ఉద్దేశించిందని అర్థమవుతుంది. నెతన్యాహు ప్రధాని అయితే పాలస్తీనా రణరంగంగా మారే అవకాశం ఉన్నది. ఆయన దుందుడుకు, దురాక్రమణ విధానాలకు ట్రంప్ ఆశీస్సులు దండిగా ఉన్నాయి. వెస్టు బ్యాంకు భూభాగంలోని మెజారిటీ ప్రాంతాన్ని కబ్జా చేయడానికి నెతన్యాహు పథక రచన చేసుకున్నాడు. నెతన్యాహు మీద మూడు అవినీతి ఆరోపణలు ఉన్నాయి. అవినీతికి తోడు దేశ ప్రజలెదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడంలో తీవ్రంగా విఫలమవుతూ వస్తోన్న జాత్యహంకారి నెతన్యాహు పాలనపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని తాజా ఎన్నికల ఫలితాలు మరోసారి రుజువు చేశాయి. ఇజ్రాయిల్ అధ్యక్షుడు రూవెన్ రిష్లిన్ మార్చి 9న అన్ని రాజకీయ పార్టీలతో చర్చించిన తర్వాత ప్రతిపక్షనేత బెన్నిగాండ్జ్‌ను ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవల్సిందిగా ఆహ్వానించాడు. మార్చి 20న నెతన్యాహు, గాండ్జ మధ్య చర్చలు జరిగాయి. మార్చి 26న బెన్నిగాండ్జ్ పార్లమెంట్ స్పీకర్‌గా ఎన్నికయ్యాడు. అధ్యక్షుడు ఇచ్చిన 6 వారాల గడువు ఏప్రిల్ 20 నాటికి గాండ్జ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయాడు. కరోనా మహమ్మారి వ్యాప్తి దృష్ట్యా అత్యవసర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా పార్లమెంట్‌ను రిష్లిన్ కోరాడు. ప్రభుత్వ కీలక స్థానాల్లో ఎవరిని నియమించాలన్న అంశంపై నెతన్యాహు-గాండ్జ్ మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. మరోవైపు తనపై విచారణ సమస్య తలెత్తకుండా, ప్రధాని పదవిలో ఉండేవారికి ప్రాసిక్యూషన్ బెడద లేకుండా చట్ట సవరణకు పూనుకోవాలని నెతన్యాహు వ్యూహం పన్నుతున్నాడు. నెతన్యాహు ప్రధాని పదవికి అర్హుడు కాదంటూ ఏప్రిల్ 21 నుంచి ప్రజలు పెద్ద ఎత్తున నిసరన ప్రదర్శనలు చేస్తున్నారు. 'ప్రజాస్వామ్యం గెలవాలి', 'క్రైం మినిస్టర్ మాకొద్దు', 'నెతన్యాహుకు శిక్ష పడాలి' అంటూ నినాదాలు చేస్తున్నారు. అవినీతి నెతన్యాహు ప్రధాని కావడాన్ని అడ్డుకోవాలని ప్రజావాజ్య పిటిషన్లు ఆ దేశ కోర్టు మే 7న కొట్టివేసింది. మే 8న పార్లమెంట్ నెతన్యాహు ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడానికి అనుకూలంగా తీర్మానించింది. దీంతో నెతన్యాహు గాండ్జ్ మితవాద ప్రభుత్వం ఏర్పడనుంది. వీ







❖ **బేడ బుడగ జంగం కుల ఆత్మగౌరవ పోరాటం** – ఓ సంచార దళిత కుల చరిత్ర – తూర్పాటి మనోహర్ – బుడ్గ (బేడ) జంగం యువజన విద్యార్థి సంఘం ప్రచురణ – 319 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: తూర్పాటి మనోహర్, ఇ.నెం. 87-1087-6-10ఎ, గణేష్ నగర్, బి-క్యాంపు, కర్నూలు – 518002 సెల్: 9490328327




❖ **అసత్య ప్రేలాపనలు – సైన్సు సమాధానాలు** – బాలాజీ – జన విజ్ఞాన వేదిక ప్రచురణ – 152 పేజీలు, 1/8 డెమీ, రు. 75, ప్రతులకు: జంపా కృష్ణ కిశోర్, ఇ.నెం. 20-3/1-91 ఇ, సాయితేజ టవర్స్, టిఎఫ్-3, ఎ-బ్లాక్, అయోధ్య నగర్, విజయవాడ – 520003 ఫోన్ : 8341911718



❖ **తెలుగు వీరుడు** – (సదాశివరెడ్డి) ఆచార్య బిరుదురాజు రామరాజు – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ – 75 పేజీలు, 1/8 డెమీ, రు. 40, ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభారతి, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్ – 500004 ఫోన్ : 040-29703142




❖ **తారీఖుల్లో తెలంగాణ** – సంపాదకులు మామిడి హరికృష్ణ – రచన డా. పెన్నా శివరామకృష్ణ – తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ప్రచురణ – 258 పేజీలు, 1/8 డెమీ, రు. 300, ప్రతులకు: డైరెక్టర్ భాషా సాంస్కృతిక శాఖ, కళాభవన్, రరీంద్రభారతి, హైదరాబాద్ – 500004




❖ **గోలకొండ పత్రిక** – కథలు – 2 – సేకరణ – కూర్పు యామిజాల ఆనంద్, డా. వి.వి. వెంకటరమణ – నవచేన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణలు – 272 పేజీలు, 1/8 డెమీ, రు. 220



❖ **మనస్సాక్షి** – జీనాదేవి – నవచేన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణలు – 208 పేజీలు, 1/8 డెమీ, రు. 170




❖ **జుమ్మా** – కథలు – వేంపల్లి షరీఫ్ – సూఫి ప్రచురణలు – 146 పేజీలు, 1/8 డెమీ, రు. 135



❖ **'ప్ర'పంచపదులు** – సి. నారాయణ రెడ్డి – నవచేన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణలు– 126 పేజీలు, 1/8 డెమీ, రు. 100, పై నాలుగు ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), జి.ఎస్.ఐ. పోస్ట్, హైదరాబాద్ – 500068 ఫోన్ : 040 – 29884454




❖ **ఇప్పుడొక పాట కావాలి** – కవిత్వం – బిల్ల మహేందర్ – 132 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: బిల్ల మహేందర్, ఇ.నెం. 35-7-674, టిఎన్‌జిఒస్ కాలనీ, ఫేస్-11, వడ్డేపల్లి, హన్మకొండ, వరంగల్ – 506370, ఫోన్ : 91776 04430




❖ **'డా. మలయశ్రీ అంతరంగ చిత్రం'** – ముత్తన్నగారి రాజేందర్ రెడ్డి ఇంటర్వ్యూ – (డిసెంబర్ – 2009) – స్నేహ పబ్లికేషన్స్ ప్రచురణ – 28 పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు: ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి, సెల్ : 9908240768



❖ **ఆశల గాలి పటాలు** – కవిత్వం – డా. సిహెచ్. ఆంజనేయులు – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 136 పేజీలు, 1/8 డెమీ, రు. 75, ప్రతులకు: డా. సిహెచ్. ఆంజనేయులు, ఇ.నెం. 15-16-164/1, ద్వారకనగర్, గట్టయ్య సెంటర్, ఖమ్మం – 507002




❖ **ఇమ్మతి** – తెలంగాణ సాహిత్య విమర్శ వ్యాసాలు – డా. పసునూరి రవీందర్ – ప్రాగ్మా పబ్లికేషన్స్ ప్రచురణలు – 128 పేజీలు, 1/8 డెమీ, రు. 150




❖ **గ్లోబలైజేషన్** – సాహిత్య వ్యాసాలు – డా. పసునూరి రవీందర్ – ప్రాగ్మా ప్రచురణలు – 110 పేజీలు, 1/8 డెమీ, రు. 150, పై రెండు ప్రతులకు: డా. పసునూరి రవీందర్, ప్లాట్ నెం. 1147, నేతాజీనగర్, గుల్మోహర్ పార్క్ కాలనీ, శేరిలింగంపల్లి, హైదరాబాద్ – 500019, సెల్ : 7702648825



❖ **పగిలిన పాదాల నెత్తురులో..** – ప్రపంచీకరణ వ్యాసాలు – కేశవ్ – సుచరిత పబ్లికేషన్స్ ప్రచురణ – 216 పేజీలు, 1/8 డెమీ, రు. 200, ప్రతులకు: సర్వమంగళ, ఫ్లాట్ నెం. 3/బి, రచన అపార్ట్‌మెంట్, 78/1, కె.ఎన్. ముఖర్జీ రోడ్, తల్పుకూర్ పోస్ట్, కొల్‌కత్తా – 700123, ఫోన్: 8961626848, 9831314213



❖ **కళింగాంధ్ర తేజం, 'ఫైర్ బ్రిగేడ్' – పుల్లెల శ్యామసుందర రావు జీవితం** – డా. కె. ముత్యం – దృష్టి ప్రచురణ – 184 పేజీలు, 1/8 డెమీ, రు. 200, ప్రతులకు: డా. కె. ముత్యం, ఫ్లాట్ నెం. 42, గుల్ మొహర్ పార్కు కాలనీ, శేరిలింగంపల్లి, హైదరాబాద్ – 500019 ఫోన్ : 9440399796



❖ **సమర శంఖం** – (వ్యాస సంపుటి) – మేకిరి దామోదర్ (మేదాజీ) – లలిత ప్రచురణలు – 188 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: లలిత పబ్లికేషన్స్, ఇ.నెం. 23-6-234/4/ఎ, న్యు శాయంపేట్ టైగర్ హిల్స్ కాలనీ, హంటర్ రోడ్, హన్మకొండ, వరంగల్ – 506001, ఫోన్ : 9573666650, 9396892749

కమ్యూనిజానికి ప్రేరణనిస్తున్న కరోనా వైరస్

కరోనా వైరస్ సంఘీభావం, సామాజిక న్యాయం, అంతర్జాతీయత అనే విలువల అవసరాన్ని, అంటే కమ్యూనిజాన్ని ముందుకు తెచ్చిందంటున్నారు **అలెక్సాండ్ర్ బుజ్గాలిన్**

'*దురదృష్టమనేదాని సహాయం లేకపోతే, సంతోషమనేదే ఉండదు'*
– రష్యన్ సామెత

కరోనా వైరస్ మహమ్మారి మన సామూహిక జీవనంలోని అత్యంత తీవ్రమైన సమస్యలనూ, దాని ప్రధాన వైరుధ్యాలనూ బట్టబయలు చేసింది. ఈ పరిణామపు ఒకానొక కోణాన్ని ప్రచార సాధనాలు విపరీతంగా పెంచి పోషిస్తున్నాయి. అదేమంటే మనం ఒకరిని చూసి ఒకరం భయపడుతున్న స్థితికి చేరాం. అంతర్జాతీయ సంబంధాలన్నీ తెగిపోతే బాగుండునని కలలు కంటున్నాం. ఒకరితో ఒకరం సంబంధాలు లేకుండా ఉండాలనుకుంటున్నాం. ప్రతి అంశంలోనూ మనం చైనా వాళ్ల (లేదా అమెరికన్ల, ఇటాలియన్ల, రష్యన్ల, మనం ఎవరి పేరు పెట్టదలచుకుంటే వారి) చెయ్యి ఉందని అనుమానిస్తున్నాం. ఇక్కడి నుంచి ఒక్క అడుగువేస్తే ఇక మనం చేరేది జాత్యహంకార వాదానికే. ఒక 'నూతన ప్రపంచం' ఆవిర్భవిస్తున్నదని, ఆ ప్రపంచంలో ఒకరితో ఒకరు చేతులు కలపడానికి భయపడడం మాత్రమే కాదు, మొత్తంగా ఏ ఒక్కరి గురించి అయినా ప్రతి ఒక్కరూ భయపడే పరిస్థితికి చేరుతున్నామని అప్పుడే కొందరు అంటున్నారు.

అయితే ఈ నాణానికి మరొక ముఖం ఉంది. ఎంత పెద్ద మొత్తంలో డబ్బు పెట్టినా కొనలేని ఎన్నో వస్తువులు ప్రపంచంలో ఉన్నాయనీ, 'మార్కెట్ అదృశ్య హస్తం' మీద ఆధారపడి పరిష్కరించలేని అత్యంత కష్టతరమైన సమస్యలెన్నో ఉన్నాయనీ, జనానికి 'హఠాత్తుగా' తెలిసివస్తున్నది. అంతే కాదు, ఆ సమస్యలను మనం ఒంటరిగా పరిష్కరించలేమని కూడ తెలిసివస్తున్నది. మన ప్రపంచమంతా ఒకటేననీ, దాన్ని రక్షించడానికి అందరమూ కలిసి పని చేయవలసిందేననీ తెలిసివస్తున్నది. క్వారంటైన్‌లూ, కలవకుండా ఉండడాలూ ఎంత ముఖ్యమైనప్పటికీ, ఈ మహా విపత్తును ఓడించాలంటే మనందరమూ కలిసి, ప్రపంచమంతా ఒకటిగా, ఉమ్మడిగా పనిచేయవలసిందేననీ తెలిసివస్తున్నది. క్వారంటైన్ అనేది మనను మనం రక్షించుకునే సాధనమూ కాదు, ప్రతి ఒక్కరినీ రక్షించడానికి అనివార్యమైనదీ కాదు.

ఈ సాధారణ అభిప్రాయాలను దాటి, వాస్తవాలను గ్రహించి, అక్కడి నుంచి ఆ వాస్తవాల పరిణామాలేమిటో గుర్తించడానికి ప్రయత్నించవలసి ఉంది. ఈ సమస్యను పరిష్కరించే వ్యూహాన్ని కనిపెట్టాలంటే ఈ సమస్య సారాంశాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించవలసి ఉంది.

ఎవరికి వారు ఒంటరిగా ఉండడం.... సంఘీభావానికి దారి

మొదటి వాస్తవం: మనం మన స్నేహితుల గురించి కూడ భయపడడం మొదలుపెట్టాం. ఇంటర్నెట్ మీద ఒక విషాద పరిహాసం చలామణీలో ఉంది: 'మిత్రులారా, ఈ కష్టకాలంలో మనం ఒకరి నుంచి ఒకరం వీలైనంత దూరంగా ఉండాలి' అని అది పిలుపునిస్తున్నది.

కాని ఒక భిన్నమైన ధోరణి కూడ ఉన్నది. 'ఎవరికి వారే' అనే వ్యక్తిగత వినియోగదారు హేతుబద్ధ మార్కెట్ స్వభావం గురించి నిన్నటి దాకా బోధిస్తుండినవాళ్లు కూడ ఇప్పుడు 'మనందరమూ ఒకే మునిగి పోతున్న పడవలో ఉన్నాం' అని అర్థం చేసుకోవడం మొదలుపెట్టారు.

మన కళ్లముందరే కొన్ని విషయాలు మారిపోతున్నాయి. అన్నిచోట్లా మార్పు జరుగుతున్నదని కాదు. అయినా, పెద్దవారికి సాయపడాలనీ, స్వచ్ఛంద సంస్థల పనిలో భాగం పంచుకోవాలనీ యువకులలో తపన కనబడుతున్నది. నిన్నటిదాకా ఎక్కడో ఒక చిత్రమైన మినహాయింపుగా మాత్రమే ఉండిన ఈ ధోరణి ఇవాళ ఒక విస్తృతమైన ధోరణిగా మారింది. ఇటాలియన్లు సాయంత్రం ఆరు గంటలకల్లా తమ వరండాలలో నిలబడి వైద్య సిబ్బందికి ప్రశంసలు అందిస్తున్నారు. ఒకరికొకరు పాటలు పాడుకుంటున్నారు. మాస్కో స్టేట్ యూనివర్సిటీ విద్యార్థులు 65 ఏళ్లు దాటిన తమ ప్రొఫెసర్లకు సహాయం అవసరమైతే సంకోచించవద్దని చెపుతున్నారు. యువజనుల సంస్కృతిలో పరస్పర సహాయం నిత్యకృత్యమై పోయింది. ఒకప్పుడు వామపక్ష శిబిరాల్లో మాత్రమే ఉండిన పరస్పర సహాయం ఇవాళ విస్తృత ప్రజాసమూహాల్లో కనబడుతున్నది. ప్రజల జీవితాల్లో నిన్నటివరకూ ప్రధాన స్వభావంగా ఉండిన వ్యక్తివాదం ఇవాళ ఇంకెంత మాత్రమూ నెలరోజుల కింద కనబడినంత పవిత్రంగా కనబడడం లేదు.

మహా మాల్‌లన్నీ ఖాళీ అయిపోయాయి. సరుకులు కొంటూ కాలం గడపడం అనేది లేకుండా వాస్తవంగా జీవితాలు గడపవచ్చునని మనం హఠాత్తుగా గుర్తించడం మొదలుపెట్టాం. మార్కెట్‌లోకి వచ్చిన కొత్త కారు కొనడం కోసమే జీవించడమనేది ఏమంత గొప్ప విషయం కాదనీ, బహుశా తెలివితక్కువ తనమనీ తెలిసివస్తున్నది. కుటుంబమంతా కలిసి పుస్తకాలు చదువుకోవచ్చుననీ, సినిమాలు చూడవచ్చుననీ తెలిసివస్తున్నది. కొత్త సామాజిక వాతావరణంలో వినియోగదారీ సమాజపు ఎండమావులు కదిలిపోతున్నాయి, కరిగిపోతున్నాయి, చెల్లాచెదురైపోతున్నాయి.

కాని, ఆగండి, మనమింకా కమ్యూనిజం విజయానికి చేరలేదు. కాని పాత సోవియట్ యుగంలో 'వాస్తవంగా ఉనికిలో ఉండిన సోషలిజం' అంతమైపోయిన తర్వాత, మొట్టమొదటిసారిగా కోట్లాది మంది మనుషులు డబ్బుకూ, ఘనత వహించిన బ్రాండ్లకూ, అత్యాధునిక జీవన శైలికీ భిన్నమైన సంగతుల గురించి తీవ్రంగా ఆలోచించడం

ప్రారంభించారు. తమ జీవితాలను పోటీలేని ప్రపంచంలో, సంఘీభావం విలసిల్లే ప్రపంచంలో సాగించగల అవకాశాల గురించి ఆలోచించడం ప్రారంభించారు.

అవును, చివరికి ఉదారవాద రాజకీయవేత్తలు కూడ ఆ పదం ఉచ్చరించడానికి ఇంకెంతమాత్రమూ భయపడడం లేదు. ఆ పదం సంఘీభావం.

ఎందుకు? ఎందుకంటే జీవితం సంఘీభావాన్ని కోరుతున్నది గనుక. అందరికీ వ్యతిరేకంగా ఒక్కరి పోరాటం అనే భావన, మార్కెట్ అదృశ్యహస్తం అనే భావన ఈ మహమ్మారి సమస్యను పరిష్కరించబోవడం లేదు. ఈ మహమ్మారికి వ్యతిరేక పోరాటం ప్రధానంగా మార్కెటేతర చర్యలను కోరుతున్నది. అందరినీ సమానంగా చుట్టుముట్టిన ఈ ఉత్పాతానికి ప్రధాన ప్రతిఘటన శక్తులు రాజ్యం చేపట్టవలసిన నియంత్రణ, ప్రజా కార్యక్రమాలు, పరస్పర సహకారం, వ్యక్తిగత నిగ్రహం, ఉమ్మడి సమస్యల పరిష్కారంలో వ్యక్తిగత అహంకారాలను వదులుకోవడం. శతాబ్దాలుగా ఉదారవాదులు లేదు లేదని చెపుతున్న సామాజిక సమష్టి ప్రయోజనం ఎంత వాస్తవమో ఇవాళ ప్రతి ఒక్కరికీ తెలిసివస్తున్నది.

కాని!

కాని ఆధునిక జాతి రాజ్యాలు ప్రజల సమష్టి కార్యాచరణ ద్వారా సమస్యలను పరిష్కరించడానికి పూనుకోవు. ఇప్పటివరకూ ప్రపంచ శక్తుల గుప్పెట్లో ఉన్న ప్రపంచ మార్కెట్ ఆ పని చేయడం అంతకంటె ఎక్కువ అసాధ్యం. ఆ పని అత్యధిక ప్రజానీకపు ప్రయోజనాలకు అనుకూలమైన కార్యాచరణ. అది ద్రవ్య పెట్టుబడి ప్రయోజనాలనూ, చమురు, ప్రచార సాధనాలు, వగైరా కార్పొరేషన్ల ప్రయోజనాలనూ తీర్చడానికి చేపట్టవలసినది కాదు. ఇవాళ ప్రపంచమంతటా ఒక దృశ్యం స్పష్టంగా బైటపడుతున్నది. అదేమంటే ఎక్కడైతే ప్రభుత్వ రంగం బలహీనంగా ఉన్నదో, ఎక్కడైతే రాజ్యం సామాజిక ప్రయోజనాల కోసం కాకుండా ఒక అత్యల్పసంఖ్యాక వ్యాపార, అధికార ప్రయోజనాలకోసం పనిచేస్తున్నదో, అక్కడ అతి ఎక్కువ మంది జీవితాలను వైరస్ బలిగొంటున్నది.

ప్రత్యామ్నాయం సుస్పష్టమే. అది రాజ్యమూ పౌర సమాజమూ కలిసి అత్యంత కీలకమైన వ్యవస్థలలో ప్రణాళికాబద్ధమైన, ప్రత్యక్ష (మార్కెటేతర), సంఘీభావ చర్యలు తీసుకోవడం. ఆ చర్యల వల్ల మొట్టమొదట ఆరోగ్య రంగం, సామాజిక భద్రత, మౌలిక సౌకర్యాలు, విద్యుత్ సరఫరా, ప్రజల సహకారయుత ఉత్పాదక సామర్థ్యం వికసిస్తాయి. ఇక్కడ మనం తప్పనిసరిగా ప్రభుత్వ, ప్రైవేటు కార్పొరేషన్లను సాహసికంగా సామాజికీకరించే వైపు అడుగులు వేయాలి. సమాజ ప్రయోజనాల కొరకు నిర్వహణ అనే లక్ష్యంతో ప్రజా నియంత్రణ, పారదర్శక నిర్వహణ అమలు కావాలి. మార్కెట్ వ్యవస్థల ఆదేశాలను తప్పనిసరిగా బద్దలుకొట్టాలి. మనం స్పష్టమైన, పారదర్శకమైన, కొత్త నిబంధనలు రూపొందించి, వాటిని కచ్చితంగా, క్రమబద్ధంగా పాటించే మార్గంలో ముందుకు సాగాలి. సాధారణ ప్రజా ప్రయోజనాలను నెరవేర్చడమే లక్ష్యం కావాలి. అంటే ఇక్కడ మనం సొంత ఆస్తి పవిత్రత సూత్రాన్ని, లాభాలను ఇతోధికంగా పెంచుకోవడంలో ఉన్న ప్రయోజనాలను రెండో స్థాయికి నెట్టివేయాలి.

ఈ పనులను ఏ రాజ్యాలు చేస్తాయి, ఎంతవరకు చేస్తాయి అనేది ఆయా రాజ్యాల పౌరుల మీద ఆధారపడి ఉంటుంది. అలాగే ఈ చర్యలు తీసుకొమ్మని మన అధికార వర్గాలను మనం ఎంత స్పష్టంగా, ఎంత నిర్విరామంగా, ఎంత క్రియాశీలంగా కోరుతామనే దానిమీద ఆధారపడి ఉంటుంది. గతంలో ఆదర్శవంతులైన వామపక్షవాదులు ఇచ్చిన ఊహావాద నినాదం, 'లాభాల కోసం కాదు, ప్రజల కోసం' అనేదాన్ని ఇవాళ తిరిగి వినిపించవలసి ఉన్నది. ప్రస్తుత మహమ్మారి అన్నిటికన్న ముందుకు తీసుకువచ్చిన అంశం ఇదే.

ఈ వైరస్ 'ప్రజాస్వామికమైనది' – అంటే సామాజిక న్యాయం ప్రతి ఒక్కరి ప్రయోజనం

రెండో వాస్తవం: ఈ వైరస్ తనదైన పద్ధతిలో ప్రజాస్వామికమైనది. ప్రతి ఒక్కరికీ అది సోకుతుంది. ప్రభుత్వం నడిపే మంత్రులు, తళుకు బెళుకుల తారలు, కోటీశ్వరులు, బిచ్చగాళ్లు, అందరూ. ఈ వైరస్ అందరినీ సమానంగా చూస్తుందనిపిస్తుంది. కాని అన్ని రకాలుగానూ సమానం చేయదు. అన్ని విషయాలనూ జయించడానికి డబ్బుకు ఉన్న సామర్థ్యం మీద ఈ మహమ్మారి ఒక సవాల్ విసిరింది, కాని ఇంకా జవాబునివ్వలేదు. గతంలో లాగనే, ప్రపంచంలో ఇంకా భిన్నమైన సంబంధాల వ్యవస్థే ప్రాబల్యంలో ఉంది. కొందరు ఇంకా విలాసాలలోనే జీవిస్తున్నారు. అత్యంత సమర్థమైన పరిస్థితుల్లో చికిత్స పొందగలుగుతున్నారు. కాగా కోట్లాది మంది కనీసమైన మందులకు అవసరమైన డబ్బు లేని స్థితిలో ఉన్నారు. వాళ్లంతా ప్రపంచపు 'అంచులలో' పేదదేశాల పౌరులు మాత్రమే కాదు. వారిలో నెలకు పది పదిహేను వేల రూబుళ్లు సంపాదించే కోట్లాది మంది రష్యన్ ప్రజలూ ఉన్నారు, మన మహామహా నగరాలకు వలస వచ్చినవారూ ఉన్నారు.

ఈ ప్రపంచ మహమ్మారి విచిత్రం ఏమంటే, బిచ్చగాళ్లు వైరస్ బారినపడినప్పుడు ప్రతిఒక్కరూ మరణాంతక ప్రమాదంలో చిక్కక తప్పదు. ఆ భయంలో వ్యవస్థా నిర్వాహకులకు కూడ మినహాయింపు లేదు. మనం ఆ సమస్యను అందరమూ కలిసి, అందరి కొరకూ పరిష్కరించనైనా పరిష్కరించాలి. లేదా అందరికందరమూ ఇతోధిక ప్రమాదంలో అంతమైపోవడమైనా జరుగుతుంది. ఈ సమస్యను పరిష్కరించడంలో అందరికందరమూ చేతులు కలపాలంటే, ఇతరుల కన్న వందలరెట్లో వేలరెట్లో ఎక్కువ సంపద ఉన్నవారు కనీసం తమ సంపదలో గణనీయమైన భాగాన్ని ఈ కృషికి ఇవ్వాలి. ఇది అనివార్యం. ఇది కేవలం నైతిక సమస్య కాదు. మహమ్మారిని అధిగమించాలంటే అది అత్యవసరం. మహమ్మారిని అధిగమించడానికి అవసరమైన నిధులను కోటీశ్వరులూ శతకోటీశ్వరులూ ఇవ్వవలసిందే. వాళ్లు ఆ పని చేయవలసింది తమ పెట్టుబడులపై, మదుపులపై కోత విధించి కాదు, తమ సొంత వినియోగాన్ని తగ్గించుకుని ఇవ్వాలి. ఇక్కడ విధించే ఆంక్షలు అత్యవసరమైనవి. ఎందుకంటే తద్వారా మాత్రమే ఎవరికీ ఇబ్బంది ఎవరికీ పెద్ద నష్టం కలగదు. చివరికి మహాచోరులకు కూడ దీనితో పోయేదేమీ లేదు. కేవలం ఈ మహమ్మారి రోజుల్లో వాళ్లు తమ కొత్త విహార నౌకలు కొనే ఆలోచనలను, తమ మహా భవనాల అలంకరణ ఆలోచనలను పక్కన పెడితే చాలు.

మొన్నటి చలికాలంలోనే పెట్టుబడి ప్రయోజనాల కన్న సమాజ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడం అసాధ్యమేనా అని ఒక తీవ్రచర్చ

జరిగింది. నిజానికి అప్పటికి ముసుకువస్తున్న ఆర్థిక సంక్షోభం అటువంటి విషయాల మీద కొత్త ఆలోచనలు చేయడానికి ప్రజలను పురికొల్పవలసింది. కాని, అప్పటి చర్చలో, రష్యన్ సామెత చెప్పినట్టు, వండిన కోడి ఎవరినీ పొడవలేదు. కాని ఇప్పుడది పొడుస్తున్నది. పెట్టుబడి యజమానులు తమ లాభాల గురించి పూర్తిగా మరిచిపోయారని అనలేను. తమ ఆదాయాలను ఈ అంటువ్యాధి మీద పోరాటానికి అప్పగించాలనే భావాలతో మునిగి తేలుతున్నారనీ అనలేను. కాని కొన్ని ప్రతీకాత్మక చర్యలు జరిగాయి. వాస్తవమేమంటే, లాభాలను మరిచిపోవడం జరగనే లేదు.

ఇప్పుడు కూడ, పెట్టుబడి యజమానులు ప్రపంచ జనాభాలో సగానికి ఈ అంటువ్యాధి అంటినా సరే అని సిద్ధంగా ఉన్నారు గాని, తమ విదేశీ ఆర్థిక స్థావరాల మీద నిషేధం విధించడానికి గాని, తమ సొంత ఖర్చులలో ఒక పెద్ద భాగాన్ని ప్రజా అవసరాలు తీర్చడానికి మళ్లించడానికి గాని సిద్ధంగా లేరు. కాని వీళ్లు తమ సంపదలో కొంచెమైనా పంచుకునేలా ఒత్తిడి తేవడం అవసరమని అశేష ప్రజానీకం అర్థం చేసుకుంటున్నారు. చివరికి రాజ్యం కూడ ఆ విషయం అర్థం చేసుకుంటున్నది. ఈ మహా సంపన్నులకు సేవ చేయడమే దానికి ఇప్పటివరకూ తెలిసింది. కాని ఇప్పుడు మాత్రం దాని వెన్నెముకలో ఒక చిన్న గగుర్పాటు కలుగుతున్నది. పౌరుల జీవితాల పట్ల తన బాధ్యతను గుర్తు తెచ్చుకొమ్మని ఆ గగుర్పాటు సూచిస్తున్నది. ఈ వ్యవహారంలో రాజ్యపు నిష్క్రియనూ, తాత్సారాన్నీ మనం ఎప్పటికీ క్షమించలేం. ఈలోగా, మహమ్మారులూ క్వారంటైన్‌లూ నిండిన ప్రపంచంలో జీవించడం కన్న తమ ఆదాయాలలో, చివరికి ఆస్తులలో కూడ ఒక భాగాన్ని ఇతరులతో పంచుకోవడం మంచిదని కోటీశ్వరుల, శతకోటీశ్వరుల పరివారాలలోని కొందరు వ్యక్తులైనా గుర్తిస్తున్నారు.

సామాజిక చైతన్యంలో తలెత్తుతున్న ఈ మార్పు సాపేక్షిక నిర్ణయాత్మక చర్యలకు దారి తీయగలదా లేదా అనేది మళ్లీ మనమీదనే ఆధారపడి ఉంటుంది. రష్యన్ ఫెడరేషన్‌తో సహా ఎన్నో రాజ్యాలు తొలి పిరికి అడుగులు వేస్తున్నాయి. ప్రస్తుతానికైతే తమ పౌరుల శ్రమతో పోగుపడిన సంస్థల నిలువల నుంచి ఖర్చుపెడుతున్నాయి గాని, ఈ స్థితి మారవచ్చు. అయితే, ఏది ఏమైనప్పటికీ ఈ సమస్య జాతి రాజ్యాలు తమంతట తాము ఏదో చేస్తే పరిష్కారమయ్యేది కాదు.

సరిహద్దుల మూసివేత... అంతర్జాతీయతకు నాంది

మూడో వాస్తవం: ఈ మహమ్మారి మానవజాతి అంతటికీ సమస్య. అది మనలో ప్రతి ఒక్కరిపైనా ప్రత్యక్షంగా ప్రభావం చూపుతుంది. ప్రతి ఒక్క దేశంలోని పౌరులలో ప్రతి ఒక్కరి ప్రయోజనాల కోసం ప్రపంచమంతటా ఈ సమస్యను పరిష్కరించవలసి ఉన్నదని వైరస్ చూపింది. సువిశాలమైన చైనాలో గాని, అత్యంత చిన్న దేశమైన మోల్దావియాలోగాని, మన సొంత రష్యాలో గాని ఎక్కడా మనం వైరస్ నుంచి తప్పించుకుని బతకలేం. విచిత్రమేమంటే, సరిహద్దుల మూసివేత, క్వారంటైన్‌లు, ఒంటరి జీవితాలు అవసరమైనవే అయినప్పటికీ, అవి కేవలం వైరస్ అంతర్జాతీయ వ్యాప్తిని తగ్గించే సాధనాలు మాత్రమే. చైనాలో అమలుచేసిన క్వారంటైన్ చైనీయులకు మాత్రమే కాదు, మన రష్యన్లతో పాటు, యావత్ ప్రపంచ ప్రజలకూ అత్యంత కీలకమైన అవసరమని రుజువైంది. తమ దేశ సరిహద్దులు మూసివేయడం ద్వారా చైనీయులు సమస్యను పరిష్కరించడంలో మనం సంసిద్ధులం కావడానికి సహకరించారు. అదే ఇటలీకి కూడ వర్తిస్తుంది. ప్రతి దేశానికీ వర్తిస్తుంది. ఏదో ఒక అద్భుతం జరిగి మనం ఈ వైరస్‌ను రష్యాలో ఆపివేయడం జరిగినా, మానవాళిని ఈ వైరస్ నుంచో, భవిష్యత్తులో రానున్న వైరస్‌ల నుంచో రక్షించినట్టు కాదు. తద్వారా మనను మనం సురక్షితం చేసుకున్నట్టు కాదు. ఎందుకంటే రానున్న వైరస్, లేదా మరేదో ప్రపంచ సమస్య అంతర్జాతీయ విమానాశ్రయాలలో అవరోధాల దగ్గర ఆగిపోదు.

ప్రజల మధ్య స్నేహ సంబంధాల, అంతర్జాతీయతా సూత్రాల కీలక అవసరాన్ని ఈ వైరస్ చూపింది. ఈ మహమ్మారికి చికిత్స చేయడానికి అవసరమైన ఔషధాలలో ఒకటి అంతర్జాతీయ సంఘీభావం. ఇది పరిస్థితి అత్యంత క్లిష్టంగా ఉన్న దేశాలకూ ప్రాంతాలకూ సహాయం అందించడం మాత్రమే కాదు. తమ సమస్యలను తామే పరిష్కరించుకోలేనంత పెద్ద స్థాయిలో పేదరికం ఉన్న దేశాలకూ, ప్రాంతాలకూ సహాయం అందించడం కూడ ఇందులో భాగమే. మనం కేవలం మన ప్రయోజనాల కోసం మాత్రమే ఆలోచిస్తున్నప్పటికీ వారికి సహాయం చేయడం అవసరం.

బహుశా ఇక్కడ ప్రధాన విషయం, ఈ సందర్భంలో వైరస్‌కు వ్యతిరేక పోరాటంలోని అన్ని విజయాలూ, అన్ని నూతన ఆవిష్కరణలూ, వాక్సిన్ సృష్టించడానికీ ఉన్న అన్ని రకాల మార్గాలూ, తదనంతర చర్యలూ, వాక్సిన్, దాన్ని ఉత్పత్తి చేయడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానమూ అన్నీ కూడ మానవాళి అంతటికీ చెందినవిగా గుర్తించాలి. ఎటువంటి ధర లేకుండా, ఎటువంటి పరిమితులు లేకుండా మానవాళి అంతటితో పంచుకోవాలి. ఈ వాక్సిన్‌ను ఎవరు ఎక్కడ సృష్టించినప్పటికీ దాని మీద ప్రైవేటు మేధో హక్కుల ఆంక్షలు ఉండగూడదు.

జాతీయవాదం, అభివృద్ధినిరోధక ప్రజారంజకత్వం అద్దుకున్న నయా ఉదారవాద 'క్రీడా సూత్రాల' క్షేత్రంలో అటువంటి నిర్ణయానికి అవకాశం ఉందా? ఈ ప్రశ్న నిన్న అడిగినా నేను 'లేదు' అని జవాబు చెప్పి ఉండేవాణ్ని. కాని మన కళ్ల ముందే పరిస్థితి మారిపోతున్నది. అతి వేగంగా మారిపోతున్నది. ఒక హాస్యాస్పదమైన ఉదాహరణ ఇస్తాను. రష్యాలో జనం ఛలోక్తులను ఇష్టపడతారు. అత్యధిక ప్రజానీకపు మానసిక ఉద్వేగాలకు, ప్రజాభిప్రాయానికి అవే పెద్ద సూచికలు. అవి సర్వేల కన్నా విశ్వసనీయమైనవి. కరోనావైరస్ గురించి సామాజిక వ్యాఖ్యలూ ఛలోక్తులూ గత రెండు వారాలుగా విపరీతంగా ప్రజల్లో చలామణీ అవుతున్నాయి. వాటిలో ఒకే ఒక్కటి మీతో పంచుకుంటాను. అది మాకు యూరప్ నుంచి వచ్చింది. 'తళుకు బెళుకుల తారలకూ ఫుట్ బాల్ క్రీడాకారులకూ మీరు నెలకు లక్షల యూరోలు ముట్టజెపుతారు. జీవశాస్త్రవేత్తలకు నెలకు రెండువేల యూరోలివ్వడానికి గింజుకుంటారు. ఇప్పుడేమో మీకో వాక్సిన్ కావాలని మాదగ్గరికి వచ్చారా? వెళ్లండి ఆ తారల దగ్గరికే. వాళ్లు మీకోసం ఒక వాక్సిన్ తయారు చేస్తారేమో చూడండి' అని ఒక శాస్త్రవేత్త అన్నాడట.

ఈ పరిహాసంలో, అటువంటి పరిహాసాలన్నిటిలో లాగనే, ఒక విషాదకరమైన తలకిందుల వాస్తవం పొడసూపుతున్నది. తారలు, మార్కెట్ డిరైవేటివ్‌లు, బ్రాండ్లు, సరికొత్త వేలం వెర్రి మోజులు, అతి ప్రదర్శనలు వంటి ఎన్నో ప్రేరణా వస్తువుల తయారీ ద్వారా తన మనుగడ

కొనసాగించుకుంటున్న ఇటీవలి పెట్టుబడిదారీ విధానపు ప్రపంచం, వైరస్ వంటి సమస్యను అడ్డుకోవడానికి గాని, పరిష్కరించడానికి గాని తనకు శక్తి సామర్థ్యాలు లేవని రుజువు చేసుకున్నది. (వేలాది, లక్షలాది మందిని వ్యాధి పీడితులను చేసే, మరణాంతకం చేసే ఈ వైరస్ ను సృష్టించి ప్రపంచం మీదికి వదిలింది కూడ అదే కావచ్చు.) ఈ ప్రపంచాన్ని మార్చక తప్పదు. ఈ మహమ్మారి దాడి చేసిన సందర్భంలో గత ఇరవై సంవత్సరాలలో రెండో పెద్ద ప్రపంచ స్థాయి ఆర్థిక సంక్షోభం ప్రారంభం కాబోతుండింది. అది కూడ ఈ ఫలితాన్నే పరోక్షంగా సూచించింది. ఇప్పుడు మహమ్మారి దాన్నే ప్రత్యక్షంగా సూచిస్తున్నది.

ముగింపుగా చెప్పాలంటే, సంఘీభావం కోసం, న్యాయం కోసం, అంతర్జాతీయత కోసం వెలువడుతున్న ఆకాంక్షలన్నీ ఒక కొత్త సమాజ ఆవిర్భావపు తొలి సూచనలు. ఈ కొత్త సమాజం ఆవిర్భావం కొరకు రెండు శతాబ్దాలుగా పెనుగులాడుతున్నది. అనేక హింసలు భరించింది. అనేక వైరుధ్యాల గుండా పయనించింది. ఎంతో నెత్తురూ చెమటా కార్చింది. జన్మనెత్తడానికి రెండు శతాబ్దాలుగా ప్రయత్నిస్తున్నది. నూట యాభై సంవత్సరాల కింద మార్క్స్, ఎంగెల్స్‌లు దాన్ని 'స్వేచ్ఛా ప్రపంచం' అని పిలిచారు. దాన్ని కమ్యూనిజం అంటారు. దాని అసలు పేరు అదే. దాని సారాంశంలో ఉన్నవి మూడు అంశాలు: సంఘీభావం, న్యాయం, అంతర్జాతీయత.

వాటితో పాటు మరొక అంశం ఉంది. అది స్వేచ్ఛ. చారిత్రక అభివృద్ధి నియమాలను తెలుసుకునే స్వేచ్ఛ. ఆ సూత్రాలకు అనుగుణంగా ప్రపంచాన్ని మార్చడానికి స్వేచ్ఛ. ప్రపంచాన్ని మార్చడానికిదే సమయం. రేపు అని కూచుంటే చాల ఆలస్యమైపోవచ్చు. ఇవాళే మనం కచ్చితంగా స్థిరంగా వామపక్షం వైపు కదలకపోతే, మన మీద రేపు దిగబోయేది ఫాసిజం అనే మహా గత్తర. అది కరోనా వైరస్ మహమ్మారి కన్న మరింత భయంకరమైనది.

ఇవాళ మనం మరొకసారి ఎంచుకోవలసిన కర్తవ్యం 'కమ్యూనిజమా, బర్బరత్వమా' అనే ప్రత్యామ్నాయాలే.

తాజా కలం: ఈ వ్యాసానికి మూలాలు గత రెండు మూడు రోజులుగా ఆల్టర్నేటివ్స్ మూవ్ మెంట్‌లో నా సహచర కామ్రేడ్స్ ల్యుద్మిలా బులావ్కా, ఆండ్రే కొల్గానొవ్, నటాల్యా యాకొవ్లెవా తదితరులతో జరిగిన సంభాషణల ఆలోచనల్లో ఉన్నాయి. ఆ ఆలోచనలన్నిటినీ నేను ఈ వ్యాస రూపంలో ఒక సాయంత్రం అక్షరాల్లో పెట్టాను. ఆ సాయంత్రమే, ఈ వ్యాస రచన అయిపోయాక, ఇంటర్నెట్ మీద నేను దాదాపు ఇదే అంశం మీద రెండు వ్యాసాలు చూశాను. ఒకటి సుప్రసిద్ధ స్లొవేనియన్ మేధావి స్లావొజ్ జిజెక్ రాసినది, మరొకటి ఉక్రేనియన్ కార్యకర్త యూరీ లాతీష్ రాసినది. ఆ తర్వాత మార్చ్ 28న రష్యన్ పబ్లిక్ టెలివిజన్‌లో 'రైట్ టు నో' కార్యక్రమంలో మాట్లాడుతూ సెర్జీ కుర్గిన్యాన్ ఇవాళ మన మీద పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలంటే ఏకైక మార్గం సోవియట్ స్త్రీ పురుషులు మళ్లీ జన్మించవలసిన అవసరమే అన్నారు.

అది ఒక మంచి సూచన.

మళ్లీ ఒకసారి ప్రపంచాన్ని కమ్యూనిజం అనే భూతం ఆవహిస్తున్నది!

(ప్రొఫెసర్ అలెక్సాండ్ర్ వ్లదీమిరొవిచ్ బుజ్గాలిన్ రాజకీయార్థ శాస్త్రవేత్త, తత్వవేత్త. మాస్కో స్టేట్ యూనివర్సిటీ రాజకీయార్థశాస్త్ర అధ్యాపకులు. ఇరవై సంవత్సరాలుగా ఆల్టర్నేటివ్స్ అనే పత్రికను, ఆ పత్రిక కేంద్రంగా ఆల్టర్నేటివ్స్ మూవ్ మెంట్ అనే ఆలోచనా బృందాన్నీ నడుపుతున్నారు.)

(అనువాదకుడి మాట: తెలుగు పాఠకులకు అందాలనే కోరికతోనే ఈ అద్భుతమైన వ్యాసాన్ని అనువదించాను. అయితే ఎంత నచ్చిన విషయంలోనైనా ఒక నచ్చని అంశం ఉంటుంది. ఎంత నచ్చని విషయంలోనైనా ఒక నచ్చిన అంశం ఉంటుది. తొంభై తొమ్మిది నచ్చిన అంశాలున్న చోట కూడ ఒక నచ్చని అంశం ఉండవచ్చు. తొంభై తొమ్మిది నచ్చని అంశాలతో పాటు ఒక నచ్చిన అంశం ఉండవచ్చు. అలా ఈ వ్యాసం అనువాదంతో పాటు రెండు అంశాలు సూచించాలని నాకు అనిపిస్తున్నది.

1) సంఘీభావం, న్యాయం, అంతర్జాతీయత, స్వేచ్ఛ అని స్థూల స్థాయిలో పూర్తిగా అంగీకరించదగిన అంశాలు చర్చించిన ఈ వ్యాసం వర్గపోరాటాన్ని, వర్గపోరాట అవసరాన్ని ప్రస్తావించకపోవడం ప్రధాన లోపమని నాకనిపిస్తున్నది. కరోనా వైరస్ మహమ్మారి ప్రస్తుత పాలనా నియమాలను మార్చడాన్ని ఆకాంక్షిస్తున్నదంటే అర్థం ఈ పాలకవర్గాలను కూలదోయమనే ఆదేశాన్ని ఇస్తున్నదనే. మరి పాలకవర్గాలు తమ అధికారాన్ని ఎలా వదులుకుంటాయి, ఎలా మారుతాయి? వర్గపోరాటం తప్ప మరొక మార్గమేదీ లేదు. ఆ పోరాటం ఎలా జరుగుతుందనే అంశం చర్చనీయం కావచ్చు, భిన్నాభిప్రాయాలుండవచ్చు. కాని వర్గపోరాట ప్రస్తావన కూడ లేకపోవడం ఉచితం కాదు.

2) బుజ్గాలిన్ కూడ 'నయా ఉదారవాద' అనే మాట వాడడం, అలాగే బూర్జువా, పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద అని వాడవలసిన చోట 'ఉదారవాద' అని వాడడం నాకు ఆశ్చర్యం కలిగించింది. పెట్టుబడిదారీ విధానం ప్రారంభదశలో, స్వేచ్ఛా వ్యాపార దశలో, భూస్వామ్య వ్యతిరేక దశలో 'ఉదారవాద' విలువల్ని ప్రచారం చేసింది. అప్పుడు దాన్ని ఉదారవాద అని పిలవడం కొంతైనా ఉచితం కావచ్చు, కాని అది వలస వాద, సామ్రాజ్యవాద, గుత్తాధిపత్య, ద్రవ్య పెట్టుబడి దశల్లో ప్రవేశించాక ఆ ఉదారవాద విలువలన్నిటినీ వదులుకుంది. భూస్వామ్యంతో మిలాఖత్తయింది. కుళ్లిపోయి మరణశయ్య మీదికి చేరింది. అంటే పందొమ్మిదో శతాబ్దం చివరికే దానిలో 'ఉదారవాదం' ఏమీ మిగలలేదు. ఇక 1970ల తర్వాత రాజ్య నియంత్రణలు రద్దు కావాలనీ, స్వేచ్ఛా వ్యాపారానికి అనుమతించాలనీ మళ్లీ ఒకసారి ద్రవ్యపెట్టుబడి నినదించడం మొదలుపెట్టినప్పుడు దాన్ని 'నయా ఉదారవాదం' అనడం మొదలైంది. పాతదీ ఉదారవాదం కాదు, స్వేచ్ఛావ్యాపారం అన్నంత మాత్రాన కొత్తది నయా ఉదారవాదమూ కాదు. కాని సామ్రాజ్యవాద సంస్థలూ, ప్రచార సాధనాలూ ప్రారంభించిన ఈ 'నయా ఉదారవాదం' అనే మాట చాల మంది అనాలోచితంగా స్వీకరించారు. మార్క్సిస్టు పరిభాషలో సామ్రాజ్యవాదం అనదలచుకోని మార్క్సిస్టు మేధావుల దగ్గరి నుంచి పత్రికల భాషతో ప్రభావితమయ్యే అమాయకుల దాకా ఎందరో ఈ మాటను పరిశీలించకుండా వాడుతున్నారు. 'సామ్రాజ్యవాదం' అనే మాట వాడడానికి భయపడే పార్లమెంటరీ కమ్యూనిస్టులు 'నయా ఉదారవాదం' అనే మాట ఎక్కువగా వాడుతున్నారు. ఈ వ్యాసంలో బుజ్గాలిన్ కూడ అదే వాడారు గనుక అనువాదంలో నేను అదే ఉంచాను గాని, ఈ వివరణ అవసరం అనుకున్నాను.)

(రష్యన్ నుంచి ఇంగ్లిష్: రెన్ (ఫే క్లార్క్; తెలుగు: ఎన్ వేణుగోపాల్) వీ

కోవిడ్-19 రాజకీయార్థిక పరిచయం

***పెట్టుబడిదారీ యాంత్రిక మాంసోత్పత్తిలో ప్రారంభమైన కరోనా వైరస్ వ్యాప్తిలో ఉన్న రాజకీయార్థిక కోణాలను విశ్లేషిస్తున్నారు* మనీష్ ఆజాద్**

నాజీ జర్మనీలో సోఫీ అనే మహిళనూ, ఆమె పిల్లలిద్దరినీ గ్యాస్ చాంబర్ దగ్గరికి తీసుకు వచ్చినప్పుడు, ఆమె ఏడుపులూ మొత్తుకోళ్లూ అభ్యర్థనలూ విని నాజీ సైనికులు ఆ ఇద్దరు పిల్లలలో ఒకరిని విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. కాని ఎవరిని విడుదల చేయాలో నిర్ణయం తీసుకునే అధికారం ఆమెకే ఇస్తున్నామన్నారు. ఈ కథ మీద ఆధారపడి రాసిన సోఫీస్ చాయిస్ అనే నవల 1979లో వెలువడిన తర్వాత, సోఫీస్ చాయిస్ అనేది ఇంగ్లిష్ నుడికారాల్లో ఒకటిగా మారింది. ఇవాళ కరోనా వైరస్‌తో సంపూర్ణ భయోత్పాతంలో మునిగి లాక్ డౌన్‌లో ఉన్న ప్రపంచాన్ని చూస్తుంటే నాకు ఆ నుడికారమే గుర్తొస్తున్నది. లాక్ డౌన్‌ను కొనసాగిస్తే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతుంది, కోట్లాది మంది మనుషుల మనుగడే సంక్షోభంలో పడిపోతుంది. లాక్ డౌన్‌ను సడలిస్తే, కరోనా వైరస్ మహావిపత్తు కోట్లాది మందిని బలిగొంటుంది. ప్రతి దేశంలోనూ ఈ సవాల్ నిలువెత్తుగా నిలిచి ఉంది.

కాని వాస్తవమైన సమస్యేమంటే, అసలు మనం ఇక్కడికి ఎలా చేరాం? ఈ గమ్యం అనివార్యమైనదా? కరోనా తప్పనిసరిగా రావలసిందేనా? లేక, దీనివెనుక చైనా కుట్ర ఉందా, అది మొదట తన జనాన్ని తానే చంపుకొని, ఆ తర్వాత యావత్ ప్రపంచాన్ని చంపి ప్రపంచ అగ్రరాజ్యంగా మారదలచిందా? లేక చైనాను బలహీన పరచడానికి ఒలింపిక్ క్రీడల సమయంలో అమెరికానే చైనాలో ఈ వైరస్‌ను ప్రవేశపెట్టిందని చైనా చెపుతున్న మాట సత్యమా? లేక మరేదైనా కారణముందా? కాస్త పరిశోధించవలసి ఉంది.

మొట్టమొదట, స్క్రిప్స్ రిసర్చ్ ఇన్ స్టిట్యూట్‌తో సహా ఎన్నో ప్రతిష్ఠాత్మక పరిశోధనా సంస్థలు కొవిడ్-19 జన్యు నిర్మాణం మీద అధ్యయనాలు చేసి, దాన్ని ఒక రసాయనశాలలో తయారు చేయడం అసాధ్యమని రుజువు చేశాయి. అంటే పరివర్తన (మ్యుటేషన్) ద్వారా సహజంగా దానంతట అదే రూపొందింది. దాని వెనుక ఏదో ఒక దేశం ఉందని అనుకోనక్కర లేదు. కరోనా కుటుంబంలో ఇది తాజా వైరస్ మాత్రమే. ఇదే కుటుంబానికి చెందిన ఎస్ఎఆర్ఎస్ (సార్స్) అనే వైరస్ 2003-04ల్లో ప్రపంచంలో ఎన్నో దేశాలను అల్లకల్లోలం చేసింది. ప్రస్తుత వైరస్‌ను కొవిడ్-19 సార్స్-2 అంటున్నారు.

ఈ వైరస్ చైనాలోని వుహాన్ నగరంలో ప్రారంభమైందని అంటున్నారు. అయితే సుప్రసిద్ధ వైద్యశాస్త్ర పత్రిక లాన్సెట్ తొలి 43 కరోనా వ్యాధి పీడితులలో 13 మంది వుహాన్ నగరానికి బైటి వారేనని, వుహాన్‌లో కరోనా సోకినవారితోగాని, అక్కడి 'పచ్చి మార్కెట్'తో గాని ఎటువంటి సంబంధం లేనివారేనని రాసింది. వుహాన్‌లోని పచ్చి మార్కెట్ (మన దగ్గరి చేపల బజారులలాగ, వుహాన్‌లో చేపలు, మాంసం అమ్మే మార్కెట్)నుంచే ఈ వైరస్ ప్రపంచమంతా వ్యాపించిందని ప్రచార సాధనాలలో రెండో కథనం ప్రచారంలోకి వచ్చింది. ఈ కథనాన్ని కూడ స్క్రిప్స్ రిసర్చ్ ఇన్ స్టిట్యూట్ అధ్యయనం ఖండించింది.

ఆ అధ్యయనం ప్రకారం కొవిడ్-19 జన్యు నిర్మాణం పరివర్తన చెందడానికి, రూపొందడానికి జంతువుల సంఖ్య సాంద్రత చాల ఎక్కువగా ఉండే ప్రాంతం కావాలి. అంటే జంతువుల ఉత్పత్తి పారిశ్రామిక పద్ధతులలో జరిగే చోట, వాటిని కిక్కిరిసినట్టుగా ఉంచే చోట మాత్రమే ఈ వైరస్ పుట్టడానికి అవకాశం ఉంది. కోళ్లను, సీమ పందులను మాత్రమే అటువంటి పరిస్థితుల్లో ఉత్పత్తి చేస్తారు. పందులలో రోగ నిరోధక వ్యవస్థ సాపేక్షికంగా మానవులలో ఉన్నట్టుగానే ఉంటుంది గనుక కొవిడ్-19 పందుల నుంచి మనుషులకు సంక్రమించడానికి అవకాశం ఉందని ఆ అధ్యయనంలో రాశారు.

ఈ విషయాల మీద పని చేసే గ్రేన్ డాట్ ఆర్గ్ అనే సుప్రసిద్ధ వెబ్ సైట్ కరోనా అనే సాకుతో వుహాన్ పచ్చి మార్కెట్‌ను మూసివేయడానికి జరుగుతున్న కుట్రలో భాగంగానే ఈ ప్రచారాలు సాగుతున్నాయని కూడ అంది. ఎందుకంటే ఈ పచ్చి మార్కెట్ చౌక మాంసాన్ని పేద ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నదనీ, తమ జీవిక కోసం ఈ మార్కెట్ మీద ఆధారపడుతున్న లక్షలాది మంది పేద ప్రజలు ఆ మార్కెట్‌ను నడుపుతున్నారని ఆ వెబ్ సైట్ అంది. ఈ పేద ప్రజలు కొద్దికాలం కిందివరకూ తమ సొంత 'సహకార సంఘాల'లో, కమ్యూన్ లలో ఉండేవారు. అక్కడ సోషలిజం కూలిపోయిన తర్వాత, వారి భూములు లాక్కోబడిన తర్వాత వారు పొట్ట చేత పట్టుకుని ఇటువంటి మార్కెట్లకు చేరి, వాటి మీద ఆధారపడవలసి వస్తున్నది. ఆ భూములలో ఇప్పుడు కబేళాలతో సహా భారీ మాంస పరిశ్రమలు, భారీ వ్యవసాయ-పారిశ్రామిక క్షేత్రాలు తలెత్తాయి. ఈ భారీ మాంస పరిశ్రమల ప్రయోజనాల కోసం పచ్చి మార్కెట్‌ను మూసివేయాలని, తద్వారా తమ మార్కెట్‌ను ఇతోధికంగా విస్తరించుకోవాలని ఆ భారీ పరిశ్రమలు ప్రయత్నిస్తున్నాయి.

గతంలో 2003-04ల్లో ఇదే కరోనా కుటుంబానికి చెందిన సార్స్ కరోనా ఎంతో మంది ప్రాణాలు తీసింది. ఈ వైరస్ జంతువులనుంచి మనుషులకు వ్యాపిస్తుంది. ఇంతకు ముందు స్వైన్ ఫ్లూ (ఎచ్1ఎన్1) కూడ ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిని చంపింది. ఒక్క అమెరికాలోనే 1200 మంది చనిపోయారు. అది మెక్సికోలో పుట్టిందనే అభిప్రాయంతో మొదట దాన్ని మెక్సికన్ ఫ్లూ అని పిలిచారు. సరిగ్గా ఇప్పుడు కొవిడ్-19ని కూడ చైనీస్ కరోనా అని పిలుస్తున్నారు.

కాని ఆ తర్వాత స్వైన్ ఫ్లూ గురించి చాల వివరాలు బైటపడ్డాయి. అది పారిశ్రామిక ఉత్పత్తిలో తయారైన పందుల నుంచి మనుషులకు వ్యాపించింది. అది మెక్సికోలోని ఒక పంది మాంసం కర్మాగారంలో ప్రారంభమైంది. ఆ కర్మాగారం పేరు స్మిత్ ఫీల్డ్ ఫుడ్ కంపెనీ. అది ఒక

అమెరికన్ కంపెనీ. ఆ కంపెనీ ప్రపంచంలోని అతి పెద్ద పంది మాంసపు ఉత్పత్తి, శుద్ధి కంపెనీలలో మూడో స్థానంలో ఉంది. ఆ కంపెనీకి సంబంధించిన వేరు వేరు కార్ఖానాలలో సాలీనా రెండు కోట్ల ఎనభై లక్షల పందులను చంపి, హామ్, సాసేజి, బేకన్ వగైరా అనేక రూపాలలో ప్రపంచమంతటికీ సరఫరా చేస్తారు. ఈ కంపెనీ నుంచి ఆ మాంస ఉత్పత్తులను కొనుగోలు చేసే పెద్ద కంపెనీలు మెక్ డొనాల్డ్స్, కెఎఫ్‌సి వగైరాలు. అవన్నీ కూడ అమెరికన్ కంపెనీలే. ఆపిల్, పెప్సి, నైకి, జనరల్ మోటర్స్, వంటి అనేక అమెరికన్ కంపెనీలు చైనా చౌక శ్రమను దోపిడీ చేయడానికి చైనాలో తమ కర్మాగారాలు తెరిచినట్టుగానే, స్మిత్ ఫీల్డ్ ఫుడ్ కంపెనీ కూడ చైనాలో ఒక భారీ కర్మాగారాన్ని తెరిచింది.

అలాగే ప్రపంచంలోకెల్లా ఎక్కువ పంది (సీమ పంది) మాంసాన్ని ఉత్పత్తి చేసే కంపెనీల్లో ఐదవ స్థానంలో ఉన్న డానిష్ క్రౌన్ అనే డానిష్ కంపెనీ, ఏడో స్థానంలో ఉన్న జర్మనీకి చెందిన టోనీ కంపెనీ కూడ చైనాలో మాంసాన్ని ఉత్పత్తి చేసే, శుద్ధి చేసే భారీ కర్మాగారాల్ని తెరిచాయి. ఇక్కడినుంచి ఆ మాంసం చైనా దేశీయ మార్కెట్‌లోకీ, అంతర్జాతీయంగా అన్ని మార్కెట్లలోకీ సరఫరా అవుతుంది. ఈ మాంసాన్ని అతి ఎక్కువగా కొనుగోలు చేసేది మెక్ డొనాల్డ్స్, కె ఎఫ్ సి వంటి కంపెనీలు.

ఈ మాంస ఉత్పత్తి పరిశ్రమ పందెంలో చైనీయ కంపెనీల పాత్ర కూడ ఉందనేది స్పష్టమే. 2008 మాంద్యం తర్వాత, ప్రపంచంలోకెల్లా అతి పెద్ద మదుపు సంస్థ గోల్డ్ మాన్ సాక్స్ తన మదుపును అనేక రంగాలకు విస్తరించడంలో భాగంగా 300 మిలియన్ డాలర్లు ఖర్చుపెట్టి చైనాలోని పది అతి పెద్ద కోళ్ల ఫారంలను కొన్నది. దానికి తోడుగా, అదే సంస్థ చైనాలోని పంది మాంసం పరిశ్రమలో 200 మిలియన్ డాలర్లు మదుపు పెట్టింది.

వీటితోపాటు ఒఎస్ఐ అనే అమెరికన్ బడా కంపెనీకి సంబంధించిన ఉదంతం ఒకటి ఇటీవల విపరీతంగా వార్తల్లోకెక్కింది. కోడి మాంసాన్ని ప్రాసెస్ చేసే ఈ కంపెనీకి చైనాలో పది భారీ కర్మాగారాలున్నాయి. ఇది తయారు చేసే మాంసం మెక్ డొనాల్డ్, కెఎఫ్‌సి వంటి కంపెనీల ద్వారా చైనాతో సహా ప్రపంచ మార్కెట్లన్నిటికీ చేరుతుంది. ఇది కుళ్లిపోయిన కోడి మాంసాన్ని ప్రాసెస్ చేసి, చైనా మార్కెట్ కు సరఫరా చేసింది. అది బైట పడడంతో చైనా ప్రభుత్వం ఈ కంపెనీ మీద భారీ జరిమానా విధించడం మాత్రమే కాక, పది మంది కంపెనీ సిబ్బందిని జైలుకు పంపింది. ఈ సందర్భంలో ఈ వివరాలన్నీ ఎందుకు అవసరమంటే, 945 మిలియన్ డాలర్ల విలువైన ప్రపంచ మాంసం వ్యాపారంలో అమెరికాకూ, ఇతర యూరపియన్ దేశాలకూ ఉన్న భాగస్వామ్యమేమిటో, ఆ వ్యాపారంతో చైనాకు ఉన్న సంబంధమేమిటో మనం అర్థం చేసుకోవలసి ఉంది.

ఇప్పుడిక, ఈ మాంస ఉత్పత్తి ఎలా జరుగుతుందో కూడ చూద్దాం. అప్టన్ సింక్లేర్ రాసిన సుప్రసిద్ధ నవల 'జంగిల్' 1906లో వచ్చింది. అమెరికన్ మాంస పరిశ్రమ ఎలా పనిచేస్తుందో అది సవివరమైన చిత్రణను ఇచ్చింది. ఆయన రాసిన ఒక వాక్యం నాకింకా గుర్తుంది. అక్కడ పందుల మృత్యుభయపు అరుపులు తప్ప ప్రతిదీ అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయంటారు సింక్లేర్. కాని నూట పదిహేనేళ్లు గడిచాక ఇవాళ పరిస్థితి 'జంగిల్' నవలలో వర్ణించినదానికన్న చాల ముందుకు వచ్చింది. ఇవాళ పరిశ్రమల్లో ఉత్పత్తి చేసే చెప్పుల లాగే, బట్టల లాగే, పందులు, కోళ్లు వంటి సజీవ జంతువులను కూడ అదే పద్ధతిలో ఉత్పత్తి చేస్తున్నారు. అనేక ఆంటీ బయోటిక్ మందులు, హార్మోన్లు, జెనెటిక్ ఇంజనీరింగ్ వాడి వాటిని ఉత్పత్తి చేస్తున్నారు. అందువల్ల ఇవాళ ఆ పందులు, కోళ్లు అరవడం కూడ లేదు. ఎందుకంటే వాటి జన్యువులలోంచి అరవడం అనే లక్షణాన్ని తొలగించారు. తొందరగా ఎదగడానికీ, ఎక్కువ మాం ఇవ్వడానికీ వాటికి అన్ని రకాల మందులూ ఇస్తున్నారు. అవి ఎదగడం ఎంత ఆలస్యమైతే అంత ఎక్కువ ఖర్చవుతుంది గనుక ఆ ఖర్చును తగ్గించడానికి ప్రయత్నిస్తున్నారు. ఎక్కువ స్థలంలో ఉంచితే ఎక్కువ ఖర్చవుతుంది గనుక వాటిని ఇరుకు స్థలాలలో కిక్కిరిసేలా పెట్టి, అవి కదలడం కూడ సాధ్యం కాకుండా చేస్తున్నారు. పెట్టుబడిదారీ తర్కం ప్రకారం, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడానికి క్రమబద్ధంగా వాటి జన్యు నిర్మాణాన్ని మారుస్తున్నారు. ఉదాహరణకు, కోడి ఈకలు తీయడం అనేది ఎక్కువ మంది శ్రామికులూ సమయమూ వెచ్చించవలసిన అదనపు అనవసర ఖర్చుగా భావించిన పరిశ్రమ ఈకలు తగ్గిపోయే శాస్త్ర అన్వేషణలు చేసి వాటి జన్యువులను మార్చింది. అదే విధంగా, కోడి కాళ్లు అమ్మినట్టుగా, కోళ్లలో, పందులలో, ఇతర జంతువులలో అనేక ప్రత్యేక అవయవాలను వేరు చేసి, విడిగా ప్యాక్ చేసి అమ్మే ప్రపంచ మార్కెట్ ఉంది గనుక, ఈ ప్రత్యేక అవయవాలు తొందరగా బరువు పుంజుకునేలా జన్యు నిర్మాణాలు మారుస్తున్నారు. మిగిలిన శరీరమంతా ఎంత బరువు ఉన్నదో, ఈ ప్రత్యేక అవయవాలు అంతే బరువుండే జన్యు నిర్మాణాలు తయారయ్యాయి. అంతే కాదు, వాటిని విడివిడిగా తూయడం, కొలవడం వంటి అదనపు శ్రమలు లేకుండా, అమ్మే జంతువులూ, పక్షులూ అన్నీ ఒకే బరువు ఉండేలా జన్యు నిర్మాణాలు మారుస్తున్నారు.

ఇలా పారిశ్రామికంగా తయారైన జంతువులు సహజ వాతావరణంలో మనుగడ సాగించజాలవు. వాటి కోసం కృత్రిమ వాతావరణం సృష్టించవలసిందే. ఉదాహరణకు, ఈకలు లేని కోడి ఒక నిర్దిష్ట ఉష్ణోగ్రతలో మాత్రమే బతుకుతుంది. అంటే ఇక్కడ జంతువులను ఒక కృత్రిమ పద్ధతిలో తయారు చేయడం మాత్రమే కాదు, అవి బతకడానికి కృత్రిమ వాతావరణాన్ని కూడ సృష్టిస్తున్నారు.

కాని ఈ ప్రక్రియలో ఏమవుతుందంటే ఈ జీవులకు సహజంగా ఉండే రోగ నిరోధక శక్తి, రక్షణ శక్తి అంతరించిపోతాయి. అంటే డార్విన్ చెప్పిన 'సహజ ఎంపిక' నియమం ఇక్కడ వర్తించకుండా పోతుంది. 'సహజ ఎంపిక' స్థానాన్ని 'పెట్టుబడిదారీ ఎంపిక' ఆక్రమిస్తుంది. ఇటువంటి పరిస్థితిలో కరోనా వంటి వైరస్‌లు ఈ జంతువులకు సోకినప్పుడు, ఆ వైరస్‌లు ఇబ్బడి ముబ్బడి కావడానికి (పరివర్తన చెందడానికి) సులభమవుతుంది. అంతేగాక, వేలాది జంతువులు ఒకేచోట కిక్కిరిసిన మందగా ఉన్నప్పుడు ఆ వైరస్‌లు వ్యాపించడం సులభమవుతుంది.

ఇందుకు భిన్నంగా, జంతువులు, జీవజాతులు సాపేక్షికంగా ఒకదానికొకటి దూరంగా, తమ సహజ వాతావరణాలలో, సహజ పద్ధతులలో జీవిస్తున్నపుడు వాటి రోగ నిరోధక శక్తి బలోపేతమవుతుంది. ఒక్కొక్క దానిలో వ్యక్తిగత స్థాయిలో రోగ నిరోధక శక్తి భిన్నంగా ఉంటుంది. అటువంటి స్థితిలో ఒక జంతువుకు వైరస్ సోకినప్పటికీ ఆ వైరస్ వేగంగా పెరగడానికి గాని, వ్యాపించడానికి గాని అవకాశం ఉండదు. ఒకరకంగా చెప్పాలంటే ఆ సహజ వాతావరణంలో వైరస్ దాటలేని అవరోధాలెన్నో ఉంటాయి. వైరస్‌తో పోరాటంలో మెరుగ్గా ఉండే జంతువులు 'సహజ

ఎంపిక' నియమం ద్వారా ఎంపిక అయి అవే మనుగడ సాగిస్తాయి. కాని జంతువులను పారిశ్రామికంగా, మార్కెట్ ఒత్తిళ్లకు లోబడి ఉత్పత్తి చేసినప్పుడు వైరస్‌లు వ్యాపించడానికీ, వేగంగా పెరగడానికీ, పరివర్తన చెందడానికీ 'ఎర్ర తివాచీ' పరిచినట్టవుతుంది. ఈ పరిశ్రమలలో పనిచేసే మనుషుల ద్వారా వైరస్ మొత్తం సమాజానికీ వ్యాపిస్తుంది. చివరికి ఈ ప్రపంచీకరణ యుగంలో ప్రపంచమంతా వ్యాపిస్తుంది.

ఈ జంతువుల ఉత్పత్తి పారిశ్రామిక స్థాయిలో జరుగుతున్నది గనుక, లక్షలాది మంది, ముఖ్యంగా ఈ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు వాటితో నిరంతర సంబంధంలో ఉంటారు. రోజులో 12-14 గంటలు వైరస్‌ల తోనే ఉంటారు. అటువంటి పరిస్థితుల్లో, అంత సుదీర్ఘకాలం చాల మంది ఒక్క చోటే ఉండడం వల్ల, వారిలో కూడ వైరస్ పరివర్తన చెందడానికి అవకాశాలు పెరుగుతాయి. కొవిడ్-19 వైరస్‌కూ, ఇంతకు ముందరి సార్స్, ఇబోలా, స్వైన్ ఫ్లూ, జికా, ఎం ఇ ఆర్, వగైరా వైరస్ లకూ సంబంధం నేరుగా పారిశ్రామిక మాంస ఉత్పత్తితోనే ఉన్నదని ఇప్పటికే తేటతెల్లమయింది.

జంతుశాస్త్రవేత్త రాబ్ వాలేస్ 'బిగ్ ఫార్మ్స్ మేక్ బిగ్ ఫ్లూ' (పెద్ద వ్యవసాయ క్షేత్రాలు భారీగా ఫ్లూను తయారు చేస్తాయి) అనే పుస్తకం రాశారు. ఆ పుస్తకంలో ఆయన, "వైరస్‌లు అంతకంతకూ ఎక్కువ ప్రమాదకరంగా ఎందుకు మారుతున్నాయో తెలుసుకోదలచిన వారెవరైనా వ్యవసాయాన్ని పారిశ్రామిక పద్ధతిలో చేసే నమూనాను పరిశోధించాలి. ప్రత్యేకించి పశుగణ ఉత్పత్తి పరిశ్రమను పరిశోధించాలి. ఒక్క మాటలో చెప్పాలంటే పెట్టుబడిదారీ విధానాన్ని పరిశీలించాలి" అన్నారు.

ఈ కంపెనీలు మాంసం ఉత్పత్తి చేయడం మాత్రమే కాదు, తీవ్రమైన వ్యాధులకు కారణమయ్యే వైరస్‌లను కూడ సాగు చేస్తాయని రాబ్ వాలేస్ మరో చోట రాశారు.

ఇదే పరిస్థితి వ్యవసాయంలో కూడ సాగుతున్నది. నిజానికి వృక్ష జాతుల జన్యు నిర్మాణం అంత క్లిష్టమైనది కాదు గనుక, సులభతరమైనది గనుక వ్యవసాయంలో జన్యు సాంకేతిక పరిజ్ఞానాన్ని చాల విస్తృతంగా వాడుతున్నారు. దానితో పాటు వ్యవసాయంలో పురుగుల మందులు, కలుపు మందులు (క్రిమి సంహారకాలు, గుల్మ నాశనులు) విపరీతంగా వాడుతున్న తీరు వల్ల, అవి భూమండల ఉష్ణోగ్రతలు పెరగడానికి మాత్రమే కాక, మొత్తంగా భూగోళపు సమస్త వాతావరణంలో నిర్ణయాత్మకమైన, గుణాత్మకమైన మార్పులకు దారి తీశాయి.

పందులకు ఆహారంగా సోయాబీన్ పిండి పెడుతున్నారు గనుక, సోయాబీన్ సాగు విస్తీర్ణం పెంచడానికి బ్రెజిల్‌లో అమెజాన్ అడవులను నరికి సాగు భూమిగా మార్చారు. తత్ఫలితంగా, అక్కడి పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో పాటు, అప్పటివరకూ ఆ అరణ్యాలలో ఇతర జీవజాతులతో సంబంధం లేకుండా స్థానికంగా ఉండిపోయిన వైరస్‌లతో మనుషులు ప్రత్యక్ష సంబంధంలోకి వచ్చారు. ప్రకృతి ఎంత సంక్లిష్ట నిర్మాణంతో ఉంటుందంటే ఎన్నో ప్రమాదకరమైన వైరస్‌లను అది స్థానికతా 'గృహాలలో' నిర్బంధించి పెడుతుంది.

ఒక శాస్త్రీయ పరిశోధన ప్రకారం, అమెజాన్ అరణ్యాల నరికివేత ఏ పద్ధతిలో జరుగుతున్నదంటే, రానున్న 15 సంవత్సరాలలో అమెజాన్ ప్రాంతంలో కార్బన్‌ను స్వీకరించే విశాల క్షేత్రమంతా కార్బన్‌ను విడుదల చేసే ప్రాంతంగా మారిపోతుంది. పెట్టుబడిదారీ లాభాపేక్షతో మనం ఈ ప్రకృతి సహజమైన సంక్లిష్ట నిర్మాణంలో జోక్యం చేసుకుని, దాన్ని ఏకరూపకంగా మార్చినప్పుడు, మనం కచ్చితంగా వైరస్‌లకు రాజమార్గాలు నిర్మిస్తున్నామన్నమాట.

ఇదే పద్ధతిలో పెట్టుబడిదారీ పారిశ్రామిక వ్యవసాయం ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని తమ భూముల నుంచి బేదఖలు చేసింది. అప్పుల ఊబిలో దించిన ఫలితంగా రైతులు ఆత్మహత్యలు చేసుకునే స్థితి వచ్చింది. అది మొత్తం పర్యావరణాన్ని విషపూరితం చేసింది.

ఇవాళ విత్తనాల, పురుగుమందుల రంగంలో ఉన్న కంపెనీలలో అత్యధికం మొదటి, రెండో ప్రపంచ యుద్ధ కాలాల్లో, వియత్నాం యుద్ధ కాలంలో విషపూరిత వాయువులను ఉత్పత్తి చేస్తూ ఉన్నాయనేది ఒక ఆశ్చర్యకరమైన వాస్తవం. డ్యుపాంట్, మోన్సాంటో, డౌ కెమికల్ వంటి కంపెనీలు అమెరికాకూ, మిత్ర రాజ్యాలకూ విష వాయువులను సరఫరా చేయగా, బేయర్ వంటి అగ్రశ్రేణి పురుగుల మందుల కంపెనీలు హిట్లర్‌కు విషవాయువులను సరఫరా చేశాయి. డౌ కెమికల్, మోన్సాంటో వంటి కంపెనీలు వియత్నాం యుద్ధ సమయంలో అమెరికన్ సైన్యానికి 'ఏజెంట్ ఆరెంజ్' అనే కుఖ్యాతి పొందిన విషవాయువునూ, నాపామ్ బాంబునూ సరఫరా చేశాయి.

ఇక 'శాంతి కాలం'లో, ప్రస్తుతం, ఈ కంపెనీలు అదే విషపూరిత రసాయనాలను పురుగుల మందులుగా మార్చి పర్యావరణాన్ని దెబ్బతీయడానికి వాడుతున్నాయి. ఒక ప్రతిష్ఠాత్మక పత్రికలో ప్రచురితమైన పత్రాన్ని ఉటంకిస్తూ, పంటల మీద కొట్టే పురుగుల మందులలో 99.9 శాతం నేరుగా పర్యావరణంలోకి వెళతాయని, కేవలం 0.1 శాతం మాత్రమే లక్ష్యాన్ని చేరుతాయని సుప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్త దేవిందర్ శర్మ అన్నారు. ఈ 99.9 శాతం విష రసాయనాల వల్ల జీవజాతులకు సహకారిగా, స్నేహంగా ఉండే ఎన్నో రకాల బాక్టీరియా, వానపాముల వంటి ప్రయోజనకరమైన జీవజాతులు అంతరిస్తాయి.

మన దేశంలో పంజాబ్‌లో పంటపొలాల్లో వాడిన పురుగుల మందులకూ అక్కడ పెరుగుతున్న కాన్సర్ వ్యాధి పీడితుల సంఖ్యకూ ఉన్న సంబంధం ఇప్పటికే అందరికీ తెలిసిందే. భటిండా నుంచి బికనేర్ కాన్సర్ ఆస్పత్రికి వెళ్లే రైలును అక్కడ 'కాన్సర్ ఎక్స్ ప్రెస్' అని పిలుస్తున్నారు. దీనికి 'జియో ఇంజనీరింగ్'నూ యుద్ధ పరిశ్రమనూ జోడిస్తే పరిస్థితి భయానకంగా మారిపోతుంది.

ఇది ఎంగెల్స్ ద్విశత జయంతి సంవత్సరం. మార్క్స్, ఎంగెల్స్‌లు తమ కాలంలో పెట్టుబడిదారీ విధానపు ధోరణిని అర్థం చేసుకుని, పెట్టుబడిదారీ విధానం గురించి తమ అధ్యయనాలలో దాన్ని ప్రస్తావించారు. "ప్రకృతితో వ్యవహరించేటప్పుడు, ఓడించిన విదేశీ ప్రజల పట్ల ప్రవర్తించే విజేత లాగ, ప్రకృతి నుంచి బైట నిలబడినవారిలాగ, అధికారం చలాయించలేమని ప్రతి అడుగునా మనకది గుర్తు చేస్తుంది. అందుకు భిన్నంగా, మనం మన రక్తమాంసాలతో, మెదడుతో ప్రకృతికి చెందినవాళ్లం. దాని మధ్య మనుగడ సాగించవలసిన వాళ్లం. దాని మీద మన ఆధిపత్యమంతా కేవలం మిగిలిన అన్ని జీవజాతులకన్న భిన్నంగా దాని నియమాలను అర్థం చేసుకోగలమనీ, ఆ నియమాలను సరిగ్గా అన్వయించగలమనీ మాత్రమే" అని ఎంగెల్స్ అన్నాడు.

పెట్టుబడిదారీ విధానానికి ముందు ఉన్న వర్గ వ్యవస్థలేవైనా కేవలం శ్రమను మాత్రమే దోపిడీ చేసేవి. శ్రమతో పాటు ప్రకృతిని కూడ దోపిడీ చేసే మొట్టమొదటి వర్గవ్యవస్థ పెట్టుబడిదారీ విధానం. కాని దాని

దుష్ఫలితాలను మాత్రం యావత్తు మానవ జాతి అనుభవించవలసి వస్తుంది.

2011కూ 2018కీ మధ్య 172 దేశాల్లో మొత్తం 1,483 విస్తృతమైన అంటువ్యాధులు ప్రబలాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించింది. ఇందుకు కారణమైన వైరస్‌లను, ప్రధానంగా ఇన్ ఫ్లుయెంజా, సార్స్, ఎంఇఆర్ఎస్, ఇబోలా, జికా, ప్లేగ్, ఎల్లో ఫివర్ వగైరాలను, అధ్యయనం చేసిన గ్లోబల్ ప్రిపేర్డ్‌నెస్ మానిటరింగ్ బోర్డ్ (జిపిఎంబి), ఇవాళ్టి కరోనా లాంటి మహా విపత్తు త్వరలో బైటపడనున్నదని కచ్చితమైన హెచ్చరికను 2019 సెప్టెంబర్‌లోనే ఇచ్చింది. 'ప్రమాదంలో ప్రపంచం' (ఎ వరల్డ్ ఎట్ రిస్క్) అనే శీర్షికతో వెలువడిన ఆ నివేదికను పరిగణనలోకి తీసుకునేవాళ్లు ఒక్కరూ లేకపోయారు.

అంతే కాదు, 2003-04లో వచ్చిన సార్స్ మహమ్మారికి ముందే శాస్త్రవేత్తలు కరోనా కుటుంబానికి చెందిన ఒక వైరస్ భవిష్యత్తులో మహా ప్రమాదకరంగా మారనున్నదని హెచ్చరిక విడుదల చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అన్ని దేశాల ప్రజా ఆరోగ్య వ్యవస్థలకు మూడు సంవత్సరాల కిందనే ఒక హెచ్చరిక జారీ చేసింది. ఒకానొక వైరస్ మహా భయానకమైన మహమ్మారిని సృష్టించబోతున్నదని, అన్ని ప్రభుత్వాలు ఆ సవాలును ఎదుర్కోవడానికి సమాయత్తం కావాలని ఆ హెచ్చరిక చెప్పింది.

ఈ హెచ్చరికలను విని ఉంటే పరిశోధనా కార్యక్రమాలు చేపట్టవలసి ఉండింది. తమ ప్రజారోగ్య సేవల వ్యవస్థలను బలోపేతం చేసి భవిష్యత్తు అవసరాలకు సంసిద్ధం చేసి ఉండవలసింది. కాని ఆ పనులు చేయవలసిన సామ్రాజ్యవాద - పెట్టుబడిదారీ వ్యవస్థ 2007-08 సంక్షోభం తర్వాత తానే స్వయంగా ఐసియులో ఉన్నప్పుడు అది భవిష్యత్తుకు ఎలా సంసిద్ధం కాగలుగుతుంది? 90 ట్రిలియన్ డాలర్ల విలువైన ప్రపంచ పెట్టుబడిదారీ విధానం తనంతట తానే 270 ట్రిలియన్ డాలర్ల రుణభారం కింద మూలుగుతున్నప్పుడు అది ఏ జాగ్రత్తలు తీసుకోగలుగుతుంది?

ప్రపంచంలోని అనేక దేశాలలో అంతవరకూ ఎంతో కొంత ఉండిన "ప్రజా" రంగం కూడ ప్రైవేటీకరణ తుపానులో ధ్వంసమైపోయింది. ప్రతి వ్యవస్థనూ, నిర్మాణాన్నీ ప్రైవేటు రంగానికి అప్పగించారు. చాల దేశాల్లో ప్రభుత్వ వైద్య ఆరోగ్య సేవా రంగాలు ధ్వంసమైపోయాయి. అమెరికా, బ్రిటన్‌లలో ప్రభుత్వ ఆరోగ్య సేవల రంగాలను ఎట్లా ధ్వంసం చేశారో మైకేల్ మూర్, జాన్ పిల్జర్‌లు తీసిన డాక్యుమెంటరీలు చూస్తే అర్థమవుతుంది.

మరొక వంక, తక్షణ లాభాలు లేని రంగాలలో ప్రైవేట్ కంపెనీలు పరిశోధనలు ఎందుకు సాగిస్తాయి? ఇది స్పష్టంగా అర్థం కావాలంటే ఒక ఉదాహరణ చూడాలి. జన్యు చికిత్స మీద పరిశోధన చేస్తున్న ఒక కంపెనీకి సంబంధించిన ఇమెయిల్స్ పొరపాటున బైటపడ్డాయి. ఆ కంపెనీలో మదుపు పెట్టిన గోల్డ్ మాన్ సాక్స్ రాసిన ఇమెయిల్‌లో జన్యువులో మార్పులు చేసి అసలు అనారోగ్యమే రాకుండా చేయడానికి పరిశోధనలు జరపడం 'సుస్థిరమైన వ్యాపార తర్కం' కాదు అని మందలించారు. జబ్బు అనేది ఎప్పుడూ వస్తూ ఉండడమే ఎప్పుడూ లాభాలు తెచ్చి పెడుతుంది. అసలు జబ్బే రాకుండా చేయడమంటే లాభాలు రాకుండా చేయడమే. అంటే అది సుస్థిరమైన వ్యాపార తర్కం కాదు.

ఇంతకూ వాస్తవమేమంటే, 2020 ప్రారంభంలో అల్లకల్లోలం చేయడానికి వచ్చిన కరోనా సంక్షోభాన్ని ఎదుర్కోవలసిన ప్రపంచాన్ని అప్పటికే ముప్పై సంవత్సరాలుగా ప్రపంచీకరణ చెదలు తినేస్తున్నది. ఆ ప్రపంచపు వాస్తవ దృశ్యాన్ని గుర్తించడానికి మీరు కేవలం రెండు అంశాలు చూస్తే చాలు:

ఒకటి, ఈ భూమిని తొమ్మిది సార్లు ధ్వంసం చేయడానికి తగిన ఆయుధ సామగ్రి మన దగ్గర ఉంది గాని, అదే సమయంలో మన దగ్గర జీవితాన్ని నిలపడానికి అవసరమైన వెంటిలేటర్లు మాత్రం కావలసినన్ని లేవు. ఈ వెంటిలేటర్ల తీవ్రమైన కొరతే ఇవాళ కరోనా వల్ల జరిగే మరణాలకు ప్రధాన కారణం కానుంది.

రెండోది, ఇవాళ ప్రపంచంలోని 2,153 మంది సహస్ర కోటీశ్వరుల దగ్గర ఉన్న సంపద, 406 కోట్ల మంది దగ్గర ఉన్న సంపదతో సమానం. ఈ ప్రపంచీకరణ వ్యవస్థకు నిర్మాత అయిన అమెరికా ప్రస్తుతం అత్యంత దారుణమైన దుస్థితిని అనుభవిస్తున్నదంటే కారణం అదే. అందుకు భిన్నంగా, ఒక భిన్నమైన సామాజిక ఆర్థిక వ్యవస్థ ఉన్న క్యూబా మెరుగైన స్థితిలో ఉన్నది. క్యూబా కరోనాను అదుపులో పెట్టడం మాత్రమే కాదు, కరోనా వ్యతిరేక పోరాటంలో ప్రపంచంలోనే అగ్రశ్రేణిలో ఉండి 62 దేశాలకు తన వైద్యులను, ఔషధాలను పంపిస్తున్నది. ఇతర దేశాలకు సైన్యాన్ని, ఆయుధాలను పంపించే పని అమెరికా చేస్తుండగా, వైద్యులను, ఔషధాలను పంపించే పని క్యూబా చేస్తున్నది. రెండు భిన్నమైన సామాజిక వ్యవస్థల మధ్య తేడా ఇదే. ఒకటి మృత్యువును ఎగుమతి చేసే వ్యవస్థ, మరొకటి జీవితాన్ని ఎగుమతి చేసే వ్యవస్థ.

వాస్తవానికి, ప్రఖ్యాత రచయిత నౌమి క్లీన్ అన్నట్టు, భూకంపం, తుపాను, మహమ్మారి వంటి ఉత్పాతం వచ్చినపుడు పాలకవర్గాలు తమ భావజాలాన్ని వదులుకోవు, మరింత గట్టిగా అంటిపెట్టుకుంటాయి. అందువల్లనే ఇంతటి ఉత్పాతంలో కూడ అవి తమ వర్గ ప్రయోజనాల మీద, భవిష్యత్తు లాభాల మీద దృష్టి పోగొట్టుకోవడం లేదు. అవి ఇంతకాలమూ అణచిపెట్టుకున్న అత్యాశలు కూడ ఇటువంటి సమయంలోనే బైటపడతాయి. వాటిని తీర్చుకోవడానికి అన్ని ప్రయత్నాలూ చేస్తాయి.

గత సంవత్సరం, 2019 ఒక గొప్ప నిరసన ప్రదర్శనల, ఉద్యమాల సంవత్సరం. చాల మంది రాజకీయ విశ్లేషకులు ఆ సంవత్సరాన్ని 1848తో, 1968తో పోల్చారు. ఆ సంవత్సరం భూగోళం మీద ఏ ఒక్క మూల కూడ భారీ ప్రజా ప్రదర్శనలు చూడకుండా లేదు. భారతదేశంలో కూడ ఈ కాలంలోనే సిఎఎకు వ్యతిరేకంగా బ్రహ్మాండమైన ప్రదర్శనలు జరిగాయి. కరోనా సాకుతో పాలకవర్గాలు ఈ ఉద్యమాలన్నిటినీ తక్షణమే మూసివేయడంలో విజయం సాధించాయి. ప్రపంచ వ్యాప్తంగా అంతటి భారీ స్థాయి ప్రజా రాజకీయ ఉద్యమాలు కరోనా సాకుతో మరణించడం, కరోనా మరణాల కన్న తక్కువదేమీ కాదు. ఇవాళ ప్రపంచమంతటా కరోనా మరణాల గురించి పత్రికలు హోరెత్తుతున్నాయి. మన దేశంలో షాహీన్ బాగ్ నిరసన ప్రదర్శనలు ఎలా ముగిసిపోయాయో ప్రతి ఒక్కరికీ తెలుసు.

ప్రపంచమంతటా మాంద్యం ముసురుకుంటున్నప్పుడు, తమ లాభాల వాటాను కాపాడుకోవడానికి కంపెనీలు తమ కార్మికులను, ఉద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగించడానికి కంకణం కట్టుకున్నాయి. కాని అవి ఆ పని చేయడానికి తీవ్రమైన వ్యతిరేకత ఎదురవుతూ ఉండింది. ఇప్పుడు కరోనా వారికి మహా అవకాశం ఇచ్చింది. ఈ కాలంలో మొత్తం ఎంత

మందిని ఉద్యోగాల నుంచి తొలగించారో వాస్తవ గణాంకాలు తర్వాత బైటపడతాయి. కాని ఈలోగా మనం వాస్తవాల ఆధారంగా కొన్ని అంచనాలు వేయవచ్చు. ఒక్క అమెరికాలోనే ఒక కోటీ ఎనభై లక్షల మంది గత రెండు నెలల్లో కొత్తగా నిరుద్యోగ భృతికి దరఖాస్తు పెట్టుకున్నారు. 1929-30 నాటి మహా సంక్షోభం తర్వాత ఇంతమంది నిరుద్యోగులు కావడం ఇప్పుడే.

ఈ కరోనా మహావిపత్తు కాలంలో అనేక దేశాల ప్రభుత్వాలు ఎటువంటి నిరంకుశ పద్ధతులను అమలు చేస్తున్నాయో చూస్తే, అవి వాళ్ల పీడనా కాంక్షను వ్యక్తీకరిస్తున్నాయనిపిస్తున్నది. హంగరీతో సహా ఎన్నో దేశాలు నేరుగానే అత్యవసర పరిస్థితిని ప్రకటించాయి. మన దేశంలో కూడ, మోడీ స్పష్టంగానే 'సామాజిక అత్యవసర పరిస్థితి' గురించి మాట్లాడాడు. నిజానికి ఇది భారత్ వంటి మూడో ప్రపంచ దేశాలలో దారుణంగా ఉంది. మార్చ్ 21న, కొలంబియాలోని బొగొటా జైలులో కరోనాతో వ్యవహరించడానికి తగిన మెరుగైన పరిస్థితులు కల్పించమని అడిగిన ఖైదీల మీద పోలీసులు దాడిచేసి, కాల్పులు జరిపి 23 మంది ఖైదీలను చంపేశారు. కెన్యాలో వీధుల్లో పోలీసు కాల్పుల్లో చనిపోయిన వారి సంఖ్య కరోనాతో చనిపోయినవారి సంఖ్య కన్న ఎక్కువ. మామూలు సందర్భాల్లోనైతే ఇవి ప్రధాన వార్తలు అయి ఉండేవి. కాని కరోనా కాలంలో ఈ వార్తలకు దిక్కే లేదు.

వివిధ దేశాల ప్రభుత్వాలు, ఇంటర్నెట్ కంపెనీలు కలిసి కరోనా సాకుతో తమ దేశాలను అక్వేరియంలలాగ మార్చేశాయి. పౌరుల ప్రతి చర్యా నిఘాకు గురవుతున్నది. మామూలు సమయాల్లోనైతే ఇంత నిఘా ఉంటే తీవ్రమైన వ్యతిరేకత వచ్చేది, కాని ప్రస్తుత స్థితి ఒక "కొత్త సాధారణ స్థితి" లాగున్నది. ఇవాళ మన ముందర గూఢచారి పెట్టుబడిదారీ విధానం దాని నగ్నరూపంలో ఉన్నది. జార్జి ఆర్వెల్ రాసిన 1984 ఇవాళ ఇంకెంతమాత్రమూ ఒక నవల కాదు, ఒక కఠోర వాస్తవం. విచిత్రమైన విషయమేమంటే ఆ నవల రాసినప్పుడు, దాన్ని సినిమాగా తీసినప్పుడు సోషలిజం మీద విమర్శగా వెలువరించారు. ఇవాళ పెట్టుబడిదారీ విధానమే ఆ నవలలో, సినిమాలో చూపినదానికన్న ఘోరంగా ఉండగలనని చూపుకుంటున్నది. ఆలోచనల మీద నిఘా, ఆలోచనల మీద పోలీసులు అనే మాటలు ఇవాళ కనీసం భారతదేశంలో అక్షరాలా నిజాలయ్యాయి. నేనీ వాక్యం రాస్తున్నప్పుడే, కరోనా విషయంలో ప్రభుత్వ వైఫల్యం గురించి ఫేస్ బుక్ మీద వ్యాఖ్య రాసినందుకు ఇంఖిలాబి మజ్దూర్ కేంద్ర కు చెందిన కైలాష్ భట్‌ను అరెస్టు చేశారని వార్త వస్తున్నది.

కరోనా ధనికులకూ పేదలకూ మధ్య వ్యత్యాసం చూపదని ప్రధానస్రవంతి ప్రచార సాధనాలు పదే పదే చెపుతున్నాయి. కాని అన్ని సందర్భాలలో లాగనే ఈ సందర్భంలో కూడ ప్రధానస్రవంతి ప్రచారసాధనాల మాట తప్పు. అన్ని రకాల ఆర్థిక సామాజిక విభజనలను కరోనా పూర్తిగా బలోపేతం చేస్తున్నది. మనం అమెరికాలోని అంకెలనే పరిశీలిస్తే, మరణాలలో 70 శాతం నల్లజాతి వారివి, ఆఫ్రికన్ అమెరికన్లవి. ఇప్పుడు కరోనా సమయంలో ఫోన్ ఎక్కడెక్కడికి వెళ్లిందనే దాన్ని బట్టి వారి సామాజిక చలనాన్ని చెప్పే సమాచారాన్ని ఎన్నో సంస్థలు బైటపెడుతున్నాయి. ఆ సమాచారాన్ని బట్టి అమెరికా, యూరప్‌లలో దాదాపు పది శాతం జనం అసలు ఎక్కడికీ కదలడమే లేదు. అంటే వాళ్లు పూర్తిగా తమ ఇళ్లలోనే ఉంటున్నారు. అదే సమయంలో ఆర్థిక స్థాయిలో అట్టడుగు 30 శాతం జనాభాలో విపరీతమైన చలనం ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ చలనంలో ఉన్న ప్రజానీకమే కరోనాకు అతి పెద్ద బాధితులుగా ఉన్నారు. అంటే తమ జీవిక కోసం బైట తిరగక తప్పని జనం కరోనా బాధితులుగా ఉన్నారన్నమాట. వారు ఇంట్లో ఉండడం అసాధ్యం. ఈ సందర్భంలో రానా అయ్యూబ్ రాసిన 'సామాజిక దూరాన్ని పాటించడం ఒక విలాసం' అనే వ్యాసం చూడడం మంచిది. భారత దేశంలో గాని, ప్రపంచంలో ఎక్కడైనా గాని మురికివాడల్లో సామాజిక దూరం, సోషల్ డిస్టెన్సింగ్ అనేది ఒక క్రూర పరిహాసం.

వాస్తవంగా వరదనీరు అంతా తీసిన తర్వాత మాత్రమే ఆ ప్రాంతపు నిజమైన చీదర అంతా కనబడుతుంది. ఈ కరోనా వెళ్లిపోయిన తర్వాతనే మన వ్యవస్థ ఎంత దుర్మార్గమైనదో బైటపడుతుంది. అయితే వరద నీరు ఉన్నప్పుడు కూడ మీరు చూడగలిగినవి కొన్ని ఉంటాయి. స్పానిష్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఇచ్చిన రహస్య ఆదేశాల ప్రకారం 60 సంవత్సరాల వయసు దాటినవాళ్లను ఐసియులలో చేర్చుకోవద్దని అన్నారు. వారికి బదులుగా యువ వ్యాధి పీడితులకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అమెరికాలో టెక్సాస్ రాష్ట్ర గవర్నర్ డాన్ పాట్రిక్ మరింత నిర్దాక్షిణ్యంగా ముసలివాళ్లు తమ జీవితాలను అమెరికన్ ఆర్థిక వ్యవస్థ కోసం, యువతరం కోసం త్యాగం చేయాలని అన్నాడు. వ్యాపార పత్రిక బ్లూంబర్గ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమెరికన్ శత కోటీశ్వరుడు టాం గాలిసానో ఈ మాటనే మరింత గట్టిగా చెప్పాడు. ఆర్థిక వ్యవస్థను మూసివేయడం కన్న కొందరు వ్యక్తులు చనిపోవడం మంచిది అని ఆయన అన్నాడు. ఇంగ్లండ్ ప్రధానమంత్రి మరొక అడుగు ముందుకు వేసి జనం చచ్చిపోతేనే కరోనాకు వ్యతిరేకంగా సమూహ రోగ నిరోధకశక్తి పెరుగుతుందని అన్నాడు. కరోనాకు ఈ మాట చాల నచ్చినట్టుంది, అది వెంటనే ఆయనకే సోకింది. ఇవాళ ఆయన లండన్‌లో ఒక ఆస్పత్రిలో ఐసియులో ఉన్నాడు. ఈ మాటలన్నీ కూడ 1942 భారత్ క్షామం సమయంలో చర్చిల్ చేసిన ప్రకటనను గుర్తుకు తెస్తున్నాయి. భారతీయులు తమ జనాభాను ఎలుకల్లాగ ఇబ్బడి ముబ్బడిగా పెంచుతున్నారనీ, ఆ జనాభా ఆ క్షామంతో అదుపులోకి వస్తుందని చర్చిల్ అన్నాడు.

ఇప్పుడిక మనం భారతదేశం సంగతి చూద్దాం. ఏప్రిల్ 5న అకాలంగా వచ్చిన దీపావళిని భక్తితో చూడని వాళ్లెవరయినా ఈ దేశంలోని నామమాత్రపు ప్రజాస్వామ్యం ఇవాళ్టికి మూర్ఖస్వామ్యంగా మారిపోయిందని గుర్తించగలరు. మర్జ్ బఢ్తా హి గయా జో జో దవాకి (ఎట్లెట్లా మందులు వేసుకుంటానో అట్లట్లా వ్యాధి పెరుగుతూ పోతున్నది) అని మీర్జా గాలిబ్ రాసిన కవితా వాక్యం ఇవాళ్టి భారత పాలకవర్గాలకు సరిగ్గా సరిపోతుంది.

మొదట పెద్ద నోట్ల రద్దును గుర్తు చేసుకుందాం. నల్లధనాన్ని అరికట్టడానికనే పేరుతో పెద్దనోట్ల రద్దు జరిగింది. కాని పెద్ద నోట్ల రద్దుతో నల్ల ధనమంతా తెల్ల ధనమైపోయింది. ఉన్న నోట్ల కన్న ఎక్కువ నోట్లు తిరిగివచ్చాయి. కాని నియంత చూపిన ఈ ఉన్మాదం వల్ల కోట్లాది భారతీయుల బతుకుతెరువు ధ్వంసమైపోయింది. భారత ఆర్థిక వ్యవస్థ పట్టాలు తప్పింది. అదే విధంగా మార్చ్ 24 లాక్ డౌన్ తర్వాత ఏర్పడిన పరిస్థితులు కరోనా మరింత వ్యాపించడానికి దారి తీశాయి. లక్షలాది మంది వలస కార్మికులు 'వెనుకకు లాంగ్ మార్చ్' చేయవలసిన పరిస్థితికి నెట్టబడ్డారు. ఎండలో, వానలో, దప్పికగొన్న ఈ వలస కార్మికులు కరోనాకు అత్యంత సులభంగా దొరికే ఎరలుగా మారారు. కొన్ని షెల్టర్ హోమ్స్‌లో జనాన్ని ఎట్లా కుక్కేశారంటే, అవి వారి కార్మిక శిబిరాల్లో

లాంటి దుస్సహమైన పరిస్థితినే కొనసాగించాయి. రహదారుల పక్కనా, గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్వారంటైన్ కేంద్రాల్లో ఎన్నో పాములకూ తేళ్లకూ మండ్రగబ్బలకూ నిలయాలయ్యాయి. మరెన్నో క్వారంటైన్ కేంద్రాలు జైళ్ల కన్న హీనంగా ఏ నేరం చేయని లక్షలాది మందిని నిర్బంధించాయి. వీరందరూ కరోనాకు అందుబాటులో ఉన్న బాధితులే. ఔను, ఈ సమయంలో ఉన్నత వర్గాలు, మధ్యతరగతి వర్గాలు కచ్చితంగా సుఖంగా, భద్రంగా ఉండిపోయారు. భారతదేశంలో సామాజిక దూరం అంటే వాస్తవంగా వర్గ దూరమే. దీని అసలు ఉద్దేశం ఉన్నత, మధ్యతరగతి వర్గాలకూ, పేద వర్గాలకూ దూరాన్ని పెంచి, కరోనాను పేద వర్గాలవైపు పంపించడమే.

అలా రహదారుల మీదికి వచ్చిన కార్మికులందరూ తమ ఇంటర్వ్యూల్లో తాము కరోనా కన్న ఆకలికీ, పోలీసు లాఠీకీ ఎక్కువ భయపడతామని చెప్పారు. ఈ నిస్సహాయ కార్మికులు తమ గ్రామాలకు సంతోషంగా ఏమీ తిరిగి వెళ్లడం లేదు. వారు తిరిగి వెళుతున్న గ్రామసీమల్లో ప్రతి రోజూ 31 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇటువంటి సంక్షోభ సమయంలో కూడ ఈ రహదారుల మీది వలస కార్మికులతో పోలీసులు ప్రవర్తిస్తున్న తీరు, వారి మీద కురిపిస్తున్న లాఠీ దెబ్బలు, వారికి శిక్షలు విధిస్తున్న తీరు, మన పాలకవర్గాల వర్గ/కుల దురభిప్రాయాలనూ, వారి పైశాచిక మనస్తత్వాన్నీ అత్యంత దారుణంగా, అసహ్యకరంగా బైటపెడ్తున్నాయి.

కరోనా సందర్భంలో ఖైదీలను విడుదల చేయమని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా 11000 మంది ఖైదీలను విడుదల చేయాలని నిర్ణయించిన ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వమే లాక్ డౌన్‌ను ఉల్లంఘించారనే పేరుతో, అంతకన్న ఎక్కువమందితో జైళ్లను నింపుతున్నదంటే ఈ ప్రభుత్వపు దివాళాకోరుతనానికి అంతకన్న మంచి ఉదాహరణ ఉండదు. ఈ దేశంలో ప్రభుత్వాలు ఎంత దివాళాకోరుతనంతో పనిచేస్తున్నాయో దీనితో అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి భారత ప్రభుత్వానికి ఎటువంటి వ్యూహమూ లేదు, ఎటువంటి ముందస్తు ఏర్పాటూ లేదు. వారి దగ్గర అసలు నమ్మదగిన అంకెలే లేవు. కాని మోడీ ప్రభుత్వానికి ప్రతి సందర్భాన్నీ ఒక ఉత్సవంగా ఎట్లా మార్చాలో తెలుసు. చివరికి కలుపు మొక్కలకు సంస్మరణ ఉత్సవాలు కూడ జరపగలరు. అది చాల బాగా కూడ చేస్తున్నారు.

యూరపియన్ దేశాలను అనుకరిస్తూ, భారత ప్రభుత్వం ఎటువంటి ముందస్తు ఏర్పాట్లు లేకుండా హఠాత్తుగా లాక్‌డౌన్ ప్రకటించింది. చివరికి అనుకరణలోనైనా కొంత మెరుగు పరచవలసి ఉంటుంది. రాత్రి ఎనిమిది గంటలకు లాక్‌డౌన్ ప్రకటించగానే, జనం విపరీతంగా దుకాణాలను చుట్టుముట్టారు. ప్రకటిత సామాజిక దూరపు నియమాలన్నిటినీ ఉల్లంఘించారు. హాస్టళ్లలోని విద్యార్థులు, యువజనులు, తాత్కాలిక కార్మికులు పెద్ద ఎత్తున బస్ స్టేషన్లకూ, రైల్వే స్టేషన్లకూ తరలి వచ్చారు. ఉన్నత మధ్యతరగతి వర్గాలను మాత్రం రక్షించి, పేద కార్మికులను కరోనా అనే సింహానికి అప్పగించడానికే ఇది జరిగిందని చెప్పవచ్చు.

భారతదేశంలో సాలీనా నాలుగు లక్షల మంది క్షయవ్యాధితో చనిపోతున్నారు. దానికి ప్రధాన కారణాలలో ఒకటి పేదరికం. ప్రస్తుత లాక్ డౌన్ ఆ పేదరికాన్ని మరింత పెంచుతుంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ తాజా నివేదిక ప్రకారం, లాక్ డౌన్ తర్వాత దేశంలో 40 కోట్లమంది మరింత పేదరికంలోకి దిగజారనున్నారు. అంటే ఈ సంవత్సరం క్షయవ్యాధితో మరణించేవారి సంఖ్య పెరగనున్నది. మరి కరోనా బారిన పడకుండా ఒకరిని రక్షించడంలో, క్షయవ్యాధితో మరణించే నలుగురిని తయారు చేయడం ఎంత సమర్థమైన వ్యూహం? ఈ కరోనా సమయంలో దాదాపు అన్ని ఆస్పత్రులలోనూ ఔట్ పేషెంట్ శాఖలను మూసేశారు. ఢిల్లీలోని ఎఐఐఎంఎస్ వంటి ఆస్పత్రి కూడ తన ఔట్ పేషంట్ విభాగాన్ని మూసేసింది. చివరికి వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న కాన్సర్ పేషంట్లకు కూడ చికిత్స చేయడం లేదు. ఢిల్లీలో కాన్సర్ వ్యాధి గ్రస్తులందరూ ఎఐఐఎంఎస్ దగ్గరా, ఇతర ఆస్పత్రుల దగ్గరా మృత్యువు కోసం ఎదురుచూస్తూ పడిఉన్నారు. ప్రైవేట్ క్లినిక్‌లు నడిపే చాల మంది డాక్టర్లు తమ క్లినిక్‌లు మూసేశారు. తమ సొంత భద్రత తాము చూసుకుంటున్నారు. ఎంతమంది కరోనా పేషంట్లను కాపాడే క్రమంలో మరెంతమంది ఇతర వ్యాధిగ్రస్తులను మనం చంపేస్తున్నామో లెక్కలు బహుశా ఎప్పటికీ బైటికి రాకపోవచ్చు.

మరి పాపం, భారతదేశం ఏం చేయగలుగుతుంది? గత కొన్ని దశాబ్దాలుగా మన సమయమంతా హిందూ – ముస్లిం ఘర్షణలు రెచ్చగొట్టడంలోనే సరిపోయింది. ఇక మిగిలిపోయిన మన పనిని ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ వంటి సామ్రాజ్యవాద సంస్థలో, అమెరికానో చేసిపెట్టాయి. అలా మనం నిర్వహించిన 'బహు సుందరమైన' కార్యక్రమాల ఫలితంగా ఇవాళ మనం ప్రతి 10,000 మందికి ఒక ఎంబిబిఎస్ డాక్టర్ ఉండే స్థితికి చేరుకున్నాం. అలాగే ప్రతి వెయ్యి మందికి ఆస్పత్రిలో సగం మంచం ఏర్పాటు చేశాం. ఇదేమీ హాస్యం కాదు, అత్యంత తీవ్రమైన జబ్బులు ఉన్నవారిని కూడ ఇద్దరు వ్యక్తులను ఒకే బెడ్ మీద పడుకోబెట్టడం ఎన్నో ఆస్పత్రుల్లో జరుగుతున్నది. బీహార్‌లోని 18 జిల్లాల్లో ఒక్కటంటే ఒక్క వెంటిలేటర్ కూడ లేదు. ఈ పరిస్థితుల వల్ల, కేవలం ఆరోగ్య సేవల మీద ఖర్చుల వల్ల, ప్రతి సంవత్సరం దేశంలో ఐదు కోట్ల ఐదు లక్షల మంది దారిద్ర్యరేఖ కిందికి జారిపోతున్నారు. కరోనా వంటి మహమ్మారిని ఎదుర్కోవడానికి తగిన స్థితిలో భారతదేశం ఏరకంగా చూసినా లేదు.

కాని ఇక్కడి ప్రచార సాధనాలు మాత్రం అన్నిటికీ అన్ని సమయాల్లోనూ సిద్ధంగా ఉంటాయి. ఇక కరోనాకైతే అవి సంసిద్ధంగా ఉండడం కంటే ఎక్కువ సంసిద్ధంగా ఉన్నాయి. అవి మొదట కరోనా విషయంలో చైనా మీద గురి పెట్టాయి. అమెరికా అన్న మాటనల్లా తిరిగి పలికాయి. కాని భారత ప్రభుత్వమే వెంటిలేటర్లు కావాలనీ, టెస్టింగ్ కిట్స్ కావాలనీ చైనాను అడగవలసి వచ్చేసరికి, మన ప్రచార సాధనాలు అప్పటిదాకా పాడుతున్న పాటను మధ్యలో ఆపేసి, ఎల్లప్పుడూ ఇష్టపూర్వకమైన శత్రువైన ముస్లింల మీదికి తమ గురిని తిప్పాయి. కరోనా మొత్తానికీ నిందను ముస్లింల మీద మోపడం మొదలుపెట్టాయి. సంఘ్ ఐటి సెల్స్ లాక్ డౌన్‌ను సంపూర్ణంగా వినియోగించుకుని, తామే కరోనా పాత్రను పోషించడం మొదలుపెట్టాయి. ప్రజలకు తమ విషం అంటించడానికి ఏ ఒక్క అవకాశాన్నీ వదులుకోవడం లేదు. సిఎఎ వ్యతిరేక ఆందోళనలో ముస్లింలు నిర్వహించిన పాత్రకు ప్రతీకారం తీసుకోవడానికి ప్రభుత్వానికి ఒక అవకాశం దొరికింది. మసీదు నుంచి బైటికి వస్తున్న ముస్లింల మీద పోలీసులు లాఠీల వర్షం కురిపిస్తున్న వీడియో, రానా అయ్యూబ్ ట్విట్టర్ మీద చూపిన వీడియో ఎవరు

కరోనా కౌగిట్లో అమెరికా

ప్రజారోగ్యం పట్ల అమెరికన్ పాలకులు వహించిన నిర్లక్ష్యమే ప్రస్తుతం అమెరికాలో విచ్చలవిడి మరణాలకు కారణమంటున్నారు **ఎ. నర్సింహారెడ్డి**

ఎక్కడ పాలకులు ప్రజారోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించారో అక్కడ కరోనా (కోవిడ్-19) మహమ్మారి విజృంభించింది. అందుకు అమెరికా తాజా ఉదాహరణ. కరోనా మహమ్మారి కనివిని ఎరుగని రీతిలో కల్లోలం సృష్టిస్తోంది. రోజు రోజుకు మరింత తీవ్రరూపం దాల్చుతోంది. దీంతో అగ్రరాజ్యం అమెరికా కకావికలం అవుతోంది. అక్కడి వార్తలు వింటుంటే ఆందోళన కలిగిస్తున్నాయి. ఏప్రిల్ 30 అర్ధరాత్రి వరకు అమెరికాలో బయటపడ్డ కరోనా పాజిటివ్ కేసులు 10,75,643 కాగా వారిలో 62,319 మంది మరణించారు. అక్కడి దృశ్యాలు చూస్తుంటే ప్రతి ఒక్కరి హృదయాలను కలిచి వేస్తున్నాయి. రోజూ వేల సంఖ్యలో ప్రజల ప్రాణాలు పోతుండడంతో మృత్యు ఘంటలు మోగిస్తోంది. ప్రతి రోజు దేశవ్యాప్తంగా పాజిటివ్ కేసులు వేలలో నమోదవుతున్నాయి. వాణిజ్యానికి పెట్టింది పేరైనా న్యూయార్క్ నగరంలో గుట్టలు గుట్టలుగా శవాలు, సామూహిక దహనాలతో కరోనా కరాళ నృత్యం చేస్తోంది. శవాలను భద్రపరచడానికి స్థలాలు లేక వందలాదిగా ఫ్రీజర్ ట్రక్కుల్లో నిండిపోతున్నాయి. ప్రపంచంలోనే అత్యంత సంపన్నమైన అమెరికాలో ఎందుకిలా జరుగుతోంది?

ట్రంప్ అలసత్వం - ప్రమాదంలో అమెరికా

కరోనా విలయం విరుచుకుపడుతున్నా దాన్ని ధిక్కరించడమే వీర లక్షణమన్న తెలివిడితో - ఏదో ఒకనాడు ఉన్నట్టుండి అది మాయమైపోతుందని ఫిబ్రవరిలోనే ట్రంప్ కాలజ్ఞానం బోధించారు. మొట్టమొదటగా జనవరి 21న వాషింగ్టన్ ప్రాంతంలోని స్నోకామీ కౌంటీలో ఒక వ్యక్తికి కరోనా వైరస్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. అతడు జనవరి 15న చైనా నుంచి వచ్చాడు. వుహాన్ నగరంలో ఈ

మరిచిపోగలరు? ఎంతమంది ముస్లింలను, లేదా ముస్లిం మొహల్లాలను కరోనా కారణంగా క్వారంటైన్ చేశారో, కేవలం వారు ముస్లింలైనందువల్లనే క్వారంటైన్ చేశారో, ఇప్పుడెవరికీ రహస్యం కాదు. మొత్తం ప్రపంచమంతా కరోనా వైరస్ జన్యు నిర్మాణం ఏమిటని అధ్యయనం చేస్తున్న సమయంలో మనం కరోనా మతమేమిటో కనిపెట్టడంలో తలమునకలై ఉన్నాం.

నిజం చెప్పాలంటే భారతదేశం వంటి పేద దేశంలో, శ్రామిక జనాభాలో 94 శాతం అసంఘటిత రంగంలోనే పనిచేస్తున్న చోట, సగం కన్న ఎక్కువ జనాభా దుర్భర దారిద్ర్యంలో మగ్గిపోతున్న చోట, సంపూర్ణ లాక్ డౌన్ సరైన నిర్ణయం కాజాలదు. ఇంకా ఇంకా ఎక్కువ పరీక్షలు జరపవలసింది. ఆ పరీక్షా ఫలితాలను బట్టి స్థానిక లాక్ డౌన్‌లు, స్థానిక క్వారంటైన్‌లు ఏర్పాటు చేయవలసింది. కాని వాస్తవమేమంటే, భారతదేశం ఇప్పటికి పది లక్షల మంది ప్రజలకు 137 పరీక్షలు మాత్రమే జరపగలిగింది. కనికా కపూర్‌కు ఇప్పటివరకూ ఏడు సార్లు పరీక్షలు జరిగాయనేది గుర్తుంచుకుంటే, ఈ లెక్క కూడ సరికాదని, ఒకే వ్యక్తికి ఒకటి కన్న ఎక్కువ పరీక్షలు జరిగి ఉండవచ్చునని తేలుతుంది. చివరికి పాకిస్తాన్, శ్రీలంక కూడ పరీక్షల విషయంలో మనకంటె మెరుగుగా ఉన్నాయి. పాకిస్తాన్‌లో పది లక్షల మందికి 262 పరీక్షలు, శ్రీలంకలో 152 పరీక్షలు జరిగాయి. ఇటలీ, జర్మనీలలోనైతే పది లక్షల మందికి 15,000 పరీక్షల దాకా జరిగాయి.

ఇవాళ ఈ కరోనా సమయంలో, అంతకు ముందు క్రమబద్ధంగా పర్యావరణ, ఆరోగ్య, దారిద్ర్య, జల్ జంగల్ జమీన్ సమస్యలు లేవనెత్తుతుండిన, ఈ అమానవీయ వ్యవస్థలో మానవ మనుగడకు సంబంధించిన మౌలిక ప్రశ్నలు లేవనెత్తుండిన, తమకు తోచిన పద్ధతులలో పోరాటాలు జరుపుతుండిన గళాల మీద, శక్తుల మీద నిర్బంధం అమలవుతున్నది. కాని కరోనానంతర సమయంలో ఈ గళాలు మరింత ఎక్కువగా, మరింత బలంగా వినబడతాయి. పద్నాలుగో శతాబ్దిలో యూరప్‌లో ప్లేగ్ అనే మహమ్మారి దాడిచేసి, నాటి యూరప్ జనాభాలో మూడో వంతును చంపేసింది. ఆ మహమ్మారి ప్రధాన ఫలితం ఏమంటే సాధారణ ప్రజానీకం చర్చ్‌లో విశ్వాసం కోల్పోయారు. అదే యూరప్‌లో పునరుజ్జీవనానికి అత్యంత కీలక దోహదం చేసింది. ఆ వరుసలో బూర్జువా ప్రజాస్వామిక విప్లవాలు చెలరేగాయి. ఈసారి కూడ అలా జరుగుతుందా?

ఎడువార్డో గలియనో అన్నట్టు చరిత్ర ఎప్పుడూ వీడ్కోలు అనే మాట అనదు. చరిత్ర ప్రతిసారీ, మళ్లీ కలుద్దాం అనే అంటుంది.

రాత్రి ఎంత గాఢమైన చీకటి అలముకున్నా, ఎల్లప్పుడూ అందులో ఉదయానికి సంబంధించిన ఒక ఆశారేఖ ఉంటుంది. ఈ సందర్భంలో చార్లెస్ డికెన్స్ సుప్రసిద్ధ నవల రెండు మహానగరాలులోని బహుళార్థ బోధకమైన ప్రారంభవాక్యాలు మళ్లీ ఒకసారి చెప్పాలనిపిస్తున్నది: "అది ఒక వైభవోజ్వల మహాశకం. అది అధ్వాన్నపు వల్లకాటి కాలం. అది వివేక సంపన్న యుగం, అది మూర్ఖత్వపు సామ్రాజ్యం. అది మూఢ విశ్వాసాల కాలం, అది మహా సంశయాల కాలం. అది వెలుగులీనిన యుగం, అది మహాంధకారపు సమయం. అది ఆశల ఊట, అది నిరాశల కోట."

(మనీష్ ఆజాద్ రాజకీయ కార్యకర్త. మావోయిస్టు కార్యకర్తలు అనే ఆరోపణతో ఆయననూ ఆయన సహచరినీ అరెస్టు చేసి ఎనిమిది నెలల నిర్బంధం తర్వాత ఫిబ్రవరి 29న బెయిల్ మీద విడుదల చేశారు.)

(హిందీ నుంచి ఇంగ్లిష్: హసన్ ప్రీత్; తెలుగు: ఎన్ వేణుగోపాల్) వీ

వైరస్ వ్యాప్తి గురించి ప్రపంచవ్యాప్తంగా వెల్లడి కావడంతో, తరువాత చైనా ప్రకటన చేసింది. కానీ, అత్యంత అధునాతన సమాచార వ్యవస్థ కలిగిన అమెరికా మేలుకోలేదు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు హెచ్చరించారు. వెంటనే చైనా నుంచి వచ్చే విమానాలను నిషేధించడం, వచ్చిన వారిని పూర్తి పర్యవేక్షణలో ఉంచడం లాంటి తక్షణ చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

సమస్య అక్కడితో ఆగలేదు. ఈ నమూనాలను పరిశీలించే టెస్టింగ్ కిట్లు, ప్రయోగశాలల విషయంలో గందరగోళం నెలకొంది. జనవరిలోనే జర్మనీ పరిశోధకులు అభివృద్ధి చేసిన టెస్టింగ్ కిట్లను ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదించడంతో అన్ని దేశాలు అదే నమూనాలను ఉపయోగించాయి. కానీ అమెరికా మాత్రం వాటిని ఉపయోగించడానికి ఒప్పుకోలేదు. అవి పూర్తి స్థాయి లోపరహితం కావనే నెపంతో సొంత నమూనాలతో పనిచేసే కేంద్ర సంస్థ ఉన్న అట్లాంటికి మాత్రమే పంపించారు. అక్కడ రోజుకు కొన్ని వేలు మాత్రమే పరీక్షించే సామర్థ్యం ఉంది. పైగా పరీక్ష ఫలితం రావడానికి కనీసం ఒక రోజు పడుతుంది. ఇలాంటి లోపభూయిష్ఠ వ్యవస్థ మూలంగా బయటి నుంచి వచ్చినవాళ్లలో ఎంతమందికి వైరస్ సోకింది. వాళ్లు ఎంతమందితో అనుసంధానమయ్యారనే విషయం తెలుసుకోవడం కష్టతరమైంది. ఈ తతంగం దాదాపు నెల రోజులు నడిచింది.

ఫిబ్రవరి 29న మొదటి కరోనా మరణం సియాటిల్ శివారులో సంభవించడంతో అమెరికా మొత్తం ఉలిక్కిపడింది. అప్పటి దాకా ప్రభుత్వ చర్యలు నిమ్మకు నీరెత్తినట్లుగా సాగడంతో వైరస్ వ్యాప్తి చాపకింద నీరులా విస్తృతమైంది. మృతుల సంఖ్య ఒకేరోజు 500 దాటాక తన ప్రథమ ప్రాధాన్యత కరోనాయేనని, ఆర్థిక వ్యవస్థ ఆ తర్వాతే వస్తుందని తెలిపారు. కొన్ని రోజులు వెనక్కి వెళ్లి చూస్తే ట్రంప్ దీనికి విరుద్ధమైన ప్రకటనలు చేశారు. కరోనా వ్యాధి పెద్ద సమస్య కాదని, ఆర్థిక వ్యవస్థ సక్రమంగా నడపడమే తన కర్తవ్యమని ఆయన చెప్పిన సంగతి ఎవరూ మరిచిపోరు. చాలా త్వరలోనే ఈ వ్యాధికి వ్యాక్సిన్ రాబోతోందని కూడా ట్రంప్ మార్చి 7న భరోసా ఇచ్చారు. మృతుల సంఖ్య ఇరవై వేలు దాటాక ఏప్రిల్ 12న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జాతీయ విపత్తుగా ప్రకటించారు. ఈ చైనాలో కరోనా వ్యాధి వ్యాప్తి ఉధృత స్థాయిలో ఉన్న సమయంలోనే అమెరికా కేంద్ర ఇంటిలిజెన్స్ సంస్థ (సిఐఎ) 12 మార్లు ఫిబ్రవరిలో ట్రంపు హెచ్చరించింది. అయినా దాన్ని పెడచెవిన పెట్టాడు. మార్చి 3న ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ వ్యాధి గురించి హెచ్చరిస్తూ దీని బారిన పడినవారిలో 3.4 శాతం మంది బలయ్యే అవకాశం ఉన్నదని తెలిపింది. అమెరికాలో రెండు కోట్ల మంది వ్యాధి బారిన పడవచ్చునని వరల్డ్ గ్లోబల్ హెల్త్ ఇనిస్టిట్యూట్ తెలిపింది. కనీసం రెండు లక్షల మందికి ఐసియులు అవసరమని తెలిపింది. ప్రస్తుతం అమెరికాలో 45 వేల ఐసియు పడకలే ఉన్నాయి. కానీ ట్రంప్ అదంతా అబద్ధమని తోసిపుచ్చారు. మరణాల రేటు మహావుంటే ఒక శాతం ఉండొచ్చునని వాదించారు. మార్చి 11న 'నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్' డాక్టరు అంటోని ఫ్యూసీ అమెరికా కాంగ్రెసులో మాట్లాడుతూ 'కరోనా వైరస్' వలన మరణాలు ఫ్లూ వలన జరిగే మరణాల కంటే ఎక్కువగా ఉంటాయని చెప్పారు. కరోనా వైరస్ రాగల ముప్పు గురించి ఎందరు హెచ్చరించినా మొదట్లో బేఖాతరు చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్వాకానికి ఆ దేశం భారీ మూల్యం చెల్లించుకోవాల్సిన స్థితిలో పడింది.

అమెరికాలో రోజు రోజుకి పరిస్థితి విషమిస్తున్నా... అందుకు తగిన చర్యలు చేపట్టడంలో ట్రంప్ పూర్తిగా విఫలమయ్యాడు. డబ్బుతోనే అన్ని సమస్యలకు పరిష్కారం కనుక్కొలేం. ఆయన రెండు దఫాలుగా 58.3 బిలియన్ డాలర్లు విడుదల చేశారు. వాటితో పరికరాలు కొనుగోలు చేయవచ్చు. మెరుపు వేగంతో పడకలు పెంచవచ్చు. కానీ సుశిక్షితులైన వైద్యులను, నర్సులను తయారు చేయలేరు కదా! రాష్ట్రాలకు వైద్య పరికరాలు అందించడం తన బాధ్యత కాదంటాడు. కరోనా రోగుల శరీరాల్లోకి క్రిమిసంహారకాలు ఎక్కించాలన్న ట్రంప్ వ్యాఖ్య ప్రపంచవ్యాప్తంగా ఆయన పరువు తీసింది. వివిధ రాష్ట్రాలలో గవర్నర్లు లాక్ డౌన్ ప్రకటించినందుకు వారిని ట్రంప్ ఎగతాళి కూడా చేశారు. లాక్ డౌన్ ఎత్తివేయొద్దన్న గవర్నర్లపై ప్రజలను తిరుగుబాటు చేయమంటాడు. అదే ఇప్పుడు కొంపముంచిందని రోజు రోజుకీ పెరుగుతున్న వ్యాధి గ్రస్తుల సంఖ్యను చూస్తే అర్థమవుతుంది.

ప్రకృతి ప్రతీకార చర్య – కరోనా

ప్రపంచంలో తలెత్తే ప్రతి మహమ్మారిని కచ్చితంగా రాజకీయార్థిక, సామాజిక కోణాల్లోంచి పరిశీలించాల్సిందే. ప్రజా ఆరోగ్యాన్ని, సంక్షేమాన్ని సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ ప్రపంచీకరణ విధానం ధ్వంసం చేస్తున్న సమయంలో కోవిడ్ 19 (కరోనా) వైరస్ ప్రబలింది. మూడు దశాబ్దాలకు పైగా అమలు చేస్తున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు, ఏళ్ల తరబడి ప్రజల సంక్షేమానికి ఎంతో కీలకమైన మౌలిక సేవలను ధ్వంసం చేస్తున్న సమయంలో కరోనా వైరస్ మహమ్మారి ప్రబలింది. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ (ఎల్‌పిజి) విధానాలు అమలవుతున్న దేశాల్లో ప్రజారోగ్య సదుపాయాలన్నీ బలహీనపడి తుడిచి పెట్టుకు పోయాయి. ఆరోగ్య రంగాన్ని ప్రైవేటీకరించడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రజల మౌలికావసరాలైన ఆహారం, ఇల్లు, విద్య, వైద్యం, రవాణా వంటి వాటిని అందించాల్సిన బాధ్యతలను ప్రభుత్వాలు విస్మరించాయి.

సమాజం ఎదుర్కొనే ఏ సంక్షోభమైనా.. అది ఆర్థికమైనా లేక సామాజికమైనా వాటి పరిష్కారం ప్రభుత్వం అమలు చేసే విధానాల పైన ఆధారపడి ఉంటుంది. ఇవాళ ప్రభుత్వ ప్రాధాన్యతలు ద్రవ్య పెట్టుబడి, కార్పొరేటు సంస్థలు, శత కోటీశ్వర్లు, బ్యాంకులు, ఆశ్రిత పెట్టుబడిదారుల ప్రయోజనాలను పరిరక్షించేవిగానే ఉన్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ అనేది ఒక ఆర్థిక విధానం మాత్రమే కాదు. రాజకీయ, సామాజిక వ్యవస్థలతోనూ ముడిపడి ఉన్న వ్యవస్థ. జీవ వైవిధ్యాన్ని విధ్వంసం చేసే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమే కరోనా లాంటి సంక్రమిక వ్యాధులకు కారణం. ఏ విపత్తు అయినా మనుషులందరిపైనా ఒకే రకమైన ప్రభావం చూపించదు. కరోనా తెచ్చిన సంక్షోభం ఒకరికి జీవన్మరణ సమస్య, మరొకరికి ఉద్యోగ సమస్య, ఇంకొకరికి ఆకలి సమస్య, వేరే ఇంకొకరికి తలదాచుకోవడానికి గూడు లేని సమస్య. అంటే అసమాన సమాజంలో ప్రజలు రకరకాల సమస్యలను ఎదుర్కొంటుంటారు.

సార్స్, ఎబోలా, స్వైన్‌ఫ్లూ, బర్డ్ ఫ్లూ – ఇలా అనేక వైరస్‌ల తరహాలోనే

కరోనా వైరస్ కూడా ఓ సాధారణ వైరసే, కాకపోతే దాని జీవనచక్రం వేరు. ప్రపంచంలోని కాలమాన భౌగోళిక వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా తన డిఎన్ఏను మార్చుకుంటూ మానవాళికి సవాలు విసురుతోంది. అందుకే కరోనా రహస్యం ఇప్పటికి మనిషికి అంతుచిక్కలేదనే చెప్పాలి. పరిశోధనా సంస్థలు, శాస్త్రవేత్తలు కరోనా వైరస్ పరమార్థాన్ని పసిగట్టలేకపోతున్నారు. భూతల స్వర్గాలు అని చెప్పబడుతున్న అగ్రదేశాల్లో కరోనా ఇప్పుడు మరణ మృందంగం మోగిస్తోంది. దీనికి ప్రధాన కారణాలు ఒకటి ప్రకృతిని, పర్యావరణాన్ని ధ్వంసం చేసే ఉత్పత్తి విధానం, రెండు ప్రజారోగ్య వ్యవస్థను నిర్వీర్యం చేయడంగా చెప్పవచ్చు.

జీవ పరిణామ క్రమంలో వివిధ జీవుల మధ్య సమన్వయం, వైవిధ్యం ఉండడమే మనుగడ సూత్రం. ఈ సమన్వయం లోపించినప్పుడే మానవ జాతిని ఈ మహమ్మారులు పీడిస్తుంటాయి. వన్యప్రాణుల నుండి మానవులకి ఏదైనా ఒక వ్యాధి వ్యాప్తి చెందుతుందంటే అది మానవ ఆర్థిక అభివృద్ధిలో భాగంగా మనకి తెలియకుండా మనం తెచ్చుకున్న ప్రమాదమే అని జీవ వైవిధ్య శాస్త్రవేత్త కే జోన్స్ అన్నారు. ఎందుకంటే, మనం ఈ ప్రకృతిలో భాగం. కానీ, ఈ ప్రకృతికి మనకి ఉన్న జీవ సంబంధాన్ని మన ఆర్థిక అభివృద్ధి ప్రణాళికలు నిర్దేశిస్తున్నాయి. ఇప్పుడు పెట్టుబడిదారీ వ్యవస్థ మనిషికీ ప్రకృతికీ మధ్య ఉన్న దూరాన్ని రోజురోజుకీ మరింత పెంచుతూ వస్తుంది. వైరస్ పరివర్తనలు (మ్యుటేషన్స్)గానీ, వాటి వలన వచ్చే అంటువ్యాధులుగానీ హెచ్చరికలు లేకుండా యాదృచ్ఛికంగా వచ్చే సంఘటనలు కావు అని వైరాలజీపై ఏ మాత్రం పరిజ్ఞానం ఉన్న వారికైనా అర్థమయ్యే విషయమే.

నోవెల్ కరోనా వైరస్ వలన వచ్చే ముప్పు గురించి సమాచారం కొన్ని సంవత్సరాలుగా ఉంది. అయినప్పటికీ 'బిగ్ ఫార్మా' కానీ, పెట్టుబడిదారీ వ్యవస్థ నడిపిస్తున్న ప్రభుత్వాలు కానీ, వైరస్ నిర్మూలన కోసం ఏమి చేయలేదు. అయితే అది పెద్ద ఆశ్చర్యం కలిగించే విషయం కాదు. ఎందుకంటే పెట్టుబడి ప్రాథమిక సూత్రం లాభాల్ని పెంచుకోవడం ఆ పెట్టుబడి సూత్రం వైరస్‌ను నిర్మూలించేకంటే వ్యాధిని నివారించడంలోనే బాగా పనిచేస్తుంది. ఇప్పుడు ఈ వైరస్ తెచ్చిన విపత్తు యావత్ మానవ సమాజాన్ని సంక్షోభం దిశగా నడిపిస్తుంది. ఎందుకంటే ఇది చాలా తీవ్ర సామాజిక పరిణామాలతో కూడిన ఒక జీవ సంబంధమైన విషయం. ఈ సంక్షోభం మన వ్యవస్థల్లో రాజకీయ, ఆర్థిక, సామాజిక) ఉన్న డొల్లతనాన్ని చాలా స్పష్టంగా చూపుతున్నది. అభివృద్ధి చెందిన సంపన్న పారిశ్రామిక దేశాల్లోనే కరోనా బాధితులు ఎక్కువగా ఉన్నారు.

సాంక్రమిక వ్యాధి నిపుణులు చాలాకాలంగా సాంక్రమిక వ్యాధుల గురించి హెచ్చరిస్తూనే ఉన్నారు. ఈ వ్యాధులు పరంపరగా సంభవిస్తూనే ఉంటాయని కూడ చెబుతున్నారు. దీనికి కారణం పర్యావరణాన్ని కలుషితం చేయడం, అడవులను నిర్మూలించడం వల్ల అడవిలో, కొండల్లో నివసించే జంతువులు జనావరణలోకి వస్తున్నాయి. వీటి ద్వారా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులు సంక్రమిస్తున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రకృతి వనరులను ఇష్టానుసారం ధ్వంసం చేసుకుంటూపోతే కలిగే పర్యవసానాలు గురించి 'న్యూయార్క్ టైమ్స్ పత్రికలో డేవిడ్ క్యామెన్ నొక్కి చెప్పాడు. వైరస్‌లు తాము సహజంగా ఉండే నెలవుల నుండి బయటికి వచ్చేలా మనం ప్రకృతిని కుళ్లబొడి చేస్తున్నాం. వైరస్‌ల నెలవులు చిద్రమయినప్పుడు ఆ వైరస్‌లు తమకు ఆశ్రయమిచ్చే కొత్త అతిథులను ఎంచుకుంటాయి. అది ఎవరో కాదు మానవులేనని అర్థం చేసుకోవాలి. ఈ పరిస్థితులకు కారణమవుతున్న వ్యవస్థను త్వరితంగా మార్చుకోవాలి.

ప్రపంచీకరణ విధానాలు – కరోనా

కరోనా మహమ్మారి మనకు ఎన్నో విలువైన పాఠాలు నేర్పుతోంది. ప్రత్యేకించి అమెరికాకు ఈ వ్యాధి నేర్పుతున్న పాఠాలు మరింత విలువైనవి. కరోనా వైరస్ వ్యాప్తికి పాస్‌పోర్ట్‌లు అక్కర్లేదు. దేశ సరిహద్దులను అది గుర్తించదు. జాతీయతతో దానికి సంబంధం లేదు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యుగంలో ఏ దేశంలో పుట్టిన వ్యాధి అయినా ప్రపంచమంతా వ్యాపిస్తుంది. ఇది ప్రపంచీకరణ దుష్పరిణామాల్లో ఒకటిగా గుర్తించాలి. ఎప్పుడైనా ఇటువంటి సీమాంతర ముప్పు తలెత్తినప్పుడు అనివార్యంగా ప్రపంచ దేశాలు ఉమ్మడిగా స్పందించాలి. పరిష్కార మార్గాల్ని వెతుకాలి. కరోనా వైరస్ లాగే ఉద్ధారాలు కూడా భారీ విలయాన్ని సృష్టించనున్నాయి.

అయితే సమిష్టిగా సమన్వయంతో ఇలాంటి ఉత్పాతాలను ఎదుర్కొనే సంప్రదాయాన్ని, అంతర్జాతీయ నీతిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం పాతాళానికి చేర్చింది. సార్వత్రిక స్వభావం ఉన్న అంటువ్యాధులు, పర్యావరణ సమస్యలను ప్రైవేట్ రంగం ఆదుకోలేదు. లాభాల కోసం పనిచేసే సంస్థలు ప్రతి సంక్షోభమూ లాభాలు పెంచుకునే అవకాశంగా భావిస్తాయి. మందులు, మాస్కులు, నిత్యావసరాల ధరలు పెరుగుతున్న తీరు ఈ విషయాన్ని మరోమారు రుజువు చేస్తోంది.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాల ప్రకారం విద్యా, వైద్య రంగాలలో ప్రభుత్వం పాత్ర తక్కువగా ఉండాలనే సిద్ధాంతం వలన ఏదైనా మహమ్మారి వచ్చినప్పుడు దానిని ధీటుగా ఎదుర్కొనే శక్తి ప్రభుత్వ వైద్యరంగానికి ఉండదు. మరోవైపు ప్రైవేటు వైద్యరంగం పట్టించుకోదు. అమెరికాలో కూడా ప్రజా ఆరోగ్య వ్యవస్థ దిగజారిపోయి.. సంక్షోభ సమయంలో నిర్ణయాత్మకంగా వ్యవహరించలేని దీనస్థితికి ప్రతిబింబంగా మారింది. హాస్పిటల్స్‌ను ఏకీకరణ చేయడంతో, బడా కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి ప్రభుత్వ ఆరోగ్యరంగం వెళ్లిపోయింది. వీటి లక్ష్యం డబ్బు సంపాదనే తప్ప ప్రజల ప్రాణాలు కాపాడడం కాదు. దీంతో ఏదన్న మహమ్మారి వస్తే దాన్ని ఎదుర్కొగల మౌలిక సౌకర్యాలున్న ఆరోగ్య వ్యవస్థ లేకుండా పోయింది.

ట్రంప్ పొదుపు చర్యల్లో భాగంగా ఆరోగ్య వైద్యరంగానికి జరిగిన నిధుల కోతల ఫలితం ఇది. అంటువ్యాధుల నివారణకు బడ్జెట్‌లో కోత విధించాడు. వ్యాధి నియంత్రణ, నివారణ కేంద్రాలకు కేటాయించే బడ్జెట్‌ను ట్రంప్ ప్రభుత్వం తగ్గిస్తూ వస్తోంది. 2018లో పది శాతం బడ్జెట్ కేటాయింపులు తగ్గితే 2019లో 19 శాతం కేటాయింపులు తగ్గించింది. మరీ దురదృష్టం ఏమిటంటే నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న కరోనా వైరస్ వంటి అంటువ్యాధులను నివారించడానికి అయ్యే ఖర్చులో కనీసం 20 శాతం ఖర్చు తగ్గించాలని ట్రంప్ ప్రతిపాదించాడు. ఒబామా హెల్త్ కేర్‌ను రద్దు చేశాడు. సామూహిక సేవలు, ప్రజారోగ్యశాఖలో పనిచేసే ఉద్యోగులను తొలగించడం జరిగింది. పర్యావసానంగా కరోనా

బాధితుడు బతుకడని ఏమాత్రం అనుమానం ఉన్న హాస్పిటల్స్‌లో అడ్మిట్ చేసుకోవడం లేదు. వైద్యులు వైద్యం అందించడం లేదు. మరోవైపు ట్రంప్ వాణిజ్య ప్రయోజనాలు చూశాడు తప్ప ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్న స్పృహ కోల్పోయాడు.

నాలుగేళ్ల క్రితం ఎబోలా విరుచుకు పడ్డప్పుడు ఒబామా హయాంలో జాతీయ భద్రతా మండలి – మహమ్మారులను ఎలా ఎదుర్కోవాలన్న దానిపై 69 పేజీల వ్యూహపత్రం సిద్ధం చేసింది. వైరస్ విస్తరణను పసిగట్టడం, సమర్థంగా రోగ నిర్ధారణ పరీక్షల నిర్వహణ, అత్యవసర వనరుల్ని ముందుగానే సిద్ధం చేసుకోవడంపై విలువైన సూచనలు అందించింది. ఆ సమాచారాన్ని కొత్తగా అధ్యక్షత చేపట్టిన ట్రంప్ దృష్టికి తీసుకెళ్లినా ఆయన దాన్ని అటకెక్కించారు. అమెరికా చరిత్ర తిరగేస్తే 80వ దశకంలో ఆ దేశాన్నేలిన రొనాల్డ్ రీగన్ అప్పట్లో బయటపడిన హెచ్ఐవి/ఎయిడ్స్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆ వైరస్ గురించి చెప్పినప్పుడు అతిగా స్పందించొద్దని రీగన్ కొట్టిపడేశారు. ఎనిమిదేళ్లు అధికారంలో ఉంటే చిట్టచివరి సంవత్సరంలో మాత్రమే ఆయన అయిష్టంగా ఈ వ్యాధిగ్రస్తుల విషయంలో పూర్తి స్థాయి చర్యలకు ఉపక్రమించాడు. కానీ ఈలోగా 4 లక్షల మంది పౌరులు ఆ వ్యాధికి బలైపోయారు.

ఇన్ని అనుభవాలు తన కళ్లముందే ఉన్నా ట్రంప్ సైతం అదే తరహా నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. ఫలితంగా మొదట్లో కరోనా వెల్లడైన చైనాను మించి మరణాలు సంభవించే ప్రమాదం కనబడుతోంది. ట్రంప్ తనంత తానే దాదాపు 2 లక్షల మంది వరకూ మరణించే అవకాశం ఉన్నదని చెప్పారు. కానీ ఆ దేశంలోని ఇంపీరియల్ కాలేజీ అధ్యయనం చూస్తే ఎవరైనా బెంబేలెత్తడం ఖాయం. ప్రభుత్వం చురుగ్గా వ్యవహరించి సకాలంలో చర్యలు తీసుకోవడానికి సిద్ధపడకపోతే 22 లక్షల మంది మృత్యువాత పడే అవకాశం ఉందని ఆ అధ్యయనం పేర్కొంది. ప్రాథమిక పరీక్షలు మొదలుకొని చికిత్స వరకూ వేర్వేరు అంశాల్లో ప్రభుత్వాలు స్పందించే తీరుతెన్నుల్ని ఊహించి, ఏ రకంగా స్పందిస్తే ఏ తరహా పరిస్థితులు ఏర్పడతాయో కంప్యూటర్ ఆధారిత నమూనాల ద్వారా ఈ అంచనా వేసింది. అంటు వ్యాధుల పట్ల కొరవడిన సన్నద్ధత కొంపముంచుతుందంటూ నిరుడు అక్టోబర్‌లో హెచ్చరికలు చెవినపడ్డా ఆయన లెక్క చెయ్యనేలేదు. కాబట్టే అమెరికాలో మరణాలు 60 వేలు దాటిపోయాయి. అమెరికాలో లక్ష మరణాలతో కోవిడ్ శాంతిస్తే – తమ ప్రభుత్వం బాగా పనిచేసినట్లేనని ముందస్తుగా తనకుతానే కితాబులిచ్చుకున్న ట్రంప్‌కు సమకాలీన చరిత్రలో సరిసాటి ఎవ్వరు?

ప్రపంచ ఆరోగ్య సంస్థకు నిధులు నిలిపివేత

ప్రపంచ దేశాలన్నీ కరోనా మహమ్మారిపై పోరాడుతున్నాయి. వేరే దేశాల సాయానికి అర్థిస్తున్నాయి. ఇలా ఎవరికి వారు కరోనా పోరులో నిమగ్నమైన తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ ఆరోగ్య సంస్థకు నిధులివ్వడాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించి అందరినీ నివ్వెరపరిచారు. ఈ సంస్థ మౌలిక లక్ష్యాలు ప్రజారోగ్యాన్ని పరిరక్షించడం.. సభ్య దేశాలన్నిటికీ ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తూ ప్రమాదకర వ్యాధుల గురించి వాటిని అప్రమత్తం చేయడం. ఈ లక్ష్యాల సాధనలో అదెంత వరకూ విజయవంతమైందన్న అంశంలో భిన్నాభిప్రాయాలున్నాయి. దానికి సారథ్యం వహిస్తున్న వారి సమర్థత గురించిన విమర్శలు కూడా ఉన్నాయి. కానీ అది ఎలాంటి అధికారాలూ లేని ఒక నిస్సహాయ సంస్థని అందరూ అంగీకరిస్తారు.

డొనాల్డ్ ట్రంప్‌కున్న అసంతృప్తి వేరు. ఆయన పేచి వేరు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కరోనా మహమ్మారిని గురించి అప్రమత్తం చేయడంలో దారుణంగా విఫలమైందని, ఆ సంస్థ చైనాకు వత్తాసుగా ఉంటోందని ఆయన ఆరోపణల సారాంశం.

నిజానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) కరోనా వైరస్ వ్యాధి (కోవిడ్–19) ప్రబలడాన్ని 'అంతర్జాతీయ ఆందోళనకరమైన ప్రజారోగ్య అత్యయిక పరిస్థితిగా, ప్రపంచవ్యాప్తంగా ముంచుకొస్తున్న మహమ్మారి వ్యాధిగా (పాండెమిక్) హెచ్చరిక చేసింది. దీనిని అదుపులో ఉంచడం అత్యంత ప్రాధాన్యతాంశంగా అన్ని దేశాలకు అది విజ్ఞప్తి చేసింది. వ్యాధికి ఎలాంటి చికిత్సా విధానం రూపొందినా, దాని కట్టడికి ఎలాంటి వ్యూహం ఖరారైనా, వ్యాక్సిన్ తయారైనా ఆ అంశాలు అన్ని దేశాలకూ వివరించేది ఆ సంస్థే. ప్రపంచాన్ని వణికిస్తున్న మహమ్మారిని ఎదుర్కొనడానికి సర్వశక్తులూ కేంద్రీకరించాల్సిన ఈ సమయంలో హఠాత్తుగా దానికి అమెరికా నిధులు ఆపేస్తున్నట్టు ప్రకటించడం ఈ కార్యకలాపాలన్నింటినీ దెబ్బతీస్తుంది. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడం కోసం ట్రంప్ తీసుకుంటున్న తప్పుడు నిర్ణయాలు మొత్తం ప్రపంచ ప్రజానీకానికి చేటు తెస్తాయి.

ట్రంప్ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి చైనాపై ఆరోపణలు

ఈ వైరస్ ఎక్కడిది... దాన్ని ఎవరైనా కావాలని సృష్టించారా లేక దానంతటదే రూపుదిద్దుకుందా అనే విషయం శాస్త్రీయంగా నిర్ధారణ కాకుండానే చైనాను ముద్దాయి చేయడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. కరోనా వైరస్ వెనుక చైనా కుట్ర ఉందని నిరూపించేందుకు యాతన పడుతున్నాడు. తన తొత్తులను కూడగడుతున్నాడు. ఇది వూహాన్ ల్యాబ్ సృష్టి కాదని ఎంతమంది శాస్త్రజ్ఞులు చెబుతున్న వినకుండా కరోనా వైరస్ చైనా సృష్టేనన్న వాదనను ప్రచారంలో పెడుతున్నాడు. చైనా నుంచి నష్టపరిహారాన్ని వసూలు చేస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాడు. ఆస్ట్రేలియా, బ్రిటన్‌లను తోడు తెచ్చుకుంటున్నాడు. కరోనా వైరస్ జన్యుపరమైన మార్పుల ద్వారా గాని, మానవ సృష్టి ద్వారాగాని రాలేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆ వ్యాధి బారినపడిన రోగుల్లో ఉన్న వైరస్ జినోమ్‌ను పరిశీలించాక అది సహజ సిద్ధంగానే ఏర్పడిందని శాస్త్రవేత్తలు తేల్చారు. అమెరికన్ ఇంటిలిజెన్స్ డైరెక్టర్ కూడ అదే చెప్పాడు. ట్రంప్ ఎప్పుడు ఏమి మాట్లాడుతాడో, అందులో నిజమెంత, అబద్ధమెంతో ఎవరికి అర్థం కాదు. ట్రంప్ నిర్లక్ష్యపు నిర్వాకం వల్లే కరోనా ప్రబలిపోయిందన్న విమర్శలను వమ్ము చేసేందుకు ఉద్దేశించిన ఈ దుర్మార్గపు ప్రయత్నాలన్నీ రానున్న ఎన్నికల్లో అమెరికన్లను ఎంతమేరకు ప్రభావితం చేస్తాయో వేచి చూడాలి. ఈ వైరస్‌ను అంతం చేయడం మాట అటుంచి కనీసం కట్టడి చేయడంలో అందరూ నిమగ్నమై విజయం సాధించాక ఆ ప్రశ్నలకు జవాబులు అన్వేషించవలసి ఉండగా ఆయన ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు.

కరోనా కట్టడిలో వైట్‌హౌస్ వైఫల్యం – 2

దేశంలో కరోనా మహమ్మారి వ్యాధిని అరికట్టడంలో అధ్యక్ష భవనం వైట్‌హౌస్ ఘోరంగా విఫలమైందని వాషింగ్టన్ పోస్టు పత్రిక తన సంపాదకీయంలో తీవ్రంగా ఎండగట్టడం గమనార్హం. ప్రధానంగా నాలుగు అంశాలలో విఫలమైందని ఈ పత్రిక తెలిపింది. ఇన్ఫెక్షన్‌ను గుర్తించేందుకు అవసరమైన డయాగ్నస్టిక్ పరీక్షను నిర్వహించే విషయంలో సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (సిడిసి)పై మితిమీరిన విశ్వాసం ఉంచడం, రెండు కరోనా వైరస్ వ్యాప్తి అదుపు తప్పుతున్నప్పటికీ తీవ్రతను తక్కువగా అంచనా వేయడం, మూడు వ్యాధి నియంత్రణకు నిధులు విడుదల చేయడంలో అనవసరవాద, ప్రతివాదనలతో విలువైన సమయాన్ని వృధా చేయడం, నాలుగు నాయకత్వ మార్పులు కరోనా వైరస్ టాస్క్ ఫోర్స్ విధులకు తీవ్ర విఘాతం కలిగించాయని పత్రిక వివరించింది. కరోనా వైరస్ దేశాన్ని కమ్ముకుంటున్నా వైట్‌హౌస్ మాత్రం ఇందుకు సంబంధించిన హెచ్చరికలను పెడ చెవిన పెట్టిందని స్పష్టం చేసింది.

లాక్‌డౌన్ ఎత్తివేత – ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణ

కరోనా వైరస్ పారదోలడానికి గట్టి చర్యలు తీసుకోకుండా, ఆర్థిక వ్యవస్థకు తలుపులు తెరవడం ప్రమాదకరమని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పలు రాష్ట్రాలో లాక్‌డౌన్‌ను వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శనలు జరుపుతున్నారు. వీటికి ట్రంప్ తన మద్దతు ప్రకటించడం శోచనీయం. ఆర్థిక వ్యవస్థకు తలుపులు తెరిచే ముందు కరోనా పరీక్షలను మూడు రెట్లు పెంచాలని వైద్యులు కోరుతున్నారు.

యాంటీబాడీల నిర్ధారణ పరీక్షలు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. తమకు మరిన్ని టెస్టింగ్ కిట్స్ కావాలని న్యూయార్క్, న్యూజెర్సీ గవర్నర్లు కోరుతున్నారు. ఆర్థిక వ్యవస్థను ఇప్పుడే తెరువద్దని కోరుతున్నారు. ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ మాత్రం టెస్టింగ్ కిట్స్ సరిపోను ఉన్నాయని ఆర్థిక వ్యవస్థను తిరిగి తెరువచ్చని అంటున్నారు. ట్రంప్ ఏప్రిల్ 20 నుంచి లాక్‌డౌన్ సడలించాలని గవర్నర్లతో పోట్లాడుతున్నాడు. చివరికి ట్రంప్ తాను విధించుకున్న మార్గదర్శకాలను తానే దిక్కరిస్తున్నారు.

ఇక లాక్‌డౌన్‌లు లేవు, ఆంక్షలు లేవు, అమెరికాలో వ్యాపారం సజావుగా జరుగాలంటాడు. వ్యాపారాలు ప్రారంభ మవుతాయంటున్నాడు ట్రంప్. రానున్న ఎన్నికల ప్రచార ర్యాలీలు నిర్వహించడానికి అనుమతించాడు. మాంసాహార ప్రాసెసింగ్ ప్లాంట్లు పునః ప్రారంభానికి ఏప్రిల్ 28న అనుమతించాడు. విమానా ప్రయాణాలు అనుమతించాడు.

జార్జియాలో జిమ్‌లు అనుమతించారు. సౌత్ కరోలినా, ఇలినాయిస్, టెన్నెస్సీ, లూసియాన రాష్ట్రాలు లాక్‌డౌన్‌ను సడలించాయి. డెమొటిక్ పార్టీ గవర్నర్లు విధించిన 'స్టే ఎట్ హోమ్'ను ఎద్దేవ చేస్తున్నారు. తొందరపాటుతో వ్యవహరిస్తే ఎదురు తిరిగే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రజల ప్రాణాలకంటే ట్రంప్‌కు వ్యాపారాలు ముఖ్యమైపోయాయి.

ఇదిలా ఉండగా త్రివిధ దళాలకు చెందిన 900 మంది సైనికులకు కరోనా పాజిటివ్ వచ్చింది. అలాగే వైద్య సిబ్బంది కరోనా బారిన పడుతున్నారు. ఇప్పటికీ 30 మంది వైద్యులు, 200 మంది నర్సులు చనిపోయారు.

ముగింపు

కరోనా వైరస్‌ను నియంత్రించలేకపోతే పైన ప్రస్థావించిన అన్ని సమస్యలు పెచ్చరిల్లుతాయి. కానీ ట్రంప్, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న రిపబ్లికన్ పార్టీ ఆది నుండి ప్రభుత్వం అన్నా, శాస్త్రవిజ్ఞానం అన్నా మీడియా అన్నా చీడపురుగును చూస్తున్నట్లు చూస్తోంది. లాభాలు దండుకునే ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల స్వైర విహారానికి పూర్తి అవకాశాలు కల్పిస్తోంది. ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు వార్తలు, విషయాలు ప్రసారం చేస్తోంది. పర్యావరణ సంక్షోభం, అంటువ్యాధులు వంటి ఉత్పాతాలను అధిగమించడానికి అమెరికా ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి ఉంది. కానీ, వాటిని ఎప్పుడో అటకెక్కించింది. మానవాళి నేడు ఈ జంట ప్రమాదాల కోరల్లో చిక్కుకోనుంది. ప్రభుత్వ యంత్రాంగం లో నిబద్ధత కలిగిన అధికారులు, ప్రభుత్వ సంస్థల్లో మిగిలి ఉన్న శాస్త్రవేత్తలు ఈ దేశాన్ని ట్రంప్ నుండీ అర్థంలేని ఆయన విధానాల నుండి కాపాడతారని ఆశిద్దాం.

ప్రపంచ వ్యాప్తంగా దేశాలను అతలాకుతలం చేసిన కరోనా వైరస్‌ను, ఉత్తరకొరియా, దక్షిణ కొరియా, క్యూబా లాంటి దేశాలు ఎదుర్కొంటున్న తీరు, పెట్టుబడిదారీ దేశాలైన అమెరికా, ఇంగ్లాండ్, జర్మనీ, ఇటలీ, స్పెయిన్, ఫ్రాన్స్ వంటి దేశాలు ఎదుర్కొంటున్న తీరులో తేడా స్పష్టంగా కనిపిస్తోంది. పెట్టుబడిదారీ దేశాల్లో ప్రైవేటీకరించబడిన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ ఉంది. కార్పొరేట్ సంస్థలు నిర్వహించే ఆరోగ్యరంగం లాభాల దిశలో పయనిస్తోంది. కరోనా మహమ్మారి వంటి ప్రజారోగ్య అత్యవసర పరిస్థితి తలెత్తినప్పుడు సమర్థవంతంగా ఎదుర్కొనడంలో ఈ వ్యవస్థ ఘోరంగా విఫలమైంది. వేలాది మంది ప్రాణాలు గాలిలో కలిశాయి. నిజానికి జీవ వైవిధ్యాన్ని నాశనం చేసిన, పర్యావరణాన్ని విషతుల్యం చేసిన కార్పొరేట్ శక్తులే ఈ నూతన అంటువ్యాధులు ప్రబలటానికి కారకులవుతున్నారు. మొత్తంగా అమెరికాలో నెలకొన్న పరిస్థితి కార్మికులకు, పేద ప్రజలకు తీవ్ర కష్టాలు తెచ్చిపెట్టేలా ఉంది. ట్రంప్ టక్కరి వేశాలు, అబద్ధాలు, దబాయింపులు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడలేవు.

ప్రపంచీకరణ అభివృద్ధి నమూనాపై కోవిడ్–19 ఇప్పుడు ప్రశ్నలు సంధించింది. ప్రకృతి వనరులను విచ్చలవిడిగా దోచుకోవడం ద్వారా భౌతిక సంపదను సృష్టించడం కోసం పాటుపడే దురాశ కనివిని ఎరుగని కష్టాలను కొని తెస్తోంది. 'మనిషి అవసరాలను ప్రకృతి సంతృప్తి పరచ గలదు కానీ పేరాశను సంతృప్తి పరచలేదని' అర్థం చేసుకోవాలి. భవిష్య తరాల బాగు కోసం అడంబర జీవన విధానంపై ఇప్పుడు పునరాలో చించాల్సిన అవసరం ఉంది. ఈ సంక్షోభం ఇకపై మన సామాజిక, ఆర్థిక వ్యవస్థ, ప్రపంచ రాజకీయాలు, ప్రజారోగ్యం ఏ విధంగా ఉండాలో అనే చర్చని ఖచ్చితంగా లేవనెత్తుతుంది. అయితే, మన ఆర్థిక ప్రణాళికల్లో ప్రకృతిని భాగస్వామ్యం చేసే దిశగా, బాగా వెనుకబడి ఉన్న తరగతుల్ని ప్రామాణికంగా తీసుకొని మన హెల్త్ కేర్ వ్యవస్థని రూపొందించుకునే దిశగా ఈ చర్చ వెళ్లకపోతే కరోనా లాంటి మహమ్మారులు తెచ్చే సంక్షోభాల్ని మానవ సమాజం ఎదుర్కోలేదు. కరోనా అనంతర పరిస్థితుల్లో సామాజిక పరివర్తన కోసం దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రజా పోరాటాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఈ అనుభవాన్ని మన మదిలో పెట్టుకుని సరైన కార్యాచరణ రూపొందించుకోవడం బుద్ధిజీవుల బాధ్యత.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

పెట్టుబడిదారీ రొచ్చుగుంటే వైరస్‌ల పురిటిగడ్డ

ప్రకృతి సంపదను పెట్టుబడిదారులు దోచుకొని పట్టణాలకు తరలించడంవల్లే కరోనా వైరస్ వ్యాధి వచ్చిందనీ, ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతిని ఎక్కువ దెబ్బతీయకుండా సాగే సమసమాజంలో ఇటువంటి వైరస్‌లు రావనీ అంటున్నారు బి.ఎస్.రాజు

గోచిపాత తప్ప, కాలినడక తప్ప, ప్రకృతిలో దొరికింది తినడం తప్ప, ఇంకేమీ తెలియని ఆదిమ మానవ సమూహాలు పురుగు–పుట్ర మధ్య, క్రిమి–కీటకాలమధ్య జీవించారు. పేర్లు తెలియని సవాలక్ష వైరస్–లతో సహజీవనం చేసారు. వాటితో పోరుతూ, పోరులో ఓడుతూ చనిపోతూ, గెలుస్తూ బ్రతుకుతూ తమ ఉనికిని నిలబెట్టుకున్నారు.

మానవ పరిణామక్రమంలో వ్యవసాయం, వ్యవసాయంతోపాటు స్థిర నివాసాలు ఏర్పడ్డాయి. వ్యవసాయ నాగరికత, ఆహారమార్పిడి, వస్తుమార్పిడి, సరుకుల మారకం, సంత, మార్కెట్ ఏర్పడ్డాయి. వివిధ రాజ్యాలు ఏర్పడ్డాయి. పట్టణాలు, నగరాలు వెలిసాయి. దూర దూరంగా బతికేవాళ్లు ఎడంలేని కుప్పలుగా, తిప్పలతో బతకసాగారు. గోచిపాత రోజుల్లోనూ, భోగమనుకుంటున్న నగరనివాస యోగంలోనూ క్రిమి–కీటకాలతో సావాసం, రోగ క్రిముల స్వైరవిహారం మనిషికి తప్పలేదు.

మనిషి ఆదిమ దశ నుండి, ప్రస్తుత పెట్టుబడిదారీ దశకు చేరుకున్న వైజ్ఞానిక, పారిశ్రామిక విప్లవ వికాస క్రమమంతా పలు జాడ్యాల కాలగమన చరిత్రేకదా!

ఈ జాడ్యాలు కేవలం మనిషి ఆరోగ్యానికి సంబంధించినవి మాత్రమే అనుకుంటే పొరపాటే! మనిషి ఆరోగ్యాన్ని అతను నివసిస్తున్న, నిర్మితమైఉన్న ఆర్థిక సామజిక రాజకీయ వ్యవస్థల నుండి విడదీసి చూడగలమా? అలానే పర్యావరణం అనే అంశాన్నైనా ఉనికిలోఉన్న వ్యవస్థల స్థితిగతుల నుండి విడగొట్టి వీక్షించగలమా? అలాచూస్తే, అలానే ఆలోచిస్తే, ఏ సమస్యకైనా సరైన పరిష్కారం లభిస్తుందా? లభించదని ఈరోజు ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనావ్యాధి (కోవిడ్–19) మానవాళి ముక్కు మీద గుద్ది మరీ చెబుతోంది.

ఈ కరోనా సందర్భంలో, మనదేశంలో నిత్యం మన కళ్లముందు ప్రదర్శితమౌతున్న భయానక, అమానవీయ దృశ్యాలు మన వ్యవస్థ గర్భంలోని క్రూరత్వాన్ని పొట్టచీల్చి చూపించడంలేదా?

ఈ వ్యవస్థ బూటకపు ప్రజాస్వామ్య నగిషీ అద్దకాల ముసుగును 'కోవిడ్ 19' తొలగించి, దాని వికృత రూపాన్ని మనముందు మరోమారు ప్రదర్శించడంలేదా?

ప్రజాస్వామ్యమైనా, పర్యావరణమైనా, వైద్యమైనా, ఆరోగ్యమైనా, మరే ఇతర సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశమైనా ప్రజల భాగస్వామ్యం లేకుండా, వారి నిరంతర శ్రమైకజీవన తాత్వికత, అనుభవసారం, ఆచరణ వీటిలో ఇమిడి రంగరించబడకుండా ఇప్పుడు మనముందు ప్రదర్శిత మౌతున్న దుర్భర అసమాన సామజిక దృశ్యాలు సమసిపోతాయా? కొందరు ఊహించుకుంటున్న, ఆశిస్తున్న ఆహ్లాదపు ఆకుపచ్చని వాతావరణ విచిత్రాలు సాధ్యపడతాయా? పడవని, కోవిడ్19 మరోమారు తేల్చిచెప్పడమేకాక, రుజువుచేసి చూపిస్తున్నది కూడా !

ఇపుడు 'కరోనా వచ్చింది–లాక్‌డౌన్ తెచ్చింది' అని అంటున్నాం గానీ, మన వ్యవస్థ లాక్‌డౌన్‌లో లేనిదెప్పుడు? తేడా అల్లా ఇపుడు వచ్చింది ఫాసిస్టు లాక్‌డౌన్. పేరు కరోనాదైనా ఇది నిజానికి ప్రపంచ ఫైనాన్స్ పెట్టుబడి, ప్రపంచ శ్రామిక మానవాళిపై ప్రకటించిన వ్యూహాత్మక యుద్ధం. ఈ యుద్ధంద్వారా అదేమి సాధించదల్చుకుంది?

భారంగా మారిన శ్రమశక్తిని అది కుదించుకో దల్చింది. వీలైనంతగా పనివారిని వదిలించుకో దల్చుకుంది. ఉత్పత్తి యాంత్రీకరణను, డిజిటల్ లావాదేవీలను అత్యంత వేగంగా అమలుచేయ దల్చుకుంది. పని గంటలు పెంచదల్చుకుంది.

8 గంటల పని అనే నిర్మిత గోడను కూల్చివేయ నిర్ణయించుకుంది. ఊడిపోయే ఉద్యోగం బూచి చూపి భయపెట్టి, ఇళ్లల్లోనే ఎంత మందిని బంధించవచ్చో అంత మందిని బంధించి, తక్కువ వేతనంతో ఎక్కువ పనిని, మేలైన పనిని పొందదల్చుకుంది. సంఘటిత కార్మిక చట్టాన్ని తుత్తునియలుచేసి కార్మికుడు అనే పదాన్ని చెరిపేయ దల్చుకుంది. వారిని కేవలం విడివిడి పనివాళ్లుగా మాత్రమే మిగిల్చి వారితో ఊడిగం చేయించుకోదల్చుకుంది. హక్కులు, యూనియన్లు, నినాదాలు, ఎర్రజెండాలు, పిడికిలి బిగింపులకు చరమగీతం పాడదల్చుకుంది.

చిన్న కమతాల శ్రామిక రైతాంగం, ఆదివాసులు, అడవిపై వాళ్లకున్న హక్కులు కాలరాసి సమస్త అటవీ సంపదను, ఖనిజ సంపదను పెట్టుబడి పాదాక్రాంతం చేయదల్చుకుంది. తనకు ఏమాత్రమూ గిట్టని పబ్లిక్ వ్యవస్థలన్నిటినీ భూస్థాపితం చేయదల్చుకుంది. పబ్లిక్ విద్య, పాఠశాలలు, కాలేజీలు, విశ్వవిద్యాలయాలు, వైద్య, ఆరోగ్య వ్యవస్థలు; బ్యాంకింగ్, బీమా, రవాణా, ప్రభుత్వ సేవలు, టోకువ్యాపారం, చిల్లర వ్యాపారం, ఇవన్నీ ప్రపంచంలో ఎక్కడున్నా, అవి పూర్తిగా తనహస్తగతం కావాలి. ఇదీ అసలు లాక్‌డౌన్ వెనుకున్న ప్రణాళిక.

ఒక్క ముక్కలో చెప్పాలంటే ఈ ప్రణాళిక 'సంఘటితం' అనే పదాన్ని తుడిచేసి, శ్రమశక్తిని నిర్జీవంచేసి, బానిసత్వపు దైన్యాన్ని నింపదల్చుకుంది. నూతన రీతుల్లో శ్రమ దోపిడీ విధానాలను ఆవిష్కరించి తన వ్యవస్థ కూలిపోకుండా కాపాడుకుని నిలబెట్టుకోవడం తప్ప దానికి వేరే మార్గాంతరం లేదు. సరిగ్గా ఇదే సమయానికి అందివచ్చిన కరోనా వైరస్ వ్యాధిని ఓ సానుకూల ఆయుధంగా అది మల్చుకుంది. అందుకే ఇప్పుడు 'కరొనాకు ముందు, కరోనా తర్వాత' అనే కొత్త నినాదం వినిపిస్తోంది.

అయితే కరోనా వ్యాధి (కోవిడ్19) విజృంభణ సంగతేమిటి? ఈ వ్యాధి సోకకుండా ఉండడానికి, చావు నుంచి తప్పించుకోవడానికి 'లాక్‌డౌన్' తప్ప వేరే మార్గమేముంది? ప్రపంచ పెట్టుబడికి దీనికి లింకుపెట్టి మాట్లాడడం తల తిరుగుడు కాక ఏమిటి? అనే ప్రశ్నలు తలెత్తుతాయి. ఔను ఈ ప్రశ్నలు సరైనవే! వెయ్యాల్సినవే! సమాధానం కోరాల్సినవే! ఈప్రశ్నలకు జవాబుగా మరికొన్ని ప్రశ్నలు కూడా వేసుకోవాల్సి ఉంటుంది.

ఈ దేశంలో ఇప్పటివరకు కరోనా బారినపడి చనిపోయిన పారిశుద్ధ్య (సఫాయిా) కార్మికులు ఎంత మంది? ఈ వ్యాధి వ్యాపిస్తున్న జాడలు గుర్తించిన నాటి నుండి వీరు ఏ రోజైనా తమ పనులు ఆపేరా? వారికీ కరోనా సోకదా? వారికి ఆ ప్రమాదం లేదా? వారేమన్నా వరప్రసాదులా?

లాక్‌డౌన్‌లో సేదతీరే మనమెవరన్నా, ఏనాడైనా, ఓ గంట సమయమైనా వాళ్లుచేసే పనిచేయడానికి సిద్ధమయ్యామా? లాక్‌డౌన్ మనకేనా? వారికి అవసరంలేదా?

లక్షలాది వలస శ్రామికుల సంగతేమిటి? నివాస సౌకర్యాములేక, దిక్కు మొక్కులేని దీనావస్థలో ఉన్న కోట్లాది జనాభాకు కోవిడ్19 సోకదా? సోకినా అది లెక్కల్లోకి రాదా? లేక లెక్కలోకి తీసుకోవాల్సిన పనిలేదా? లాక్‌డౌన్‌తో చిరు వ్యాపారాలు ఏమైపోవాలి? దినసరి ఆదాయంతో పొట్టపోసుకునే జనాభా సంగతేమిటి?

రెండు నెలలుగా ఇళ్లల్లో సుష్టుగా తింటూ, సేద తీరుతున్న బొజ్జలకోసమేనా వీళ్లంతా పనిచేయాల్సింది? కేవలం ఈ బొజ్జలను 'కోవిద్' బారినపడకుండా కాపాడటానికేనా లాక్‌డౌన్? వీళ్లకోసమే పనిచేసేవారికి గుప్పెడు బిచ్చమేసి బతకండిరా అంటే సరిపోతుందా? రేపోమాపో లాక్‌డౌన్ ఎత్తుతాం, అప్పటిదాకా చావకుండా మిగిలినోళ్లు చెయ్యండి మాసేవలు, ఒత్తండి మా కాళ్లు, ఇదేకదా చిత్రం..

ఒకసారి మనదేశంలో కరోనా వ్యాధి సోకి చనిపోయే వాళ్ల లెక్కలు, వ్యాధి సోకిన ప్రాంతాల లెక్కలు చూస్తే ఈ క్రింది విషయాలు నిర్ధారణ అవుతాయి:

1) మన మహానగరాలు, పెద్దపట్టణాలు, వాటి చుట్టూ ఉన్న ప్రాంతాల్లోనే ఇది ప్రబలంగా ఉంది. అంటే ఇది ప్రధానంగా నగరాల-పట్టణాల జాడ్యం. పల్లెల, అడవుల వనరులు కొల్లగొట్టి నగరాలకు పట్టంగట్టిన నాగరికం అని చెప్పుకుంటున్న సంస్కృతికి సోకిన జాడ్యం ఇది. వస్తు వినియోగ సంస్కృతి విషమిస్తే అంటుకుంటున్న జాఢ్యాల్లో కరోనా ఓ జాడ్యం.
2) ఎర్రజోన్లు ఎక్కడ ఎక్కువున్నాయి? పచ్చ జోన్లు ఎక్కడ ఎక్కువున్నాయి? అలానే కాషాయ జోన్లు.. తెలంగాణ తీసుకున్నా, ఆంధ్రా తీసుకున్నా హైదరాబాద్‌కు దూరం జరిగే కొలదీ, అటవీ ప్రాంతాలకు దగ్గరయ్యే కొలదీ కరోనా కేసులు పెద్దగా లేనట్లే! మన నాగరికుల లెక్కల ప్రకారం ఇవి నగరాలకన్నా వెనక బడిన ప్రాంతాలు. ఈ ప్రాంతాల నుండే జనం నగరాలకు పట్టణాలకు వచ్చిపడుతున్నారు. వాళ్లు నివసించే ఆరోగ్యవంతమైన ఊళ్లను వదిలి పనులకు పొట్టపోసుకోడానికి ఇక్కడకే ఎందుకు రావాల్సి వస్తోంది? అసలు జాడ్యం ఈ స్థితి కల్పిస్తున్న వ్యవస్థలో కదా ఉంది? లాక్‌డౌన్ చేయాల్సింది ఈ స్థితిని కల్పిస్తున్న వ్యవస్థను కదా?
3) అలానే దేశంలో పలు రాష్ట్రాలను చూడండి. ఒడిస్సా, బీహార్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఈశాన్య ప్రాంతం... ఇలా పేద రాష్ట్రాలు, అందులో మళ్లా పేద ప్రాంతాల్లో కోవిడ్ కుదిపేయడం లేదే? ఎందుకని?
4) ఈ ప్రాంతాల నుండి లక్షలాది కార్మికులు సకల రోగాలకు నిలయాలైన నాగరిక ఎడారులకు ఎందుకు ఎగబడాల్సి వస్తోంది? కరోనా లాక్‌డౌన్‌తో ఆగమైపోతున్న వీరినుండి ఇతరులకు వ్యాధిసోకిన దాఖలా లేదు. అంటే ఇంతటి దుర్భర పరిస్థితిలో కూడా వీరు కరోనా వ్యాధిని తట్టుకున్నారు.
5) పిడికెడు నగరవాసుల సౌభాగ్యానికి, మిగతా యావత్ ప్రజానీకం పీకలు కోసుకుని, వాళ్లను వాళ్లే ఏటలు వేసుకుని, నరుక్కున్న తలలను నగర వాసుల పాదాలచెంత పెడుతున్నారు.
6) జబ్బులు సృష్టించేవారు సకల సౌకర్యాలు గల ఏసి విల్లాల్లో కులాసాగా, కాలుకదపకనే ఖుషీగా లాక్‌డౌన్‌లో సేదతీరుతుంటే , వాళ్ల ఖుషీకి తమ స్వేదాన్ని, రక్తాన్ని ధారబోసే కార్మికులు, శ్రామికులు మట్టికొట్టుకు పోవాలా? అయ్యా! బాబు! మా ఇళ్లకు మమ్మల్ని పంపండి లేదా మాచావేదో మేంచస్తూనైనా కాలినడకన మా ఊళ్లకు పోతామని వేడుకుంటేకూడా వారిని కనికరించరు. ఏమి వ్యవస్థ ఇది?

పెట్టుబడిదారీ వ్యవస్థ విస్తృతిలోనే మానవాళి రుగ్మతలన్నీ దాగి ఉన్నాయి. కాల క్రమంలో అవి ఒక్కొక్కటీ బయటపడుతూ, వినాశనం సృష్టిస్తూ ఉంటాయి. వైరస్‌లు, వ్యాధులు, జాడ్యాలు, యుద్ధాలు, అసమానతలు, వనరుల దోపిడీ, పర్యావరణ హననం, ప్రమాదకర వ్యర్థాలు, కాలుష్యాలు, మితిమీరిన వస్తు వినియోగం, ఇవన్నీ పెట్టుబడిదారీ వ్యవస్థ విష ఫలాలే!

ప్రభుత్వాలు వైద్యరంగాన్ని కార్పొరేట్ వైద్యవ్యాపార ముఠాలకు కైంకర్యంచేసి, ప్రజా ఆరోగ్యంతో మాకు పనిలేదని చేతులు దులుపుకున్నాయి. ఈ బాధ్యత నుండి తప్పుకున్నాయి. ఇపుడు కరోనా మహమ్మారి ముంచుకొచ్చింది. కార్పొరేట్ వైద్యరంగం దీని నియంత్రణ, నివారణ బాధ్యత తీసుకుంటుందా? తీసుకోదు. కరోనా పీకకు చుట్టుకుని ప్రభుత్వాలు సంకట స్థితిలో పడ్డాయి. వాటికి కనపడ్డ అర్జెంట్ అడ్డదారి లక్డౌన్.

ప్రజలను, ప్రజా జీవనాన్ని స్తంభింపచేయడానికి సిద్దపడి, ప్రభుత్వాలు ఈ అడ్డగోలు విధానానికి తెగబడ్డాయంటే, ఇవి ఎంత అప్రజాస్వామికమైన, ప్రజా వ్యతిరేకమైన ప్రభుత్వాలో మనం అర్థంచేసుకోవచ్చు. ఇవి ఎవరి సేవలో మునిగి, ఎంతగా తరిస్తున్నాయో సులభంగానే మనం గ్రహించవచ్చు.

ఏ దేశాల్లో ప్రజా ఆరోగ్య వ్యవస్థలు బలంగా ఉండి, ప్రజల భాగస్వామ్యంతో నడుస్తున్నాయో అక్కడ ప్రజలకు పెద్దగా కోవిడ్ బాధాలేదు, ఒకవేళ ఉన్నా అవి ప్రజలను కృత్రిమ లక్డౌన్లకు గురిచేసి హింసించక తొందరగానే గట్టెక్కాయి. ఇప్పుడు మన ప్రభుత్వాలు అనాలోచిత, అస్తవ్యస్త లాక్‌డౌన్ నుండి బయటపడే మార్గం కానరాక, ముందు గొయ్యి, వెనక నుయ్యి చందంగా కొట్టుమిట్టాడుతున్నాయి.

సోషలిస్టు ఛాయలుగల క్యూబాలో ప్రజావైద్యం గురించి, అక్కడ వైద్యుల పనితనం గురించి ఒక్క అమెరికా మినహా ప్రపంచమంతా శ్లాఘించడం ఇపుడు మనమంతా చూస్తున్నాం. ఒకప్పటి సోవియట్

రష్యా, జన చైనాలు, సోషలిస్టు సమాజాలుగా మనుగడ సాగించిన కాలంలో అవి జనరంజకమైన, అద్భుతమైన ప్రజా వైద్యఆరోగ్య వ్యవస్థలకు పటిష్టంగా నిర్మాణం చేసాయి. ఈ రంగాల్లో ప్రజా వైద్యుల, అనుబంధ కార్యకర్తలు పనితీరు ఎలా ఉండాలో ఆవిష్కరించి సకల జనరంజకంగా అమలుచేసి ప్రపంచానికి చూపించాయి.

ఈ మేడే సందర్భంగా, కార్ల్ మార్క్స్ జయంతి, లెనిన్ 150వ జయంతి, ఎంగెల్స్ 200వ జయంతి సందర్భంగా క్లుప్తంగానైనా ఆ వ్యవస్థల గురించి, వాటి పనితీరు గురించి మననం చేసుకుందాం. తద్వారా ఇప్పటి ప్రపంచ మానవాళి ఏమి కోల్పోయిందో తెలుసుకోవచ్చు. కోల్పోయిన ప్రజానిధిని తిరిగి ఎలా రాబట్టుకోవాలో, సాధించాలో ఆలోచించవచ్చు.

ప్రజా పోరాట మార్గాల్లో విప్లవాలు విజయవంతమై శ్రామిక ప్రజా ప్రభుత్వాలు స్థాపించ బడ్డాక ఇటు సోవియెట్ రష్యాలోనూ, అటు జనచైనాలోనూ ప్రజా ఆరోగ్య రంగాల్లో వేసిన మొదటి అడుగు: ప్రజలందరికీ, స్థాయీ బేధం లేకుండా, తరగతుల్లేని ఒకే తరహా ప్రజా వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడం. డబ్బుతో వైద్యం కొనుక్కోవడాన్ని రద్దుచేయడం. డబ్బుతో పనిలేని వైద్యాన్ని ప్రజలకు అందించడం. పనిచేసే చోటే, నివసించే చోటే అందుబాటులో వైద్యం.

రెండు: ప్రజల చెంతకు వైద్యులు, కార్యకర్తలు, ప్రజావైద్యం పయనించడం. మూడు: ప్రజా వైద్యాన్ని ప్రజల భాగస్వామ్యంతో మేళవించి రోగ గణన, రోగ నిర్ధారణ, రోగ నివారణ, వైద్య వ్యవస్థల నిర్మాణం చేపట్టడం. నాలుగు: తల్లుల, బిడ్డల వైద్య ఆరోగ్యాలకు పెద్దపీట వేయడం. ఐదు: వైద్యంలో మంత్ర–తంత్రాలకు, మూఢ నమ్మకాలకు, మత చొరబాటుకు తావులేకుండాచేసి, శాస్త్రీయతను చాటిచెప్పడం, విజ్ఞానాన్ని వ్యాప్తిచేయడం. ఆరు: ఆహార, వ్యాయామ, విరామ, విహార, ఆహ్లాదాలను మేళవించి ప్రజా ఆరోగ్య సమస్యలను దూరం చేయడం. ఏడు: ఆరోగ్యమే మహాభాగ్యం అనే పదానికి ఆచరణలో పట్టంకట్టడం, కట్టి సాధించడం. క్లుప్తంగా ఇవీ అప్పటి ప్రజా సోషలిస్టు వ్యవస్థలు చేపట్టిన ప్రజా ఆరోగ్య విధానాలు.

రష్యాలో వైద్య బృందాలు, కమ్యూనిస్టు కార్యకర్తలు ఎప్పుడూ సరైన వైద్యమంటే ఏమిటో తెలియని సంచార జాతులకు, ముల్లాల, మత గురువుల, మంత్రం వైద్యుల బారినపడి నలిగిపోతున్న, వెనుకబాటుతో మగ్గిపోతున్న జాతుల ప్రజలకు వైద్య సేవలందించి, విద్య వికాసపు వెలుగు రేఖలను నింపారు. ఇక ప్రతి వ్యవసాయ క్షేత్రంలోనూ, ప్రతి పరిశ్రమ ఆవరణలోనూ, ప్రతి ప్రజా నివాస ప్రాంతంలోనూ ప్రజల ముంగిటే వైద్యాన్ని నిలిపారు.

చైనాలో లక్షల బేర్ఫుట్ డాక్టర్లను(కాలినడక వైద్యులను), వైద్య ఆరోగ్య కార్యకర్తలను ఎలా తర్ఫీదు ఇచ్చి తయారుచేసారో, వారు ప్రజలతోనే జీవిస్తూ, ప్రజల మధ్యనే నివసిస్తూ, ప్రజలతోపాటు ఉత్పత్తిలో పాల్గొంటూ చైనాలో బెత్తెడు నేలను కూడా మిగల్చకుండా ఎక్కడెక్కడో నివసించే ప్రజలకు అత్యంత ప్రేమతో, శ్రద్ధాసక్తులతో వైద్యాన్ని అందించి వారి జీవితాల్లో సంతోశాన్ని నింపారు. తరాలుగా వదిలించుకులోని అనేక వ్యాధులను, చెడు అలవాట్లను, సామజిక కట్టుబాట్లను, మూఢ నమ్మకాలను వైద్య, జ్ఞాన,సేవా జ్యోతులు వెలిగించి పారదోలారు.

అటువంటి ప్రజా వ్యవస్థలు ఈ నాడు మనకు ఉండిఉంటే కరోనా కల్లోలాలు మనలను ఏమీచేయలేవు. ప్రజలను, ప్రజా జీవనాన్ని కృత్రిమ లాక్‌డౌన్‌లలో బంధించి జన జీవనాన్ని దిగ్బంధం చేయాల్సిన పనిలేకుండానే ప్రజా వైద్య బృందాలు, వైద్యసేవా కార్యకర్తలు, ప్రజా వాలంటీర్లు, శాస్త్రజ్ఞులు ఏకతాటిపై నడిచి ఎటువంటి మహమ్మరినైనా, జాఢ్యానైనా పారద్రోలి ప్రజలకు స్వస్థత చేకూర్చేవారు. ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేయకుండానే సకల ఉత్పత్తులను ప్రణాళికాబద్దంగా కొనసాగించి, ప్రజలకు సరుకులు, సేవలు అందించేవారు.

ఇప్పటిలా మొత్తం భారాన్నంతా ప్రభుత్వ వైద్యులపై, వైద్యా సేవికలపై, సఫాయి కార్మికులపై నెట్టివేసి ధనికవర్గం, దాని బంటువర్గం, కార్పొరేటు వైద్య వ్యవస్థ, సేదతీరుతూ ఉండే దృశ్యం కనిపించేదికాదు. ఈ వ్యవస్థే, ఈ సంకర జాతి(క్రాస్ బ్రీడ్) పెట్టుబడిదారీ వ్యవస్థే ఓ రొచ్చుగుంట. సకల జాడ్యాలకు ఇదే ఆలవాలం. అన్ని జబ్బులు ఇక్కడ నుండే పుట్టి ప్రజలను పీడిస్తూ ఉంటాయి. ఈ రొచ్చుగుంటను వదిలించు కుని ఓ సుందరమైన ప్రజా సరస్సును నిర్మించుకోకుండా మనకు వైరస్‌ల బాధలు తప్పవు. ఏదో ఒక విధమైన లాక్‌డౌన్‌ల తిప్పలు తప్పవు.

(సోవియెట్ రష్యా, జనచైనా 'ప్రథమ దశ' వైద్యవ్యవస్థల గురించి వివరంగా తెలుసుకోవాలంటే ఈ పుస్తకాలను చదవండి :

1. Socialised Medicine in the Soviet Union by Henry E.Sigerist;
2. The Red Medicine by Sir Arthur Newsholme and John Adams Kingsbur;
3. Protection of Women and Children in Soviet Russia by Alice Withrow Field;
4. Health Work in Soviet Russia by Anna J.Haines.

On China's Medicine:

1. Away With All Pests by Joshua Horn;
2. Serve The People, Observations on Medicine in PRC by Victor W. Sidel and Ruth Sidel;
3. China: The Quality of Life by Wilfred Burchett and Rewi Alley (Chapter-14),
4. Daily Life in Revolutionary China (Chapter-10) by Maria A Macciocchi.
5. నిత్యజీవితంలో సోషలిజం, రచన: భూసారం శివన్న

(రచయిత శ్రామికనేస్తం సంపాదకులు) వీ

మానవ ఆలోచన భౌతిక సత్యాన్ని గ్రహించగలదా అనేది సైద్ధాంతిక ప్రశ్న కాదు. అది ఆచరణలో తేలే ప్రశ్న. సత్యాన్ని, అంటే, తన ఆలోచనకు సంబంధించిన వాస్తవికతనూ, శక్తినీ, తాను చూసే పార్శ్వాన్నీ మనిషి ఆచరణలోనే రుజువు చేయవలసి ఉంటుంది. ఆలోచన వాస్తవికమైనదా, అవాస్తవికమైనదా అనే వివాదాన్ని ఆచరణ నుంచి వేరు చేస్తే అది కేవలం పండిత చర్చే అవుతుంది.

– కార్ల్ మార్క్స్

ప్రపంచీకరణలో కరోనా

పెట్టుబడిదారీ విధానం లాభం కేంద్రంగా నడుస్తుందనీ, ప్రజల సామాజిక బాధ్యతను అది పట్టించుకోదని కరోనా సందర్భంలో మరింత అర్థమవుతుందని కాబట్టి మానవాళికి సోషలిస్టు వ్యవస్థలే రక్షణ అని చరిత్ర రుజువు చేసిందనీ అంటున్నారు కేశవ్

ప్రపంచ మానవాళిని నేడు కరోనా అనే ఒక అతి చిన్న వైరస్ శాసిస్తోంది. సరిహద్దుల తారతమ్యం లేకుండా హిందూ ముస్లిం బేధ భావం లేకుండా ధనిక పేద తేడా లేకుండా, సామ్రాజ్యవాద దేశాలు, అభివృద్ధి చెందిన దేశాలు అనే తారతమ్యం లేకుండా, కమ్యూనిస్టు దేశాలు, పెట్టుబడిదారీ దేశాలు అనే వివక్షత లేకుండా అందరినీ ఒకే సమానత్వంతో చూస్తోంది. భయ భ్రాంతులకు గురిచేస్తోంది. మొట్ట మొదట చైనాలోని వూహాన్‌లో తన వికృత రూపాన్ని ప్రదర్శించి భయపెట్టి, జన జీవితాల్ని అతలాకుతలం చేసేసిన తర్వాత మరింత ముందుకు వెళ్లి అటు యూరోప్ దేశాలనూ, ఇటు అమెరికా రష్యాలనూ ఇటు ఆసియా దేశాలనూ కబళించడానికి సిద్ధమయింది. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక జీవితాలను అతలాకుతలం చేసేసింది. చేసేస్తోంది. భవిష్యత్తులో ఈ మహమ్మారి గురించి ఆలోచిస్తేనే భయంతో వణికిపోయేలా ఉగ్రరూపం దాల్చింది. ఈ వ్యాసం రాసేనాటికి భారతదేశంలో దాదాపు 39 వేల 980 మంది ఈ వ్యాధికి గురయ్యారు. 1301 మంది ప్రాణాలు కోల్పాయారు. ఎలాంటి సమస్యలకైనా చిటికెలో పరిష్కారం చెప్పేసి సాధారణ జనాలను మభ్యపెట్టేసి చిట్కా వైద్యాలు, మరోవైపు గుడులూ, పూజారులూ, మంత్రతంత్రాలూ జ్యోతిష్యాలు కనుమరుగయ్యాయి. హేతువును నమ్ముకున్న విజ్ఞాన శాస్త్రం నేడు మనిషి సరసన నిలబడింది.

నిరసన స్వరాల నుండి ఊరట

దేశాలకు దేశాలు లాక్‌డౌన్‌లతో ఆర్థికంగా ఆతలాకుతల మవుతున్నాయి. ఎక్కడి వాళ్లక్కడే గప్ చుప్ అన్నట్టు ప్రజలు ధనిక పేద తారతమ్యం లేకుండా దాక్కుంటున్నారు. అలా దాక్కునే పరిస్థితి వచ్చింది. బయటికొచ్చిన ప్రజలకు పోలీసు లాఠీలు వైరస్‌తో పాటు భయపెడుతున్నాయి. బయటికొచ్చే ప్రజలు మాస్కులతో ఇంతకు ముందు సిఏఏలకు వ్యతిరేకంగా గొంతెత్తిన నోళ్లకు మాస్కులతో బిగిస్తున్నారు. వైరస్ కారణం వల్ల ఏలినవారికి నిరసన స్వరాల నుండి ఊరట లభించింది. సబ్బులతో సానిటైజర్‌లతో చేతుల్ని మాటిమాటికి కడుక్కుంటూ వైరస్‌ని చంపే విషమ ప్రయత్నంలో ప్రజలు బిజీ అయిపోయారు. మధ్యలో గొంతెత్తిన కార్యకర్తలకు కటకటాల్లోకి బిగించినా, ఎనిమిది గంటల పని వేళల్ని ఇదే సాకుతో పన్నెండు గంటల పనివేళలుగా మార్చేసే ప్రయత్నాలు చాప కింద నీరులా జరుగుతున్నా నిరసన స్వరాలకు అటు మాస్కులూ ఇటు లాక్‌డౌన్ చట్టాలూ, అటు వైరస్ మహమ్మారీ అడ్డొస్తున్నాయి. ఏ వస్తువు ముట్టుకున్నా, ఏ మనిషి గాలి తగిలినా చేతులు కడుక్కుంటూ వైరస్ నుండి విముక్తి పొందడానికి విషమ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రయాణంలో, ఈ విపత్తులో మానవ ప్రయత్నం ఎంతవరకు విజయం సాధిస్తుందనేది కాలమే చెప్పాలి. అలా విజయం సాధించేలోగా హిందూ, ముస్లిం అని ఒకరిపై ఒకరు రాళ్లు విసురుకుంటున్న భారతీయ సోదరులను ఎంతమందిని కరోనా 19 రోగ గ్రస్తులుగా మారుస్తుందో, ఎంత మందిని పొట్టన పెట్టుకుంటుందో ప్రస్తుతానికి అర్థం కావడం లేదు. పెట్టుబడిదారీ దేశాలు ఇంతవరకు ప్రబోధించిన మార్కెట్ మంత్రాలు ప్రజా సమస్యలకు ఎలా పరిష్కారం చేస్తాయో ప్రపంచీకరణకు వంతపాడిన కుహనా ఆర్థికవేత్తలే చెప్పాలి. కోవిడ్ 19తో పోరాటంలో కమ్యూనిస్టు దేశాలు ఎందుకు ముందున్నాయో, సూపర్ పవర్ దేశాలు అని విర్ర వీగిన అమెరికాలు ఎందుకు చతికిలబడుతున్నాయో వీరికే బాగా అర్థం అవుతుంది.

మహమ్మారులకు స్వాగతం పలికే వ్యవస్థ

వైరస్‌లూ, బాక్టీరియాలూ ఇలాంటి అసంఖ్యాకమైన సూక్ష్మ జీవులు పరిణామ క్రమంలో మనిషితో పాటే జీవిస్తున్నాయి. ఈ రోజు వైరస్‌లు కొత్తగా పుట్టుకు రాలేదు. అయితే, మనిషి ఏర్పరచుకున్న పెట్టుబడిదారీ వ్యవస్థ పర్యావరణంలోని సహజత్వానికీ, స్వచ్ఛతకూ ఆఘాతం కలిగిస్తూ పర్యావరణంలోని అసహజమైన మార్పులకు పునాది వేస్తూ, కొత్తరకాల వైరస్‌లకు కారణమవుతోంది. వ్యవస్థలోని పోటీ, లాభం, సామ్రాజ్యవాదం, పర్యావరణ విధ్వంసం ఇవేవీ అన్వయించకుండా ఒక్క కరోనా గురించి ఆలోచిస్తే మనకు విషయాలు అర్థం కావు. గతంలో ప్లేగునీ, స్పానిష్ ఫ్లూ, స్మాల్ పాక్స్, కలరా, పోలియో మానవ జాతిని అత్యంత విషాదానికి గురిచేశాయి. లక్షలాది మందిని పొట్టన పెట్టుకున్నాయి. అయితే, విజ్ఞాన శాస్త్రం వీటికి పరిష్కారాలు వెదికింది. చాలా జబ్బులు నేడు అయితే మాయమయ్యాయి. లేదా కలరా లాంటివి అక్కడక్కడా వినిపిస్తున్నా మహమ్మారుల్లా బాధించడం లేదు. అలానే, కరోనా 19 వైరస్‌కి విజ్ఞానశాస్త్రం పరిష్కారం వెదుకుతుంది. ఈ ప్రయత్నంలో మనం విజయం సాధిస్తాం. కానీ, ఒకే ఒక్క ప్రశ్న మిగిలిపోతుంది. ఈ మహమ్మారులు కరోనాలకు కారణమైన పెట్టుబడిదారీ వ్యవస్థకు మానవాళి పరిష్కారం వెదుకుతుందా? అలా వెదక్కపోతే మానవాళి మరిన్ని ఇలాంటి వైరస్‌ల బారిన పడకుండా ఉంటుందని గ్యారంటీ ఏమిటి? మన పోరాటం ఒక్క వైరస్‌తోనే కాదు. మానవ జాతిని ఇలాంటి కొత్త జబ్బుల్లో ముంచేసే వ్యవస్థతోనూ, ఉత్పత్తి విధానాలతోనూ మన పోరాటం. ప్రఖ్యాత జీవ శాస్త్రజ్ఞుడు రాబ్ వాలేష్ ప్రకారం, కోవిడ్ 19 పుట్టుక, విస్తరణనూ పెట్టుబడి పయనంలోనే చూడొచ్చు. అయితే, అంతవరకు ఈ కఠిన పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సిందే. సమస్య ఇలా ఉంటే, డిజిటల్ ప్రపంచంలో, వాట్స్‌అప్‌లో, ఫేస్ బుక్ లాంటి సోషల్ మీడియాలు శాసిస్తోన్న పరిస్థితుల్లో ఈ కరోనా 19కి సంబందించి కొన్ని

వాస్తవాలు, అవాస్తవాలు చలామణీ అవుతున్నాయి. వాస్తవాలను, అవాస్తవాల నుండి విడగొట్టి కరోనా 19 గురించి స్పష్టమైన హేతు బద్ధమైన అవగాహనను పెంచుకోవలసిన అవసరం ఉంది. సమస్త జనావళి ఇప్పటికే భయాందోళనలతో ఉన్నారు. ఒకవైపు, కరోనా వైరస్ 19 భయం, మరోవైపు, కోవిడ్ 19 వస్తే ఎలా అనే ఆందోళన. దీనికి తోడు, లాక్‌డౌన్ కారణంగా నలిగిపోతున్న జీవితాలు. ఆర్థికంగా చితికిపోతున్న జీవితాలు. పెరగబోతున్న నిరుద్యోగం. అస్తవ్యస్తమైన మానవ నాగరికత. బయటికివెళ్లితే పోలీసుల లాఠీల భయం. కష్టకాలంలో మనిషి పక్కన నిల్చొని ధైర్యం చెప్పాల్సిన పోలీసులు, పరిపాలనా యంత్రాంగం అక్కడక్కడా సహనం కోల్పోయి మనిషి ప్రాణాలు పోయేటంతగా కొడుతున్నారంటే సమస్య ఎంత గంభీరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఊహాగానాల వెల్లువ

కుట్ర సిద్ధాంతాలు ఒకవైపూ, మతపరమైన ఫేక్ న్యూస్ మరోవైపూ సమస్యను మరింత గందరగోళం చేసేస్తున్నాయి. వైరస్‌ను చైనా ప్రపంచానికి పంపించిందని, కాబట్టి చైనా వస్తువుల్ని బాయ్‌కాట్ చేయాలని ఒకవైపు వాదన. చైనా ఆర్థికంగా ముందుకు వస్తుండడం వల్ల, నచ్చక ఈ వైరస్‌ని అమెరికాయే చైనా మీదకు పంపించిందని మరో వాదన. ఎవరూ పంపించలేదనీ, చైనా లేబొరేటరీ నుండి ఇది లీక్ అయ్యిందని మరో వాదన. ఇదిలా ఉంటే, మన దేశంలో ఒక ప్రత్యేక మతస్తులు పనిగట్టుకొని ఈ వైరస్‌ని వ్యాప్తి చేస్తున్నారని మరో వైపునుండి ప్రచారం. ఇప్పటికే ఏం చెయ్యాలో తోచని అస్తవ్యస్తమైన పరిస్థితిలో లాక్‌డౌన్‌లో చిక్కుకున్న ప్రజలకు ఇలాంటి తప్పుడు ప్రచారాలు, తప్పుడు వార్తలు మరింత అయోమయంలోనూ, సందిగ్ధంలోను పడేస్తున్నాయి. సమస్యలను పరిష్కారం చెయ్యాల్సింది పోగా, ఈ ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీ సమస్యలను మరింత జఠిలం చేసేసి ప్రజలు తెలుసుకోవలసిన అసలు విషయాలను పక్కకి తోసేస్తున్నాయి. మరోవైపు ప్రజలు బాజాలు వాయించడం, కొవ్వొత్తులు వెలిగించడం, ఇంకాస్త ముందుకు వెళ్లి మరికొందరు ఏకంగా తుపాకులు పేల్చి కరోనా వైరస్‌ని తరిమే ప్రయత్నం చూస్తోంటే మధ్య యుగానికి ప్రజల ప్రయాణ సంకేతాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వాలకు కూడా అదే కావాలి కదా.

అసలు వాస్తవాలు

క్రిప్స్ పరిశోధన సంస్థకు చెందిన శాస్త్రవేత్త క్రిస్టియన్ ఏండెర్సన్ ఈ వైరస్ మీద పరిశోధన చేస్తూ, ఈ వైరస్‌ని ప్రయోగశాలలో తయారు చెయ్యలేదని తేల్చి చెప్పారు. అలానే, వుహాన్‌లోనే ఈ వైరస్ పుట్టిందని మొదట అక్కడి వ్యక్తులకే వ్యాపించిందని ఒక వాదన. అయితే, మొదటి 43 కరోనా వ్యాధి బాధితుల్లో 13 మంది వుహాన్ నగరానికి బయటివారే అని వారు అక్కడి మార్కెట్‌కి వెళ్లలేదని అక్కడ సోకిన వారితో ఎలాంటి సంబంధం లేని వారేనని లాన్సెట్ పత్రిక అధ్యయనం వెల్లడి చేస్తోంది. కోవిడ్ 19 అనేది బయో వార్‌కి సంబంధించినది కాదని ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా వెల్లడి చేసింది.

మహమ్మారుల వెనుక వాస్తవాలు

గతంలో స్వైన్ ఫ్లూ వల్ల అమెరికాలో 1200 మంది చనిపోయారు. అది మెక్సికోలో పుట్టిందనే అభిప్రాయంలో మొదట దాన్ని మెక్సికో ఫ్లూ అన్నారు. తర్వాత స్వైన్ ఫ్లూ పారిశ్రామిక ఉత్పత్తిలో తయారైన పందుల నుండి మనుషులకు వ్యాప్తి చెందిందని తెలిసింది. ఆ కర్మాగారం పేరు స్మిత్ ఫీల్డ్ ఫుడ్ కంపెనీ ఇది ఒక అమెరికన్ కంపెనీ. అతి పెద్ద పంది మాంసపు ఉత్పత్తి శుద్ధి కంపెనీ. మూడో స్థానంలో ఉంది. ఈ కంపెనీకి సంబంధించిన వేర్వేరు కార్ఖానాల్లో రెండు కోట్ల ఎనభై లక్షల పందులను చంపి హామ్, బేకన్, సాసేజి వగైరా అనేక కంపెనీలకు ఎగుమతి జరుగుతుంది. 2003–2004లో ఇదే కరోనా కుటుంబానికి చెందిన సార్స్ కరోనా ఎంతో మంది ప్రాణాలను బలి తీసుకుంది. ఈ కంపెనీల నుండి ఉత్పత్తులు అతి పెద్ద కంపెనీలైన మ్యాక్ డోనల్డ్స్, కెఎఫ్‌సి కంపెనీలకు చేరతాయి. ప్రపంచం మొత్తం మీద పంపిణీ వ్యవస్థ ఉన్న కంపెనీలు ఇవి. ఈ రోజు చైనా ఉత్పత్తులు వద్దని మనం చైనా మీద విరుచుకు పడుతున్నాం. అలా పడేలా ఫేక్ న్యూస్‌తో మన మెదళ్లని కడిగే పని జరుగుతుంది. అయితే, వాస్తవాలు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. చైనాలో ఉత్పత్తి ప్రక్రియను కొనసాగిస్తున్న కంపెనీలన్నీ చైనావే కావాలనే నిబంధనలు ఏమీ లేవు. చైనాలోని చవక శ్రమకు ప్రేరేపితులై యాపుల్, నైకి, పెప్సి, జనరల్ మోటర్స్, వంటి అమెరికన్ కంపెనీలు ఇంకా ఇలాంటివి ఎన్నో ఈ రోజు చైనా మార్కెట్‌ని ఆక్రమించి ఉన్నాయి. ఇందులో చైనా ఆర్థిక ప్రయోజనాలు కూడా ఉన్నాయి. చైనా కారు చవక ఉత్పత్తుల నేపథ్యంలో, శ్రమ దోపిడీవెనుక చట్ట పట్టాల్ వేసుకొని ఇద్దరి చలవ కూడా ఉంది. అతి పెద్ద కమ్యూనిస్టు దేశంగా నేడు చైనాను అభివర్ణించనవసరం లేదు. కమ్యూనిస్టు గొడుగు కింద పెట్టుబడి ప్రయోజనాలు ఇక్కడ ఏనాడో ఆరంభమయ్యాయి. శ్రామికుల శ్రమ దోపిడి చవక చైనీష్ వస్తువులకు ఆరంభ గీతం పలికి మరో పెట్టుబడిదారీ వ్యవస్థకు ఏనాడో నాంది పలికింది. ఇదే నేపథ్యంలో, మాంసం ఉత్పత్తిలో చైనా కంపెనీల పాత్ర కూడా లేకపోలేదు. 2008 ఆర్థిక మాంద్యం తర్వాత ప్రపంచంలో అతి పెద్ద సంస్థ గోల్డ్ మ్యాన్ సోక్స్ చైనాలోని అతి పెద్ద కోళ్ల ఫారంలను 300 మిలియన్ డాలర్లకు కొన్నది. ఇదే సంస్థ చైనాలోని పంది మాంసం పరిశ్రమలో మరో 200 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టింది. ఇలాంటి పెట్టుబడుల వెనుక బహుళజాతి సంస్థల ప్రయోజనాలు, చైనా ప్రయోజనాలు మనకు అర్థం అవుతున్నాయి. 945 మిలియన్ డాలర్ల విలువైన ప్రపంచ మాంసం పరిశ్రమలో పెట్టుబడిదారుల ప్రయోజనాలు, చైనా ప్రయోజనాలు అర్థం అవుతున్నాయి.

ఉత్పత్తిలో పెట్టుబడిదారీ విధానం ప్రవేశిస్తే అంతా తారుమారు అవుతుంది. లాభం తప్పించి ఈ విధానంలో మరో ఉన్నతమైన మార్గం కనిపించదు. అధిక లాభాల కోసం, అదనపు విలువల దోపిడీ కోసం ఈ విధానం ఎంతవరకైనా దారితీస్తుంది. పర్యావరణ విధ్వంసమైనా, పర్యావరణంలో మార్పులైనా, జన్యు ప్రక్రియలో మార్పులైనా లాభం కోసం ఎంతవరకైనా ఈ విధానం దారి తీస్తుంది. నేడు ప్రపంచ ఆహార రంగంలోనూ, మాంసం ఉత్పత్తిలోను అతి పెద్ద బహుళ జాతి కంపెనీలు ప్రవేశించి ఉన్నాయి. ప్రవేశిస్తు ఉన్నాయి. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో అసహజమైన జన్యు మార్పిడి ప్రక్రియను ప్రవేశ పెట్టాలనే వీరి లాబీ ఎంతగా ప్రయత్నిస్తుందో మనకు తెలుసు. జన్యు మార్పిడి పంటల విషయంలో ఎంతో మంది శాస్త్రవేత్తల వ్యతిరేకత ఉంది. పోరాటం ఉంది. అయినా సరే ఈ కంపెనీల ప్రాబల్యం ఏ స్థాయిలో ఉంది అంటే పరిపాలనా రంగాన్ని, శాస్త్రవేత్తల మెదళ్లని, వారి రాతల్ని ప్రభావితం చెయ్యగలిగేంతగా. మొక్కల్లో విత్తనాలు పుట్టడం సహజం. ఇది అత్యంత

సహజమైన ప్రక్రియ. అయితే, వ్యవసాయ భూముల్లో రైతు ఉన్నంతవరకు ఇది సాధ్యం. కానీ, వ్యవసాయ భూముల్ని బహుళజాతి కంపెనీలు ఆక్రమించుకున్నప్పుడు, పంటల్ని, వ్యవసాయ ఉత్పత్తుల్ని వీరు నిర్ణయించేటప్పుడు పరిస్థితి లాభాలవైపుగా పయనిస్తుంది. అందుకోసం అసహజమైన ప్రక్రియలు ఆరంభమవుతాయి.

పెట్టుబడి ఊబిలో జన్యు శాస్త్రం

వ్యవసాయంలోనూ, వ్యాపారంలోనూ నేడు జన్యు శాస్త్రాన్ని విరివిగా ఉపయోగిస్తున్నారు. మొక్కల్లో విత్తనాలే పుట్టని వింతైన ఆలోచనలు కూడా ఇదే నేపథ్యంలో వీరికి వస్తాయి. మరలా అదే పంట పండించాలంటే, మనం వీరి దగ్గరే ఆయా విత్తనాలు కొనాల్సిన అవసరం ఉంటుంది. ఏదో ఒక జంతువును చంపి వండుకొని ఆ మాంసాన్ని తినడం వేరు. అదే మాంసంతో ప్రపంచవ్యాప్తంగా వ్యాపారం చేసుకోవడం వేరు. మాంసం పరిశ్రమ నేడు ప్రపంచంలో చాలా పెద్ద పరిశ్రమ. కోడి మాంసం కావచ్చు. ఎద్దు మాంసం కావచ్చు. పంది మాంసం కావచ్చు. ఒక జంతువు యొక్క ఒక్కో శరీర భాగం విడివిడిగా ప్రాసెసింగ్ చేసి ప్రపంచం మొత్తం మీద సరఫరా చేసే అతి పెద్ద వ్యాపారం. ప్రపంచ నాయకులు కలుసుకొని చేసే సంతకాల్లో ఈ మాంసం ఉత్పత్తుల అమ్మకాల అగ్రిమెంట్లు కూడా చోటుచేసుకుంటున్నాయంటే, ఈ పారిశ్రామిక వేత్తలు పరిపాలనా యంత్రాంగాన్ని ఎంతగా ప్రభావితం చెయ్యగలరో మనకు అర్థం అవుతుంది.

భారతదేశంలో కూడా నేడు జన్యు మార్పిడి పంటల గురించి మనం విన్నాం. వ్యవసాయంలో జన్యు మార్పిడి పంటల్ని రైతుల మీద రుద్దడానికి ఎంత వ్యతిరేకత ఉన్నా సరే, ప్రయత్నాలు నడుస్తున్నాయి. జన్యు మార్పిడి అన్నది ప్రకృతి నియమాలకు విరుద్ధమని, శాస్త్రవేత్తలు ఘోషిస్తున్నా సరే, పెట్టుబడి దగ్గర ఎవరి మాటలు సాగవు. దానికి అభివృద్ధి అయిన డిజిటల్, టెక్నాలజీ, సోషల్ మీడియా వీరికే బాగా పనికొచ్చేలా తప్పుడు వార్తలు అవాస్తవాలు పరిశోధనల పేరు మీద ప్రజల మెదళ్లలోకి పంపించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

కరోనాల వెనుక మాంసం పరిశ్రమ

వ్యవసాయంలో లాగానే ఫాస్ట్ ఫుడ్ పరిశ్రమ కూడా అత్యంత విశాలంగా నడవాలి. ఇందులో కూడా చాలా పెద్ద బహుళజాతి కంపెనీలు ప్రవేశించి ఉన్నాయి. మాంసం తినే సహజ సిద్ధమైన స్వభావాన్ని ఇవి అత్యంత భారీ పరిశ్రమగా మార్చేశాయి. ఒక జంతువు యొక్క కాలు అనీ, తల అనీ, మెదడు అనీ రకరకాలుగా బ్రాండ్ల పేరుతో నేడు భారీ ఆహార పరిశ్రమ నడుస్తోంది. ప్రజల్ని ఫాస్ట్ ఫుడ్ పరిశ్రమ బానిసగా మార్చేసే ప్రక్రియ నడుస్తోంది. కోళ్ల మాంసం పరిశ్రమ, పందుల మాంసం పరిశ్రమ, ఎద్దు మాంసం పరిశ్రమ ఇలా రక రకాల పరిశ్రమలు మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఇవన్నీ కూడా పెద్ద పెద్ద కార్పొరేట్ల చేతుల్లో ఉన్నాయి.

పంది మాంసం ప్రాసెస్ చేసే ఇండస్ట్రీ కోసం పందుల్ని చాలా కిక్కిరిసిన గదుల్లో ఉంచాలి. పందులు ఒక్కసారిగా ప్రాణ భయంతో ఏడ్వడం కూడా వీరికి చిరాకు కలిగించే విషయం. వీరి లాభాల సంచులకు ఇబ్బంది కలిగించే విషయం. పందుల శరీర భాగాల్లో ఒక భాగం ఎక్కువ బరువు ఉండడం, మరో భాగం తక్కువ బరువు ఉండడం కూడా వీరి లాభాలకు అవాంతరం కలిగించే విషయం. కాబట్టి పెట్టుబడిదారుడికి మన సైన్స్ ఎలా ఉపయోగపడాలి అంటే, పందులు మౌన వ్రతం పాటించేలా ఉండాలి. పందుల శరీర భాగాల్లో ప్రతి భాగం బరువు పెరిగి లాభాలను తెచ్చేవిగా ఉండాలి. లేదా అన్నీ సమాన బరువులో ఉండాలి. అలా జరగాలీ అంటే పెట్టుబడిదారుడి సైంటిస్టు ఆ జంతువుల జన్యువుల్లో ఆ విధమైన మార్పులు చెయ్యగలగాలి. కోళ్ల ఫారంలో వేల కొలది కోళ్లని ఒక దగ్గర ఉంచి, వాటి మాంసాన్ని ఫాస్ట్ ఫుడ్‌గా మార్చాలి. అందులో ఒక్కో భాగాన్ని విడివిడిగా అమర్చి ప్రపంచం మొత్తం మీద తమ వ్యాపారం సాగించాలీ అంటే, కోళ్లలో కూడా జన్యు మార్పిడి జరగాలి. ఉదాహరణకు, కోడి ఈకల్ని తొలగించడం ఒక పెద్ద ప్రక్రియ. ఒకాటా రెండా......కొన్ని వేల లక్షల కోళ్ల ఈకల్ని పెకిలించాలి కదా. ఇందుకు చాలా శ్రమ అవసరమవుతుంది. సంబంధిత శ్రామికుల జీతాల కోసం చాలా డబ్బులు పెట్టాలి. ఇది యంత్రం ద్వారా సాధ్యమయ్యే పని కాదు కదా. కాబట్టి, కోడిలో ఈకల్ని పుట్టకుండా చేసేస్తేనో.. అందుకు పెట్టుబడిదారుడికి అలా సహకరించే శాస్త్రవేత్త కావాలి. ప్రస్తుతం మాంసం పరిశ్రమ ఇదే దిశలో ఎదుగుతోంది. పయనిస్తోంది. ఇంతకుముందు వివరించినట్లు, రాబ్ వాలేస్ తన 'బిగ్ ఫార్మ్స్ మేక్స్ బిగ్ ఫ్లూ' అనే పుస్తకంలో పెద్ద పెద్ద బహుళ జాతి కంపెనీలు ఇలాంటి మహమ్మారులకు కారణభూతం ఎలా అవుతున్నాయో వివరిస్తాడు. జన్యు మార్పిడి ద్వారా అసహజంగా తయారైన జంతువుల్లో రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంది. ఉదాహరణకు, ఈకలు లేకుండా పుట్టిన కోళ్లు సహజంగా పుట్టిన కోళ్లలా జీవించలేవు. వీటి రోగ నిరోధక శక్తిలో మార్పు వస్తుంది. సహజ సిద్ధంగా బయట ప్రకృతిలో పుట్టిన ఒక సీమ పందికి ఏ వైరస్ సోకినా సరే, అవి వాటికి తట్టుకునేలా రోగ నిరోధక శక్తి కలిగి ఉంటాయి. కానీ, అసహజంగా, ప్రకృతిలో కాకుండా కర్మాగారంలో జన్యుమార్పిడి ద్వారా, మందులు, కృత్రిమ హార్మోన్ల సహకారం ద్వారా పుట్టిన సీమ పంది సాధారణ ఉష్ణోగ్రతలో ఎక్కువ కాలం బతకలేవు. వీటి రోగ నిరోధక శక్తి కూడా తక్కువ ఉంటుంది. వీటికోసం ఒక అసహజమైన ఉష్ణోగ్రతను సృష్టించాల్సి ఉంటుంది. వీటికి ఏ వైరస్‌లు సోకినా సరే అవి వాటితో పోరాడలేవు. మరి, వీటికి చేరువలో 10-14 గంటలు పనిచేసే శ్రామికులకు ఈ వైరస్‌లు సోకితే వారి పరిస్థితి ఏమిటి? ఇంతకు ముందు భయపెట్టిన సార్స్, కోవిడ్ మహమ్మారులకు పునాది ఇలాంటి పరిశ్రమలే అని వేల్స్ అంటాడు.

నేడు ఈ వ్యాపారం అన్ని దేశాలకు విస్తరించి ఉంది. చాలా పెద్ద కంపెనీలు ఇందులో ఇమిడి ఉన్నాయి. ప్రపంచంలో కెల్లా ఎక్కువ సీమ పంది మాంసాన్ని ఉత్పత్తి చేసే కంపెనీల్లో అయిదవ స్థానంలో ఉన్న డానీష్ క్రౌన్ అనే డానీష్ కంపెనీ, 7వ స్థానంలో ఉన్న జర్మనీకి చెందిన టోని కంపెనీ కూడా చైనాలో మాంసాన్ని ఉత్పత్తి చేసి శుద్ధి చేసే భారీ కర్మాగారాన్ని తెరిచాయి. ఇక్కడి నుండి ఆ మాంసం చైనా దేశీయ మార్కెట్‌లోనూ, అంతర్జాతీయంగా ఇతర దేశాల్లోనూ సరఫరా అవుతున్నాయి. ప్రపంచంలో అతి పెద్ద పెట్టుబడి సంస్థ గోల్మన్ సాక్స్ తన పెట్టుబడిని అన్ని రంగాలకు విస్తరించడంలో భాగంగా 300 మిలియన్ డాలర్లను ఖర్చు పెట్టి చైనాలోని అతి పెద్ద కోళ్ల ఫారంలను కొనేసింది. దానికి తోడు అదే సంస్థ చైనాలోని పంది మాంసం పరిశ్రమలో 200 మిలియన్ డాలర్లను పెట్టుబడి పెట్టింది. వీటితో పాటు ఈ గణాంకాలు మాంసం పరిశ్రమ ప్రపంచాన్ని ఎలా శాసిస్తుందో అర్థమవుతుంది. సోషలిస్టు ముసుగులో చైనాలో పెట్టుబడిదారీ వ్యవస్థ నడుస్తోంది.

విఫలమైన ప్రపంచీకరణ సూత్రాలు

ప్రతి ఒక్కటీ మార్కెట్ చూసుకుంటుంది. ప్రభుత్వం ప్రమేయం అవసరం లేదు అనేది ప్రపంచీకరణ ముఖ్య సూత్రం. ఈ సూత్రం ఆధారం చేసుకొని అమెరికా తన సార్వత్రిక ఆరోగ్యం ప్రభుత్వం బాధ్యత కాదని, మెడికల్ ఇన్సూరెన్స్ కంపెనీల చేతుల్లో పెట్టేసి చేతులు దులిపేసుకొని ఆయుధాలను ప్రపంచం మొత్తం మీద అమ్ముకుంటూ, వర్ధమాన దేశాల్ని, అరబ్ దేశాల్ని యుద్ధం కుంపట్లోకి నెట్టేసి నేడు ఒక కరోనా 19 వైరస్‌ని పరిష్కరించలేక పోతోంది. అతి చిన్న దేశం క్యూబా లా కూడా న్యాయం చెయ్యలేకపోతోంది. ప్రస్తుతం, ప్రపంచీకరణ మంత్రాలు సరయినవి కావని, పెట్టుబడిదారీ వ్యవస్థ తన స్వలాభం కోసం ప్రపంచ మానవాళిని ఇలా నమ్మించిందని అర్థం అవుతోంది. ఇటలీ కూడా ఇదే దారిలో పయనించి కష్టాలను అనుభవిస్తోంది. భారతదేశం కూడా ప్రపంచీకరణ ఫలితంగా 1990ల నుండే కార్పొరేటు ఆసుపత్రులకు ఎర్ర తివాచీ పరచింది. ప్రభుత్వాలు అందించే సబ్సిడీలను అనుభవిస్తూ వెలసిన ఈ ఆసుపత్రులు ఆరోగ్యాన్ని సామాన్యునికి గగన కుసుమంగ మార్చాయి. మెడికల్ విద్య సామాన్యునికి అందనంత దూరంగా జరిగింది. కొత్తగా వచ్చిన మెడికల్ బిల్లు కూడా అదే దారిలో పయనిస్తోంది. చివరికి శవాలను కూడా బిల్లు కట్టకపోతే రోగి కుటుంబానికి ఇవ్వని కార్పొరేటు ఆసుపత్రులను మనం చూశాం. ఇలా వెలసిన ఈ ఆసుపత్రులు ఆరోగ్యాన్ని పచ్చి వ్యాపారంగా మార్చేశాయి. అధిక ధరల మందులతో, అనవసరమైన పరీక్షలతో, రోగి అనారోగ్యాన్ని తమ కాసుల పంటగా మార్చుకొనే ఒక కొత్తరకం అమానవీయ వ్యవస్థకు రూపకల్పనచేశాయి. కొన్నయినా ప్రభుత్వ ఆసుపత్రులు ఉండడం మనం ఇప్పటికీ బతికిపోయాం. వాటిని కూడా బ్యాంకుల్లా, ఇతర పబ్లిక్ సెక్టార్ పరిశ్రమల్లా మార్చేసి ఉంటే భారతదేశం పరిస్థితి మరింత దయనీయంగా మారి ఉండేది.

గుణపాఠాల్ని నేర్పుతోన్న కరోనా

కరోనా 19 మనకు చాలా గుణపాఠాల్ని నేర్పింది. మనం ఎలాంటి వ్యవస్థలను తయారుచేసుకోవాలో, ఎలాంటి వ్యవస్థలు కష్టకాలంలో మనిషి పక్కన నిలుచుని సేవ చేస్తాయో, ఎలాంటి వ్యవస్థలు మహమ్మారులు వచ్చేటప్పుడు విఫలమవుతాయో తెలిసేలా చేసింది. 1990ల నుండి ప్రపంచీకరణ ప్రక్రియ దేశంలో ఆరంభమయింది. పబ్లిక్ సెక్టార్‌లోని ఒక్కో పరిశ్రమ అయితే ప్రైవేటీకరణకు గురి కావడమో లేదా ప్రైవేటు పెట్టుబడి సగం వరకు ఆహ్వానించడమో జరిగింది. మొన్న మొన్నటి కరోనా మహమ్మారి ప్రబలించక ముందు కథ చూస్తే అత్యంత లాభాల్లో ఉన్న పబ్లిక్ రంగంలోని పరిశ్రమలకు ప్రైవేటు గీతాలు పాడడం ఆరంభమయింది. ఇక బ్యాంకుల వైపు చూస్తే పరిస్తితి మరింత నిరాశా జనకంగా ఉంది. మొండి బాకీలు పెరుగుతున్నాయి. బ్యాంకులు బలహీనం అయ్యాయి. బలహీనం అయిన బ్యాంకులు కాస్తంత నిలదొక్కుకుంటున్న బ్యాంకులతో విలీనం ప్రక్రియ ఫలితంగా కాస్తంత బలంగా ఉన్న బ్యాంకులు కూడా తమకు మించిన భారాన్ని మోయలేక కాలక్రమంలో మరింత బలహీనం అవుతాయి. కానీ, మొండి బాకీలు చెల్లించలేనివారు ఎవరో కరోనా లాంటి మహమ్మారికి గురైన పేద రైతులు కాదు. అధిక సంఖ్యాకులు బాగా బలిసిన పెట్టుబడిదారులే. బ్యాంకుల్లో ప్రజల సొమ్ముల్ని దోచేసుకున్న ఈ మహానుభావులకు శిక్షలు అంతంత మాత్రమే. దేశ ప్రజలు విపత్తులో ఉంటే, లాక్‌డౌన్ కారణంగా ఆర్థికంగా ఆదాయాలు లేకుండా, పనులు లేకుండా అత్యంత విషాదంలో ఉంటే పేద ప్రజలకు సంబంధించిన ఆర్థిక ప్రణాళికల అవసరం ఎంతైనా ఉంది. కానీ, ఒక ఆర్‌టిఐ ప్రకారం, గత సెప్టెంబర్ 2019 వరకు దాదాపు 69 వేల కోట్ల రూపాయల కార్పొరేట్ల రుణాలను ఆర్‌బిఐ సాంకేతికంగా రద్దు చేసిందని తెలుస్తోంది. ఇందులో, పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంలో ఇరుక్కున్న చోక్సీలున్నారు. ఇంతకు ముందే రుణ ఎగవేతదారులకు తన నేర్పరితనంతో దారి చూపించిన విజయ్ మాల్యాలు ఉండడం గమనార్హం. దాదాపు 50 మంది కార్పొరేట్లు లబ్ధి పొందారు ఇలా. మరోవైపు జి.ఎస్.టి, నల్లధనం వెలికితీత అని వ్యవస్థ మరింత గల్లంతు అయింది.

కరోనా లాంటి మహమ్మారులను ఎదుర్కోవడంలో ఆహార ధాన్యాల సరఫరా కేంద్రీకృతమయ్యే అవసరం వచ్చింది. ఆహార ధాన్యాల నిల్వలు బాగా ఉండడం కారణంగా ఆపదలో ఆదుకున్నాయి. ఆహార ధాన్యాల మీద ప్రభుత్వాల బాధ్యత గుర్తు చేసింది. ఆహారం విషయంలో ప్రభుత్వాలు పక్కకి జరిగితే, మార్కెట్ శక్తులకు అప్పజెప్పేస్తే కోట్లకొలది ప్రజలు కరోనా కంటే ముందు ఆహార ధాన్యాలు దొరక్క చనిపోయి ఉండేవారు. అలానే, వైద్యం ప్రైవేటు రంగంలో ఉంటే, ముప్పు ఎలా ఉంటుందో అమెరికాలాంటి దేశాల వ్యథల్ని చూస్తే అర్థం అవుతుంది. భారతదేశంలో కూడా ప్రపంచీకరణ గాలులు 1990ల నుండి ప్రవేశించి ఉన్నప్పుడు ఉన్నత వైద్య సేవలకోసం ప్రైవేటు ఆసుపత్రులు అవసరమని నమ్మించారు. ఫలితంగా, ఐదు నక్షత్రాల కార్పొరేటు ఆసుపత్రులు వెలసి వైద్యంలో కొత్తరకం దోపిడిని ఆరంభించాయి. వైద్యసేవలు సామాన్యునికి దూరమయ్యాయి. మరోవైపు మెడి క్లెయిమ్ కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి సామాన్యుని పాకెట్టుని ఖాళీ చేశాయి. ఇలాంటి సందర్భంలో అక్కడక్కడా ప్రభుత్వ ఆసుపత్రులు ఉండబట్టే, కరోనా సమయంలో బతికిపోయాం. ప్రైవేటు వైద్యసేవలు మహమ్మారుల సమయంలో సామాజిక బాధ్యతల్ని నెరవేర్చలేవని కరోనా నేపథ్యంలో అర్థం అయింది. మార్కెట్ అంతా చూసుకుంటుందని నేర్పిన ఉదారవాదం నీతులు బూటకమని రుజువయింది. క్యూబా లాంటి అతి చిన్న సోషలిస్టు దేశాలు కరోనా విపత్తుని ఎలా ఎదుర్కున్నాయో, ఎంత విజయవంతమయ్యాయో, అమెరికాలాంటి అతి పెద్ద 'అభివృద్ధి చెందిన దేశం' కరోనా మహమ్మారిని ఎదుర్కోవడంలో ఎలా విఫలమయింది మనకు అర్థం అయింది. కరోనా అందించిన గుణపాఠాల్లో, సమస్త ప్రపంచానికి నయా ఉదారవాద, స్వేచ్ఛా వాణిజ్యం, ప్రపంచీకరణ అవసరమో, క్యూబా లాంటి సోషలిస్టు దేశాలు అవసరమో అనుభవంతో ప్రజలు తెలుసుకుంటున్నారు. ప్రభుత్వాల బాధ్యతలను పక్కకితోసి అంతా ప్రపంచీకరణ చూసు కుంటుందనే తప్పుడు సిద్ధాంతాలు ఎంతగా ప్రమాదకరమో తెలుస్తోంది. కార్ల్ మార్క్స్ సిద్ధాంతాలు కాలం చెల్లినవనీ, వీరు బయటి వారనీ, సోషలిజం ఒక ఊహా స్వర్గమనీ నమ్మించిన పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక చిన్న వైరస్‌తో పడే కష్టాలు చూస్తోంటే, ఏ ఆలోచనలు కాలం చెల్లినవో, ఏ ఆదర్శాలు మానవ మనుగడకు అవసరమో ప్రజలు కాలక్రమంలో తెలుసుకుంటారు. ముఖ్యంగా, ఆహారం, విద్య, వైద్యం ప్రపంచీకరణ గాలులకు కొట్టుకు పోకుండా జాగ్రత్తపడాలని ప్రజలు తెలుసుకుంటారు. మన పోరాటం కరోనాతో మాత్రమే కాదనీ, కరోనాకి అనుబంధంగా ఉన్న వ్యవస్థ అన్ని పార్శ్వాలతో అనీ ప్రజలు తెలుసుకుంటారు. ఎంతవరకు తెలుసుకోరో, అంతవరకు ఇలాంటి మహమ్మారుల నుండి, మానవాళికి విముక్తి లేదు. కరోనా మహమ్మారి నేపథ్యంలో ప్రజలకు అవసరమైన సోషలిస్టు విలువల కోసం వర్గ దృక్పథంతో ముందుకు నడవాల్సిన అవసరం ఉంది.... మరింత వేగంగానూ, మరింత బాధ్యతతోనూ.

(రచయిత అధ్యాపకులు) వీ

కరోనా కాలంలో హక్కుల హననం

దేశ ప్రజలందరూ కరోనా వైరస్ కారణంగా భయాందోళనలకు లోనవుతున్న కాలంలో భరోసా కల్పించాల్సిన పాలకులు ప్రజల పక్షాన గొంతు విప్పిన మేధావుల అరెస్టులకు పాల్పడుతున్నారని అంటున్నారు **రాజేంద్రబాబు ఆర్విణి**

సమాజంలోని ఇతర వర్గాలను అణిచివేయడానికి పాలకవర్గాల చేతుల్లో ఉండే ఒక పరికరమే రాజ్యవ్యవస్థ అన్నాడు మార్క్స్.

ఆశ్చర్యకరమయిన విషయమేమిటంటే దేశమంతా కరోనా కల్లోల కాలంలో తలమునకలై ప్రజాజీవితం స్తంభించిపోయిన ఈ స్థితిలో కూడా రాజ్యం తన వ్యతిరేక వర్గాలను అణిచివేయడంలో తన పాత్రను ఏ మాత్రం ఏమరుపాటు లేకుండా కొనసాగిస్తూనే ఉంది. ఏప్రిల్ మొదటి వారంలో వార్తా పత్రికలలో వచ్చిన ఒక వార్త నాలో ఆసక్తిని రేకెత్తించింది. మల్కన్‌గిరి– కోరాపుట్– విశాఖ సరిహద్దుకు చెందిన ఒక విప్లవపార్టీ కార్యదర్శి కైలాసం పేరుతో వచ్చిన ఆ పత్రికా ప్రకటనలో ప్రపంచాన్ని కుదిపివేస్తున్న మహమ్మారి కరోనా నేపథ్యంలో ఆ పార్టీవారు ప్రభుత్వంతో తాత్కాలికంగా కొద్ది రోజులపాటు యుద్ధ విరమణ ప్రతిపాదించారు.

కరోనా విపత్తు ముగిసేవరకు ప్రభుత్వ రక్షణ దళాలపై ఎలాంటి దాడులు చేయబోమని, ఈ కాల్పుల విరమణ పిలుపుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వైరస్ భయంకరంగా వ్యాప్తి చెందుతున్న ఈ సమయంలో ఆరోగ్య సేవా కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, వైద్యులు ఆదివాసీలకు అందుబాటులో ఉండాలంటే కొంతకాలం పాటు తాము తుపాకులు ప్రయోగించకుండా ఉండడమే సరైనదని వారు భావించి ఉండవచ్చు. ఈ కాల్పుల విరమణ ప్రతిపాదనను ప్రభుత్వము, పోలీసులు ఎంత తీవ్రంగా తీసుకున్నారో తెలియదుగాని, ఏప్రిల్ నెల మూడో వారంలో ఒకచోట, మే 2న మరోచోట ఎంకౌంటర్లు జరిగాయి. వాటిల్లో విప్లవకారులు మరణించారు. ఒకపక్క జైళ్లు కిక్కిరిసిపోయాయని, సోషల్ డిస్టెంసింగ్ పాటించే పరిస్థితులు జైళ్లల్లో లేని కారణంగా కరోనా వ్యాధి వ్యాప్తి నిరోధక చర్యగా రిమాండ్లో ఉన్న ఖైదీలను, శిక్షపడిన ఖైదీలను కూడా కొన్ని షరతులపై విడుదల చెయ్యాలని సుప్రీంకోర్టు సూచనలిచ్చినప్పటికీ, వాటికి విరుద్ధంగా పాలకవర్గాల ప్రజా వ్యతిరేక చర్యలను అభిశంసిస్తూ తమ ఆలోచనలను పంచుతున్న ప్రొఫెసర్ ఆనంద్ తేల్తుంబ్డేను, మేధావి గౌతమ్ నవ్లాఖాను లాక్‌డౌన్ కాలంలోనే అరెస్ట్ చేసిందీ రాజ్యవ్యవస్థ.

ప్రభుత్వంచే నిషేధించబడ్డ సంస్థల విషయంలోనే కాదు, ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయపార్టీ భావజాలాన్ని వ్యతిరేకిస్తున్న వారిని కూడా సహించే ఓపిక ప్రభుత్వానికి లేదు. ఆ భావజాలం ప్రభావంలో పడి కొట్టుకుపోతున్న వ్యక్తులలోను లేదు. ప్రశాంత్ భూషణ్ పేరు మనదేశంలో పత్రికలు చదివే ప్రతివారికి పరిచయం ఉంటుంది. ప్రసిద్ధి పొందిన సుప్రీంకోర్టు లాయరు. పౌరహక్కుల పరిరక్షణకై తనదైనశైలిలో ఉద్యమంలో పాలుపంచుకుంటున్న వ్యక్తి. చట్టాన్ని తప్పుగా అన్వయిస్తే సుప్రీంకోర్టు జడ్జినైనా బెంచ్ ముందే ఖండితంగా విమర్శించే లాయర్‌గా పేరున్న వ్యక్తి. ఈ మధ్య దూరదర్శన్ వారు ముప్పయ్యేళ్ల క్రితం రామానంద సాగర్, బిఆర్ చోప్రాలు నిర్మించిన రామాయణ్, మహాభారత్ టి.వి. సీరియళ్లను తిరిగి ప్రసారం చేస్తున్నారు. ఈ లాక్‌డౌన్ సమయంలో రామాయణం, మహాభారతం టివిలో చూస్తూ ఆనందిస్తున్నాను అని ఒక కేంద్రమంత్రి ట్విట్టర్‌లో మెసెజ్ పెడితే అది నచ్చని ప్రశాంత్ భూషణ్, కోట్లాది మంది వలస కార్మికులు వందలాదిగా మైళ్లు ఎండలో నడుస్తూ అన్నము నీళ్లు లేక అలమటిస్తుంటే నీవెట్లా టివిని చూస్తూ ఆనందంగా ఉన్నావని మంత్రిని విమర్శిస్తూ, ఇలాంటి సీరియళ్ల ద్వారా నల్లమందు లాంటి భావజాలాన్ని ప్రజల మెదళ్లలోకి ఎక్కించే ప్రయత్నం చేస్తున్నారు అని కూడా తన అభిప్రాయం వ్యక్తపరిచారు.

గతంలో సైన్యంలో పనిచేసి రిటైర్ అయిన రజనీకాంత్ జోషి అన్న పెద్దమనిషి ఒకాయన ప్రశాంత్ భూషణ్ చాలా మంది హిందువుల మనోభావాలు దెబ్బతీశాడు అని పోలీసులకు ఫిర్యాదు చేసాడు. దీంతో విభిన్న అభిప్రాయాన్ని సహించే స్థితిలోలేని పోలీస్ వ్యవస్థ గుజరాత్ లోని రాజ్‌కోట్ పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. ఆ వెంటనే అరెస్టుకూ సిద్ధపడితే తాత్కాలికంగా అరెస్టును వాయిదా వేసింది సుప్రీంకోర్టు.

పరివర్తన కమి ఛాత్ర సంఘటన అన్న పేరుతో ఉత్తరాఖండ్‌లో ఒక విద్యార్థి సంస్థ ఉంది. లాక్‌డౌన్ సమయంలో పేదలందరికీ ఆహారం ఉచితంగా సరఫరా చెయ్యాలి అన్నది ఆ సంస్థ డిమాండ్. ఆ విషయాన్ని బలంగా ప్రభుత్వం ముందుంచడం కోసం సభ్యులందరు ఇళ్ల వద్దనే ఒకరోజు నిరాహార దీక్ష చెయ్యండని అ సంస్థ పిలునిచ్చింది. చాలామంది విద్యార్థులు తమ ఇళ్ల దగ్గరే ఉండి ఉదయం నుండి సాయంత్రం వరకు నిరాహారదీక్ష చేపట్టారు. సంస్థ కార్యకలాపాలలో ఎప్పుడూ చురుకుగా ఉండే నైనిటాల్ జిల్లా లాలకువాన్ పట్టణ యూనిట్ కార్యదర్శి మహేష్ తన దీక్షను విజయవంతంగా పూర్తిచేసుకొని దాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేసాడు. ఆ మర్నాడే పోలీసులు మహేష్ పై ఐపిసి సెక్షన్లు 188, 269, 278 , విపత్తు నిర్వహణా చట్టం –2005 లోని సెక్షన్ 51 కింద ప్రభుత్వ చర్యలకు అవరోధాలు కల్పించే ప్రయత్నం చేసాడని, ప్రాణాంతక వ్యాధి వ్యాప్తి చెందడానికి ఆయన చేపట్టిన కార్యక్రమాలు దోహద పడే ప్రమాదం ఉందని అభియోగాలు మోపి అరెస్ట్ చేశారు.

ఢిల్లీలోని ప్రతిష్ఠాత్మక జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీలో పిహెచ్‌డి విద్యార్థి షర్జీల్ ఇమామ్. సెంటర్ హిస్టారికల్ స్టడీస్‌లో పరిశోధన చేస్తున్నాడు. కరోనా కల్లోల సమయంలోనే ఆయనను అరెస్ట్ చేశారు

పోలీసులు. జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలంలో, అలీఘడ్ యూనివర్సిటీలో పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆవేశపూరిత ఉపన్యాసాలిచ్చి విద్యార్థులను ఉత్తేజ పరిచాడని ఆయనపై అభియోగం మోపి ఉపా చట్టం కింద నిర్బంధించారు. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, అస్సాం, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్‌లో ఆయనపై కేసులు నమోదయ్యాయి. అవన్నీ కలిపి ఒకే కేసు కింద విచారించండి అన్న అభ్యర్థనతో కోర్టును ఆశ్రయించాడు ఇమామ్. దీనికి కోర్టు చాలా నిర్లిప్తంగా స్పందిస్తూ, ఆయా పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్‌లు మాత్రమే దాఖలయ్యాయి గాని అంతకు మించి ఏమీ జరగలేదుగా. అయినా ఎఫ్ఐఆర్ దఖలు చెయ్యడంలో తప్పేమీ లేదు అని దాటవేసింది.

ఇక, జమ్మూ కశ్మీర్‌లో 'ఎంకౌంటర్'లకు, 'ఎదురుకాల్పులకు' లాక్‌డౌన్ నే లేదు. కశ్మీర్‌లో లాక్‌డౌన్ కంటే ముందు ఏ స్థాయిలో పోరాటంలో మరణాలు సంభవించాయో అదే స్థాయిలో లాక్‌డౌన్‌లో కూడా కొనసాగుతున్నాయి. మే 4 నాడు ఉత్తర కశ్మీర్‌లోని హంద్వారాలో జరిగిన ఎదురుకాల్పుల సంఘటనలో ఇద్దరు మిలిటరీ అధికారులు, ఇద్దరు సైనికులు, ఒక జమ్మూ కశ్మీర్ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ చనిపోయిన కారణంగా అది దేశవ్యాప్త చర్చకు, నిరసనలకు దారితీసింది. అంతకు ముందు కూడా దాడులు జరిగాయి.

హంద్వారా సంఘటనలో ఇద్దరు మిలిటెంట్లు కూడా చనిపోయారు. ఏప్రిల్ నెల చివరి వారంలో షోపియాన్ జిల్లాలోని జైనా పోరా ప్రాంతంలో మిలిటెంట్లకు, సైనికులకు మధ్య కాల్పులు జరిగాయి. అంతకు ముందు దక్షిణ కాశ్మీరులో జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మిలిటెంట్లను కాల్చివేసినట్టు, అదే ప్రాంతంలో దాక్కున్న మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్టు, అది ఈ నెలలో జరిగిన నాలుగవ ఎదురుకాల్పుల సంఘటన అని పోలీసులు ప్రకటించారు.

లాక్‌డౌన్‌లో కూడా హక్కుల విషయంలో రాజ్యం ప్రదర్శిస్తున్న శత్రుపూరిత వైఖరి గురించి ఆలోచిస్తూ ఉంటే, నాకింకొక విషయం దృష్టికి వచ్చింది. ముంబై నగరంలో 600 ఎకరాల స్థలంలో విస్తరించి ఉన్న ఆసియా ఖండంలోనే అతి పెద్ద మురికివాడ ధారవి. జనాభా పది లక్షల పైనే ఉంటుంది. దాదాపు అందరూ దళిత, బహుజనులు. మే 3 నాటికి 3,590 మందికి కరోనా సోకిందని తేలింది. 20 మంది మృత్యువాత పడ్డారు. ధారవితో పాటు వొర్లి, కుర్లా లాంటి ఇతర మురికివాడలు కోవిడ్– 19కు ఆలవాలమయిన ప్రాంతాలు. ఆ బస్తీలలో కూడా వైరస్ ప్రబలుతూ వుంది. "ఆప్లి ముంబై" అనే స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ అయిన సంజశిండే "మురివాడలలో ప్రభుత్వ స్పందన అత్యంత బాధాకరంగా ఉంది. అక్కడ టెస్ట్‌ల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎవరికయినా పరిస్థితి విషమించి, ప్రాంతమంతా అట్టుడికిపోతే, అప్పుడుగాని ప్రభుత్వం కళ్లు తెరుస్తుంది" అని వాపోయాడు. అతిష్కుల వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ఒక సంస్థలో పనిచేస్తున్న దళిత కార్యకర్త, ముంబై మునిసిపల్ ఆఫీసులో ఉద్యోగి కూడా. ఆయన ది వైర్ పోర్టల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో "సవర్ణ హిందువులు, పైతరగతి ప్రజలు, గేటెడ్ కమ్యూనిటీలలో నివసించే వారి పట్ల మునిసిపల్ అధికారుల స్పందన మరో విధంగా ఉంటుంది. పేద ప్రజల ప్రాణాలు విలువలేనివి అన్నట్లుగా వారు మసులుతూ ఉంటారు" అని విడమరిచి చెప్పారు. సునీత సాంస్కృతిక రంగంలో పనిచేస్తున్న ఒక దళిత యువతి. ప్రభుత్వం, వైద్య సిబ్బంది పట్టించుకోక చావుకు దగ్గరయిన ఒక కరోనా పాజిటివ్ వ్యక్తికి సపరిచర్యలు చేసి ఆమె శవానికి కూడా దహన సంస్కారాలు చేసి కరోనా బారినపడింది. ఆమెతో పాటు ఆమె కుటుంబంలో అయిదు మందికి ఆ వ్యాధి సోకింది. ప్రభుత్వం నుండి ఆసరా పొందడానికి ఆమె చెయ్యని ప్రయత్నం లేదు. చివరికి సోషల్ మీడియా ద్వారా అలజడి సృష్టిస్తే, ఆమెను ఆమె కుటుంబ సభ్యులను క్వారంటైన్ కేంద్రానికి తరలించారు. అది అత్యంత దారుణంగా, ఏమాత్రం సౌకర్యాలు లేకుండా ఉన్న క్వారంటైన్ కేంద్రం. "బైంగన్ వాడి, చీతాకాంప్, తిలక్ నగర్‌లోని ఇతర మురికివాడలలోంచి వచ్చిన వారిని మాత్రమే మహుల్లోని ఈ క్వారంటైన్ కేంద్రానికి తీసుకువస్తారు. మధ్యతరగతి వారు గాని, సమాజంలో ఉన్నత శ్రేణి ప్రజలు గాని ఒక్కరూ ఇక్కడ కనిపించరు" అని సుమిత్ అనే మరో విద్యార్థినేత ది వైర్‌కు వివరించాడు. అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లు, నీళ్ల సరఫరాలేని ఆ కేంద్రం మామూలు ఆరోగ్యవంతులకే నివాసయోగ్యం కాదు. అలాంటి స్థలంలో మురికి వాడలలోంచి వచ్చిన 100 మంది కరోనా రోగులను ఉంచారు. సుమిత్ కూడా కరోనా వ్యాధిగ్రస్తుడు. "మేమేమీ అయిదు నక్షత్రాల సౌకర్యాలను అడగడంలేదు. రోగికి అవసరమయిన కనీస మానవీయ స్థితిలో మమ్మల్ని ఉంచమని కోరుతున్నాం. ధనవంతులకు, ఉన్నత కులాల వారికి మాత్రమే ఈ వసతులు అందుబాటులో ఉంటాయనడం ఏం న్యాయం" అని అంటాడు సుమిత్.

విద్యార్థి నాయకులు, దళిత బహుజన కార్యకర్తలు, హక్కుల నేతలు దేశ ప్రజలనందరినీ ఒక ప్రశ్నకు సమాధానం చెప్పమని అడుగుతున్నారు. కరోనా జబ్బుకు అందరూ సమానమే, కరోనాకు వివక్షలేదు, ధనిక పేదా అందరూ ఒకటే అని పాలకులు అంటున్న మాటలలో వాస్తవముందా? కరోనా ఎవరికైనా రావచ్చు, కానీ కరోనా నుండి మెరుగైన చికిత్సకు, కరోనా బారి నుండి కాపాడబడడానికి కొందరికే అవకాశాలు ఎక్కువ అనడంలో వాస్తవంలేదా? కరోనా వల్ల ప్రపంచం మొత్తంలో ఎక్కువ సంఖ్యలో చనిపోతున్నది అగ్రరాజ్యంగా చలామణి అవుతున్న అమెరికాలోనన్నది ఇప్పుడు బహిరంగ వాస్తవం. కానీ, ఈ అమెరికాలో ఈ వ్యాధి వల్ల చనిపోతున్నది అధికంగా తక్కువ ఆదాయ వర్గాలయిన ఆఫ్రికన్ అమెరికన్లు (నల్లజాతి ప్రజలు), ఇస్పానిక్స్ (బతుకుతెరువు కోసం మెక్సికో నుండి వలస వచ్చి కాయకష్టం చేసుకుంటూ అమెరికాలో రెండవశ్రేణి పౌరులుగా బతుకులీడుస్తున్న పౌరులు). ప్రపంచంలో ధనిక, పేద అంతరాలున్న ప్రతి దేశంలో ఇదే పరిస్థితి. ఇంగ్లాండ్‌లోను ఇదే కథ, ప్రధాన మంత్రికి, రాజకుమారునికి కరోనా సోకి ఉండవచ్చు కానీ చనిపోయిన వారిలో అధిక సంఖ్యాకులు అల్పాదాయ వర్గాల వారే!

మన దేశంలో కరోనా వల్ల అత్యంత పీడన అనుభవించిన వారు వలస కార్మికులు. రాజ్యాంగం హామీ పడ్డ జీవించే హక్కు కోసం వాళ్లెన్ని యాతనలు పడ్డారు! భద్రజీవులు ఆరోగ్య రక్షణ కోసం రోజూ అయిదు కిలో మీటర్లు మార్నింగ్ వాక్ రూపంలో నడిచి ఆనందాన్ని, మానసిక తృప్తి పొందుతూ ఉంటే ఈ దేశంలో పొట్ట చేత పట్టుకొని, భార్యా పిల్లలను ముసలి తల్లితండ్రులను విడిచి దేశంగాని దేశంలో ఒంటరి బతుకు బతుకుతూ దేశమంతా లాక్‌డౌన్ అయితే అయినవాళ్ల కోసం మనసంతా చెదిరిపోయి వందల మైళ్ల దూరమయినా ఎర్రటి ఎండలో నడిచి పోయేందుకు సిద్ధమయిన వలస కార్మికులు ఈ దేశంలో కోటాను కోట్ల మంది కాళ్లు వాచిపోయి తమ స్వస్థలాలకు పయనం సాగించారు. అంతా అయిపోయింతర్వాత ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చెయ్యడానికి ముందుకు వచ్చింది కానీ, నెల రోజులపైగా మండుతున్న

లాక్‌డౌన్‌తో నలిగిన వలస జీవులు...

లాక్‌డౌన్ నిర్ణయంతో వలస కూలీలు తమ ఊళ్లకు ప్రయాణ సౌకర్యాలు లేక కాలినడక ప్రయాణంలో పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వాలకు లక్ష్యాలే తప్ప ప్రజల ఇబ్బందులు పట్టవనే విషయానికి అద్దంపడుతున్నాయని అంటున్నారు అభిజ్ఞ.

సంపూర్ణ జీవి కాకుండా, నిర్జీవి కాకుండా అర్ధ జీవిగా కంటికి కనిపించని వైరస్ ప్రపంచ మహా విపత్తును, విధ్వంసాన్ని సృష్టిస్తున్నది. ప్రపంచ చరిత్రలో వైరస్‌లు కొత్తేమీ కాదు అవి సృష్టించిన విలయాలు తక్కువేం కాదు. గత శతాబ్దంలోనే స్పానిష్ ఫ్లూ బారినపడి ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది మృత్యువాత పడ్డారు. గతం నుండి ప్రపంచం నేర్చుకున్నది ఎక్కువే అయినా ఆచరించినది మాత్రం తక్కువే. వైరస్‌లు విజృంభించి మానవాళి మనుగడను ప్రమాదంలో పడేసినప్పుడల్లా ఆయా ప్రభుత్వాలు చేసే హడావుడి అంతా ఇంతా కాదు. అంతా సద్దుమణిగాక తమకు తాము జబ్బలు చరుచుకుని నిద్రలోకి జారుకుంటాయి. మొదటి ప్రపంచ యుద్ధానంతరం చెలరేగిన స్పానిష్ ఫ్లూ ఆనాటి జనాభాలో మూడోవంతుకు పైగా ప్రజల ప్రాణాలను హరించింది. సరిగ్గా శతాబ్దానంతరం ప్రపంచ రంగస్థలంపై విలయతాండవం చేస్తున్నది కరోనా వైరస్. చైనాలోని వూహాన్‌లో బయలుదేరి ఇప్పటికే భూమండలమంతా కలియ తిరుగుతున్నది. దీని మూలంగా వచ్చే అనారోగ్యానికి కోవిడ్-19గా నామకరణం చేశారు. అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ దీనిని 'మహమ్మారి'గా ప్రకటించింది.

అభివృద్ధి చెందిన అగ్రదేశాలుగా ప్రపంచ ఆధిపత్యం చేసే దేశాలు కరోనా కల్లోలంలో విలవిలలాడి పోతున్నాయి. నాగరికతకు మేమే ఉయ్యాల అనుకునే యూరప్ దేశాలన్నీ చిగురుటాకులా వణికి పోతున్నాయి. ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారు. ఇవాళ ఏ దేశమూ, ఏ మారుమూల ప్రాంతమూ, కరోనా కాలు పెట్టకుండా అడ్డుగోడలు కట్టుకునే పరిస్థితి లేనే లేదు. దానికి భారతదేశమూ మినహాయింపు కాదు. చైనాతో సుదీర్ఘ సరిహద్దును కలిగి ఉన్న ఇండియా మరింత జాగ్రత్తగా, సన్నద్ధంగా ఉండాల్సి వచ్చింది. మన దేశానికి రానేరాదు అనుకున్నది రానే వచ్చింది. జనవరి 30న మొదటి కరోనా కేసు నమోదైతే మార్చి 13న తొలి మరణం నమోదయింది. ఈలోగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎదురయ్యే ముప్పును ముందే అడ్డుకోవాలని విమాన ప్రయాణికులను పరీక్షించడం, ప్రజలకు జాగ్రత్తలు చెప్పడం మొదలు

ఎండల్లో దేశవ్యాప్తంగా రోడ్లన్నీ వలస కార్మికుల వ్యదార్థ కథలే వినిపించాయి. ఎక్కడబడితే అక్కడ వాళ్లను పోలీసులు ఆపేవారు. లాఠీలు ఝళిపించేవారు. ఆకలి బాధ ఒకవైపు, నిప్పులు కురిపిస్తున్న సూర్యుడొకవైపు. పురుషుడు సూట్కేస్ మోస్తూ ఉంటే చంకలో పిల్లల్ని మోస్తూ మహిళ. పైనుంచి పోలీసుల అదిలింపు. రోడ్ల మీద దేశవ్యాప్తంగా ఇవే దృశ్యాలు పునరావృతమయ్యేవి.

ఒకపన్నెండేళ్ల బాలిక ప్రాణాలు కోల్పోతేగాని సమస్య తీవ్రత ప్రభుత్వానికీ, పోలీసులకు అర్థం కాలేదు. ఆ బాలిక పేరు జమ్లో మడ్కమ్.

జమ్లో మడ్కం సొంత ఊరు ఛత్తీస్‌గడ్‌లోని బీజాపూర్. ఏదైనా పనిలో కుదిరితేగాని తన కుటుంబం గడవదు. తెలంగాణకు పనికోసం వలస వచ్చిన కూలీలతో పాటు తానూ వచ్చి కన్నాయిగూడంలో పనికి కుదిరింది. అక్కడ మిర్చితోటలో పని. మిర్చితోటలో పని అయిపోయిన తర్వాత మరోచోట పని వెతుక్కుందామని ప్రయత్నం. ఆ లోపల లాక్‌డౌన్ ప్రకటించేశారు. కాలం గడుస్తూ ఉంది. పనిలేదు. మిగుల్చుకున్న డబ్బు అయిపోయింది. చేసేదేమీలేక, అక్కడ ఉండడమూ కుదరక ఏప్రిల్ 15న తన ఊరు బయల్దేరింది. బస్సులు లేవు, రైళ్లు లేవు. 250 కిలోమీటర్ల దూరం. మరో మార్గంలేక కాలినడకన తోటి కూలీలతో కలిసి తన ఊరు చేరుకుందామన్న తాపత్రయంతో నడక ప్రారంభించింది. తినడానికి తిండి దొరకలేదు. తాగడానికి నీళ్లు దొరకలేదు. బొబ్బలెక్కినకాళ్లు. మధ్యలోనే మృత్యువాత పడింది. ఏప్రిల్ 18న డీహైడ్రేషన్‌తో చనిపోయింది. వెలుతురు చూడని ఇలాంటి కథేలెన్నో.

కరోనా కల్లోల సమయంలో గౌరవ ప్రదంగా జీవనం గడిపే ప్రాథమిక హక్కుకు సంబంధించి గాయపడ్డ సమూహం ఇంకొకటి దేశంలో ఉంది. వారు ముస్లిం మత వర్గీయులు. ఢిల్లీలో జరిగిన ఒక మత సమావేశానికి హాజరయిన విదేశీ ముస్లింలు, భారతీయ ముస్లింలు కరోనా వ్యాధిని దేశమంతా వ్యాపింప జేశారని అపప్రథను వారు మూటగట్టుకున్నారు. కరోనా మహమ్మారి గురించి తెలియక వారు మత సమావేశం నిర్వహించి ఉండవచ్చు. కానీ, దానిని గురించి అప్పటికే వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నుండి హెచ్చరికలు అందుకున్న కేంద్ర ప్రభుత్వం సమావేశానికి అవసరమయిన అనుమతులు ఎలా జారీచేసింది?

కరోనా వ్యాప్తిలో ముప్పయి శాతం మేరకు మర్కజ్‌లో జరిగిన సభల ద్వారా (అదీ అనాలోచితంగానే) జరిగి ఉండవచ్చునని ప్రభుత్వ గణాంకాలే చెపుతున్నాయి. మరి మిగతా 70 శాతానికి బాధ్యులెవరు? తమకు తెలిసి జరగకపోయినా, కరోనా వ్యాధి నుండి కోలుకున్న ముస్లింలందరికి తమ రక్తంలోని ప్లాస్మాను ప్రభుత్వ ఆసుపత్రులకు వితరణ చెయ్యమని మర్కజ్ మత పెద్ద మౌలానాసాద్ విజ్ఞప్తి చేసాడు. అయినా కేంద్రమంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ వారిని 'కరోనా విలన్లు' అని తీవ్ర పదజాలంతో దూషించాడు. కేంద్రమంత్రి దూషణ తర్వాతే మర్కజ్ మత పెద్దల మీద పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్‌లు మొదలయ్యాయి.

ఈరకంగా లాక్‌డౌన్ సమయంలో కూడా లోపాలతో కూడిన వ్యవస్థను వ్యతిరేకిస్తున్నవారు, పేద ప్రజానీకం, దళితులు, వలస కార్మికులు, ముస్లింలు, ఇతర బలహీన సమూహాలు వివక్షకు గురవుతూనే ఉన్నారు.

(రచయిత జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్) వీ

పెట్టాయి. అప్పటికే దేశంలోకి వచ్చిన ఇతర దేశాల్లో ఉన్న భారతీయుల నుండి, తబ్లిగీ సదస్సు కోసం వచ్చిన విదేశీయుల నుండి దేశంలోని అన్ని ప్రాంతాలకు కరోనా విస్తరించింది. ఈ వైరస్ విస్తరణ అంతా దావానంలా ఉన్నది.

ఈ విపత్తును ఎదుర్కొనే ప్రణాళికలో సన్నాహక కార్యక్రమంగా మార్చి 22న జనతా కర్ఫ్యూ పేరుతో ఒక రోజంతా 'స్వచ్ఛంద' బంద్ నిర్వహించాక మార్చి 24 నుండి దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ కొనసాగుతున్నది. విదేశీయానం, స్వదేశీ ప్రయాణాలు, రవాణా వ్యవస్థ, కంపెనీలు కార్ఖానాలు, సమస్తం స్తంభించిపోయినవి. మన ప్రధాని ఏ పెద్ద నిర్ణయం తీసుకున్న ఒకింత నాటకీయతను ప్రదర్శించడం అలవాటు చేసుకున్నాడు. దేశంలోని సమస్త జీవన రంగాలను ప్రభావితం చేసే నిర్ణయం అయినా సరే చుక్క తెగిపడ్డట్టు ప్రకటించేస్తుంటాడు. పెద్ద నోట్ల రద్దు వ్యవహారంలో కూడా ఇదే నాటకీయ ధోరణి కనబరిచాడు. పర్యవసానాలతో నిమిత్తం లేకుండా 'లక్ష్యా'లనే పదేపదే చెబుతూ నిర్ణయాలు తీసుకోవడం ఎక్కువైపోయింది. నిజమే ఆరోగ్య అత్యవసర పరిస్థితి, మనుషుల మనుగడకే ముప్పు ముంచుకొస్తుంటే సమాలోచనలతో సమయాన్ని వృథా చేయడం ఉచితమైనది కాదు కదా ఎవరికైనా! అందునా మోడీ ఏ నిర్ణయం తీసుకున్నా కాదనే స్థితిలో ఆయన పార్టీ నేతలు ఉండరు. ప్రతిపక్షాలంటారా వాళ్ల మాటలు ఆయనకు చెవి మీద పేను బారినంత కూడా కాదు.

దేశ ప్రజల ఆరోగ్య రీత్యా ఈ నిర్ణయం అనివార్యం, ఆహ్వానించ దగినదే! కరోనాను కట్టడి చేయాలన్నా, ముట్టడి చేసి తుదముట్టించాలన్నా దేశ ప్రజలందరూ అనేక తాత్కాలిక త్యాగాలకు సిద్ధం కావాల్సిందే! అప్పటికే ప్రజల మానసికావరణలోకి దేశవ్యాప్తంగా తాళం అనివార్యం అనే భావన బలంగా వచ్చి చేరింది. ఈ స్థితి రెండు మూడు రోజులు ఉన్నదో లేదో దేశంలోని ప్రధాన నగరాలు, పట్టణాలతో సహా అన్ని ప్రాంతాల నుండి పుట్ట పగిలి చీమల బారులు కదిలినట్టు లక్షలాది వలస కార్మికులు రోడ్లను ముంచెత్తారు. నెత్తిన మూటలు, చంకన పిల్లలతో రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు చేరుకొని స్వస్థలాలకు వెళ్లే మార్గం లేదనుకొని కాలినడకన సుదీర్ఘ యాత్రకు బయలుదేరినట్టు మొదలయ్యారు. పని చేసిన చోట ఉండలేక, చేసిన పనికి పూర్తిగా పైకము పొందక అసలు ఏ వైపు వెళితే తాము పుట్టి పెరిగిన నేలను చేరుకుంటామో కూడా తెలియకుండానే జాతీయ రహదారుల వెంట నిండి పోవడంతో వాహనాలతో నిండే ఆ దారులన్నీ సుదీర్ఘ జన ప్రవాహాన్ని తలపిస్తున్నాయి. నెత్తి మీద సూర్యుని భగభగలు, ఖాళీ కడుపులు ఇంటికి చేరుకోవాలనే తపన, పశువులను తరిమినట్టు తరుముతున్న పోలీసులు దారంతా వారిని ఉక్కిరి బిక్కిరి చేశాయి. తాగడానికి నీరు లేక, ఉండటానికి నీడ లేక, కడుపు నింపుకునే దిక్కులేక దారులెంటా కన్నీరు కారుస్తూనే వారి జీవితంలోకి వస్తున్న భయంకర అనుభవాలను దాటుకుంటూ బహుదూరపు బాటసారులుగా సాగుతున్నారు.

పక్కా ప్రణాళిక, ముందుచూపు లేకుండా నాటకీయ ఫక్కీలో ఒక పెద్ద నిర్ణయం తీసుకుంటే ఎలా ఉంటుందో పెద్ద నోట్ల రద్దు నిర్ణయం తర్వాత, కరోనా కట్టడికి తీసుకున్న దేశవ్యాప్త లాక్‌డౌన్ నిర్ణయమే పరాకాష్ట. నోట్ల రద్దు నిర్ణయంతో రోడ్డు మీద పడిన జీవితాలే నేడు మళ్లీ రోడ్డున పడ్డాయి. మొదటి నిర్ణయం వల్ల తలెత్తిన పర్యవసానాలను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయాలైనా కనిపించాయి గాని కదలకుండా కట్టిపడేసే లాక్‌డౌన్ వలస జీవుల్నీ భగ్గున మండే వేసవిలో ఆకలి చావుల అంచుల వరకు నెట్టివేసింది. మొత్తం దేశ ఆర్థిక వ్యవస్థలో అసంఘటిత రంగ భాగస్వామ్యం 80 శాతానికి పైగానే ఉంది. ఈ రంగం కిందికే వచ్చే వలస కార్మికులు దేశంలో 15 కోట్లకు పైగానే ఉంటారనేది ఒక అంచనా. అసలు ప్రభుత్వాల దగ్గర దేశంలో ఏ రాష్ట్రాల నుండి ఏ రాష్ట్రాలకు, ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి ఏయే రంగాల్లో పని చేయడానికి ఎంత మంది వెళ్తున్నారో నిర్దిష్ట లెక్కలు ఏవి లేవు. బహుశా వారిని లెక్కలకు రాని మనుషులు అనుకుంటున్నదేమో ప్రభుత్వం.

ప్రధానంగా భారతీయ గ్రామీణ ప్రాంతాల నుండి సీజనల్ పనుల వారీగా ఆయా ప్రాంతాల్లో లభ్యమయ్యే తాత్కాలిక ఉపాధి మీద ఆధారపడి వీరంతా బతుకుదెరువు కోసం వలస వెళుతూ ఉంటారు. ఒక రాష్ట్రం, ప్రాంతం అంటూ పరిమితం కాకుండా దేశమంతటా వలస కూలీల దృశ్యాలు విరివిగా కనిపిస్తుంటాయి. గ్రామీణ వ్యవసాయ రంగం కుదేలవడం, వ్యవసాయ ఆదాయంతో కుటుంబ అవసరాలు తీరక పోవడంతో వలస వారికి అనివార్యమైంది. ఎక్కడ పని లభిస్తే అక్కడ తాత్కాలిక నివాసాన్ని ఏర్పాటు చేసుకోవడం, ఏ ప్రమాణాలకు పొందని దుర్భర జీవితం గడపడం సర్వసాధారణమైంది. తమ భాష గాని రాష్ట్రంలో, స్థానిక బలం లేని చోట విశ్వాసాన్ని, ధైర్యాన్ని కోల్పోయి అన్ని రకాల దోపిడికి, వివక్షలకు గురవుతున్నారు. ఇలాంటి దయనీయమైన బతుకులు వెళ్లదీస్తున్న ఈ బక్క జీవుల పైన లాక్‌డౌన్ ఒక్కసారిగా విరుచుకు పడి చెట్టుకొకరు పుట్టకొకరు అయ్యేలా చేసింది. ఇలాంటివారు కోట్లల్లో ఉన్నారని, వారికి స్థిరనివాసం, ఆదాయం ఉండదని వారి బతుకులు ఈ లాక్‌డౌన్ నిర్ణయంతో పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్టు అవుతాయని పాలకులకు తెలియదా? సంపదలు పోగేసుకోవడానికి విదేశాలకు వెళ్లిన వారిని ఆగమేఘాల మీద ప్రత్యేక విమానాలు నడిపి స్వదేశం తరలించడం, కోటా లాంటి ప్రాంతంలో చిక్కుకుపోయిన స్వదేశీ విద్యార్థులను దేశంలోకి వారి వారి ప్రాంతాలకు భద్రంగా సాగనంపడం, అనేక యాత్ర స్థలాల్లో ఇరుక్కొని పోయిన వారిని కూడా ప్రత్యేక చర్యలు చేపట్టి మరీ వారివారి ఇళ్లకు చేర్చారు. వారి పట్ల అంత చిత్తశుద్ధిని ప్రదర్శించిన పాలకులకు, నాయక గణానికి ఈ బడుగు జీవులు ఎందుకు కనిపించలేదో? పోనీ పనిచేసే చోటనే భద్రంగా ఉండేలా కనీస ఏర్పాట్లన్నా చేశారా అంటే ఆర్భాటపు ప్రకటనలే తప్ప చేసింది శూన్యం. కార్మికులందరూ కాలినడకన ఇంటి బాట పట్టాక ఏదో చేస్తాం ఆదుకుంటాం అనే లోపే పరిస్థితి చేయి దాటిపోయింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో స్వస్థలాలకు వెళుతున్న కార్మికులపై క్రిమిసంహారక మందుల పేరుతో సామూహికంగా రసాయనాలను పిచికారి చేశారు. ఎక్కడి వాళ్లను అక్కడే కట్టడి చేసి రోడ్డు పక్కన, ఏ సదుపాయాలు లేని చోట షెల్టర్ల పేరుతో బంధించి వేశారు. వారు తినలేని ఆహారం, ఉండలేని వాతావరణం, భౌతిక దాడుల మధ్య నలిగి పోవలసి వచ్చింది. బస్సు వద్దు, రైలు వద్దు ఇడిసి పెడితే నడసి పోతాం అని బతిమిలాడినా కూడా ఎర్రటి ఎండలో వారిని మాడ్చిందే గాని తగు రక్షణ చర్యలతో కన్న ఊరికి చేర్చే మార్గాలేమి ఆలోచించలేదు ప్రభుత్వం. గుంపులుగా మండే ఎండలో నడిచి నడిచి అరికాళ్లు చిట్లిపోయి నడవలేక సొమ్మసిల్లి, అనారోగ్యం పాలై ఆకస్మికంగా మృత్యువు పాలైన వారి లెక్కలు కూడా లేవు. తరుముకొస్తోందన్న కరోనా కంటే కడుపుల్నీ దహించి వేసే ఆకలే వారి ప్రాణాలను ఎక్కువగా బలిగొన్నది. దాతలో, దయదలచినవారో దారిన నాలుగు మెతుకులు పెడితే కడుపు నింపుకోవడమే గాని

కొనుక్కోవడానికి బ్రెడ్డు ముక్కలు గాని, కావాల్సిన ఆహారం కొనే కాసులు గానీ జేబులో లేవు. కేంద్రం ప్రకటించిన 5 కిలోల బియ్యం, 500 రూపాయలు వీళ్లకు అందడం అసాధ్యం. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని వీరికి చాలినంత ఆహారం, రక్షిత మంచి నీళ్లు, సానిటైజర్లను అందించాలని ఆదేశిస్తే అనేక ప్రాంతాల్లో ఉదయం 5 గంటల నుండి 12 గంటల వరకు మాత్రమే నీటి సదుపాయాన్ని కల్పించారు. ఉన్నచోటకే ఆహారం సకాలంలో అందక పిల్లలు, అనారోగ్య పీడితులు తల్లడిల్లి పోయారు. ఏ వీధిలోనో, సందుల్లోనూ పెట్టే ఆహారం కోసం బయటకు వెళితే పోలీసుల లాఠీలు ఆకలి పేగుల్ని తరిమి వేస్తున్న దృశ్యాలు అనేకం ఉన్నాయి. పోనీ ఎలాగోలా భౌతిక దూరం పాటించి లైన్లలో గంటల తరబడి నిలబడ్డ అందరికీ ఆహారం అందుతున్న గ్యారెంటీ ఏమీ లేదు. కరోనాతో చచ్చిపోతామనే భయం కంటే ఆకలితో చచ్చిపోతామనే అనే భయమే వాళ్లలో ఆవరించింది. వీరికి ఇంటి మీద బెంగ, ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులకు తమ వాళ్లు ఏమైపోయారోననే దిగులు కలిపి వారి కుటుంబాలను అతలాకుతలం చేస్తున్నాయి. ఇలా రోడ్డు మార్గాన వెళ్తూ నానా బాధలు పడుతున్న వారే గాక సముద్రంలో చేపల వేటకు వెళ్లిన వాళ్లు కూడా తమది కాని రాష్ట్రంలో ఇరుక్కుపోయి నానా యాతన అనుభవిస్తున్నారు. అలా గుజరాత్‌లో ఇరుక్కొని పోయిన ఆంధ్రప్రదేశ్ మత్స్య కార్మికులు ప్రాణాలకు తెగించి సముద్ర మార్గం ద్వారా స్వస్థలాలకు చేరుకుంటే లాక్‌డౌన్ నిబంధనలను ఉల్లంఘించారని క్రిమినల్ కేసులు బనాయించారు. ఏప్రిల్ 14న ముంబైలోని బాంద్రా రైల్వే స్టేషన్ నుండి రైళ్లు నడుస్తున్నాయి అన్న తప్పుడు సమాచారంతో వేలాదిగా పోగయిన వలస కార్మికులపై పోలీసులు లాఠీలు ఝులిపించారు. గుజరాత్‌లోని సూరత్, అహ్మదాబాద్‌లలో వలస కార్మికులు స్వస్థలాలకు వెళ్లడానికి అనుమతి నిరాకరించడంతో వారి దుర్భర స్థితిని, ప్రగాఢ ఆకాంక్షను బయటి ప్రపంచానికి బలంగా చెప్పుకోవడానికి 'విధ్వం'సానికి దిగాల్సి వచ్చింది. వందలాది మంది పై కేసులు పెట్టడంతో ఉన్న చికాకులకు తోడు కొత్త చిక్కులు వారి మెడకు చుట్టుకున్నాయి. అనేక చోట్ల వారిని నిర్బంధించి వారితో చౌకగా పని చేయించుకోవచ్చు అనే వాళ్ల ప్రయత్నాలు జరుగుతున్నట్టు వార్తలు వచ్చాయి. నెల రోజులపాటు నానా యాతనను అనుభవించిన వలస కార్మికుల ఒత్తిడికి తలొగ్గిన ప్రభుత్వం ఎట్టకేలకు రైళ్లలో, బస్సులలో వారి స్వస్థలాలకు పంపడానికి అనుమతి ఇచ్చినప్పటికీ రవాణా ఖర్చులన్నీ వలస కార్మికులే భరించాలన్న నిబంధన ప్రభుత్వాల నిర్దయత్వాన్ని బట్టబయలు చేస్తున్నది. వారికి అయ్యే దారి బత్యం ఎవరు భరించాలి అన్న విషయంలో కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిని ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. ఇన్నింటిని తట్టుకొని, ప్రాణాలకు తెగించి పుట్టిన ఊర్లకు వచ్చిన కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు ఆత్మీయ స్వాగతాలు లభించక పోవడమే కాక తిరస్కార ముళ్ల కంచెలే దర్శనమిచ్చాయి. వీరంతా నగర, పట్టణ ప్రాంతాల నుండి కరోనాను మోసుకొచ్చారేమోనని ఊళ్లలోకి అడుగుపెట్టనివ్వని పరిస్థితి. కిలోమీటర్లు నడిచి వచ్చి, సొమ్మసిల్లిన వారు సొంత గూట్లో సేద దీరుదామంటే ఊరు ఊరంతా ఒక్కటై ఊరి బయటకు నెట్టివేస్తే చేండ్లలోనో, చెలకల్లోనో చెట్ల కిందనో అజ్ఞాతవాసం చేయాల్సి వస్తున్నది. పోనీ ఈ ఏకాంత వాసాల, 'అజ్ఞాత'వాసాల తదనంతర బతుకులు బాగుంటాయా అంటే అసలు పెద్ద భయమంతా అక్కడే ఉంది. జేబులో చిల్లిగవ్వ లేకుండా, చేసేందుకు పనులు లేక ప్రభుత్వాల విదిలింపు ఏ మూలకు సరిపోక భవిష్యత్తును తలుచుకుంటేనే బడుగు జీవుల బతుకుల్లో పిడుగులు పడుతున్నాయి.

స్థూల జాతీయోత్పత్తికి అతి పెద్ద దోహదకారి అయిన అసంఘటిత రంగ కార్మిక శక్తిలో భాగమై భారీ సంఖ్యలో ఉన్న వలస కార్మికులకు ఏ చట్టబద్ధమైన రక్షణలు లేవు. ఏ సామాజిక భద్రతా పతకాల ప్రయోజనాలు వర్తించవు. కనీస భద్రత కరువైన దినదిన గండపు బడుగు జీవితాలు వారివి. ఈ వలస కార్మికుల్లో నూటికి 90 శాతం పైగా బహుజన, ఉత్పత్తి కులాల నుండి భూమిలేని నిరుపేద వర్గాల నుండి వచ్చిన వారే. నయా ఉదారవాద విధానాల హోరులో మార్కెట్‌కే అంతా అప్పగించి బడుగు జీవుల సంక్షేమ బాధ్యత నుండి తప్పుకున్న తప్పిదాల ఫలితం ఈ రూపంలో బయటపడుతుంది. కార్పొరేట్ల మీద ఉన్న కన్సర్న్ ఈ కార్మిక సమూహాల మీద కనీసంగానైనా లేదు. ఈ వర్తమానపు దయనీయమైన దృశ్యం రాజ్య వ్యవహార శైలిలో ఉన్న వివక్షను, పక్షపాత జాడ్యాలను బట్టబయలు చేస్తున్నది. అరకొరగా అమలు చేస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థ పరిధిలోకి వలస కార్మికులు రావడం లేదు. కనీస వేతనాల చట్టం వీరికి అమలు కావడం లేదు. వీరి కోసం ప్రత్యేకంగా బీమా పథకాలు అంటూ కూడా ఏమీ లేవు. పనిచేసే చోట ప్రమాదవశాత్తు ప్రాణాలు పోయినా, అనారోగ్యం పాలై పని చేయలేని స్థితికి వచ్చినా ప్రమాద బీమా లేకపోవడంతో కనీస నష్టపరిహారం కూడా పొందే పరిస్థితి లేకుండా పోయింది. చట్టబద్ధ రక్షణలు ఉన్నచోటనే శ్రమదోపిడి జరుగుతూ ఉంటే ఏ రక్షణలు లేని వలస కార్మికులు ఇంకెంత శ్రమదోపిడికి గురవుతున్నారో ఊహించుకోవచ్చు. అసంఘటిత కార్మికుల భద్రత చట్టం 2008 అని ఒకటుంది గాని అయితే ఈ చట్టం కింద వచ్చే వలస కార్మికులు ఐదు శాతం కూడా లేరు.

2019లో వచ్చిన సామాజిక భద్రతా బిల్లులో కూడా వలస కార్మికులకు ప్రత్యేక రక్షణల్ని కల్పించే అంశాలు ఏమీ లేవు. దేశంలో ఎక్కువగా చదువుకు దూరం అవుతున్న, అసలు బడికి వెళ్లే వయసులో బడి మొహం కూడా చూడని పిల్లల్లో వలస కార్మికుల పిల్లలే అధిక భాగంగా ఉన్నారు. పనిచేసే చోట అనేక అఘాయిత్యాలకు, అత్యాచారాలకు గురి అవుతున్నది వలస మహిళా కార్మికులే. కుటుంబ హింసను భరిస్తూనే బయట తమది కాని దూర ప్రాంతంలో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు ఈ మహిళా కార్మికులు. ఇదిలా ఉంటే వీరి వృద్ధ తల్లిదండ్రులు తమ తమ గ్రామాల్లో అనారోగ్యం పాలయి, కనీస అవసరాలు ప్రత్యేకించి వైద్య సహాయం సకాలంలో అందక అనేక అవస్థలు పడుతున్నారు.

ఇప్పుడు అమలవుతున్న అభివృద్ధి నమూనా తెచ్చిన కేంద్రీకృత 'అభివృద్ధి' ప్రక్రియలో రెక్కలు కట్టుకొని పని దొరికిన చోటుకల్లా ఎగిరి పోవాల్సిన అనివార్య పరిస్థితి తలెత్తింది. పుట్టి పెరిగిన చోటనో లేదా సమీప పట్టణ, నగరాల ప్రాంతాల్లోనో నికరంగా ఉపాధి లభించినట్టయితే వందల వేల కిలోమీటర్ల దూరం ఊరు విడిచి రావలసిన అగత్యం ఏమీ ఉండదు. అన్ని ప్రాంతాల్లో అన్ని పనులు కల్పించడం సాధ్యం కాకపోవచ్చు. స్థానిక పరిస్థితులకు తగ్గట్టు, అక్కడి వనరుల ఆధారంగా ఉపాధి కల్పించేలా ప్రయత్నాలు చేయవచ్చు. అనివార్యంగా నగరాల్లోకి పట్టణాల్లోకి పని కోసం వచ్చిన వారికి కనీస వేతనం, నికరంగా ఉపాధి లభ్యత, తాత్కాలిక ఆవాసాలు, పిల్లలకు విద్యా గ్యారెంటీ, ఆరోగ్య పరిరక్షణ పథకాలు వారి వృద్ధ తల్లిదండ్రులకు సామాజిక జీవన భద్రతను కల్పించకపోతే నానాటికీ వీరి స్థితిగతులు దిగజారడం ఖాయం. వీ

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు)

భారత ఆర్థిక వ్యవస్థపై కరోనా ప్రభావం

కరోనా వైరస్ దెబ్బకు భారత ఆర్థిక వ్యవస్థ ఎలా కకావికలయిందో, కరోనా అనంతరం ఎటువంటి సవాళ్లను ఎదుర్కోబోతున్నదో వివరిస్తున్నారు **డా. ఎ. పున్నయ్య**

కరోనా సృష్టించిన అలల తాకిడి మెరుపు వేగంతో ప్రపంచ దేశాలన్నింటిలో పెను ఉత్పాతాన్ని సృష్టించింది. మొదటిగా ఈ మహమ్మారి మానవ ఆరోగ్యానికి అశనిపాతమైంది. అన్ని వర్గాల ప్రజా సమూహాలను అతలాకుతలం చేసింది. అత్యంత ప్రమాదకార ఈ వైరస్ మూలానా అంతర్జాతీయంగా యుద్ధం జరగకుండానే, శత్రువుల దాడి లేకుండానే, శక్తివంతమైన అణు బాంబులు విసరకుండానే ప్రపంచ వ్యాప్తంగా ప్రజలను విలవిలాడిస్తూ లక్షల సంఖ్యలో శవాలు పోగుబడ్డాయి. ఇది అత్యంత విషాదం.

ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగంలో ఎన్నో అభివృద్ధి మైలురాళ్లను దాటామని, శక్తివంతమైన ఉత్పాతాలు ఎన్నో ఎదుర్కొన్నామని విర్రవీగుతున్న నవీన మానవ సమాజానికి ఈ సూక్ష్మ జీవిని కట్టడి చేయడం సవాలుగా మిగిలింది.

మహోన్నతంగా అభివృద్ధి సాధించిన వైద్య వ్యవస్థ కరోనా బారిన పడకుండా ప్రజలను కాపాడడంలో ఘోరంగా విఫలమైంది. ఫలితంగా నేడు 220 దేశాలలోని అన్ని రంగాలు ఉక్కిరి బిక్కిరి అయినాయి. చేసేదేమిలేక ప్రత్యామ్నాయంగా ప్రపంచంలోని 150 దేశాలు సంపూర్ణంగా, మిగిలిన దేశాలు పాక్షికంగా లాక్‌డౌన్‌లు ప్రకటించాయి. ఫలితంగా ఒక దేశం నుండి మరో దేశానికి సరిహద్దులు మూసుకున్నాయి. ముడి పదార్థాలు పరఫరా చేసుకోలేని నిస్సాయత స్థితిలో అంతర్జాతీయ సహకారానికి, వాణిజ్యానికి రెక్కలు తెగి గ్లోబల్ ఎకానమీ కుప్పకూలింది. ఈ లాక్‌డౌన్ ఇలాగే కొనసాగిస్తే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత దిగజారి కోట్లాది మంది మనుగడే సంక్షోభంలో పడి లక్షలాదిగా ఆకలి చావులుండవచ్చు. లాక్‌డౌన్‌ను ఉన్నఫలంగా సడలిస్తే కరోనా విజృంభించి కోట్లాది మందిని బలిగొంటుందనే మీమాంసలో ప్రపంచ దేశాధినేతలు కలవరపడుతున్నారు.

దూరదృష్టి లోపించిన ప్రభుత్వ చర్యలు

కరోనా మొదటి పాజిటివ్ కేసు చైనాలోని వూహాన్‌లో 2019 డిసెంబర్‌లో గుర్తించిన అనంతరం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుఎచ్ఒ) ఈ ప్రాణాంతర వైరస్ పట్ల ప్రపంచ దేశాలన్ని అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. భారతదేశంలో జనవరి 12న కేరళ రాష్ట్రంలో మొదటి పాజిటివ్ కేసు రికార్డు అయితే భారత ప్రభుత్వం దాని తీవ్రతను అంచనా వేయలేదు. కనీసం జనవరి, ఫిబ్రవరి మాసాలలో ప్రపంచ వ్యాప్తంగా విజృంభిస్తున్న కరోనా మరణాలను మనుషుల ద్వారా మాత్రమే ఈ వైరస్ దేశంలోకి ప్రవేశిస్తుందన్న శాస్త్రీయతను గుర్తించడంలో ప్రభుత్వం విఫలమైంది. మార్చి మొదటి వారంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పర్యటన విజయవంతం కోసం మెప్పు కోసం కృషి చేసింది. అనంతరం జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో కరోనా తీవ్రత పట్ల ప్రతిపక్షాల సూచనలను అవహేళన చేసింది.

సామాజిక వేత్తల సలహాలను తోసిపుచ్చి మనదేశంలో కరోనా వైరస్ పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసానిచ్చింది. సరిగ్గా వారం రోజులకే జనతా కర్ఫ్యు పేరుతో మార్చి 22న 14 గంటల బంద్‌కు పిలుపునివ్వడం ఒక్కరోజు తేడాతో మార్చి 24 నుండి ఏప్రిల్ 14 వరకు 21 రోజులు మొదటి దశలో లాక్‌డౌన్, తిరిగి ఏప్రిల్ 14 నుండి మే 3 వరకు రెండవ దశలో లాక్‌డౌన్ కొనసాగింపు, మూడవ దశలో మే 3 నుండి 17 వరకు కొనసాగిస్తూనే ఉంది. ఇది దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక వేత్తలను విస్మయానికి గురిచేసింది. సాంకేతికంగా ఉన్నతమైన ఇంటలీజెన్స్ వ్యవస్థ ఉన్నప్పటికీ సమస్య తీవ్రతను ప్రాథమిక స్థాయిలో అంచనా వేయలేని అంధకారం మూలానా ఈ హఠాత్ పరిణామం వలన కోట్లాది మంది 'రెక్కాడితే డొక్కాడే' పేదలు, వలస కూలీలు, దినసరి కూలీల బతుకులు చిద్రమైనాయి.

నిజానికి పక్కదేశంలో ప్రమాదకర స్థాయిలో వైరస్ విజృంభన గుర్తించి ఈ భౌతిక దూరమేదో అప్పుడే పాటించి, సరిహద్దులను అప్రమత్తం చేసి, విదేశీ ప్రయాణాలను క్వారంటైన్ పెట్టి ఉంటే ఈ దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి ప్రాణం పోసుకోకుండా పురిటిలోనే దెబ్బకొట్టే అవకాశం మనదేశానికుండేది. తీరా మనదేశంలోకి వైరస్ ప్రవేశించిన 70 రోజుల అనంతరం ఈ లాక్‌డౌన్ విధించడం ప్రభుత్వ దూరదృష్టిలేమికి, బాధ్యతారాహిత్యానికి నిలువెత్తు నిదర్శనం.

కరోనా దెబ్బకు ఆర్థిక వ్యవస్థ కకావికలు

ఇప్పటికే మాంద్య ప్రభావంతో సంక్షోభంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ కరోనా దెబ్బకు విలవిలలాడుతుంది. అసంఘటిత రంగంలోని కార్మికులు, చిరు వ్యాపారులు, ఆటో, క్యాబ్ డ్రైవర్లు, రోజువారి కూలీలతో సహ అల్పదాయ వర్గాల వారందరూ ఉపాధి కోల్పోయి కోలుకోలేనంతగా దెబ్బతిన్నారు. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) నివేదిక ప్రకారం ఆర్థిక వ్యవస్థకు అధిక వాటాను అందించే పర్యాటక అతిథి రంగంలో పనిచేసే 4 కోట్ల మందికి జాబ్‌లాస్ అయింది.

కరోనా వైరస్ కారణంగా బయటి ఆహారానికి దూరంగా ఉండడం వల్ల రెస్టారెంట్ ఇండస్ట్రీ, హోటల్స్‌తో పాటు చిన్న చిన్న టిఫిన్ సెంటర్స్‌కు గిరాకీ లేక ఈ రంగంలో పనిచేసే వారితో పాటు అనుబంధంగా పనిచేసే

3 కోట్ల మంది ఉపాధి కోల్పోయారు. సరిహద్దులు మూయడంతో విమానాలు రద్దు కావడం, ఏవియేషన్ ఇండస్ట్రీలో పనిచేసే 3 లక్షల మంది వేతనాలు నిలిచిపోయినాయి.

ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా మారిన రియల్ ఎస్టేట్ రంగం తీవ్ర ఒడిదొడుగులకు లోనుకావడంతో దీనికి అనుబంధంగా పనిచేస్తున్న 4.50 కోట్ల మంది ఉపాధి ప్రశ్నార్థం. ఆటోమొబైల్ రంగంలో సేల్స్ లేక డిస్కౌంట్ ఆఫర్స్ పెట్టి లే ఆఫ్‌లు ప్రకటిస్తున్న తరుణంలో ఈ దెబ్బకు లక్షల మంది ఉపాధి కోల్పోయారు.

భారత అతి ప్రాచీన పరిశ్రమైన వస్త్ర పరిశ్రమ మూడ పడడంతో 13 కోట్ల మంది ఉపాధి కోల్పోయారు. ఇందులో 70 శాతం మహిళలున్నారు. చేనేత కార్మికులకు నూలు, రంగుల సరఫరా ఆగినందున లక్షలాది మంది నేత కార్మికులు రోడ్డున పడ్డారు. బీడి కార్మికులు తమకు పొగాకు, తంబాకు సరఫరా నిలిచిపోవడం మూలన వారు ఉపాధి కోల్పోయారు. జెమ్స్ అండ్ జూలరీ షాపులు మూతపడడం వలన లక్షలాది మంది డైమండ్, సిల్వర్, గోల్డ్ వర్కర్స్ ఉపాధి గల్లంతు అయింది. నిర్మాణ రంగంలో పనిచేసే లక్షలాది మంది ఉపాధులు కోల్పోయారు. స్థూల జాతీయాదాయంలో ప్రాథమిక రంగమైన వ్యవసాయ అనుబంధ రంగాల వాటా 14 శాతమైనప్పటికీ ఉపాధి కల్పనలో ఈ రంగంలోనే 50 శాతం పైగా ఉంది. లాక్‌డౌన్ మూలంగా ఈ రంగానికి అనుబంధంగా పనిచేస్తున్న హమాలీలు, వర్కర్స్ మిల్లు పనివారు, సుమారు 13.5 కోట్ల మంది ఉపాధికి దూరంగా ఉన్నారు.

క్యాపిటల్ గూడ్స్, సిమెంట్, ఐరన్, లోహ, గాజు, ప్లాస్టిక్, రబ్బర్, ఎలక్ట్రానిక్స్ రంగంలో పనిచేస్తున్న వారందరూ ఉపాధి కోల్పోయారు. ఈ విధంగా దేశంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో పనిచేస్తున్న కోట్లాది మంది ఉపాధి కోల్పోవడం వలన 41.8 కోట్ల కార్మిక శక్తి ఉపాధి కోల్పోయినట్లయిందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ ప్రకటించింది. దీనితో పాటు ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న 2.5 కోట్లు ప్రభుత్వ అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న మరో 2.5 కోట్ల మందికి జీతాల్లో కోతల వలన కొనుగోలు శక్తి లేకపోవడంతో వినియోగం తగ్గి వస్తు డిమాండ్ పడిపోయింది, వృద్ధి మందగిచింది. ఈ నేపథ్యంలో మునుపెన్నడు లేనంతగా 45 సంవత్సరాల నాటి కనిష్ట నిరుద్యోగ రేటు 26.2 శాతం నమోదు కావడం విచారకరం.

భారత ఆర్థిక వృద్ధిరేటు పల్టీ కొడుతూ మైనస్‌లోకి జారింది

ఇప్పటికే మాంద్యం దెబ్బతో మందగమనంలో మునిగిన భారత ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రాన్ని 'కరోనా' మరింత విధ్వంసం చేసి వృద్ధిరేటును అట్టడుగు స్థాయికి చేర్చింది. నూతన ఆర్థిక సంస్కరణల అనంతరం దేశానికిదే కనిష్ట వృద్ధిరేటు కానుందని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీలు ముకుమ్మడిగా ఏకాభిప్రాయానికి వచ్చాయి.

భారత ప్రభుత్వం 2020-21 సంవత్సరం బడ్జెట్‌లో అత్యాశగా ఆశించిన వృద్ధిరేటును 10 శాతం అంచనా వేసింది. గడిచిన 5 సంవత్సరాలుగా 7 శాతం నుండి 4 శాతం వరకు తగ్గుముఖం పడితే 5 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థను 2024-25కు అందించాలనే కోటి ఆశలతో వృద్ధిరేటును రెట్టింపు చేసి చూపింది. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ఫిచ్, స్టాండర్డ్ అండ్ పూర్, మూడీస్, గోల్డ్‌మెన్ సాచ్, గ్లోబల్ ఎకనామిక్ అవుట్ లుక్, ఇండియా టూడే డేటా ఇంటలిజెన్స్ యూనిట్ లాంటి అగ్రగామి సంస్థలు 5 శాతానికి అటు ఇటుగా ఉండే అవకాశముందని అంచనా వేసినారు. కరోనా మహమ్మారి ఆర్థిక వృద్ధి అంచనాలను మరింత దిగజార్చింది. ఏప్రిల్ చివరి వారంలో వృద్ధి అంచనాలు 20 శాతం నుండి 1 శాతం మధ్యన ఊగిసలాడుతుంటే, తాజాగా అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ, ప్రపంచ బ్యాంకు, ప్రపంచ ఆర్థిక సంస్థలన్ని తక్కువ ఆర్థిక ఉత్పత్తిని అంచనా విసినాయి.

వృద్ధిరేటు లాక్‌డౌన్ మూడో విడత ప్రకటించడంతో ఉత్పత్తిలో ప్రతికూల ప్రభావం వలన మైనస్‌లోకి జారుతుందని ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఫిక్కి, ధృవా కన్సల్‌టెన్సీ నిర్వహించిన సర్వేలో పేరు మోసిన 380 కంపెనీల ప్రతిస్పందనలను రికార్డు చేస్తే అందులో అన్ని కంపెనీలు తీవ్ర అనిశ్చితిలో ఉన్నట్లు పేర్కొనడం ఆర్థిక వేత్తలందరిని గందరగోళపరుస్తుంది.

నేటికి రెండు విడతలుగా ప్రకటించిన లాక్‌డౌన్ పిడియడ్‌లో స్థూల దేశీయోత్పత్తి రోజుకు రు. 60,000 కోట్ల నష్టంతో 40 రోజుల్లో రు. 24 లక్షల కోట్ల నష్టాన్ని భారత ఆర్థిక వ్యవస్థ ఖాతాలోకి వచ్చింది. ఇక మూడవ విడతగా ప్రకటించిన లాక్‌డౌన్ రెండు వారాలకు గాను మరో రు. 8.4 లక్షల కోట్ల నష్టం జరుగుతుందని డాటా ల్యాబ్స్ నివేదిక వెల్లడించింది. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా పరిగణించే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగం కరోనా కాటుకు తల్లడిల్లడంతో ఈ రంగంలోని ఆదాయానికి భారీగా గండి పడడం మూలానా ఆర్థిక వ్యవస్థకు మరింతగా నష్టం వాటిల్లుతుంది.

కరోనా అనంతరం ఆర్థిక వ్యవస్థకు సవాళ్లు

భారతదేశంలోకి కరోనా వైరస్ లేటుగా ప్రవేశించిన కారణంగానో, టెస్టులు తక్కువ చేసినందువల్లనో నేటివరకు పాజిటివ్ కేసులు ప్రపంచంలో 17వ స్థానంలో ఉంది. 130 కోట్లకు పైగా జనాభాతో ప్రపంచంలో అధిక జనాభాగల దేశాలలో 2వ స్థానంలో ఉంది. అతి తక్కువ వైద్య సదుపాయాలతో ఈ దేశం నెట్టుకొస్తుంది.

మన దేశంలోని ప్రజల ఆరోగ్యాలు, వైద్య సదుపాయాలు, వైద్య ఆరోగ్య రంగానికి మన ప్రభుత్వాలు కేటాయిస్తున్న అతి తక్కువ బడ్జెట్ 1 శాతం వలన మనదేశంలో ప్రతి సంవత్సరం అతిసార వ్యాది వలన 5 లక్షల మంది, క్షయవ్యాధి వలన 4 లక్షల మంది, మలేరియా వలన 2 లక్షల మంది, పోషకాహార లోపం వలన 5 లక్షల శిశు మరణాలు సంభవిస్తున్నాయని ప్రభుత్వ గణాంకాలే చెపుతున్నాయి. ఈ కరోనా నేపథ్యంలో భారత వైద్య సదుపాయాల్లో ఉన్న తీవ్ర లోపాలను బయటపెట్టింది.

సగటున 84,000 మందికి ఒక హైసోలేషన్ బెడ్, 36,000 మందికి ఒక క్యారెంటెడ్ బెడ్, 11,600 మందికి ఒక డాక్టర్, 11,826 మందికి ఒక ఆస్పిటల్ బెడ్ అందుబాటులో ఉన్నాయి. ఈ చాలీ చాలనీ వసతులతో ఉన్న ఇంత పెద్ద భారతదేశంలో లాక్‌డౌన్ ఎత్తివేస్తే మహమ్మారి విజృంభనకు గేటెత్తినట్లే అవుతుంది. ఒకవేళ లాక్‌డౌన్‌ను కొనసాగిస్తే వచ్చే ప్రమాదం గురించి ఆర్థిక నిపుణుల హెచ్చరికలు ఆర్థిక ఆరోగ్యాన్ని

ఫణంగా పెట్టి ప్రజారోగ్యాన్ని దీర్ఘకాలం కాపాడలేమని అనేక విపత్కర పరిస్థితుల్లో ప్రపంచ దేశాల నుండి పాఠాలు నేర్చుకున్నాము. కావున ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు సంభవించినప్పుడు ఆయా రంగాల్లో నిష్ణాతులైన వారి సూచనలతో, విపక్ష నాయకుల సలహాలను తీసుకోవాలి. ఒకవైపు ఆరోగ్య పరిస్థితులపై దృష్టి పెడుతూనే ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆర్థిక నిపుణుల సలహాలను చిత్తశుద్ధితో అమలు చేస్తే ఇప్పుడున్న ఈ విషమ పరిస్థితుల్లో ప్రజారోగ్యంతో పాటు ఆర్థిక వ్యవస్థ సమాంతరంగా అభివృద్ధి చెందే అవకాశాలున్నాయి. లాక్‌డౌన్ ఎత్తివేసినా ఇప్పటికిప్పుడే అతలాకుతలమైన ఆర్థిక వ్యవస్థను క్రమేనా పునరుద్ధరించుకోవాలన్నా నిర్మాణాత్మక ప్రణాళికలతో కఠోర పరిశ్రమ చేయాలి. అపారమైన ధనం అవసరంతో పాటు బహిరంగ నిపుణులు మనకు అనుకూలంగా ఉండడం చాలా ముఖ్యం. వాణిజ్య సంబంధాలు, అంతర్జాతీయ సహకారం ఎంతో అవసరం. మందగించిన ఆర్థిక వ్యవస్థను ఎప్పుడు? ఎలా? పునః ప్రారంభించాలనే అంశంపై ఆలోచించి అడుగులు వేయాలి.

దశల వారిగా నిత్యావసర, అత్యవసర ఫ్యాక్టరీలను, దవాఖానాలు ముందుగా ప్రారంభించాలి. అనంతరం రెస్టారెంట్లు, బార్బర్ షాపుల్లాంటి ప్రజా అవసరాలను గుర్తించాలి. వివిధ జోన్‌లలో, వివిధ ప్రాంతాలలో ఉన్న ముప్పు తీవ్రతను ఆధారం చేసుకొని పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలను పలు జాగ్రత్తలతో పైలెట్ ప్రాజెక్టులుగా ప్రారంభించాలి. ప్రాంతాల వారిగా బహుళ దశల్లో రక్షిత కార్యక్రమాలుండాలి. పది మంది సామర్థ్యంతో పనిచేసే పరిశ్రమలను పునరుద్ధరణ కావిస్తే సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు ఉత్పత్తిని అందిస్తాయి.

ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రతి దేశం తన సొంత ప్రయోజనాలకు ప్రాధాన్యతనివ్వకుండా సమిష్టి దేశాల ప్రయోజనాలకు విలువనివ్వాలి. అంతర్జాతీయ ఆర్థిక సహకారం కోసం ఒక వేదిక ఏర్పాటు చేసుకోవాలి. అంతర్జాతీయ ప్రయాణాలపై సత్వరమే ఒప్పందం చేసుకొని ఆవశ్యక దేశాల అధ్యక్షులు, ప్రధానులు, శాస్త్రవేత్తలు, డాక్టర్లు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తలు స్క్రీనింగ్ పరీక్షల నిర్వాహణాంతరం విమానం ఎక్కేందుకు అనుమతించేలా చర్యలుండాలి. 2008 నాటి ఆర్థిక మాంద్యాన్ని 2014లో ఎబోలా మహమ్మారి సమయంలో అన్ని దేశాలు సమన్వయంగా ముందుకు పోయి సహకారం అందించుకోవడం వలన ప్రపంచ దేశాలు పెను ప్రమాదం నుండి బయటపడినాయి. ఆ అనుభవంతో కరోనాపై యుద్ధం చేసే ప్రపంచ స్థాయి కార్యచరణ పథకాన్ని సత్వరమే రూపొందించి కరోనాపై ఉమ్మడిగా యుద్ధం చేయాలి. ఈ విపత్కర పరిస్థితుల్లో ఒక దేశంపై మరో దేశం విరుచుకుపడకుండా, విమర్శించుకోకుండా, నిందలు వేసుకోకుండా ప్రపంచ దేశాలన్నీ వసుదైక సంఘీభావ మార్గంలోకి వెళ్లి నేడు విజృంభిస్తున్న కరోనాతో పాటు రాబోయే రోజుల్లో మానవాళిపై విజృంభించే ఏ ఉపద్రవాన్నయినా విజయవంతంగా ఎదుర్కోవాలి.

కనీస అవసరాలందించలేని ఉద్దీపన పథకం

ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా హఠాత్తుగా కేంద్రం ప్రకటించిన లాక్‌డౌన్‌కు ప్రజల నుండి వ్యతిరేకత రాకుండా వలస కార్మికులను, దినసరి కూలీలను, పట్టణ, గ్రామ పేదలను, రైతులను ఆదుకునేందుకు మార్చి 26న ప్రధాని మోడీ సంక్షేమ దేశమైన భారతదేశంలో వ్యాపారాల కంటే అత్యంత విలువైనవి ప్రజల ప్రాణాలంటూ, వీరి కోసం దేశం ఏ త్యాగం చేయడానికైనా సిద్ధంగా ఉందంటూ ప్రజలందరిని ఊదరగొట్టి రు. 1.70 లక్షల కోట్లు ఆర్థిక ఉద్దీపనలు ప్రకటించింది. ఇది భారతదేశ జిడిపిలో కేవలం 0.8 శాతం మాత్రమే.

ఈ ప్యాకేజీని సునిశితంగా గమనిస్తే 2020-21 బడ్జెట్‌లో కేటాయించిన కిసాన్ గరీబ్ యోజన లాంటివి కలిసే ఉన్నాయి. నిజానికి ఈ ఉత్పాతానికి కేటాయించింది కేవలం 0.5 శాతం మాత్రమే. ఈ ప్యాకేజీ విలువ గత సంవత్సరం సెప్టెంబర్‌లో కార్పొరేట్ పన్నును 32 శాతం నుంచి 22 శాతానికి తగ్గించినప్పుడు ఈ ప్రభుత్వం పడికెడు మంది కార్పొరేట్లకు రు. 1.45 లక్షల కోట్లు మినహాయించింది. ఇప్పుడు ప్రకటించిన ఈ ప్యాకేజీ దేశంలో మూడింట రెండొంతులున్న 80 కోట్ల పౌర సమాజానికి ఈ విపత్కర పరిస్థితుల్లో ఆదుకోవడానికి కేటాయించడం పాలకుల చిత్తశుద్ధికి నిదర్శనం. ఈ చాలీచాలనీ ప్యాకేజీతో దేశంలో సగం ప్రాంతాలకు కూడా కనీస వసతులు కల్పించలేము.

వ్యాపారాభివృద్ధే లక్ష్యంగా పనిచేసే అమెరికా 2 ట్రిలియన్ డాలర్ల అంటే అమెరికా జిడిపిలో 10 శాతం, బ్రిటన్ 9.5 లక్షల కోట్లు. అనగా జిడిపిలో 17 శాతం జర్మనీ 3.3 లక్షల కోట్లు, జర్మనీ జిడిపిలో 12 శాతం ప్రకటించినాయి. భారతదేశంలో ఉన్న పరిస్థితుల రీత్యా ప్రభుత్వం కనీసంగా 20 లక్షల కోట్లు అనగా భారత జిడిపి విలువ రు. 203 లక్షల కోట్లు. ఇందులో 10 శాతం ఈ ఉత్పాతానికే కేటాయించాల్సిన కనీస మొత్తం అవుతుంది.

భారతదేశానికి నేడు అనేక వనరులున్నాయి. 2014 సంవత్సరం నుండి అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా తగ్గినాయి. 120 డాలర్లున్న ఒక బ్యారెల్ పెట్రో ఉత్పత్తులు తగ్గుకుంటూ నేడు 25 డాలర్లకు పడిపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుంకాలు పెంచినాయి కాని, తగ్గిన పెట్రోలు ధరలు వినియోగదారునికి చెందనివ్వలేదు. 2014 నుండి 2019 వరకు ఈ పెట్రో ధరలు తగ్గడం మూలనా రు. 20 లక్షల కోట్లు ప్రభుత్వానికి ఆదా జరిగింది. అదంతా ప్రజా ప్రయోజనార్థం ఖర్చు పెట్టి ఉండవచ్చు. కాని 2019-20లో తగ్గిన ముడి చమురు మూలనా ప్రభుత్వానికి ఆదా రు. 3.50 లక్షల కోట్లుంది. దీనితో పాటు గత సెప్టెంబర్‌లో కార్పొరేట్లకు ఇచ్చిన పన్ను తగ్గింపును ఈ సంవత్సరానికి మినహాయింపును ఎత్తివేయాలి. దానితో రు. 1.50 లక్షల కోట్లు ప్రభుత్వానికి ఆదాయంగా ఉంటుంది. ఈ పన్ను తగ్గింపును ఎత్తివేయడం ద్వారా కార్పొరేట్లకు జరిగే నష్టమేమీ లేదు.

కేంద్ర ప్రభుత్వం 2020-21 బడ్జెట్ రు. 30 లక్షల కోట్లు అంచనా వేసింది. ఈ బడ్జెట్‌లో ఉన్నతాధికారులు, మంత్రులు విదేశీ విలాసాలకు సుమారు 15 శాతం అంచనా వేసినారు. అత్యవసరమైతే తప్ప ఈ పర్యటనలన్నీ రద్దు చేసుకుంటే రు. 4.50 లక్షల కోట్లు ఆదా అవుతుంది. ఇక ద్రవ్యలోటు బడ్జెట్‌లో 5.5 శాతం ప్రతిపాదించినారు. ఈ ప్రతి ద్రవ్యోల్బణ కాలంలో దానిని రెట్టింపు చేసినా ఆర్థిక వ్యవస్థ మీద ఎలాంటి ప్రభావం చూపదు. దీని ద్వారా సుమారు రు. 11 లక్షల కోట్లను

క్యాంటిటెవ్ ఈజింగ్ ద్వారా, హెలీకాప్టర్ మనీ ద్వారానైనా ఆర్థిక వ్యవస్థలోకి చలామణిలోకి తీసుకురావచ్చు. ఈ విపత్కర పరిస్థితులను అధిగమించుటకు ఆర్థిక వ్యవస్థ పునర్జీవింపజేయుటకు ప్రపంచ ప్రఖ్యాత ఆర్థిక వేత్త ప్రొ. జీనేడ్రిజ్ మార్గదర్శకంలో ప్రభుత్వానికి నివేదికనందించారు. ఈ నిపుణులు అందించిన ప్రభావశీలమైన సిఫార్సులు పాలకులు చిత్తశుద్ధితో అమలు పరచాలి.

ఆర్‌బిఐ తీసుకున్న చర్యలు కొంతమేరకు ఆర్థిక వృద్ధికి ఊపిరులూద నున్నాయి. రివర్స్ రెపోరేటు 4 శాతం నుంచి 3.75 శాతం తగ్గించడం. లిక్విడిటీ కవరేజీరేషయెను (ఎల్‌సిఆర్) 100 శాతం నుంచి 60 శాతానికి తగ్గించింది. రాష్ట్రాలకు వేస్ అండ్ మీన్స్ రుణాల (డబ్ల్యుఎంఎ) పరిమితిని 60 శాతం పెంపుతో పాటు బ్యాంకుల డివిడెంట్ చెల్లింపుల నిలుపుదలతో కొంతమేరకు ఆర్థిక వ్యవస్థకు ఉపయోగమే.

భారత ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవం

కేంద్రం అనుసరిస్తున్న తప్పుడు విధానాల వల్లే ఆర్థిక వ్యవస్థ దిగజారింది. కరోనా కాటుకు ముందే భారత ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైతే కరోనా కట్టడికి ఆలస్యంగా తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల ఈ వైరస్ విజృంభించి 'గోరు చుట్టుపై రోకలి పోటన్నట్లు' ఆర్థిక వ్యవస్థ మరింత దిగజారింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించెందుకు గతంలోని అనుభవాలను సమీక్షించుకొని వర్తమాన పరిస్థితులకు నూతనంగా ఆవిష్కృతమైన ఆలోచనలను అమలు పరచాలి. 1918లో మొదటి ప్రపంచ యుద్ధ వినాశనం కళ్లముందు తేలియాడు తుండగానే ప్రపంచాన్ని స్పానిష్ ఫ్లూ కౌగిట్లోకి తీసుకొని పెను విధ్వంసాన్ని సృష్టించింది. ప్రపంచ దేశాలు అప్రమత్తమయ్యేసరికే ప్రపంచ జనాభాలో 4 శాతం మరణించడం చరిత్రలో మరిచిపోలేని దుస్సంఘటన సరిగ్గా శతాబ్దం అనంతరం కరోనా రూపంలో ప్రపంచం మరో అనుభవాన్ని నేర్చుకోనుంది.

ఆ ఘటన అనంతరం దశాబ్ద కాలానికి 1929లో ఏర్పడిన గొప్ప ఆర్థిక మాంద్యం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చింది. అప్పుడు ప్రభుత్వమే డిమాండ్‌ను సృష్టించి ప్రజల్లో కొనుగోలు శక్తిని పెంచాలన్న ఆర్థికవేత్త జె.యం. కీన్స్ ఆదాయ ఉద్యోగితా సిద్ధాంతం ఆ ఘోర విపత్తు నుంచి ప్రపంచాన్ని బయట పడేసింది. కొద్ది తేడాతో అవే పరిస్థితులు ఇంచుమించు నేడు పునరావృతం అవుతున్నాయి. చిన్నా, పెద్దా ఇలాంటి అనుభవాలు మరెన్నో ఈ ప్రపంచానికి కొత్తేమి కాదు. ఈ క్లిష్ట పరిస్థితులను ఎంత ప్రభావాత్మకంగా, ప్రగతి పూర్వకంగా అదిగమిస్తా మనేది భారత ప్రభుత్వ చిత్తశుద్ధి కార్యాచరణపై ఆధారపడింది.

ఆర్థిక ప్రగతికి పది సూత్రాలు

1) భారత పాలకులు ప్రభుత్వ గోడౌన్లలో నేడు నిల్వ ఉన్న 7.7 టన్నుల బియ్యం, గోదుమలను ప్రజా పంపిణి ద్వారా తక్షణమే ఒకే దేశం – ఒకే రేషన్ విధానాన్ని అమలు పరిచి పంపిణి చేసి మొదటగా ఈ దేశ ఆకలి సమస్యను పరిష్కరించాలి.

2) ఉపాధీ హామి పథకం గ్రామాలతో పాటు పట్టణాలకు వర్తింపచేసి 100 రోజులు పని కాకుండా కుటుంబంలో ప్రతి ఒక్కరికి అడిగినన్ని రోజులు పని కల్పించాలి. ఈ పథకాన్ని కొత్త రంగాలకు విస్తరించి వలస కార్మికులు గ్రామాలకు వెళ్లిన అనంతరం ఎలాంటి షరతులు లేకుండా ఉపాధి హామి పనులు కేటాయించాలి.

3) రైతులకు రుణమాఫీ చేసి కొత్త రుణాలిచ్చి నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ భారత వ్యవసాయ రంగాన్ని పునరుద్ధరించాలి.

4) సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు షరతులు లేకుండా రుణాలందించి గతంలోని రుణాలపై వడ్డీ రాయితిచ్చి 50 శాతం జిఎస్‌టిని రద్దు చేయాలి.

5) ప్రభుత్వం దీర్ఘకాలిక వ్యూహాలతో ఏర్పాటు చేసే లక్షల కోట్ల భారీ పెట్టుబడి పథకాలను వాయిదా వేసి ఈ సంక్షోభం నుండి బయటపడే స్వల్పకాలిక ఆర్థిక ప్రణాళికలను రూపొందించుకోవాలి.

6) కార్పొరేట్లకిచ్చే భారీ సబ్సిడీలు, రాయితీలు, పన్ను మినహాయింపులను రద్దు చేయాలి. దేశంలో వాణిజ్య విధానాలను సమీక్షించి పన్ను పరిధిలోకి వచ్చే సంస్థలను, వ్యక్తులను గుర్తించి వారి నుంచి నిర్బంధంగా పన్ను వసూలు చేయాలి. పన్ను అడ్వాన్సు చెల్లింపులపై రాయితీలిస్తే దేశానికి సత్వరమే కొంత రెవెన్యూ పోగుబడుతుంది. ఈ సంక్షోభంలో కొన్ని పన్నులు ఏడాదికోమారు కాకుండా ఆరు మాసాల వ్యవధికి వర్తింపచేయాలి.

7) పోస్టాఫీసుల్లో చిన్న మొత్తాల పొదుపుతో పాటు బ్యాంకుల్లో స్వల్పకాలిక, దీర్ఘకాలిక డిపాజిట్ల సేకరణను ప్రోత్సహించి, ఆకర్షణీమైన వడ్డీ రేట్లను ప్రకటించాలి.

8) 1923 కార్మిక చట్టం ప్రకారం కార్మికులకిచ్చే భీమాను ప్రభుత్వ పనుల్లో భాగస్వామ్యమయ్యే కార్మికులందరికి వర్తింపచేయాలి. ప్రిమియంతో ప్రభుత్వానికి తక్షణం ఆదాయం సమకూరడంతో పాటు దీర్ఘకాలంలో కార్మికులకు ప్రయోజనం చేకూరుతుంది.

9) విదేశీ సంస్థలు, తాము భారతీయ శాఖ కార్యాలయాలు, శాశ్వత సంస్థల నుండి సంపాదించిన ఆదాయంపై చెల్లించే సర్ చార్జీనీ రు. ఒక కోటి నుండి పది కోట్ల పరిధిలో 2 శాతం చొప్పున 10 కోట్లకు మించితే 5 శాతంగా ప్రతిపాదిస్తే ఈ దేశానికి ఆర్థిక ప్రయోజనం ఉంటుంది.

10) ఈ విపత్కర పరిస్థితుల్లో సంపద పన్నును పునరుద్ధరించాలి. ప్రస్తుతం కోటి రుపాయల కంటే ఎక్కువ ఆదాయం ఉన్న సంపన్నులపై ఆదాయ పన్ను శ్లాబ్ 30 శాతం నుండి 40 శాతం పెంచాలి. 5 కోట్ల నికర సంపద ఉన్న వారిపై గతంలో రద్దు చేయబడిన సంపద పన్నును తిరిగి ప్రవేశపెట్టాలి. ఈ పురోగామి పన్ను ద్వారా ప్రభుత్వానికి ఆదాయ మార్గంతో పాటు సమాజంలో అసమానతలు తగ్గించుటకు ఉపయోగపడుతుంది.

ఈ విపత్కర పరిస్థితులను, సంక్షోభాన్ని ప్రజలు ధైర్యంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తూ వైరస్ వ్యాప్తిని అరికడుతూనే ఆకలి చావులతో పాటు ఆర్థిక ఒత్తిడితో కూడిన ఆత్మహత్యలు జరగకుండా ప్రజలందరిని తగు విధంగా పోషిస్తూ ఆర్థిక వ్యవస్థలో జరిగే ఉత్పత్తి కార్యకలాపాలను తగు జాగ్రత్తలతో ముందుకు తీసుకుపోవడం ప్రభుత్వ తక్షణ కర్తవ్యం.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ విశ్వవిద్యాలయం) వీ

కరోనా సందర్భంలో జీతాల్లో కోత

కరోనా పేరు మీద ప్రభుత్వాలు ప్రజలపై సాగిస్తున్న దాడిలో భాగంగా జరిగిన ఉద్యోగుల జీతాల కోతను వివరిస్తున్నారు

బి. రామకృష్ణ

కరోనాను కట్టడి చేయడానికని మార్చ్ 22న దేశవ్యాప్త జనతా కర్ఫ్యూను విధించారు. ఆ మరుసటి రోజు నుండి లాక్‌డౌన్ ప్రకటించారు. ప్రస్తుతం 2020 మే 17 వరకు పొడిగించబడింది. తెలంగాణలో 2020 మే 29 వరకు ఉన్నది. దీన్ని పొడిగించరనే గ్యారంటీ ఏమీ లేదు.

లాక్‌డౌన్‌ను పురస్కరించుకుని మార్చ్ 22న కేంద్ర కార్మిక శాఖ, ఉపాధి మంత్రిత్వ శాఖ చేసిన ప్రకటనలో ఉద్యోగులను తొలగించడం కాని, వారి వేతనాల్లో కోతలు వేయడం కాని చేయవద్దని చెప్పారు. ఇలా చేయడం సంక్షోభానికి దారితీస్తుందని, ఉద్యోగుల ఆర్థిక పరిస్థితిపై తీవ్రమైన ప్రభావాన్ని వేస్తుందని, వారి మనోనిబ్బరాన్ని దెబ్బతీస్తుందని, ఫలితంగా కరోనాను ఎదుర్కొనే పోరాటంపై ప్రతికూల ప్రభావం పడుతుందని చెప్పారు. ఈ సవాళ్ల నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలన్నీ కూడా ప్రత్యేకించి క్యాజువల్ కాంట్రాక్ట్ కార్మికులు ఉద్యోగులతో సహా ఏ ఒక్క ఉద్యోగిని కూడా తొలగించడం కాని, జీత భత్యాల్లో కోతలు విధించడం కాని చేయవద్దని తెలిపారు. ఈ కాలంలో ఎవరైనా సెలవులో ఉంటే దానిని ఆన్‌డ్యూటీగానే పరిగణించి పూర్తి వేతనం చెల్లించాలని స్పష్టం చేశారు.

ఈ ప్రకటన వచ్చిన రోజే తెలంగాణ ప్రభుత్వం జిఒ ఎం.ఎస్ నెం. 45 అనే ఉత్తర్వును విడుదల చేసింది. ఇందులో లాక్‌డౌన్ గురించి వివరించారు. లాక్‌డౌన్ కాలంలో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాలు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ వారితో సహా ఉద్యోగులందరికీ పూర్తి వేతనాలు చెల్లించాలని చెప్పారు. దీన్ని ఉల్లంఘిస్తే తీవ్రంగా పరిగణించి ఎపిడమిక్ చట్టం 1897 ప్రకారం పెనాలిటీ చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు.

ఈ రెండు వివరణలకు విరుద్ధంగా 2020 మార్చ్ 30న జిఒ ఎం.ఎస్. నెం. 27ను తెలంగాణ ప్రభుత్వం జారీ చేసింది. లాక్‌డౌన్ వల్ల కలిగిన వనరుల కొరత, కోవిడ్-19 ఫలితంగా పెరిగిన అదనపు ఖర్చుల వలన ఆర్థిక పరిస్థితిపై ప్రభావం పడిందని, అందుకోసం ఉద్యోగుల వేతనాలలో వాయిదా వేయడం జరుగుతున్నదని చెప్పారు. దీనిలో ముఖ్యమంత్రితో సహా అన్ని రకాల ప్రజా ప్రతినిధుల జీతాలో ÊFల 75 శాతం, అఖిల భారత సేవా అధికారుల జీతాలలో 60 శాతం, నాలుగవ తరగతి, అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల జీతాలలో 10 శాతం, మిగతా ఉద్యోగుల జీతాలలో 50 శాతం, పింఛన్‌దారులకు వారు పదవీ విరమణ పొందిన ఉద్యోగాలను అనుసరించి పైన తెలిపినట్లుగా పెన్షన్లలో వాయిదాలుంటాయని చెప్పారు. ఇలా తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు కోతలు కొనసాగుతాయని అంటే నిరవధిక కోతలను పాటిస్తారన్నమాట.

వారంలోనే ఎంతమార్పు. తాము చెప్పిన మాటను తామే ఉల్లంఘించారు. దేశంలోనే ఇటువంటి నిర్ణయం మొట్ట మొదటిదిగా జారీచేసినట్లుగా తెలంగాణ ప్రభుత్వం చరిత్రలో నిలుస్తుంది. ఈ వారం పది రోజుల్లోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చేజారిపోయిందా? కరోనా కోసం ఎంత ఖర్చు చేయడం ద్వారా ఖజానాకు గండిపడింది? ఎక్కడెక్కడి నుండి ఎంతెంత రాబడి ఉందో ఈ వారం రోజుల్లో ఎంతెంత తగ్గిందో స్పష్టం చేయకుండానే అకస్మాత్తుగా వేతనాలలో కోతలేయడం అనేది నిజాలను దాచిపెట్టడమే అవుతుంది.

నిజా నిజాలను కుల్లంకుల్లాగా బయటపెట్టకుండా ఉద్యోగుల ఇష్టా ఇష్టాలతో సంబంధం లేకుండా వేతనాలలో కోతలు పెట్టడం, ఈ కోతలను ఎప్పుడు తిరిగి చెల్లిస్తారో చెప్పకపోవడం అనేది నిరంకుశ నిర్ణయానికి నిలువుటద్దంగా నిలిచింది. వేతనాల్లో కోతలు మార్చ్, ఏప్రిల్ నెలలో జరిగాయి. ఇకముందు ఎన్ని నెలల వరకు కొనసాగిస్తారో స్పష్టత లేదు. ఇదే దారిలో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలు నిర్ణయాలు చేశాయి. ఇక కేంద్ర ప్రభుత్వం కూడా 2020 జనవరి నుండి 2021 జూన్ వరకు సంవత్సరంన్నర పాటు కరువు భత్యాన్ని నిలిపివేస్తున్నట్లు ఏప్రిల్ 23న ఉత్తర్వులను జారీ చేసింది. వీటి బకాయిలను కూడా చెల్లించడం జరగదని కూడా తెలిపారు. మరోవైపు బడా కంపెనీలకు, కార్పొరేట్ సంస్థలకు 1.45 లక్షల కోట్లు కార్పొరేట్ టాక్స్‌ను రద్దుచేసిన చరిత్ర కేంద్ర ప్రభుత్వానిది. ఇంతే కాకుండా 2014లో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం బడా పెట్టుబడిదారుల కోసం సుమారు ఐదున్నర లక్షల కోట్ల రుపాయల బ్యాంకు రుణాలను మొండి పద్దుల పేరుతో వేతనాలలో కోతలు ఉద్యోగుల కుటుంబాల జీవితాన్ని తీవ్రంగా కుంటుపరుస్తాయి. పూర్తి జీతం వస్తేనే ఆ నెలంతా కుటుంబాన్ని నెట్టుకొచ్చే పరిస్థితి దాదాపుగా ఉద్యోగులందరికీ ఉంటుంది. కుటుంబ పోషణలో భాగంగా నెలసరి అద్దెలు, అప్పులు, ఆహారం, పిల్లల విద్యా ఖర్చులు, వైద్యం మందుల ఖర్చులు మొదలగు అనివార్యమైన వాటిని కోతల వేతనాలతో నెట్టుకురావడం కష్టంతో కూడుకున్న విషయం. ఇంతటి తీవ్రమైన నిర్ణయాన్ని తీసుకునే ముందు ఉద్యోగ ప్రతినిధులతో సంప్రదించకుండా తీసేసుకోవడం నియంతృత్వ పోకడలకు నిదర్శనం. ఇది ప్రజాస్వామ్యంలో చెల్లదు. కాని చెల్లుబాటు అవుతుండడం ఈ రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యం కాక మరేమవుతుంది. వేతనాలలో కోతలు విధించవద్దని చెప్పడానికి రెఫరెన్స్‌గా చెప్పిన ఎపిడమిక్ చట్టం 1897ను వేతనాల్లో కోతలేయడానికి కూడా రెఫరెన్స్‌గా చూపారు. ఈ చట్టంలో జీతాల్లో వాయిదాలు గాని, కోతలు గాని వేయమని లేదు.

సగం వేతనం వాయిదా వేసినపుడు కుటుంబ పోషణకు అవసరమయ్యే అన్నింటినీ కూడా సగం వ్యయంతోనే సమకూరేలా ఏమైనా చర్యలు తీసుకున్నారా? లేదే. ఇవన్ని కూడా పూర్తి స్థాయిలో చెల్లిస్తూ వేతన కాలంలో నెట్టుకురావడం సాధ్యమేనా. వేతనాలలో నిరవధిక వాయిదా వేసినట్లుగానే ఉద్యోగులు నెలవారీగా చెల్లించే అన్ని రకాల ఖర్చులపై కూడా నిరవధిక వాయిదా అమలయ్యేలా చేస్తే వేతనాల వాయిదా ఉత్తర్వులకు అర్థముండేది.

గత్యంతరం లేని ఆర్థిక అత్యాయిక పరిస్థితి ఏమైనా విధించబడిందా. అలాంటి సందర్భంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 360 ప్రకారం వేతనాలలో తగ్గింపులు చేసే అవకాశమున్నది. ఆర్థిక అత్యాయిక పరిస్థితి లేకుండానే ఏ రాజ్యాంగ శాసనాధికారం ద్వారా వేతనాల కోతను చేపడతారు? ఇది రాజ్యాంగ విరుద్ధమైన చర్య., జీవించే హక్కుకు భంగకరం.

ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సవివరంగా చర్చించిన మీదట గత్యంతరం లేని తీవ్రమైన సందర్భమే ఉంటే ప్రజల్లో భాగమే అయిన ఉద్యోగులేమీ స్పందించలేని బండరాళ్లు కాదుకదా. ఆ పనిని ప్రభుత్వం చేయలేదు. ప్రకృతి విపత్తుల సందర్భంలో గతంలో ఎన్నోసార్లు తమ వేతనాలలో కొంత మొత్తాన్ని రిలీఫ్ ఫండ్‌ల కింద జమచేస్తూనే ఉన్నారు. ప్రస్తుత కరోనా కష్ట కాలంలో కూడా తమ విధి నిర్వహణలో భాగంగా సహాయ సహకారాలు అందిస్తూనే ఉన్నారు. ఉద్యోగ విధులే కాకుండా స్వచ్ఛందంగా తమతమ వ్యక్తిగత స్థాయిల్లో తమ సంఘాల్లో భాగంగా కూలీలకు, వలస కార్మికులకు, పేదలకు సహాయం అందిస్తూనే ఉన్నారు.

కరోనాను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నదని పేరుతెచ్చుకున్న కేరళ రాష్ట్రంలో ఉద్యోగుల వేతనాలలో కోతలు లేవు. 20 వేల కోట్లు కరోనా కోసం కేటాయించారు. ఒరిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కరోనాకు సంబంధించి ప్రత్యక్షంగా భాగస్వాములవుతున్న ఉద్యోగ వర్గాలకు నాలుగు నెలల జీతాలను అడ్వాన్స్‌గా ప్రకటించాడు. ఓ వైపు ధనిక రాష్ట్రమని, తమది ఘనమైన బడ్జెట్ అని చెప్పుకునే వాళ్లు ఉద్యోగుల వేతనాలలో వాయిదాను వేయడం అనేది ఎవరిని మాయచేయడానికి సూచిస్తుంది. చైనాలోని వూహాన్‌లో కరోనా వ్యాప్తి చెందుతున్నప్పుడు ఆ దేశం స్పందించిన తీరును గుణపాఠంగా తీసుకోవచ్చు. ఇళ్లల్లో నుండి బయటకు రాకుండా ఇంటింటికే కావాల్సినవి పరఫరా చేశారు. మెడికల్, పారా మెడికల్ సిబ్బందికి పూర్తి స్థాయి రక్షణ పరికరాలను అందించారు. పది పదిహేను రోజుల్లోనే కరోనా చికిత్స కోసం ప్రత్యేకంగా పెద్ద ఆసుపత్రిని యుద్ధ ప్రాతిపదికన నిర్మించారు.

కరోనా వ్యాప్తిని అదుపుచేయడం కోసం రోబోలను, డ్రోన్‌లను, తదితర శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా ఉపయోగించుకున్నారు. అటువంటివి తెలంగాణ ప్రభుత్వానికి ఆదర్శం కావాలి. కరోనాను తేలికగా తీసుకున్న ముఖ్యమంత్రి అసెంబ్లీలో మాట్లాడుతూ పారసిటమాల్ వేసుకుంటే తగ్గిపోయేదానికి భయపడాల్సిందేమీ లేదంటునే ఒకవేళ ఆ అవసరమే వస్తే వెయ్యి కోట్లయినా కేటాయిస్తాం అన్నాడు. మంత్రులందరూ మాస్కులు లేకుండానే ప్రజా క్షేత్రంలో పనిచేస్తారని చెప్పిన విషయం తెలిసిందే. అలా అన్నవారు వేతనాలలో కోతలు వేయడాన్ని ఎలా చూడాల్సి ఉంటుంది.

కేంద్రానికి రాష్ట్రాలు తమవంతు వాటాగా పన్నుల రూపంలో నిధులను సమకూరుస్తుంటాయి కదా. మరి ఈ సంక్షోభ సమయంలో ఒక హక్కుగానే కరోనాను ఎదుర్కోవడానికి నిధులను కేంద్రం నుండి రాబట్టుకోవచ్చు. అటువైపుగా ఆలోచించింది లేదు. ఖచ్చితమైన డిమాండ్ లేదు.

ఒకవేళ తీవ్రమైన ఆర్థిక సంక్షోభమే వచ్చిందనుకుందాం. అప్పుడు ఎవరి సంపదల నుండి రాబట్టుకోవాలో ప్రభుత్వాలకు తెలియదా? బడా పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులు, వ్యాపార వర్గాలు, పెద్ద పెద్ద కాంట్రాక్టర్లు, సినీ దిగ్గజాలు, మొదలగు సంపన్న వర్గాల నుండి కదా సేకరించాల్సింది. రాష్ట్రంలోని సంపన్న వర్గాలను గుర్తించి వారి నుండి పన్నుల రూపంలో వసూలు చేయవచ్చు. సంపన్నమైన మత సంస్థలు, మఠాలు, పీఠాధిపతులు, కోట్లల్లో వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ విద్యా, వైద్య సంస్థల వద్ద పోగై ఉన్న ధనాన్ని గురించి ఆలోచించవచ్చు.

ఇటీవలనే విడుదలైన ఆక్స్‌ఫాం నివేదిక 2020లో అత్యధిక సంపదలు కొద్దిమంది చేతుల్లో పోగుపడ్డాయని చెప్పారు. అత్యధిక జనాభా వద్ద అత్యల్ప సంపద ఉన్నదని, ఇదంతా కూడా సంపదల పంపిణీ అసమానంగా జరుగుతున్నందువల్ల ఏర్పడిందని తెలిపారు. ఫలితంగా అత్యధిక ప్రజానీకం బీదరికంలో బాధలు అనుభవిస్తున్నారని చెప్పింది. 70 శాతం భారత జనాభా (95.3 కోట్లు) వద్దనున్న సంపద మొత్తానికి నాలుగింతలకు పైగా కేవలం 1 శాతం ఉన్న సంపన్నవంతుల వద్ద గుట్టలుగా పోగుపడిందని, తొమ్మిది మంది బిలియనీర్ల (శత కోటీశ్వరులు) సంపద అట్టడుగున ఉన్న 50 శాతం జనాభా మొత్తం సంపదకు సమానమని, దేశంలోని బిలియనీర్లందరి సంపద మొత్తం 2018-19 దేశ బడ్జెట్ కంటే ఎక్కువగా ఉందని ఆక్స్‌ఫామ్ నివేదిక 2020 స్పష్టం చేసింది. ఇటువంటి సంపన్న వర్గాల నుండే కదా గడ్డు పరిస్థితుల్లోనైనా కొంతైనా వసూలు చేసి ప్రజా సంక్షేమం కోసం వినియోగించాలి. ఈ వర్గాలను ముట్టుకోకుండా ఉంటున్న ప్రభుత్వాలు, పాలకులు ఏ వర్గం కొమ్ముకాస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు.

సూపర్ రిచ్ వారిపై, బహుళజాతి కార్పొరేషన్‌లపై టాక్స్‌లు విధించమని భారత ప్రభుత్వానికి ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్‌కు చెందిన కొంతమంది అధికారులు లేఖ రాశారు. ఈ లేఖను నిర్ద్వందంగా తిరస్కరించడమే కాకుండా ఇది తప్పుడు ప్రతిపాదన అని చెబుతూ అలా లేఖ రాయడం క్రమశిక్షణా రాహిత్యమని అంటున్నారు. పౌరులుగా, ఉద్యోగులుగా తమ ప్రతిపాదనలను సూచిస్తే వారిని క్రమశిక్షణలు ఉల్లంఘించిన వారిగా చూడడం, వారిపై కన్నెర్ర చేయడం అనేది పాలకుల దుష్టబుద్ధిని సూచిస్తున్నది.

దినసరి, వలస కూలీలు, అసంఘటిత రంగంలోని కార్మికులు, కర్షకులకు పూటగడవడం కష్టంగా దినదినగండం బతుకే భారంగా మారింది. బయటకొస్తే లాక్‌డౌన్. ఇంట్లోనే ఉంటే తీరని కనీస అవసరాలు ఎలా ఎదుర్కోవాలో తెలియని సంకట స్థితిలో అక్కడక్కడ అందించే ఆహార పొట్లాల కోసం ఎదురుచూడడం ఎంత బాధాకరమో అనుభవిస్తేగాని తెలిసిరాదు. ప్రభుత్వం జీతాలలో కోతను ఎత్తేయకుంటే గనుక ఉద్యోగుల పరిస్థితి రాబోయే కాలంలో దుర్భరం కానున్నది. ఇప్పటికే మార్చ్, ఏప్రిల్ నెల వేతనాల్లో కోతలేశారు. ఇదే అదనుగా

వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలులో రైతుల నిలువు దోపిడీ

ఒకవైపు సాగు పెట్టుబడి పెరిగిపోయి, మరోవైపు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు రాకపోవడంతో రైతులు దోపిడీకి గురవుతున్నారనీ, కనీస మద్దతు ధర అందిస్తామని అంటున్న ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితం అవుతోందనీ అంటున్నారు **ఎస్. ఆశాలత**

"లాక్‌డౌన్ కాలంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగనివ్వం"

"వ్యవసాయ రంగాన్నీ, రైతులను ఆదు కోవటానికి అన్ని చర్యలు తీసుకుంటాం"

"ఒక్క గింజ కూడా వదలకుండా కొంటాం"

కొరోనా వ్యాప్తిని అరికట్టటానికి లాక్‌డౌన్ విధించిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి వరుసగా చేస్తూ వచ్చిన ప్రకటనలు ఇవి. రబీ పంట కోతకు వచ్చిన సమయంలో లాక్‌డౌన్ విధించిన నేపథ్యంలో అయోమయంలో ఉన్న రైతులలో ఈ ప్రకటనలు కొంత భరోసాను కలిగించాయి. అందుకు అనుగుణంగానే ప్రభుత్వం ఉత్తరువులను కూడా తెచ్చింది.

రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ కార్యదర్శి మార్చ్ 30న విడుదల చేసిన ఒక ఉత్తరువులో మక్కజొన్న పంట మొత్తం దిగుబడి (14.59లక్షల మెట్రిక్ టన్నుల)ని ప్రభుత్వం క్వింటాల్‌కు 1760 రూపాయల చొప్పున కొనుగోలు చేస్తుందనీ, మక్కల కొనుగోలులో మార్కెట్ రుసుమును, అన్ని రకాల పన్నులను రద్దు చేస్తున్నామని, ఇందుకోసం మార్క్‌ఫెడ్‌కు 3213 కోట్ల రూపాయల రుణ సదుపాయం సమాకూర్చటానికి సహాయం అందిస్తామని కూడా ప్రకటించింది.

అదే విధంగా గ్రామాలలోనే మక్కలు, వడ్ల కొనుగోలు చేస్తామని, రైతులు మార్కెట్ యార్డులకు తమ పంటను తీసుకురానవసరం లేదనీ ప్రభుత్వం ప్రకటించింది.

ముఖ్యమంత్రి ప్రతి ప్రెస్‌మీట్‌లోనూ చేసిన ప్రకటనలు రైతులకు అరచేతిలో స్వర్గం చూపించాయి. కానీ వాస్తవంలో రైతుల వెతలకు అంతులేకుండా ఉంది. రైతులు వరి, మక్క జొన్నలు కూరగాయలు, పండ్లు పండించటంలో ఎంత కష్టపడ్డారో వాటిని అమ్ముకోవటానికి అంతకంటే రెట్టింపు కష్టాలు ఎదుర్కుంటున్నారు.

హామీలు, నిబంధనలు విధిస్తూ ప్రకటనలు అయితే చేశారు కానీ ధాన్యం, మక్కజొన్న కొనుగోలు ఏ విధంగా జరుగుతున్నదో పట్టించుకున్నవాడు లేకుండా పోయాడు. మక్కల కొనుగోలుకు మార్క్‌ఫెడ్ రాష్ట్ర వ్యాప్తంగా 1059 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది కానీ మే 1 నాటికి అంటే దాదాపు నెల రోజుల తర్వాత కూడా కేవలం 2.76 లక్షల మెట్రిక్ టన్నుల మక్కలను మాత్రమే కొనుగోలు చేసింది. మక్కల కొనుగోలు మందకొడిగా సాగుతుండడంతో రైతులు రోడ్డెక్కి ఆందోళనకు దిగే పరిస్థితి నెలకొంది. కామారెడ్డి జిల్లాలో 101 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా మే 1 నాటికి ఒక్క గింజకూడా కొనుగోలు చేయలేదు.

మక్కలలో 12 శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తామని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు చెప్పటంతో రైతులు కేంద్రాల వద్దే మక్కలను ఆరబోసి తేమ శాతం 12కు వచ్చే వరకు ఎండబెడుతున్నారు. ఈలోపు అకాల వర్షాలు కురిసి మక్కలు తడిసిపోయిన సంఘటనలు కూడా చాలా ఉన్నాయి. ఇదంతా రైతులకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది.

రైతుల నుండి కొనుగోలుచేసిన మక్కజొన్నలకు డబ్బులు చెల్లించడంలో మార్క్‌ఫెడ్ అధికారులు జాప్యం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 49 వేల మంది రైతుల నుండి 428 కోట్ల రూపాయల విలువైన మక్కజొన్నలను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది, కానీ రైతులకు ఇప్పటివరకు చెల్లించింది రు. 57 కోట్లు మాత్రమే. మక్కల కొనుగోలు కోసం మార్క్‌ఫెడ్ జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎంసిడిసి) నుండి

ప్రభుత్వమే చేయగా లేనిది తమకేమిటన్నట్లుగా ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులు తమవద్ద పనిచేసే వారికి వేతనాలను సక్రమంగా చెల్లిస్తారా?

వేతనాలలో వాయిదా అనేది ఎంతవరకు ఉంటుందో తెలియని పరిస్థితి ఉన్నది. లాక్‌డౌన్ ప్రకటించే పది రోజుల ముందే వేతన సవరణలను చేపట్టాలని 2020 మార్చ్ 13న రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు హైదరాబాద్‌లో నిరసన తెలిపారు. 2018 జూన్ నుండే అమలు చేస్తామని ఇచ్చిన హామిని అమలు చేయమని పెద్ద ఎత్తున రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతకు ముందు కూడా వివిధ దశల్లో, వివిధ రూపాల్లో వేతన సవరణల డిమాండ్‌ను తెలియపరచడం జరిగింది. ధర్నాచౌక్ వద్దకు వచ్చిన వేలాది ఉపాధ్యాయులను ఎక్కడికక్కడ హైదరాబాద్‌లోనూ, అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ముందస్తు అరెస్టులు చేసి నిర్బంధించారు. నిరసన రోజున వేలాది మందిని అరెస్టు చేసి దినమంతా పోలీసు కస్టడీలో నిర్బంధించారు.

ప్రతి ఐదేళ్లకోసారి వేతనాల్లో సవరణలు చేయడం సహజమైనది, న్యాయమైనది. నిజ జీవిత ప్రమాణాలకు, పెరిగిన ధరలకు అనుగుణంగా జీతభత్యాలను సవరించడం జరగాలి. దీనికోసం మాట ఇచ్చిన ప్రభుత్వం తన మాటకు తానే కట్టుబడలేని పరిస్థితుల్లో ఉద్యమ బాట తప్ప వేరే దారిలేని పరిస్థితుల్లో ఉద్యోగులు ఉన్నారు. ఓ వైపు వేతన సవరణల ద్వారా పెరుగుతున్న ధరలు ఖర్చులననుసరించి వేతనాలను పెంచమని అడుగుతున్న ఉద్యోగులకు ఏకంగా వేతనాల్లో వాయిదాలను చవి చూస్తుండడం విపత్కర పరిస్థితే.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

3213 కోట్ల రూపాయల రుణం తీసుకోవటానికి రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చింది, అయినప్పటికీ రుణం మంజూరు కాలేదు. గత ఏడాది మార్క్‌ఫెడ్ తీసుకున్న రుణంలో రు. 100 కోట్లు మిగిలి ఉన్నాయి, వాటి నుంచి రైతులకు రు. 57 కోట్లు చెల్లించారు. మార్క్‌ఫెడ్‌కు రుణం మంజూరు కానపుడు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం కలిగించుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయటంలో విఫలమైంది.

ఇక వడ్ల కొనుగోలు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ప్రతి గ్రామంలో ఐకెపి (డ్వాక్రా గ్రూపులు) కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 14 శాతం ఉన్న వడ్లను ఏ గ్రేడ్ క్వింటాలుకు రు. 1835, బి గ్రేడ్ రు. 1810కు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యంలో 17 శాతం తేమ, 4 శాతం తాలు ఉన్నప్పటికీ కొనాలని చెప్పారు. కానీ 14 శాతం తేమ ఉన్నప్పటికీ కొనడం లేదని చాలా జిల్లాలలో రైతులు వాపోతున్నారు.

రైతులు ధాన్యాన్ని ఎండబెట్టి జల్లెడ పట్టటానికి కొనుగోలు కేంద్రాలలో సరిపడినన్ని టార్పాలిన్ కవర్లు ఉండడటం లేదు. ధాన్యం నింపటానికి సరిపడినన్ని గొనె సంచులు అందుబాటు లేవు. తాలు తీసే యంత్రాలు కూడా అందుబాటులో లేక రైతులు వాటి కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తున్నది. ధాన్యం తూర్పార బట్టటానికి కూలీల కొరత ఏర్పడింది. తీరా ఎండబెట్టి తాలు తీసి తూకం వేసిన తర్వాత కూడా లారీలు రాక రాత్రింబవళ్లు తమ ధాన్యానికి కాపలా ఉండవలసి వస్తున్నది. కాటా వేసిన వడ్లు లారీలలో ఎక్కించి రైస్ మిల్లులలో దించేంతవరకు కూడా నమ్మకం ఉండటంలేదని తొగుట, మిర్ దొడ్డి మండలంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైస్ మిల్లుల యజమానులు రైతుల లాటు నెంబర్‌ను వడ్లను తనిఖీ చేసి తాలు ఎక్కువగా ఉందని చెప్పి 40 కిలోల బస్తాకు రెండు కిలోలు తగ్గిస్తున్నారు.

మరి కొన్ని చోట్ల కాటా వేసేటప్పుడు 40 కిలోలకు రెండు కిలోలు ఎక్కువ తీసుకుంటున్నారు. మొక్కజొన్నకు 50 కిలోల బస్తాకు ఒక కిలో అదనంగా తీసుకుంటున్నారు. తొగుట మండలం తుక్కాపూర్ గ్రామంలో 40 కిలోల వడ్ల బస్తాకు 42 కిలోలు తూకం వేసి తీసుకుంటున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఈ దోపిడీ మరింత దారుణంగా ఉంది. అక్కడ 40 కిలోల బస్తాకు 47 కిలోల వరకు తూకం వేస్తున్నారు. అంటే క్వింటాలుకు 5 నుండి 10 కిలోల వరకు రైతులు నష్టపోతున్నారు.

రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు కుమ్మక్కై రైతులను నిలువునా దోచుకుంటున్నారు. ఏ గ్రేడ్ ధాన్యం పంపిస్తే బి గ్రేడ్ అని ఒప్పుకుంటేనే దించుకుంటామనీ, లేకుంటే రైస్ మిల్లులో ధాన్యం దించుకోకుండా వెనక్కు పంపిస్తామనీ రైతులను బెదిరించి ఒకొక్క రైతు దగ్గర 1000–2000 రూపాయల వరకు లంచం తీసుకుంటున్నారు. ఎదో ఒక విధంగా కాటా వేసిన ధాన్యాన్ని లారీలకు ఎక్కించి రైస్ మిల్లుకు చేరితే చాలునని రైతులు వారు చెప్పిన దానికి ఒప్పుకుని లంచాలు ఇచ్చి మరీ అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వేసవిలో సాధారణంగా వచ్చే అకాల వర్షాలు, వడగండ్ల వానలు, ఈదురు గాలుల వల్ల చాలా జిల్లాలలో రైతులు ఇప్పటికే పంట నష్టపోయారు. వడగండ్ల వానలకు చాలా చోట్ల కోతకు వచ్చిన వరి పంట నేల మట్టమైంది. కోసి కుప్పలు వేసిన ధాన్యం, మొక్కజొన్నలు అకాల వర్షాలకు కొట్టుకుపోయాయి, తడిసిపోయాయి. గాలి వానలకు మామిడి కాయలు రాలిపోయి రైతులు నష్టపోయారు. లాక్‌డౌన్ కారణంగా నల్గొండ జిల్లాలో బత్తాయి, ఇతర జిల్లాలో మామిడికాయలు కోయటానికి కూలీల కొరత కారణంగా మరికొంత నష్టం జరిగింది.

ఈ నేపథ్యంలో అకాల వర్షాలు వచ్చి ధాన్యం తడిసిపోతే మొదటికే మోసం వస్తుందని రైతులు భయపడి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లరు ఎంత చెబితే అంతకు లంచాలు ఇచ్చి మరీ అమ్ముకోవాల్సి వస్తున్నది. ధాన్యం కొనుగోలులో జరుగుతున్న అక్రమాలను ఎదిరిస్తూ, సరైన ధర ఇవ్వనందుకు, తాలు ఎక్కువ తీస్తున్నందుకు చాలా జిల్లాలలో రైతులు నిరసన ప్రదర్శనలు చేశారు. సిరిసిల్ల మార్కెట్‌లో ధాన్యం కుప్పలు తగులబెట్టి నిరసన వ్యక్తం చేశారు. జగిత్యాలలో రైతులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. వారిలో 40 మందిని పోలీస్ స్టేషనుకు తరలించారు. ఐదుగురు రైతులపై లాక్‌డౌన్ ఉల్లంఘన కేసు పెట్టారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజార్లలో ధాన్యం కొనుగోలులో జరుగుతున్న అక్రమాలను ప్రశ్నించినందుకు ఒక రైతుపై కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు గొడ్డలితో దాడి చేయగా ఆ రైతు తలకు, చేతికి గాయాలయ్యాయి.

ఈ సందర్భంగా రైతులకు యాసంగిలో వరి పండించదానికి అవుతున్న పెట్టుబడి ఖర్చు, పంటను అమ్మితే వస్తున్న ఆదాయం లెక్కలు చూస్తే రైతులు 6 నెలల పాటు కష్టపడి చెమటోడ్చి పండిస్తే రోజు కూలీ లెక్కన కూడా దక్కటం లేదని తెసులుస్తుంది.

2020 యాసంగి వరి సాగులో సగటు ఖర్చు (ఎకరాకు రు.)

1. నారుమడి, పొలం దున్నడం	5500
2. చదును చేయడం, (గొర్రు) వేయడం	1500
3. గట్టు చెక్కడం, పెట్టడం..........	1000
4. వరి నాటు............	4000
5. వరి విత్తనాలు హైబ్రిడ్ 20 కిలోలు...	1800
6. కలుపు మందు, కలుపు తీయడం	1800
7. డిఏపి బస్తాలు రెండు	2500
8. జింక్ 10 కిలోలు...	600
9. గుళికలు	1000
10. యూరియా 2 బస్తాలు	700
11. పొటాష్ 1 బస్తా	950
12. మందుల పిచికారీ	1000
13. వరి కోత మిషన్	2000
14. మిషన్‌కు ట్రాక్టర్	1000
15. ధాన్యం ఆరబెట్టడం	500
16. హమాలి ఛార్జ్	1000
పెట్టుబడి మొత్తం	**26,850**

ధాన్యం దిగుబడి బస్తాలు = 70 (బస్తా = 40 కిలోలు), 70×40 = 28 క్వింటాళ్ళు

క్వింటాలు వరి ధర 1810×28 = 50,680

రైతు పెట్టుబడి 26,850 పోను మిగిలింది 23,830 (ఆరుకాలం కష్టపడితే వచ్చే ఆదాయం)

రైతు 6 నెలల కష్టార్జితం, నెలకు = 3971

అంటే రైతుకు ఒక్క రోజుకు పడే కూలి రు.132 (ఇది ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనంలో సగం కూడా లేదు).

ఒకవేళ ప్రకృతి కన్నెర్ర చేసై, అంటే అకాల వర్షాలు, గాలి దుమారం, వడగండ్ల వాన లేదా అగ్గితెగులు, మెడవిరుపు, వగైరా లాంటి రోగాలు వస్తే కలిగే నష్టానికి అంతు లేదు. ఆ నష్టానికి పరిహారం అందుతుందన్న హామీ కూడా లేదు. అటువంటి పరిస్థితిలో రైతు పెట్టిన పెట్టుబడి కూడా ఒకొక్కసారి చేతికి తిరిగి రాదు. ఇంతటి నాజూకు పరిస్థితిలో వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రభుత్వం నుండి అందుతున్న సహాయం గాలిలో దీపం పెట్టిన చందంగా ఉంది. పైగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, అధికారులు, రైస్ మిల్లర్లు కుమ్మక్కై దోపిడీచేస్తున్నారు.

ఇది ఒక్క వరిపంటకే పరిమితం కాదు. మక్కజొన్న, పత్తి తదితర పంటల విషయంలో కూడా రైతు పెట్టే పెట్టుబడి పెరిగిపోయింది. పంట చేతికి వచ్చి ప్రభుత్వం ప్రకటించిన ధరకు కొనుగోలు చేసే దాకా హామీ ఉండటం లేదు, ఆదాయం సంగతి అటుంచి పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాక అత్యధిక శాతం రైతులు అప్పుల పాలవుతున్నారు.

ఇక కూరగాయల విషయానికి వస్తే సాధారణంగా రబీ సీజన్ (యాసంగి)లో తెలంగాణలో రైతులు బోర్ల కింద కొద్దిపాటి నీటితో కూరగాయలు పండిస్తారు. టమాటా, బెండ, మిర్చి, ఉల్లి, ఆకుకూరలు ఎక్కువగా సాగు చేస్తారు. వీటిని డిసెంబర్ – జనవరి నెలల్లో నాటుతారు, టమాట, బెండ నాటిన 45 రోజుల నుండి పంట దిగుబడి మొదలవుతుంది. కూరగాయల సాగుకు కూడా పెట్టుబడి ఎక్కువగానే ఉంటుంది. ఉదాహరణకు టమాటో తీసుకుంటే హైబ్రిడ్ విత్తనాలు (ప్రస్తుతం నాటు విత్తనాలు ఎక్కడో తప్ప అందుబాటులో లేవు) 10 గ్రాములు 660 రూపాయలు. ఎకరానికి 100 గ్రాముల విత్తనాలు నారు పోస్తారు. దున్నటం, నారు పెంచటం, రసాయన ఎరువులు వేయటం, నాటు వేయటం, కలుపు తీయటం, పురుగు మందులు చల్లటం మొదలైన వాటికి ఎకరానికి రు. 35,000 వరకు ఖర్చు అవుతుంది. తర్వాత కలుపు ఖర్చు, కాపు మొదలై టమాటా కోత కోయటానికి రోజుకు నలుగురు కూలీల చొప్పున రు. 1000 ఖర్చు ఉంటుంది. మార్కెట్‌కి తీసుకెళ్లడానికి రవాణా ఖర్చు ఉంటుంది.

పంట సరిగ్గా పండితే రోజుకు 500 కేజీల టమాటా దిగుబడి వస్తుంది. ఆ విధంగా రెండున్నర నుండి మూడు నెలల వరకు కాపు వస్తుంది. టమాటా కిలో రు.10 ధర పలికితే రైతుకు పెట్టుబడి తిరిగి రాగా కొంత అందాయం వస్తుంది. కానీ ఈ సంవత్సరం ఫిబ్రవరి నుండే టమాటా ధర పడిపోయింది. బహిరంగ మార్కెట్‌లో కిలో రు.10 అమ్ముతుంటే రైతుకు కిలోకు రు. 2–3 కంటే ఎక్కువ ధర లభించలేదు. దీనితో ఈ సంవత్సరం టమాటా రైతులకు పెట్టుబడి కూడా తిరిగి రాలేదు. అందుకే రైతు చెమటోడ్చి పండించిన టమాటాలు రోడ్డు పక్కన పారబోసి ఉండటం చాలా చోట్ల కనిపించింది. కొంతమంది రైతులు కోత ఖర్చు దండుగ అనుకుని చేనులోనే వదిలేశారు. అలాగే మిర్చి బహిరంగ మార్కెట్‌లో కిలో రు. 40 అమ్మితే రైతుకు కిలో రు. 14 కూడా లభించలేదు.

మార్చ్ మూడవ వారం నుండి విధించిన లాక్‌డౌన్ కారణంగా టమాటా, మిర్చి వంటి కూరగాయలను కోత కోయటానికి కూలీలు దొరకలేదు. లాక్‌డౌన్ కాలంలో వ్యవసాయ పనులకు సడలింపు ఇస్తున్నామని ఒకవైపు ముఖ్యమంత్రి ప్రకటించినప్పటికీ చాలా గ్రామాలలో కరోనా వ్యాప్తి సాకుతో పోలీసులు రైతులు, రైతు కూలీలను వ్యవసాయ పనులు చేసుకోనివ్వలేదు. ఇక కోసిన పంటను మార్కెట్ కి తీసుకెళ్లడానికి ఆటోలు నడవకపోవటంచేత అవసరమైనప్పుడు రవాణా సౌకర్యం లేకుండా పోయింది. అమ్ముకోవటానికి సరైన మార్గంలేక, అమ్మినా గిట్టు బాటు ధర లేక కూరగాయలు సాగు చేసిన రైతులు విపరీతంగా నష్టపోయారు. కూరగాయలు నిల్వ ఉండే ఉత్పత్తి కాకపోవటం కూడా తీవ్రమైన నష్టాలకు దారి తీస్తుంది.

వ్యవసాయం కార్పొరేట్ కంపెనీల ఆధీనంలోకి వెళ్లిపోయి ఉత్పాదకాల ధరలు పెరిగిపోవటం కారణంగా పెరిగిన ఉత్పత్తి ఖర్చు, సకాలంలో వర్షాలు పడకపోవటం, తెగుళ్ల సోకి దిగుబడి రాకపోవటం, దిగుబడి వచ్చినా మార్కెట్‌లో ధర లేకపోవటం, అమ్ముకోవటంలో ఇబ్బందులు, ప్రయివేటు వ్యాపారస్తులు, రైస్ మిల్లర్లు, మధ్య దళారుల దోపిడీ, ఇవన్నీ కలసి గత రెండు మూడు దశాబ్దాలుగా రైతులు అప్పులు పాలయ్యే పరిస్థితికి నెట్టివేశాయి. అప్పులు పేరుకుపోయి తీర్చే మార్గం లేక ఆత్మహత్యేలు చేసుకుంటున్నారు.

గత 25 ఏళ్లలో దేశ వ్యాప్తంగా 3.5 లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని జాతీయ నేర రికార్డుల బ్యూరో అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. తెలంగాణలో రైతుల ఆత్మహత్యల సంఖ్య 30,000 వరకు ఉంటుంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి ఆరు సంవత్సరాలు గడుస్తున్నా, ఆత్మహత్యలు కొనసాగుతూనే వున్నాయి. రైతు ఆత్మహత్యలు ఆగిపోయాయని ప్రభుత్వం అబద్దాలు ప్రచారం చేస్తున్నా ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి.

లాక్‌డౌన్ కాలంలో ఈ సంక్షోభం అన్ని సెక్షన్ల ప్రజలను ఇబ్బందులకు గురిచేసినట్లే రైతుల పైన కూడా తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని కలిగింది. రైతులు ఈ సమయంలో ఎదుర్కుంటున్న ప్రత్యేక సమస్యలను పరిష్కరించటానికి ప్రభుత్వం ఉత్తరువులకు, ప్రకటనలకు మాత్రమే పరిమితమైంది. ఇచ్చిన హామీలను సక్రమంగా అమలయ్యేటట్లు చర్యలు తీసుకోవటంలో శ్రద్ధ కనబరచలేదు

కాళేశ్వరం ప్రాజెక్టు నీటితో బీడు భూములు మాగాణులుగా మారి ఈ సంవత్సరం యాసంగిలో అత్యధిక విస్తీర్ణంలో పంటలు సాగైనా యని ప్రభుత్వం. గర్వంగా ప్రకటించింది. సాగు నీరు, 24 గంటల విద్యుత్ సరఫరా చేయగానే వ్యవసాయ సంక్షోభం, రైతుల రుణభారం వంటి సమస్యలన్నీ పరిష్కారం కావు అని ప్రభుత్వం గుర్తించాలి. దశాబ్దాలుగా వెళ్లానుకుని వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించటానికి ఒక సమగ్రమైన వ్యవసాయ విధానాన్ని రూపొందించాలి. భూమి యజమానులకు కాక వ్యవసాయం చేస్తున్న రైతులకు అన్ని రకాల సహాయం అందాలి. వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీల అదుపు నుండి విముక్తం చేసి పెట్టుబడి ఖర్చులు తగ్గించాలి, మార్కెట్ రైతుకు అనుకూలంగా ఉండాలి.

(వరి, కూరగాయల సాగు ఖర్చులు యాదాద్రి భువనగిరి జిల్లా నుండి జిట్టా బాల్‌రెడ్డి అనే రైతు అందించిన సమాచారం ఆధారంగా)

(రచయిత రైతు స్వరాజ్య వేదిక) వీ

కరోనాలో కల్లు చావులు

కల్తీ కల్లుకు అలవాటు పడ్డ పేదకూలీలు కరోనా లాక్‌డౌన్ వల్ల అది దొరక్కపోవడంతో వింతగా ప్రవర్తిస్తున్నారనీ, కరోనా మరణాల కన్న వీరి సంఖ్య అధికంగా ఉంటోందనీ, ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమనీ అంటున్నారు ప్రొ. లక్ష్మణ్ గడ్డం

లాక్‌డౌన్ కాలంలో కల్లుకు వెసులుబాటు కల్పించే అంశంపై ప్రభుత్వం సానుభూతితో ఆలోచించాలని, కల్లు దొరకకపోవడం పేద కూలీలకు ప్రాణ సంకటంగా పరిణమించిందని ఇంగ్లిష్ మందులకన్నా ఈ వర్గం ప్రజల ప్రాణాలు కాపాడడానికి కల్లే మందు, ఔషధమని కాంగ్రెస్ ఎంఎల్ఎ జగ్గారెడ్డి ప్రభుత్వానికి సూచించాడు. ఈ అభ్యర్థనలో ఒక సున్నిత మానవీయమైన కోణం దాగి ఉంది. ఏ ఇతర వాదాలకు ప్రస్తుత పరిస్థితిలో స్థానం లేదు. పరిస్థితులు చక్కబడ్డ తర్వాత మిగతా విషయాలు తీరికగా చర్చించుకోవచ్చు కాని ఇప్పుడు మాత్రం జగ్గారెడ్డి ఆలోచనను ఔదార్యంతో ఆలోచించాల్సిన అవసరముంది.

ఈ మత్తు కల్లుకు బానిసలైన వారు ఎవరో కాదు గ్రామాల్లో వ్యవసాయ కూలీలు, నగరాల్లో అడ్డా కూలీలు. ఆకలిగొన్న కడుపులకు ఇంత ముద్దపెట్టే అన్నదాతలు మరోవైపు అత్యాధునిక అభివృద్ధి సోపానాలకు వెన్నెముకలాంటి వారు. అమితమైన గలీజును ఎత్తివేసి నాగరిక సమాజాన్ని సుందరీకరించిన మురికి అంటని కుమ్మరి పురుగులు వాళ్లు. ఎన్నో రోడ్లు, ఎన్నో భవనాలు, ఎన్నో నిర్మాణాలు, ఎన్నో ఫ్యాక్టరీలు, ఎన్నో ఫ్లైవోవర్లు, ఎన్నో అపార్ట్‌మెంట్లు, అవే చేతులు మీదుగా అద్భుతంగా సాకారమయ్యాయి. పొద్దంతా కష్టించి అలసిసొలసిన శరీరానికి నొప్పి సలపకుండా నిద్రపట్టడానికి కడుపులో అన్నం సగమే నింపి మిగిలింది కల్లుతో నింపుకొని కంటినిండ అదమరిచి నిద్రపోయే అభాగ్య జీవులు. అలసిన శరీరానికి కల్లు, సారానే మంచి ఔషదమని భ్రమించిన బడుగు జీవులు. కాలక్రమంలో దానికే బానిసలయ్యారు.

ఈ ఒక్క బలహీనత ఇటు ప్రభుత్వానికి అటు కాంట్రాక్టర్లకు కోట్లు గడించే పెద్ద వ్యాపార వనరైంది. బాధ్యతగల ప్రభుత్వాలు వీరి జీవితాలతో వ్యాపారం చేయడం మొదలు పెట్టాయి. ఒక దేశం ప్రతిష్టను కొలవడానికి కొలబద్ద ఆ దేశం ఎన్ని కోట్ల ఆర్థిక వ్యవస్థను రూపొందించిందనడానికన్న ఆ దేశ ప్రజలు దృఢంగా మానసిక పరిపుష్టితో ఉన్నారనేది ప్రాతిపదికగా నిలుస్తుంది. ప్రపంచ మానవాభివృద్ధి ఇండెక్సు అధ్యయనంలో భాగంగా నిర్వహించిన 119 దేశాల సర్వేలో భారతదేశం అట్టడుగు స్థానం 103లో ఉంది. మనకంటే పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీశీలంక, మయన్మార్ మెరుగైన స్థానంలో ఉన్నాయి. ఇది ఏడు దశాబ్దాల విషాదం.

2025 కల్లా అయిదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తామన్న పాలకులు ఎప్పటికల్లా దారిద్ర్య రేఖ దిగువన ఉన్న 40 శాతం ప్రజలను గట్టెక్కిస్తారో సెలవివ్వలేదు. వీరి దారిద్ర్యానికి ఎవరు బాధ్యులు. పాలకులు కారా? దరిద్రుల శ్రమ మీదుగా సృష్టించబడుతున్న సంపద ఎటు కొట్టుకుపోతుంది. అట్టడుగున ఉన్న మానవాభివృద్ధి సూచికను అందరికంటే ముందు భాగాన ఎప్పటికల్లా చేర్చుతారు మన పాలకులు! పేద ప్రజలను పట్టి పీడిస్తున్న బలహీనతల నుండి విముక్తులను గావించే పథకాలు పాలకుల దగ్గర ఉన్నాయా? పైగా అవే బలహీనతలను సొమ్ము చేసుకుంటున్నారు. ఆర్టికల్ 47 ప్రకారం 'ప్రజల పోషకాహార ప్రమాణాన్ని, జీవన ప్రమాణాలను, ప్రజారోగ్యాన్ని పెంపొందించడం ప్రభుత్వం తన బాధ్యతలలో ప్రధానమైనదిగా భావించాలి. ఆరోగ్యానికి హానికరమైన మత్తు పానియాలు, మాదకద్రవ్యాలను కేవలం వైద్య అవసరాలకు మినహా ఇతరత్రా వినియోగించడాన్ని నిషేధించే ప్రయత్నం చేయాలి.

గత ప్రభుత్వాలు అన్ని కూడా ఈ స్ఫూర్తికి విరుద్ధంగా పనిచేశాయి. భారత రాజ్యాంగంలోని శ్రేయోరాజ్య ఆశయాల నుండి ప్రభుత్వాలు వైదొలగి అగాధాలు సృష్టిస్తున్నాయి. ప్రజల ఆదాయాన్ని గుంజుకోవడానికి గుంటనక్కలా కాచుకొని ఎన్నెన్ని బలహీనతలను ప్రజల మీదకు వెదజల్లుతుంది. సామాన్య ప్రజలను, యువతను మద్యం, వినోదం, ఆహ్లాదం, అనుభవం అనే మత్తులలో, వ్యవసనాలలో ముంచి దైనందిన సమస్యలపై కలిగే తమ అసంతృప్తిని ప్రభుత్వాలకు వ్యతిరేకంగా రాకుండా జాగ్రత్త పడుతుంది. ఈత చెట్లే లేని ఈ కాలంలో అసలైన కల్లు లభ్యం కావడం లేదని ప్రభుత్వాలకు తెలుసుగదా! మరి కల్తీకల్లు తయారికి ఎందుకు అనుమతులు ఇచ్చినట్లు? ఈ కృత్రిమ కల్లువల్ల ఎన్ని కుటుంబాలు నాశనమవుతాయో ప్రభుత్వానికి తెలియనిదా? డిస్టిల్లరీలకు, బ్రూవరీలకు లైసెన్సులు జారీ చేసేది ఈ ప్రభుత్వాలే గదా! పేదల పొట్టల్లో గంజినీళ్లకు బదులు సారా లేదా కల్లు నీళ్లు పోయండని పురమాయించడానికే కదా! మద్యం సేవించడం, పొగత్రాగడం ఆరోగ్యానికి హానికరమని సినిమా హాళ్లలో, సిగరెట్ పెట్టెలపై ప్రకటనలిస్తే సమస్య సమసిపోతుందా? పైగా ఈ ప్రకటనల కోసం చేసే కోట్ల ఖర్చు తిరిగి ఎవరి జేబులు నింపుతుంది? ఎందుకీ హిపోక్రసీ?

శ్రమజీవులు నివసించే ప్రతి బస్తీలో తప్పనిసరిగా సారా దుకాణం, కల్లు దుకాణం వెలసి ఉండడం యాదృచ్ఛికమేనా? సారాజుల నుండి, లిక్కర్ మాఫియాల నుండి ముడుపులు మింగడానికి అలవాటుపడ్డ రాజకీయ నాయకులు, అధికారులు ఉద్దేశపూర్వకంగా మంజూరు చేసిన, పేదలను కొల్లగొట్టే ఆదాయకేంద్రాలు కావా అవి. భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో కల్లు, సారా ఏరులై పారకుండా ఎలక్షన్లు ఎప్పుడైనా జరిగాయా? బలహీనతలను సొమ్ము చేసుకోవాలనుకోవడం నైతిక పతనమే కదా. ఈ ప్రక్రియ పాలసీ విధానంగా కొనసాగితే మానవ అభివృద్ధి సూచికలో 109వ స్థానం దాటి పైకి ఎగబాకగలమా ఎన్నటికైనా?

మద్యాన్ని సామాజిక రుగ్మతగా భావించి మహిళలు మద్యపాన నిషేధం కోసం పోరాడితే దిగొచ్చిన ప్రభుత్వం 1994లో నిషేధాన్ని విధిస్తే రెండు సంవత్సరాలు అమలు జరిగింది. ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా బాగుపడ్డాయి. అయితే ఆ నిషేధ సమయంలో ప్రజలు స్థిమితంగానే ఉన్నారు. అది మత్తుమందుల కల్లు కాదు గనుక ఉపసంహారణ ప్రభావాలకు గురికాలేదు. ఇప్పుడున్నదల్లా మత్తుకల్లే గనుక నిష ప్రభావం బయటపడుతుంది. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక

మద్యపాన నిషేధానికి తూట్లు పొడిచి మళ్లీ మద్యాన్ని ఏరులై పారించాడు. ప్రజలను తాగుబోతులను జేసి, వాళ్ల ఆరోగ్యం, కుటుంబాలను నాశనం చేసి ఖజానా నింపుకున్నాడు. కల్తీకల్లు, నాటు సారా తయారీ చంద్రబాబు పాలనలో మొదలైంది. స్వయంగా ప్రభుత్వంలో భాగస్వాములైన వాళ్లే ఈ వ్యాపారం నింపాదిగా కొనసాగించారు. 'వారుణి వాహిని' పేరుతో చిన్న చిన్న బాటిళ్లలో, ఆ తర్వాత పాలిథిన్ ప్యాకెట్లలో సారాను గ్రామ గ్రామానికి, వీధి వీధికి దించి బీదాబిక్కి జనానికి, పదేళ్లు నిండిన పిల్లల వరకూ అందరినీ మద్యపాన వ్యవసనపరులుగా మార్చారు. కల్లు, సారా తాగడం అనేది గ్రామాల్లో, బస్తీల్లో ఒక బలమైన సంస్కృతిగా, ధైర్యపుష్టి కషాయంగా మార్చింది ప్రభుత్వం. మహిళలు ఎక్కడికక్కడ అడ్డుకుంటుంటే పోలీస్ స్టేషన్లలో తుపాకుల పహారాతో సారాను అమ్మించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిది. ఆ తర్వాత అదే విధానాన్ని కొనసాగించడం వలన ఏర్పడిన మహా విపత్తు వికృత రూపాలు కరోనా సమయంలో కనబడుతున్నాయి.

ఒక యుద్ధం సంభవిస్తే ఆయా దేశాల శక్తిసామర్థ్యాలు ఎలాగైతే బయటపడతాయో కరోనా లాంటి ప్రాణాంతకమైన క్రిములు బయట పడినప్పుడు ఆరోగ్య అంశాలతో పాటు, ఆర్థిక కోణాలు, ప్రజా పంపిణీ వ్యవస్థ, పేదల స్థితిగతుల సమీక్ష తెరమీదకు వస్తాయి. ప్రజాస్వామిక ప్రభుత్వాలు వీటన్నింటికి జవాబుదారీ కావాలి. ప్రభుత్వాలు అమలు పరుస్తున్న విధానాలు అట్టడుగు ప్రజల జీవన వైవిధ్యాలను ప్రభావితం చేస్తున్నప్పుడు సంయమనంతో వాటి పరిష్కారం కోసం దృష్టి పెట్టాలి. లాక్‌డౌన్‌లో కల్లు దుకాణాలు బందుకావడంతో దానికి బానిసలైన వారి గురించి బాధ్యతగా ఆలోచించాలి. రాష్ట్రంలో చాలా చోట్ల కరోనా కాటేయకముందే కల్తీకల్లు లేమి కాటేస్తుంది. క్లోరోఫాం, డైజోఫాం మత్తు పదార్థాలతో తయారయ్యే కల్లు దొరకకపోవడంతో బానిసలైన పేద ప్రజలు పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తున్నారు. వింత చేష్టలకు పాల్పడుతున్నారు. మతితప్పి రోడ్ల మీదకు పరుగులు తీస్తున్నారు. బట్టలు చింపేసుకుని నిగ్నంగా తిరుగుతున్నారు. వీరిని రక్షించుకోవడం కుటుంబ సభ్యులకు కంటిమీద కునుకు లేకుండా పోతుంది.

డైజోఫాం, క్లోరో హైడ్రీడ్ కలిపిన కల్లు తాగి అలవాటుండి ఒక్కసారిగా అది దొరకకపోయేసరికి మతిస్థిమితం కోల్పోతారు. దీన్నే ఆల్కహాల్ విత్‌డ్రాల్ డెలీరియాగా వ్యవహరిస్తారు. కల్లు మానేసిన 48 గంటల తర్వాత లక్షణాలు బయట పడతాయి. ఒకవిధమైన గందరగోళానికి గురై మెదడుకు రక్తం సరఫరా తగ్గిపోతుంది. డోపమైన్ మెదడులో ఎక్కువగా విడుదల కావడంతో శరీరంపై పట్టు తప్పుతుంది. మూత్ర పిండాలు, గుండె, లివర్, మెదడుపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుంది. ఆత్మహత్యలు చేసుకోవడం, ఇతరులపై దాడి చేయడం లాంటి ఘటనలకు పాల్పడుతారు. శరీరంలో మొదలు వణుకు తర్వాత ఫిట్స్ వస్తాయి. ఇది ముదిరితే పిచ్చివాడై ఆత్మహత్యలకు పాల్పడుతారు.

నిజామాబాదు జిల్లాలో కల్తీకల్లు కోసం పేద ప్రజలు ఆందోళనకు దిగారు. నిజామాబాదు జిల్లా గాయత్రినగర్‌కు చెందిన శంకర్ (45) మతికోల్పోయి తన ఇంట్లోనే ఉరేసుకొని చనిపోయాడు. సాయినగర్‌కు చెందిన శకుంతల (60) వింత ప్రవర్తనతో ఫినాయిల్ తాగి చనిపోయింది. ముదిరాజ్ వీధికి చెందిన మరో వ్యక్తి (50) మూర్ఛతో నిజామాబాదు జిల్లా ఆసుపత్రిలో మృతి చెందాడు. వనపర్తి జిల్లా ఏదుల్ గ్రామానికి చెందిన బోయల నగేష్ (50) హైదరాబాద్‌లో వలస కూలి. కల్లు లభించకపోవడంతో డిసిపి కార్యాలయం ఎదుట చెట్టుకు ఉరేసుకుని చనిపోయాడు. వికారాబాద్ జిల్లా షాబాదు గ్రామానికి చెందిన చాకలి సత్తయ్య (46) కల్లు లేకపోవడంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఉరేసుకుని చనిపోయాడు. వికారాబాదు జిల్లా తోరుమామిడికి చెందిన మొగులయ్య (38) వింతగా ప్రవర్తిస్తూ విద్యుత్తు తీగను పట్టుకుని చనిపోయాడు. కామారెడ్డి జిల్లా జుక్కల్‌కు చెందిన రాజు (34), పటాన్‌చెరు మండలం ఇంద్రీశం గ్రామానికి చెందిన లక్ష్మయ్య (60) లు ఇరువురు కల్లు తాగేందుకు తిరిగి తిరిగి మూర్ఛతో కిందపడి చనిపోయారు. మెదక్ జిల్లా చేగుంటకు చెందిన నత్తి మంగమ్మ (55) కల్లు లభించక పిచ్చిదై కిందపడి తీవ్ర గాయాలపాలై చనిపోయింది. వెల్దుర్తి మండలం మాసాయిపేటకు చెందిన కాశమైన కిష్టయ్య (76) తన ఇంట్లోనే దూలానికి ఉరేసుకుని చనిపోయాడు. నిజాంపేట మండలం బచ్చురాజ్‌పల్లి గ్రామస్థుడు కిష్టయ్య (40) కుటుంబ సభ్యులంతా నిద్రపోయిన తర్వాత ఇంట్లో నుంచి వెళ్లిపోయి చెరువులో పడి చనిపోయాడు.

సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన సామల్ల కిష్టయ్య (65) మానసిక ఆందోళనతో కత్తితో కడుపులో పొడుచుకుని గాయపరుచు కున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లా కొడంగల్‌కు చెందిన వలస కూలి రాజు హైదరాబాద్ చింతలబస్తీ పోలీస్ ఔట్‌పోస్టు ఎదురుగా ఉన్న దుకాణం మెట్లపై కూర్చుని కత్తితో గొంతుకోసుకున్నాడు. కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం పేరాయిగూడెంకు చెందిన మద్రివాడ రాంబాబు (35) చాకుతో గొంతుకోసుకున్నాడు. మెదక్ జిల్లాకు చెందిన నాగరాజు (47) పటాన్‌చెరులోని భవనంపై నుంచి దూకి తీవ్ర గాయాలపాలై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్ట దేవమ్మ బస్తీలో అంజయ్యనగర్‌కు చెందిన ప్రకాశ్ (60) కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. కల్లు దొరకక పోవడంతో మతిస్థిమితం కోల్పోయి కనిపించకుండాపోయి శవమై బయటపడ్డాడు. గోల్కొండ ప్రాంతంలోని అన్నపూర్ణనగర్‌కు చెందిన సావిత్రి అనే మహిళ కల్లు లేక గొంతు ఎండుకపోయి మృత్యువాతపడింది. పటాన్‌చెరు పట్టణం జె.పి. కాలనీలోని బిక్షపతి (48) కల్లు దొరక్క ఫిట్స్ బారినపడి మరణించాడు. సంగారెడ్డి మండలం తాళ్లపల్లికి చెందిన దేవదాసు (45) కల్లు దొరక్క వింతగా ప్రవర్తించి ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పటాన్‌చెరులో నివాసముండే భవాని కృష్ణప్రసాద్ (45) ఇల్లు వదిలి వెళ్లిపోయి సమీప పొదల్లో శవమై దొరికాడు. ఆందోలు మండలం మాసాపల్లికి చెందిన వడ్ల సత్తయ్య (40) కల్లును వెతుక్కుంటూ పోయి ఇంటికి తిరిగి రాలేదు. హైదరాబాద్, ఉప్పల్, గణేష్‌నగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు (62) మద్యం దుకాణాలు మూసినప్పటి నుండి భార్య పిల్లలో గొడవపడుతూ ఓ రోజు వారిని బయటికి నెట్టేసి ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందాడు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం కొడిచెర్లకు చెందిన చింతకింది లక్ష్మయ్య (34) వింతగా ప్రవర్తిస్తూ ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకుని ఆత్మహ్యతకు పాల్పడ్డాడు. మేడ్చెల్ జిల్లా దుండిగల్ దగ్గర గండి మైసమ్మ కల్లు కాంపౌండ్ వెనుక గుర్తు తెలియని వ్యక్తి (33) పగిలిన కల్లు సీసాల నడుమ పడి చనిపోయాడు. ఇదే కల్లు దుకాణం ముందు భాగంలో మరో వృద్ధుడు మృతిచెందాడు. రాజేంద్రనగర్‌లోని కిస్మత్‌పూర్‌కు చెందిన దాసరి వెంకటయ్య కల్లు కోసం వెంపర్లాడుతూ బాత్‌రూంలో తదేకంగా వెతుకుతూ అక్కడే పడి చనిపోయాడు. మేడ్చెల్ జిల్లా బీరంపేటలో గుర్తుతెలియని వ్యక్తి వాటర్ ట్యాంక్ పైకి ఎక్కి వింతగా ప్రవర్తించి కిందికి దూకి తీవ్ర గాయాలపాలై గాంధీ ఆసుపత్రిలో మృతి చెందాడు.

నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలానికి చెందిన శంకర్ (68) లక్ష్మి కాలువలో దూకి ప్రాణాలోదిలాడు. బాల్కొండ మండలం

కిసాన్‌నగర్‌కు చెందిన సుబాష్‌చాంద్ వాగ్మారే (56) విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ పట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ జిల్లా బూర్గుపల్లి గ్రామానికి చెందిన చాకలి రాజయ్య కల్లు లేక మతిస్థిమితం తప్పి శివార్లలోని బావిలో దూకి చనిపోయాడు. కర్నాటక రాష్ట్రంలోని సేడెం ప్రాంతానికి చెంది అలీ సాహెబ్ హైదరాబాద్ నుంచి కాలినడకన సొంతూరికి బయలుదేరాడు. దారితప్పి వికారాబాద్ జిల్లా పరిగిలోని ఎర్రగడ్డపల్లి వ్యవసాయ క్షేత్రంలోకి ప్రవేశించి కల్లు కోసం వెంపర్లాడుతూ అక్కడే పడి చనిపోయాడు. సంగారెడ్డి మండలం కల్పగూర్‌కి చెందిన మంగలి రాములు (75) కల్లు లేకపోవడంతో తీవ్ర అస్వస్థకు గురై చనిపోయాడు. ఆందోల్ మండలం మన్యాన్‌పల్లికి చెందిన సత్తయ్య (57) ఇస్నాపూర్ పెద్ద చెరువు వద్ద చెట్టుకు ఉరేసుకుని మృత్యువాత పడ్డాడు. కొండాపూర్ మండలం గిర్మాపూర్‌కి చెందిన లక్ష్మినారాయణ (30) వింతగా ప్రవర్తిస్తూ కిందపడి గాయాలపాలై సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించాడు. కొండాపూర్‌కు చెందిన నాగయ్య (75) కల్లు దొరక్క సమీప పాడుపడ్డ బావిలో దూకి మృతి చెందాడు. నిజామాబాద్ జిల్లా ఆర్మూరు మండలం ఆలూర్‌కి చెందిన రాము (34) తీవ్ర అస్వస్థకు గురై మరణించాడు. లాలాపేటకు చెందిన కూలీ పనులు చేసుకునే మహ్మద్ దస్తగిరి (43) మల్కాజ్‌గిరి యాదవనగర్‌లో ఫిట్స్‌వచ్చి రోడ్డుపక్కనపడి చనిపోయాడు. లాలాపేట వాసి ఫ్రాంక్విలిన్ (45) కల్లు కోసం అల్లాడిపోయి రోడ్ల వెంబడి తిరుగుతూ చివరికి మౌలాలి బిడ్జి కింద పడుకుని నిద్రలోనే చనిపోయాడు. నేరెడ్‌మెట్‌లోని సాయినగర్‌లో నివాసముండే లక్ష్మమ్మ (65) కల్లు కోసం మానసిక స్థితి కోల్పయి ఇల్లువదిలి ఇప్పటివరకు తిరిగి రాలేదు. మెదక్ జిల్లా జహీరాబాద్‌కు చెందన మంగలి రాజు (39) కుటుంబంతో వలస వచ్చి జగద్గిరిగుట్ట మహాలక్ష్మినగర్‌లో నివసిస్తున్నాడు. కల్లు బంద్ కావడంతో వింతగా ప్రవర్తిస్తూ ఫిట్స్‌వచ్చి ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు.

రంగారెడ్డి జిల్లా కొత్వాల్‌గూడకు చెందిన మల్లేష్ యాదవ్ (40) కల్లు లభించక గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని చనిపోయాడు. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలో విఠల్ (55) పోలానికి వెళ్లున్నట్లు ఇంట్లో చెప్పి కల్లు కోసం వెంపర్లాడుతూ ఊరు బయట విగతజీవిగా కనిపించాడు. బంట్వారం గ్రామానికి చెందిన వ్యక్తి సహకార సంస్థలో వాచ్‌మెన్‌గా చేస్తున్నాడు. కల్లు దొరకకపోవడంతో మతిస్థిమితం కోల్పోయి కార్యాలయంలోనే పడి చనిపోయాడు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని చైతన్యపురి కాలనీ వాసి ఈశ్వరమ్మ (36) వింతగా ప్రవర్తిస్తూ వాటర్ ట్యాంక్ ఎక్కి కిందికి పడిపోయి గాయాలపాలై చికిత్స పొందుతుంది. బేగంపేట (హైదరాబాద్) బస్తీ నాలా సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి పిచ్చిపిచ్చిగా తిరుగుతూ, అరుస్తూ నాలాలో పడి చనిపోయాడు. జీడిమెట్ల ఎచ్ఎంటి ఖాళీ స్థలంలో ఆచూకి తెలియని వ్యక్తి కల్లు లభించక పడిపోయి చనిపోయాడు. కెపిఎచ్‌బి కాలనీ, ఎల్లమ్మబండకు చెందిన దశరథ్ (45) మేస్త్రీ పనిచేసుకుంటూ బతుకుతున్నాడు. కల్లు కోసం తిరిగి తిరిగి చివరికి శంషీగూడ ప్రాంతంలో పడి ప్రాణాలు వదిలాడు. ఖైరతాబాద్‌లోని ఐమాక్స్ థియేటర్ ఎదురుగా ఉన్న ఎచ్ఎండిఎ లేక్‌వ్యూ పార్క్ కొలనులో చిరునామా తెలియని ఓ వ్యక్తి నీళ్లలో పడి చనిపోయాడు. రాజ్ భవన్ సమీపంలో గుర్తుతెలియని ఓ మహిళ కల్లు కోసం తిరిగి కిందపడి చనిపోయింది. భువనగిరి జిల్లా ఆత్మకూరుకు చెందిన నాగరాజు యాదవ్ మల్కాజ్‌గిరి వాణినగర్‌లోని వాణి విల్లా అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కల్లు దొరకకపోవడంతో పిచ్చెక్కి రోడ్డుపై తిరుగుతూ గీతంనగర్ రైల్వే ట్రాక్ సమీప పొదల్లో పడి చనిపోయాడు. ఒరిస్సాకు చెందిన పూర్ణచందర్‌రావు వలస వచ్చి జుబ్లీహిల్స్ రోడ్ నెం. 35లో ఉంటున్నాడు. భార్య మద్యానికి డబ్బులు నిరాకరించడంతో మనస్థాపానికి గురై గుర్తుతెలియని టాబ్లెట్లు వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తుకారాంగేట్ రియోపాయింట్ వద్దెర బస్తీకి చెందిన కనకరాజు కూలి పనిచేస్తూ బతుకుతూ కల్లు తాగక మతిస్థిమితం కోల్పోయి ఫిట్స్ కూడా రావడంతో కుప్పకూలి మృతి చెందాడు. బాలానగర్ చెరబండరాజునగర్‌కు చెందిన ఎర్ర నారాయణ (68) కల్లు లభించక మతిస్థిమితం కోల్పోయి ఇల్లువదిలి తిరిగి రాలేదు. శేరిలింగంపల్లి పాపిరెడ్డి కాలనీలోని బాంబే భవన సముదాయాల్లో నివసించే శివయ్య (42) కల్లు దొరక్క పిచ్చెక్కి నిద్రలోనే కన్నుమూశాడు. తుకారంగేట్ గడ్డమీది బస్తీకి చెందిన బాలుడు (17) కల్లుకు బానిసై ఫిట్స్ వచ్చి మృతి చెందాడు. కాచిగూడ నింబోలి అడ్డాకు చెందిన సాయికిరణ్ (32) ఓ షాప్‌లో సేల్స్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. మద్యం లభించకపోవడంతో మానసిక వ్యథకులోనై ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి మద్యం దొరకకపోవడంతో పిచ్చెక్కిన వాళ్లు వేల సంఖ్యలో ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రికి చేరుతున్నారు. వచ్చిన వారిలో 60 శాతం మంది పరిస్థితి విషమంగా ఉంది. ఇది రాజ్యం సృష్టించిన విషాదం. మద్య నిషేధాన్ని అమలు పరిస్తే ఈ దుస్థితి దాపురించేది కాదు. ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన తక్షణ కర్తవ్యం వచ్చిపడింది. కల్లుకు సడలింపు కలిగించాలి. కరోనా చావులను నిలవరించడం మానవుని చేతిలో లేకపోయినా కల్లు చావులను నిలవరించడం పాలకుల చేతిలోనే ఉంది. కరోనా కల్లోలం ప్రత్యక్ష్యంగానే కాక పరోక్షంగా కూడా ఈ రకంగా ప్రజలు బలవుతున్నారు. పరోక్షంగా చనిపోయిన వాళ్లెవరూ కరోనాను దేశంలోకి తెచ్చినవారు కాదు. చేయని నేరానికి బలవుతున్నారు. దీన్ని ఈ దేశంలోకి తెచ్చినవారు విమానాల్లో తిరిగే సంపన్న వర్గాల వారే! లాక్‌డౌన్‌లో సంపన్న వర్గాలు హాయిగా పిల్లా పాపలతో కులాసాగా కాలం గడుపుతున్నారు. చక్కని యోగాలు, వ్యాయామాలు చేస్తూ ఆరోగ్యాన్ని మరింత కాపాడుకుంటున్నారు. టివీల ఎదురుగా కూర్చుని ఇష్టమైన సినిమాలు చిరుతుళ్లు తీంటూ ఆనందిస్తున్నారు. ఇంకా కొంతమంది రాజకీయ నాయకులు చదరంగం ఆడుకుంటున్నారు. పేదలు మాత్రం రోడ్ల పాలయ్యారు. భారతదేశం రెండు లోకాలు. ఒకటి ఉన్నోళ్లది, ఇంకోటి లేనోళ్లది.

కరోనా చావులకంటే కల్లు చావులే అధికంగా ఉన్నాయి. కరోనా చావుల గురించి ఆందోళన పడుతున్న ప్రభుత్వం కల్లు చావుల గురించి ఎందుకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నది? పేద ప్రజల ప్రాణాలు విలులేనివా?

తమ దేశం నుంచి కరోనా వైరస్‌ను విజయవంతంగా తరిమికొట్టిన చైనా ఇలాంటి సున్నిత వైరుధ్యాలను సహితం పరిష్కరించి తమ పౌరులను కాపాడుకుంది. చైనా చొరవను ఆదర్శంగా తీసుకోవాలి. సొంతూర్లకు కాలినడకన బయలుదేరిన వాళ్లను మార్గమధ్యంలో అడ్డుకోవడం అమానుషం. ఒక భయంకరమైన మహమ్మారిపై పోరాటం చేసేటప్పుడు ప్రజలను ఇళ్లల్లో కట్టిపడేసి, దానికిగాను క్షమాపణలు అడగడం ఒక్కటే కాదు క్షేత్ర స్థాయిలో వివిధ సెక్షన్ల ప్రజలు ఎదుర్కొనే జీవన సంఘర్షణలోకి మానవీయ మనసుతో తొంగిచూసి పరిష్కరించినప్పుడే సాఫల్యతకు సంపూర్ణత దక్కుతుంది.

(రచయిత అధ్యక్షులు పౌరహక్కుల సంఘం) వీ

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ - ఒక పరిశీలన

తెలంగాణ ఆర్థిక వ్యవస్థ నిర్వహణ సక్రమంగా జరగడం లేదని రాష్ట్ర ఏర్పాటు తర్వాత గడిచిన ఆరు సంవత్సరాల బడ్జెట్ల పరిశీలనతో అంటున్నారు ప్రొ. ఎం. కోదండరామ్

ప్రపంచంలోని ఆధునిక ప్రజాస్వామిక సంప్రదాయాలు చాలా వరకు యూరప్ దేశాలలో ఫ్యూడల్ వ్యవస్థపై జరిగిన తిరుగుబాట్ల నుండి పుట్టినాయి. బడ్జెట్ అని మనం పిలుచుకుంటున్న ఆదాయ-వ్యయ పట్టికను తయారు చేసే పద్ధతి కూడా ఆ కాలంలోనే వచ్చింది. యూరప్లో మధ్య యుగాలలో ఫ్యూడల్ ప్రభువులు ప్రజలను పీడించి పన్నులు వసూలు చేసేవారు. ఈ దురాచారాన్ని ఫ్యూడల్ వ్యతిరేక పోరాటాలు ప్రశ్నించాయి. ప్రజలను సంప్రదించకుండా పన్ను వసూలు చేయరాదని ఈ పోరాటాలు బలంగా డిమాండ్ చేసినాయి. 1215లో రాజుకు, ప్రజలకు మధ్య జరిగిన మాగ్నాకార్టా ఒప్పందంలో ఈ ప్రతిపాదన భాగమై ఒక నియమంగా మారింది. 1689లో ఇంగ్లండులో వచ్చిన రక్తరహిత విప్లవం వరకు బడ్జెట్ కేవలం పన్నులను మాత్రమే నిర్ణయించేది. ఆ విప్లవం తరువాత పన్నులతో పాటు ఆయా పద్దులకు, అవసరాలకు ప్రజా ధనాన్ని కేటాయించే అధికారం కూడా శాసన సభకు దక్కింది. ఆ తరువాత కాలంలో బడ్జెట్ లక్ష్యాలు, పరిధి బాగా విస్తరించాయి. కేవలం ప్రభుత్వ ఆదాయ వ్యయాలను నియంత్రించడమే కాక మొత్తం ఆర్థికాభివృద్ధికి, సామాజిక ప్రగతికి దిశానిర్దేశం చేసే సాధనంగా బడ్జెట్ మారిపోయింది. అయితే ఇన్ని పరిణామాల నడుమ మారని అంశం ఒకటున్నది. సాధారణంగా బడ్జెట్‌ను మార్చి నెలలో ప్రవేశ పెడతారు. ఆ బడ్జెట్ సంవత్సరాన్ని విత్త సంవత్సరం అంటారు. క్యాలెండర్ సంవత్సం జనవరితో మొదలయితే విత్త సంవత్సరం ఏప్రిల్ నెలతో ప్రారంభమవుతుంది.

మన దేశంలో గత 20 సంవత్సరాల కాలంలో కేంద్ర రాష్ట్రాల వ్యయం బాగా పెరగడంతో ప్రభుత్వ కార్యకలాపాలు సంఖ్యా పరంగా ఎక్కువయ్యాయి. అవి నిత్య జీవితంలో మన మనుగడకు కీలకమయ్యాయి. 2004 నాటికి ఉమ్మడి రాష్ట్ర బడ్జెట్ స్థూల ఆదాయం 36941 కోట్ల రూపాయలు కాగా గత సంవత్సరంలో ఒక్క తెలంగాణ బడ్జెట్ స్థూల ఆదాయం 146045 కోట్ల రూపాయలకు పెరిగింది. ఆదాయం పెరగడంతో సామాజిక, ఆర్థిక రంగాలలో ప్రభుత్వం పాత్ర చాలా విస్తరించింది.

తెలంగాణ విషయానికొస్తే, రాష్ట్రం ఉద్యమ ఆకాంక్షల సాధనవైపు నడుస్తున్నదో, లేదో తెలుసుకోవడానికి బడ్జెట్ దిక్సూచిలాంటిది. నీళ్లు, నిధులు, నియామకాలు లక్ష్యంగా తెలంగాణ ఉద్యమం సాగింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడితే మన నిధులు మనకు దక్కుతాయని, వాటితో అందుబాటులో ఉన్న జల వనరులను వినియోగంలోకి తేవచ్చునని, ఉద్యోగావకాశాలను పెంచుకోవచ్చునని అందరం ఆశించినం. ఈ ఆకాంక్షల కోసమే అనేక మంది యువతీ, యువకులు బలిదానాలకు పాల్పడినారు. నీళ్ళు, నిధులు, నియామకాలనే లక్ష్య సాధనకు మనం ఎంత దూరంలో ఉన్నామో తెలుసుకోవడానికి బడ్జెట్ ఒక సూచిక లాగా ఉపయోగపడుతుంది.

ఆదాయ వనరులు

ఇంకా వివరాల్లోకి వెళ్లేముందు బడ్జెట్‌లో ఉపయోగించే ప్రత్యేక పదజాలాన్ని పరిచయం చేసుకోవాలి. బడ్జెట్‌లో రాష్ట్రానికి వచ్చే ఆదాయాన్ని గాని, ఖర్చును గాని వివిధ పద్దుల కింద చూపిస్తారు. ముందుగా ఆదాయ మార్గాల గురించి తెలుసుకుందాం. ప్రభుత్వానికి 5 రకాలుగా ఆదాయం వస్తున్నది.

- రాష్ట్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసే పన్ను ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వ స్వంత పన్ను ఆదాయంగా పేర్కొంటారు. 2019-20లో రాష్ట్ర ఆదాయంలో స్వంత పన్ను ద్వారా 61 శాతం రాబడి ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వం విధించే పన్నులలో అమ్మకం పన్ను, ఎక్సైజు పన్ను, వాహనం పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజులు ముఖ్యమైనవి.
- ఇక కేంద్రం విధించి, వసూలు చేసి రాష్ట్రాలకు పంచి ఇచ్చే మొత్తాన్ని కేంద్ర పన్నులలో వాటాగా గుర్తిస్తారు. కేంద్రం వసూలు చేసే పన్నులలో ఆదాయం పన్ను ముఖ్యమైనది. రాష్ట్రాల వాటాను, ఈ సంవత్సరం నుండి అమలులోకి వస్తున్న 15వ ఫైనాన్స్ కమిషన్ నివేదిక ఒక శాతం తగ్గించింది. 14వ ఫైనాన్సు కమిషన్ సూచనల ప్రకారం కేంద్రం వసూలు చేసే పన్నులలో రాష్ట్రాలకు 42 శాతం వాట దక్కింది. 15వ ఫైనాన్స్ కమిషన్ రాష్ట్రాల వాటాను 41 శాతానికి తగ్గించింది. ఈ మార్పు వలన కేంద్ర పన్నులలో మనకు వచ్చే వాటా 2384 కోట్ల రూపాయలు తగ్గనున్నది.
- ఆదాయ మార్గాలలో మూడవది పన్నేతర ఆదాయం. బడ్జెట్‌లో పన్నేతర ఆదాయం శాతం 9 నుండి 18 శాతం దాకా ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చిన అపరాధ రుసుములు, ఫీజులు, ప్రభుత్వం ఇచ్చిన అప్పులపై వచ్చే వడ్డీలు, ప్రభుత్వ ఆస్తులు అమ్మగా వచ్చిన సొమ్ము, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల నుండి వచ్చే రాయల్టీలు, ఆదాయాలను కలిపి పన్నేతర ఆదాయం అంటారు. ఆసుపత్రులు, విద్యా సంస్థల నుండి వచ్చే ఫీజులను, విద్యుత్తు చార్జీల రూపంలో వచ్చే ఆదాయాన్ని పెంచుకోవాలని రిజర్వు బ్యాంకు సూచిస్తున్నది.
- కేంద్ర ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్లు రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ రాబడిలో భాగమే.
- పైన వివరించిన నాలుగు మార్గాల ద్వారా వచ్చిన ఆదాయం చాలక

పట్టిక-1: రాష్ట్ర ఆదాయ వనరులు (రూ.కోట్లలో)

	2014-15	2015-16	2016-17	2017-18	2018-19	2019-20	2020-21
రాష్ట్ర పన్ను ఆదాయం	29,288	39,775	48,408	56,520	64,474	71,327	85,300
కేంద్రం ఇచ్చే పన్నుల వాటా	18,189	12,351	14,676	16,420	18,560	15,987	16,726
కేంద్రం ఇచ్చే గ్రాంటులు	7,118	9,394	9,752	8,059	8,177	11,333	30,600
రాష్ట్ర పన్నేతర ఆదాయం	6,447	14,414	9,782	7,825	10,007	12,275	10,525
మొత్తం	**51,042**	**76,134**	**82,818**	**88,824**	**1,01,420**	**1,10,928**	**1,43,151**
అప్పు	9,580	17,497	44,819	49,153	55,561	31,000	39,550
రాష్ట్ర స్థూల ఆదాయంలో అప్పు శాతం	15.78	18.67	35.07	35.59	25.14	22.55	
స్థూల ఆదాయం	60,699	93,720	1,27,793	1,38,115	1,56,981	1,46,544	1,82,701
రాష్ట్ర జి.యస్.టి.				13,073	23,840	25,816	27,600
అమ్మకం పన్ను	22,121	29,847	34,235	25,107	25,106	21,972	26,400
ఎక్సైజ్ పన్ను	2,808	3,809	5,581	9,421	9,421	12,600	16,000
వాహనం పన్ను	1,618	2,309	3,394	3,590	3,589	3,714	4,300
స్టాంపులు రిజిస్ట్రేషన్లు	2,177	3,102	3,822	4,202	4,202	6,446	10,000
ఇతరములు	564	908	1,376	1,127	822	786	1,000
మొత్తం	**29,288**	**39,975**	**48,408**	**56,520**	**64,674**	**71,327**	**85,300**

పోతే రాష్ట్రాలు అప్పు చేస్తుంటాయి. రాష్ట్ర ప్రభుత్వం 2014-15 నుండి సుమారు 3 లక్షల కోట్ల అప్పు చేసింది. 2014-15 నుండి ఇప్పటి వరకు రాష్ట్ర ఆదాయం ఎలా ఉన్నదో దిగువ పట్టికలో చూడవచ్చు. పట్టికను అధ్యయనం చేస్తే పట్టిక-1లో చెప్పిన విషయాలు కొట్టవచ్చినట్టుగా కనబడుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయం 2018-19 వరకు క్రమంగా పెరిగింది. కానీ 2019-20లో స్థూల ఆదాయం ఎదుగుదల తగ్గింది. తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పినట్టు 2018-19లో రాష్ట్ర రెవెన్యూ అంతకు ముందు ఏడాది కన్నా సుమారు 16 శాతం పెరిగింది. కానీ 2019-20లో ఆదాయం 2018-19 కన్నా 6.3 శాతం మాత్రమే పెరిగింది. ఆదాయం వృద్ధి రేటు మందగిస్తున్నది.

రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే స్వంత పన్ను ఆదాయంలో అమ్మకం పన్ను, రాష్ట్ర జి.ఎస్.టి. వాటా సుమారు 70 శాతం. రాష్ట్ర స్వంత పన్నులో ఆ తరువాత భాగం ఎక్సైజ్ పన్నుది. దీని ద్వారా 16 శాతం ఆదాయం వస్తున్నది. 2015-16 నుంచి 2019-20 మధ్య కాలంలో అమ్మకం పన్ను ఆదాయం 160 శాతం పెరిగింది. అదే కాలానికి ఎక్సైజు పన్ను ఆదాయం 286 శాతం పెరిగింది. ఈ విషయాలను చూసినప్పుడు సాధారణ ప్రజలే రాష్ట్ర ఖజానాకు ఎక్కువ మొత్తం పన్ను చెల్లిస్తున్నారని అర్థమవుతున్నది.

2019-20 కన్నా ఈ ఆర్థిక సంవత్సరంలో 32,000 కోట్ల రూపాయలు అదనపు రాబడిని సంపాదించడానికి ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేసింది. అమ్మకం పన్ను, రాష్ట్ర జి.ఎస్.టిలలో 7000 కోట్ల పెరుగుదలను సాధించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నది. ఎక్సైజు పన్ను సుమారు 3500 కోట్లు పెరుగుతుంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్లు ద్వారా ఈ సారి అదనంగా 3500 కోట్ల రూపాయలు రాబట్టాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఉన్నది. బడ్జెట్ లెక్కల ప్రకారం రాష్ట్ర స్వంత పన్ను ఆదాయం 14,000 కోట్ల రూపాయలు పెరుగుతుంది. పన్నుల ద్వారానే కాకుండా ప్రభుత్వం పన్నేతర ఆదాయాన్ని కూడా పెంచాలన్న ఆలోచనతో ఉన్నది. పన్నేతర ఆదాయం ద్వారా గత సంవత్సరం కన్నా అదనంగా 18,000 కోట్ల రూపాయలను సాధించడానికి ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేసింది. ఇందులో 10,000 కోట్ల రూపాయలు భూముల అమ్మకం ద్వారా పొందాలని చూస్తున్నది. మరో 4000 కోట్ల రూపాయలు మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల నుండి రాబట్టాలన్నది ప్రభుత్వ వ్యూహం. ఆస్తులు అమ్మి, అప్పు చేసి ఖర్చులకు కావలసిన పైసలు సంపాదించాలనేదే ప్రభుత్వ ప్రణాళిక. ఇక్కడ ఒక విషయాన్ని గుర్తు చేసుకోవాలి. 2019 ఫిబ్రవరి నెలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్-ఆన్-ఎకౌంట్‌లో ప్రతిపాదిత ఆదాయం 1,82,016 కోట్ల రూపాయలు. కానీ అదే సంత్సరం సెప్టెంబర్ నెలలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో స్థూల రెవెన్యూ 1,46,544 కోట్లకు పడిపోయింది. ఆర్థిక మందగమనం వలనే ఆదాయం పడిపోయిందని ప్రభుత్వం అప్పుడు అన్నది. ఆ మందగమనం పరిస్థితులు ఇంకా మారలేదు. కరోనా వైరస్ తాకిడితో ఆర్థిక సంక్షోభం తీవ్రమైనదని ఆర్థిక శాస్త్రవేత్తలు అంటూనే ఉన్నారు. అటువంటప్పుడు 2020-21 బడ్జెట్‌లో ప్రతిపాదిత 1,82,701 కోట్ల ఆదాయం సాధ్యమేనా?

అప్పులు

రాష్ట్ర ప్రభుత్వం లోటును పూడ్చుకోవడానికి అప్పులు చేస్తున్నదని గణాంకాలు సూచిస్తున్నాయి. 2014-15 నుండి 2019-20 మధ్య కాలంలో రాష్ట్ర వార్షిక ఆదాయంలో అప్పుల వాటా 15 నుండి 35 శాతం దాకా ఉన్నది. ఈ అప్పులను 7-9 శాతం వడ్డీకి బ్యాంకుల నుండి, మార్కెట్ నుండి తెస్తున్నది. 2005-06 సంవత్సరం దాకా కేంద్ర ప్రభుత్వం తక్కువ వడ్డీకి అప్పులు ఇచ్చింది. ఆ తరువాత కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అప్పులు ఇచ్చే బాధ్యతను వదులుకున్నది.

ఆ తరువాత కాలంలో చిన్న మొత్తాల పొదుపు నిధి నుండి రాష్ట్రాలు తక్కువ వడ్డీకి అప్పులు తెచ్చుకోగలిగినాయి. 2016-17 తరువాత ఆ సంస్థ బాగా వెనుకబడిన కొన్ని రాష్ట్రాలకు మాత్రమే అప్పులు ఇస్తున్నది. తెలంగాణ వంటి రాష్ట్రాలకు ఆ సంస్థ నుండి అప్పులు ఆగిపోయాయి. అప్పటి నుండి రాష్ట్రాలు పూర్తిగా మార్కెట్ రుణాల పైన ఆధారపడి ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో 2000-01 సంవత్సరంలో రాష్ట్రం అప్పులలో మార్కెట్ రుణాల వాటా 25.63 శాతం. 2013-14 నాటికి మార్కెట్ రుణాలు 64.92 శాతానికి పెరిగినాయి. 2018-19లో తెలంగాణ మార్కెట్ రుణాలు 93.8 శాతం. మార్కెట్ రుణాల వాట పెరుగుతున్నా కొద్ది వడ్డీల భారం పెరుగుతున్నది. ఇది ఇబ్బందికరంగా మారే ప్రమాదం ఉన్నది. రాష్ట్ర అప్పుల వివరాలు పట్టిక-2లో.

ఎఫ్ఆర్‌బిఎం చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా అప్పులు చేయడానికి వీలు లేదు. చట్టం ఒక పరిమితిని విధించింది. ఏ రాష్ట్రమైనా ఆ రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 25 శాతానికి మించి అప్పులు తీసుకోరాదు. మన రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న అప్పుల లెక్కలు వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించినవి.

ఈ అప్పులు 2019-20 నాటికి 1,99,215 కోట్ల రూపాయలు. ఇదికాక మార్చి 1, 2020 ప్రభుత్వం వివిధ పబ్లిక్ రంగ సంస్థలకు ఇచ్చిన పూచీ మొత్తం 89,600 కోట్ల రూపాయలు. ఆయా సంస్థలు చెల్లించకపోతే ఆ రుణాల చెల్లింపుల బాధ్యత ప్రభుత్వానిదే. వీటిని కూడా కలిపితే రుణభారం మరింత పెరుగుతుంది.

వడ్డీల చెల్లింపులు రాష్ట్ర రెవెన్యూలో 10 శాతం మించరాదు. మన రాష్ట్రంలో వడ్డీల చెల్లింపులు ఈ పరిమితిని దాటి ఉన్నాయి. మార్కెట్ నుండి అధిక వడ్డీకి రుణాలు తేవడం వలన వడ్డీల చెల్లింపులు బాగా పెరిగిపోతున్నాయి. ఈ అంశాన్ని రిజర్వు బ్యాంకు ఎత్తి చూపుతూ ఇది రాష్ట్రాల పైన ఆర్థిక భారాన్ని విపరీతంగా పెంచుతుందని హెచ్చరించింది.

రెవెన్యూ-పెట్టుబడి వ్యయం

ఇప్పటి వరకు ఆదాయం గురించి మాట్లాడుకున్నాం. రాబడితో పాటు వ్యయం గురించి కూడా తెలుసుకోకుండా బడ్జెట్‌పై సంపూర్ణ అవగాహన ఏర్పడదు. మన రాష్ట్రంలో 40 పద్దులలో వివిధ శాఖల ఖర్చులకై నిధులను కేటాయిస్తున్నారు. ఈ పద్దులకు చేసే కేటాయింపులను రెండు రకాలుగా విభజిస్తారు. రోజువారీ నిర్వహణకు చేసే ఖర్చును రెవెన్యూ ఖర్చుగా పేర్కొంటారు. ఇక మౌలిక సదుపాయాల కల్పన కోసం చేసే ఖర్చును పెట్టుబడి వ్యయం అంటారు.

ఈ మధ్య కాలంలో ఇంకొక రూపంలో పద్దుల కేటాయింపులను వర్గీకరించి, విశ్లేషిస్తున్నారు. ఈ విశ్లేషణ ప్రకారం రెవెన్యూ, పెట్టుబడి వ్యయాల మధ్య చాలా చిన్న తేడా ఉన్నది. ఉదాహరణకు విద్య, వైద్యం, వ్యవసాయాభివృద్ధికి చేసే ఖర్చులన్నీ మౌలిక సదుపాయాల నిర్మాణానికి దారి తీయక పోవచ్చు. కానీ సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఇవి చాలా కీలకం. అందుకని ఇటువంటి ఖర్చులను అభివృద్ధికి ఉపయోగపడే ఖర్చులుగా గుర్తిస్తున్నారు. అవికాక కేవలం ప్రభుత్వ నిర్వహణకు మాత్రమే చేసే ఖర్చులను నిర్వహణ వ్యయం అంటున్నారు. గతంలో మాదిరిగానే మౌలిక సదుపాయాల నిర్మాణానికి చేసే ఖర్చును పెట్టుబడి వ్యయం అంటున్నారు. మరొక అంశమేమిటంటే మొత్తం ఆయా పద్దులను సామాజిక రంగానికి, ఆర్థిక రంగానికి సంబంధించిన పద్దులుగా కూడా విభజిస్తున్నారు. ఈ వ్యాసంలో నిర్వహణ వ్యయంతో పాటు, సామాజిక, ఆర్థిక రంగాలకు సంబంధించిన పద్దులలో రెవెన్యూ, పెట్టుబడి ఖర్చులను విడిగా చూపుతున్నాం. దిగువ పట్టికలో వివరాలను చూడవచ్చు.

పట్టిక-3ను పరిశీలించినప్పుడు 2019-20 సంవత్సరంలో పెట్టుబడి వ్యయం గణనీయంగా పడిపోయింది. 2017-18 సంవత్సరంలో పెట్టుబడి వ్యయం 23, 902 కోట్ల రూపాయలు. ఇది రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 3.2 శాతం. ఆ తరువాత సంవత్సరం పెట్టబడి వ్యయంలో 22,640 కోట్లకు తగ్గింది. 2019-20 సంవత్సరంలో పెట్టుబడి వ్యయం 13, 165 కోట్లు. భారీగా తగ్గిందని గమనించవచ్చు. ఇది కూడా సవరించిన అంచనా. వాస్తవ లెక్కలు బయటపడితే మరింత తగ్గే

పట్టిక-2: రాష్ట్ర అప్పుల వివరాలు

సంవత్సరం	వార్షిక అప్పులు (రూ.కోట్లలో)	రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో అప్పుల శాతం	వడ్డీల చెల్లింపులు (రూ.కోట్లలో)	రెవెన్యూలో వడ్డీల శాతం
2014-15	9580	16.06	5227	10.31
2015-16	17497	16.18	7558	10.00
2016-17	44819	20.04	8609	10.57
2017-18	49153	20.21	10836	12.20
2018-19	55561	20.25	13086	15.90
2019-20	31000	20.55	14385	16.4
2020-21	39550	20.74	14615	10.54

పట్టిక-3: ప్రభుత్వ వ్యయ వివరాలు (రూ.కోట్లలో)

	2015-16		2016-17		2017-18		2018-19		2019-20		2020-21	
	రెవెన్యూ వ్యయం	పెట్టుబడి వ్యయం	రెవెన్యూ వ్యయం	పెట్టుబడి వ్యయం	రెవెన్యూ వ్యయం	పెట్టుబడి వ్యయం	రెవెన్యూ వ్యయం	పెట్టుబడి వ్యయం	రెవెన్యూ వ్యయం	పెట్టుబడి వ్యయం	రెవెన్యూ వ్యయం	పెట్టుబడి వ్యయం
నిర్వహణ వ్యయం	23247	274	25125	567	30872	565	34199	703	32961	166	33765	768
సామాజిక రంగపద్దుల వ్యయం	30466	2152	35285	3162	37259	2851	39721	5620	42197	687	60905	10797
ఆర్థికరంగం పద్దుల వ్యయం	22043	11164	20950	29642	17200	20486	23157	5620	35655	12311	43988	10495
మొత్తం	**75816**	**13590**	**81432**	**33371**	**85365**	**23902**	**97083**	**22640**	**110824**	**13165**	**138658**	**22061**

అవకాశం ఉన్నది. ఈసారి ప్రభుత్వం 22,061 కోట్ల పెట్టుబడి వ్యయాన్ని బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ఇది పూర్తిగా సాధ్యం కాదని గత అనుభవం చెపుతున్నది. మన రాష్ట్రంలో పెట్టుబడి వ్యయానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పెట్టుబడి వ్యయంలో అత్యధిక భాగం సాగునీరు, తాగునీరు, మురుగునీటి పారుదల, విద్యుత్తు, రోడ్లు, భవనాలకే ఖర్చవుతున్నది. 2014-15 నుండి 2020-21 మధ్య కాలంలో ప్రభుత్వం రాష్ట్ర ఖజానా నుంచి 1,37,100 కోట్ల రూపాయలు పెట్టుబడి వ్యయానికి కేటాయించింది. ఇందులో 2.51 శాతం నిర్వహణ పద్దులకు, సామాజిక సేవల పద్దులపై 19 శాతం ఖర్చయింది. 78.5 శాతం పెట్టుబడి వ్యయాన్ని ఆర్థిక సేవలకే వినియోగించింది. రాష్ట్ర ప్రభుత్వం పెట్టబడి వ్యయంలో 47 శాతం ఖర్చు భారీ మధ్య తరహా ప్రాజెక్టులకు ఖర్చయింది. చిన్న నీటి పారుదల కోసం చేసిన ఖర్చును కూడా కలిపితే సాగునీటి రంగానికి అయిన ఖర్చు 51.85 శాతం. ఇది కాకుండా అప్పు తెచ్చి ప్రాజెక్టుల కోసం ఉపయోగించింది. ఈ ఖర్చుతో తెలంగాణ ఏర్పడిన నాటికే నిర్మాణంలో ఉన్న 33 భారీ, మధ్య తరహా ప్రాజెక్టులు పూర్తికావాలి. ఇందులో రాష్ట్రం ఏర్పడిన నాటికి దాదాపుగా పూర్తయినవి 3 ప్రాజెక్టులు. 2015 మార్చి 31 నాడు సాగు నీటి పారుదల శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులలో 2014-15లో 8, మరో 7 ప్రాజెక్టులు 2015-16లోనూ, 2016-17, 2017-18 సంవత్సరాలలో ప్రతి ఏటా ఆరు చొప్పున పనులు పూర్తవుతాయి. మిగతా ప్రాజెక్టులు ఇక ఆ తరువాత పూర్తి కావచ్చునని ఇరిగేషన్ శాఖ అంచనా వేసింది. ఈ ప్రాజెక్టుల అంచనా వ్యయం రు. 1,10,069 కోట్లు అయితే 2015 మార్చి నెల నాటికి నిర్మాణానికి 42598 కోట్ల రూపాయలు ఖర్చయింది. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత దుమ్ముగూడెం-నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ ప్రాజెక్టు, కాంతనపల్లి ప్రాజెక్టులు రద్దయ్యాయి. వీటి విలువ సుమారు 30,000 కోట్ల రూపాయలు. వీటి స్థానంలో తుపాకులగూడెం, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలు జాబితాలో చేరినాయి.

ప్రభుత్వం రాష్ట్రం ఏర్పడిన తరువాత కేటాయించిన మొత్తాన్ని సరిగ్గా ఖర్చు చేసి ఉంటే దాదాపుగా అన్ని ప్రాజెక్టులు పూర్తయ్యేవి. కానీ రిడిజైనింగ్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం, నిపుణులు వారించినా వినకుండా ప్రాజెక్టులపై ఖర్చును పెంచేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుగా మారిన ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు ఖర్చు 40000 కోట్ల నుండి ఒక లక్ష కోట్ల వరకు పెరిగింది. గతంలో, ఉమ్మడి రాష్ట్రంలో ఖర్చయిన 8000 కోట్ల రూపాయలు కూడా వృధా అయ్యాయి. ఈ మార్పుల కారణంతో కాళేశ్వరం ప్రాజెక్టుకే చాలా వరకు వనరులను వినియోగించడంతో మిగతా ప్రాజక్టులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పుడు ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడానికి కావలసిన పైసలు లేవు.

రాష్ట్రం చేసిన 1,37, 100 కోట్ల రూపాయల పెట్టుబడి వ్యయంలో 79,917 కోట్ల రూపాయలు, సుమారు 58 శాతం 2016-17 నుండి 2018-19 మధ్య కాలంలో ఖర్చయింది. నిజానికి ఇప్పుడున్న ఆర్థిక పరిస్థితిలో, ఆర్థికాభివృద్ధి మందగమనంలో సాగుతున్న సమయంలో ప్రభుత్వం పెట్టుబడి ఖర్చు పెరిగినప్పుడే వృద్ధి రేటు పుంజుకొంటుంది. కానీ ఇటువంటి కీలక సమయంలో పెట్టుబడి వ్యయం పడిపోతున్నది.

2015-18 మధ్య కాలంలో పెట్టుబడి వ్యయం 7 శాతం పడిపోయిందని అధ్యయనాలు చెపుతున్నాయి. రెవెన్యూ వ్యయం తగ్గించడం కుదరదు. చాలా ఖర్చులు తప్పనిసరిగా కొనసాగించాలి. అందుకని ప్రభుత్వ ఆదాయం తగ్గినప్పుడల్లా పెట్టుబడి వ్యయాన్ని కుదిస్తారు. మన రాష్ట్రంలోనూ అదే జరిగింది. మన రాష్ట్రంలో అధ్యయనాల ప్రకారం బడ్జెట్ కేటాయింపుల కన్నా వాస్తవ వ్యయం 17 శాతం తగ్గింది. ప్రభుత్వ రెవెన్యూ నుండి రోజువారి పాలనా వ్యవహారాల ఖర్చులకు పోను మిగలాలి. అలా జరిగినప్పుడు ప్రభుత్వ నిర్వహణకే కాక రెవెన్యూ నిధులను అభివృద్ధికి వాడుకోవచ్చు. ప్రభుత్వ నిర్వహణ ఖర్చులకు రెవెన్యూ ఆదాయంలో మిగులును రెవెన్యూ మిగులు అంటారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినప్పటి నుండి రెవెన్యూ మిగులు ఉంటున్నది. అయితే కొన్ని సందర్భాలలో కాగ్ తన నివేదికలో ప్రభుత్వ లెక్కలను తప్పు పట్టింది. బిల్లుల చెల్లింపులు పెండింగులో ఉండటం వలన, ప్రభుత్వ రంగ సంస్థల నిధులను ప్రభుత్వ ఖజానాకు జమ

చేయడం వలన మిగులు ఏర్పడిందని కాగ్ వ్యాఖ్యానించింది. ఏదైనా రెవెన్యూ మిగులు ఉన్నా అది చాలా చిన్న మొత్తమే. అభివృద్ధి అవసరాలకు చాలా పెద్ద మొత్తంలో అప్పుచేస్తున్నామని గ్రహించాలి.

మరొక అంశం ఏమిటంటే జీతాలు, పింఛన్లు, వడ్డీల చెల్లింపులు వంటి పాలనా నిర్వహణ అంశాలపై 2015-20 మధ్య కాలంలో రాష్ట్ర ప్రభుత్వం మొత్తం ఆదాయంలో 45 శాతం ఖర్చు చేసింది. ఇక ప్రగతి పద్దుగా చూపే అభివృద్ధి వ్యయం అన్ని రాష్ట్రాల సగటు 63 శాతం ఉండగా మన రాష్ట్రం 69 శాతం ఖర్చు చేసింది. అయితే మన రాష్ట్ర అభివృద్ధి వ్యయం కొన్ని కీలకాంశాలను విస్మరిస్తున్నది. మానవాభివృద్ధికి తోడ్పడే విద్య, వైద్యం, తాగు నీటి సరఫరా, మురుగునీటి పారుదల అనే నాలుగు అంశాలపై అన్ని రాష్ట్రాల సగటు వ్యయం రాష్ట్ర స్థూల వ్యయంలో 24 శాతం కాగా మన రాష్ట్రంలో స్థూల వ్యయంలో మానవాభివృద్ధికై కేవలం 16 శాతం ఖర్చు చేస్తున్నాం.

వివిధ రంగాలలో 2015-20 మధ్య కాలంలో అన్ని రాష్ట్రాలు స్థూల వ్యయంతో సగటున గ్రామీణాభివృద్ధిని 6.3 శాతం, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి 6.5 శాతం, ఎస్.సి., ఎస్.టి., బి.సి. వర్గాల సంక్షేమానికి 2.7 శాతం, సామాజిక భద్రతకై 4.3 శాతం, గృహ నిర్మాణానికి 1.6 శాతం ఖర్చు చేసాయి. మన రాష్ట్రంలో ఇదే కాలానికి స్థూల వ్యయంలో ఆయా రంగాలపై చేసిన ఖర్చు నిష్పత్తి కొన్ని రంగాల్లో మెరుగ్గా ఉన్నది. మరికొన్ని రంగాలలో తక్కువగానూ ఉన్నది. 2015-20 మధ్య కాలంలో స్థూల వ్యయంలో వ్యవసాయంపై ఖర్చు 10 శాతం, గ్రామీణాభివృద్ధికి 4.7 శాతం, ఎస్.సి., ఎస్.టి., బి.సి. వర్గాల సంక్షేమానికి 7.6 శాతం, సామాజిక భద్రతకు 6.1 శాతం, గృహ నిర్మాణానికి 0.8 శాతం ఖర్చయింది.

చారిత్రక తెలంగాణ నేపథ్యం

అయితే మన రాష్ట్ర సామాజిక, ఆర్థిక పరిస్థితులను, చారిత్రక నేపథ్యాన్ని పరిశీలిస్తే తప్ప కేటాయింపులు ఏ మేరకు ఉపయోగపడతాయో చెప్పలేము. మన రాష్ట్రంలో నూటికి 55 మంది వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆధారపడి బతుకుదెరువు పొందుతున్నారు. కానీ రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో ఈ రంగం వాటా 15-16 శాతం దాటడం లేదు. ఇక స్థూల ఉత్పత్తిలో పారిశ్రామిక రంగం వాటా 25-26 శాతం. ఈ రంగంపైన ఆధారపడి బతుకుతున్న వాళ్ల సుమారు 20 శాతం. మన రాష్ట్రంలో అత్యధిక ఆదాయం సేవారంగం నుండి వస్తున్నది. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 60 శాతం దాకా ఆదాయం వస్తున్న సేవా రంగంపై ఆధారపడి బతుకుతున్న వాళ్లు కేవలం 25 శాతం మాత్రమే. ఈ రంగంలో తక్కువ వేతనాలతో పని చేసే దిగువ స్థాయి డ్రైవర్లు, క్లర్కులు, ఆఫీసు అటెండర్ స్థాయి పనులు తప్ప మిగతా ఉద్యోగాలు పొందగల నైపుణ్యం చాలా మంది ప్రజలకు లేదు. ఉన్న ఉద్యోగాలలో అనేక రాష్ట్రాలకు చెందిన వాళ్ళు వచ్చి చేరినారు. బాగా ఎదుగుతున్న రియల్ ఎస్టేట్ రంగం ఉపాధి అవకాశాలు తక్కువ. అందువలన ఎక్కువ మంది ప్రజలు బతుకుదెరువు పొందుతున్న వ్యవసాయం, దాని అనుబంధ రంగాల అభివృద్ధిని సాధించడం అవసరం. వ్యవసాయం, అనుబంధ రంగాలలో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవడం, మార్కెట్ అవకాశాలను విస్తరించుకోవడం చాలా అవసరం. ఈ కోణం నుండి చూసినప్పుడు చేసిన కేటాయింపులు చాలవు. వ్యవసాయ రంగానికి చేసిన కేటాయింపులలో అత్యధిక భాగం రైతు బంధు, రుణమాఫీ, రైతు బీమాకే ఖర్చవుతున్నది. ఉదాహరణకు 2019-20లో వ్యవసాయ రంగ కేటాయింపులో రైతు రుణ మాఫీకి, రైతు బందుకు ఇచ్చింది సుమారు 13,584 కోట్ల రూపాయలు. తెలంగాణ వ్యవసాయ రంగ అభివృద్ధి నిలకడగా లేదు. ప్రకృతి మీద ఆధాపడి సాగుతున్నది. అందుకే ఆటుపోట్లు ఎక్కువ. నిలకడైన అభివృద్ధిని సాధించడానికి రైతుల ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలి. ధాన్యం అమ్మకానికి అవకాశాలు పెంచాలి. ఇక ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే ప్రయత్నాలకు, ధాన్యం కొనుగోలుకు బడ్జెట్ చేసిన కేటాయింపులు చాలవు. వ్యవసాయక అనుబంధ రంగాలకు ఇచ్చిన మొత్తం చాలదు. వివిధ బి.సి. కార్పొరేషన్ల ద్వారా మత్స్య, పశుపోషణ వంటి రంగాలకు, చేనేత తదితర వృత్తులకు చేసే కేటాయింపులు తక్కువ. అవీ సరిగ్గా ఖర్చు కావడం లేదు. ఈ అంశాలపై సవివరంగా తరువాత పరిశీలిద్దాం.

అదే విధంగా పారిశ్రామిక రంగంలో చిన్న, సూక్ష్మ పరిశ్రమలకు మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడి సహాయం కోసం బడ్జెట్‌లో కేటాయింపులు ఉండాలి. అవి లేవు. చిన్న పరిశ్రమలు కోరుకుంటున్నదేమిటి? పరిశ్రమ నెలకొల్పడానికి చిన్న ప్లాట్, అందులో ఒక షెడ్డు, సమీపంలో గృహ వసతి, వైద్య సౌకర్యం, పాఠశాలలు, పెట్టుబడి సాయం. కానీ ప్రభుత్వానికి పెద్ద పరిశ్రమల పట్ల మోజు ఎక్కువ. వారికి రైతుల నుండి బలవంతంగా గుంజుకున్న వందల ఎకరాలకు అగ్గువకే ఇస్తున్నది. అధికారం ఉన్న నాయకులకు కావలసిన వారి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సహకరించడానికి టౌన్‌షిప్పుల నిర్మాణ ప్రణాళికలు, జిల్లా కార్యాలయ సముదాయాలు తయారవుతాయి. కానీ చిన్న పరిశ్రమలకు ఊతం ఇచ్చే రీతిలో టౌన్‌షిప్పుల అభివృద్ధి జరుగదు. బడ్జెట్‌లో ఇందుకై కెటాయింపులు ఉండాలి. ఈ సారి హైదరాబాద్ ఎన్నికల కోసం మాత్రమే పట్టణాభివృద్ధికి కేటాయింపులు గతంలో ఎన్నడూ లేనంతగా జరిగాయి.

అదే విధంగా విద్య, వైద్యం ఉచితంగా ఇవ్వగలిగితే ప్రజల మౌలిక అవసరాలు తీరడమే కాదు అట్టుడుగు వర్గాలు ఎదుగడానికి కావలసిన చేయూత దొరుకుతుంది. గుప్పెడు మంది పిల్లలకు గురుకులాల్లో మంచి విద్యను అందిస్తున్నారు. ఇతరులను ప్రైవేటు విద్యా సంస్థల్లో చదువుకోవలసిన పరిస్థితి కల్పించారు.

ఈ కోణం నుండి బడ్జెటును చూడాలి. ఇప్పుడు ఆయా శాఖలకు చేసిన కేటాయింపులను పరిశీలిద్దాం. దిగువ పట్టికలో వివరాలున్నాయి. ఆయా పద్దులను పరిశీలించినప్పుడు కేటాయింపులలో 2016-17 నుండి చెప్పుకోదగిన పెంపులేదు. కొన్ని రంగాలలో కేటాయింపులు తగ్గినాయని కూడా గ్రహించవచ్చు. తాగునీరు, పట్టణాభివృద్ధి రంగాలకు ఈ సారి కేటాయింపులు బాగా పెంచారు. ఇందులో 10,000 కోట్ల రూపాయలు హైదరాబాద్ కార్పొరేషన్‌కు రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని చేసిన కేటాయింపులు ఉన్నాయని గ్రహించాలి. 2019-20 సంవత్సరానికి ఇచ్చిన లెక్కలు సవరించిన అంచనాలు కాగా 2020-21 లెక్కలు బడ్జెట్ అంచనాలు. తుది లెక్కలు అందితే తప్ప ఎన్ని ఖర్చయ్యేది తెలియదు. మిగతా సంవత్సరాలవి తుది లెక్కలు.

బడ్జెట్ అంచనాలకన్నా వాస్తవాలు బాగా తగ్గిపోయాయని పట్టిక-5 తెలియజేస్తున్నది. వాస్తవంగా వచ్చిన ఆదాయం అంచనాల కన్నా 20,000 కోట్ల రూపాయల నుండి 30,000 కోట్ల రూపాయలు తక్కువగా

పట్టిక-4: కొన్ని ముఖ్యమైన రంగాలకు కేటాయింపులు (రూ.కోట్లలో)

	2014-15	2015-16	2016-17	2017-18	2018-19	2019-20	2020-21
వ్యవసాయం	5380	5668	5775	7074	13611	21504	25204
సామాజిక సంక్షేమం	-	2961	9069	8904	10714	14612	17385
విద్య	7084	10671	11955	12494	11773	9568	11896
ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీల సంక్షేమం	3365	4899	6910	8270	11838	9493	10755
ఇరిగేషన్	8051	10978	15723	12994	9506	8475	11042
వైద్యం, కుటుంబ సంక్షేమం	2439	3294	5432	5031	5995	5865	6386
గ్రామీణాభివృద్ధి	3712	5610	6345	4649	4583	4464	6038
తాగునీరు, మురుగునీటి నీటి పారుదల, గృహనిర్మాణం పట్టణాభివృద్ధి	2305	4706	4739	4850	11067	7814	31104

ఉన్నది. స్థూల వ్యయంలోనూ ఇదే మాదిరిగా అంచనాలకు, వాస్తవాలకు మధ్య తేడా ఉన్నది. దిగువ పట్టిక చూడండి.

స్థూల వ్యయం 2016-17, 2017-18 సంవత్సరాలలో మాత్రమే అంచనాలకు దగ్గరగా ఉన్నది. మిగతా అన్ని సంవత్సరాలలో వ్యత్యాసం కనబడుతున్నది. నిజానికి రాష్ట్ర రెవెన్యూ అంచనాల కన్నా పైన పేర్కొన్న రెండు సంవత్సరాలలో రెవెన్యూ 20,000 కోట్ల రూపాయల నుండి 25,000 కోట్ల రూపాయల దాకా తగ్గింది. కానీ స్థూల వ్యయం పెరిగింది. అందుకు కారణం ఒక్కటే. లోటు పూడ్చడానికి ప్రభుత్వం విపరీతంగా అప్పులు చేసింది. అందుకే బడ్జెట్ అంచనాల కన్నా అప్పులు చాలా ఎక్కువయ్యాయి. 2018-19 సంవత్సరంలో రెవెన్యూ ఆదాయం బాగా పడిపోయింది. అయితే 30,000 కోట్ల రెవెన్యూ లోటును పూడ్చడానికి కావలసిన స్థాయిలో అప్పులు పెరగలేదు.

2014-15,2015-16 సంవత్సరాలలో తప్ప మిగతా అన్ని సంవత్సరాలలోను వాస్తవంగా తెచ్చిన అప్పు అంచనాలకన్నా చాలా ఎక్కువ. అధికంగా అప్పు తెచ్చి ప్రభుత్వం తన కార్యకలాపాలను నడిపిస్తున్నది. కానీ ఆదాయం పెరిగే పరిస్థితి మాత్రం కనబడటం లేదు. ఆదాయం తగ్గుతున్నదని గమనించవచ్చు. ఈ పద్ధతిలో ప్రభుత్వ నిర్వహణ ఎక్కువ రోజులు సాగదు. రుణ భారం పెరుగుతున్న కొద్దీ కొత్తగా తెచ్చిన అప్పులు పాత బాకీలను తీర్చడానికి చాలవు. గత మూడేళ్లుగా సంవత్సరానికి 14,000 కోట్ల దాకా ప్రభుత్వం వడ్డీలు చెల్లిస్తున్నది. ఇది తెచ్చిన అప్పులో సగభాగమని గుర్తించాలి.

ముగింపు

మరొక అంశం ఏమిటంటే బడ్జెట్ వాస్తవికంగా లేనప్పుడు చాలా అనర్థాలు తలెత్తుతాయి. అనేక పద్దుల కేటాయింపులు తగ్గిపోతాయి. అసెంబ్లీ ఓటువేసిన ఖర్చులకు వాస్తవంగా అయ్యే వ్యయానికి మధ్య వ్యత్యాసం పెరిగిపోతుంది. ఏ వర్గాలు రాజకీయంగా బలహీనంగా ఉంటాయో ఆ వర్గాలు ఎక్కువ నిధులను కోల్పోతాయి. అసలే కేటాయింపులు తక్కువ అందునా కోతలు విధించడంతో నిధుల కొరతను ఎదుర్కొంటారు. కాగ్ అధ్యయనం ప్రకారం 2017-18 సంవత్సరంలో పెట్టుబడి వ్యయంలో సగమే ఖర్చయింది. రెవెన్యూ వ్యయంలో బడ్జెట్ కేటాయింపుకన్నా 22 శాతం తగ్గింది. తెలంగాణ బడ్జెట్‌లో ఖర్చును వివిధ శాఖలకు 40 పద్దుల కింద కేటాయింపులు చేస్తారని తెలుకున్నాం. అందులో 33 పద్దులకు చేసిన కేటాయింపుల కన్నా వాస్తవ ఖర్చులు తక్కువ. అంటే ఈ పద్దులకు అసెంబ్లీ చేసిన కేటాయింపులు పూర్తిగా ఖర్చు కాలేదు. మరో 7 పద్దులలో కేటాయింపుల కన్నా ఎక్కువ

పట్టిక-5: రాష్ట్ర రెవెన్యూ ఆదాయం : అంచనాలు - వాస్తవాలు (రూ. కోట్లలో)

సంవత్సరం	బడ్జెట్ అంచనాలు	సవరించిన అంచనాలు	వాస్తవ లెక్కలు
2014-15	80,090	80,090	51,042
2015-16	91,131	79,312	76,134
2016-17	1,00,924	87,069	82,818
2017-18	1,13,083	1,08,148	88,824
2018-19	1,30,975	1,19,099	1,01,420
2019-20	1,13,099	1,109,28	-
2020-21	1,46,151		

పట్టిక-6: రాష్ట్ర స్థూల వ్యయం: అంచనాలు - వాస్తవాలు (రూ. కోట్లలో)

సంవత్సరం	బడ్జెట్ అంచనాలు	సవరించిన అంచనాలు	వాస్తవ లెక్కలు
2014-15	1,00,637	1,00,637	62,306
2015-16	1,15,689	1,00,061	97,923
2016-17	1,30,415	1,12,191	1,22,823
2017-18	1,49,645	1,42,506	1,43,133
2018-19	1,74,453	1,61,856	1,57,150
2019-20	1,46,492	1,42,152	-
2020-21	1,82,914		

పట్టిక-7: రాష్ట్ర అప్పులు: అంచనాలు - వాస్తవాలు (రూ. కోట్లలో)

సంవత్సరం	బడ్జెట్ అంచనాలు	సవరించిన అంచనాలు	వాస్తవ లెక్కలు
2014-15	18,008	18,008	11,431
2015-16	21,554	20,849	21,683
2016-17	29,504	25,583	50,832
2017-18	36,237	34,837	54,554
2018-19	43,507	42,507	55,561
2019-20	33,444	32,344	-
2020-21	39,550		

ఖర్చయింది. కాగ్ నివేదిక ప్రకారం కోత విధించిన మొత్తం 58,614 కోట్ల రూపాయలు కాగా అసెంబ్లీ ఆమోదించిన కేటాయింపుల కన్నా అధికంగా ఖర్చయిన మొత్తం 28,171 కోట్ల రూపాయలు. ఖర్చు కాకుండా మిగిలిన 58,614 కోట్ల రూపాయలలో 97 శాతం అంటే 56,856 కోట్ల రూపాయలు 25 పద్దులకు సంబంధించిన మొత్తం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 204(3) ప్రకారం అసెంబ్లీ ఆమోదం లేకుండా ఖర్చు చేయరాదు. అసెంబ్లీ ఆమోదించిన దానికన్నా అదనపు కేటాయింపులు అవసరమైతే మళ్లీ సభకు వెళ్ళాలి. ఏ అమోదం లేకుండా 2017-18లో కాగ్ నివేదిక ప్రకారం, 2218 కోట్ల రూపాయలు ఖర్చయింది. పోలీసు శాఖకు ప్రతి సంవత్సరం అదనపు కేటాయింపులు ఉంటున్నాయి. అసెంబ్లీ ఆమోదం లేకుండానే ఆ శాఖకు 2015-16 నుండి 2017-18 మధ్య కాలంలో ఆదనంగా 2327 కోట్లు కేటాయించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 205 ప్రకారం అదనపు వ్యయాన్ని పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీలో చర్చించి సభ ఆమోదం తీసుకోవాలి. కానీ కాగ్ కు అందిన సమాచారం ప్రకారం రాజ్యాంగ పరమైన ప్రక్రియలు పాటించకుండానే 2014-15 నుండి 2016-17 వరకు ప్రభుత్వం 27,346 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది.

కాగ్ పూర్తి కేటాయింపులు, ఖర్చు కాని 8 పద్దులను వివరంగా పరిశీలించింది. కాగ్ నివేదికలో పొందుపర్చిన ఈ అంశాలలో కొన్నింటిని చూద్దాం. సామాజిక సంక్షేమ శాఖకు 12, 152 కోట్ల రూపాయలు కేటాయిస్తే 7624 కోట్లు మాత్రమే ఖర్చయింది. 2017-18 సంవత్సరానికి ఎస్.సి., ఎస్.టి. సబ్ ప్లాన్ నిధులలో 54 శాతం మాత్రమే ఖర్చయ్యాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 10 కార్యక్రమాలలో మూడింటిలో మాత్రమే లక్ష్యాలకు అనుగుణంగా నిధులు ఖర్చయ్యాయి. అవి: కె.సి.ఆర్.కిట్, షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి. నిధులు లేక పురోగతి కనిపించని పథకాలు: డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకం, దళితుల 3 ఎకరాల పంపిణీ స్కీమ్, బాగా వెనకబడిన తరగతుల కార్పొరేషన్ కార్యక్రమాలు.

ఇదికాక బడ్జెట్ వెలుపల ప్రభుత్వం కొన్ని కార్యక్రమాలను కార్పొరేషన్ల ద్వారా నిర్వహిస్తున్నది. వాటి ద్వారా అయ్యే ఖర్చులు బడ్జెట్ పరిధిలోకి రావు. ఉదాహరణకు కాళేశ్వరం, మిషన్ భగీరథ పనులకు గాను ఏర్పడిన కార్పొరేషను 1-3-2020 నాటికి ప్రభుత్వం 34,390 కోట్ల రూపాయలకు గ్యారంటీలు ఇచ్చింది. అట్లా ప్రజా నియంత్రణ పరిధి నుండి చాలా అంశాలను తొలగిస్తున్నారు.

ఏ ప్రజాస్వామిక సంప్రదాయాల ప్రతిష్టాపన కోసం తెలంగాణ సాధించుకున్నామో ఆ రాష్ట్రంలో ప్రజాస్వామిక విలువలకు ప్రాధాన్యతనివ్వకపోవడం శోచనీయం. ఫలితంగానే బడ్జెట్ అర్థరహితంగా మారిపోయింది. మరోవైపు తెలంగాణ ఆకాంక్షల సాధన కోసం ప్రభుత్వం కేటాయింపులునూ చేయలేక పోతున్నది.

(రచయిత రాజనీతి శాస్త్రవేత్త) వీ

అవాస్తవిక అంచనాల ఊహల బడ్జెట్

బడ్జెట్ అంచనాలకు, సవరింపులకు, ఖర్చులకు చాలా వ్యత్యాసముందనీ, ఓటు బ్యాంకును పెంచుకునే పథకాల మీద ఉన్న శ్రద్ధ ప్రజల జీవనప్రమాణాలను పెంచే విధానాలపై లేదనీ అంటున్నారు **ఎ. నర్సింహారెడ్డి**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రు. 1,82,914 కోట్ల 42 లక్షల అంచనా వ్యయంతో 2020–21 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను మార్చ్ 8న అసెంబ్లీలో ఆర్థిక శాఖా మంత్రి హరీష్‌రావు ప్రవేశపెట్టారు. రెవెన్యూ రాబడి రు. 1,43 లక్షల కోట్లు కాగా రెవెన్యూ వ్యయం రు. 1,38,669 కోట్ల 82 లక్షలని, పెట్టుబడి వ్యయం రు. 22.061 కోట్ల 18 లక్షలని ఆర్థికమంత్రి టి.హరీష్‌రావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం – అభివృద్ధి లక్ష్యంతో కూడిన సమతుల్య బడ్జెట్ అని చెబుతున్నప్పటికీ అంచనాలకు, వాస్తవాలకు పొంతన లేకుండా ఉన్నాయి. స్థిరమైన ఆదాయ వనరులు లేకుండా ఉహాగానాలతో కూడిన కేటాయింపులు నమ్మశక్యంగా లేవు. బడ్జెట్‌లో అంకెలగారడి చేసి మసిపూసి మారెడుకాయ చేసింది. ఒకవైపు జిఎస్‌టి నిధులు ఆశించిన మేరకు రాలేదని, పదిహేనో ఆర్థిక సంఘం సిఫారసులు అమలు కాలేదని, కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా తగ్గిందని చెబుతూనే, గత బడ్జెట్‌కు అదనంగా రు. 40,762 కోట్లు (27 శాతం పెరుగుదల) పెంచి మొత్తం రు. 1,82,914 కోట్ల పద్దును ప్రతిపాదించారు.

రాష్ట్ర బడ్జెట్ ఆశలూరించే అంకెల గారడీ తప్ప వాస్తవ పరిస్థితితో సంబంధం లేదని అంకెలే చెబుతున్నాయి. ఏ అంచనాకైనా బలమైన ప్రాతిపదిక ఉండాలి. “ఆర్థిక వ్యవస్థలో గత సంవత్సరంన్నరగా మనం మందగమనాన్ని ఎదుర్కొంటున్నాము. పర్యవసానంగా, రాష్ట్రానికి కేంద్రం నుండి లభించే పన్నుల్లో వాటా, ఇతర సొమ్ము బదిలీలు తగ్గాయి. రాష్ట్ర ఆదాయాల్లో తగ్గుదల ఉంది” అని ఆర్థికమంత్రి స్వయంగా చెప్పారు. మందగమనం ప్రభావం వల్ల రాష్ట్ర ఆదాయ వృద్ధి 2018–19లోని 16.1 శాతం నుండి 2019–20లో (ఫిబ్రవరి చివరి వరకు) 6.3 శాతానికి తగ్గినట్లు కూడా మంత్రి చెప్పారు. 15వ ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం పన్నుల వాటాను 42 శాతం నుంచి 41 శాతానికి కేంద్రం తగ్గించింది. అటువంటప్పుడు, ఆర్థిక మందగమనం కొనసాగుతున్న పరిస్థితిలో రాష్ట్ర ఆశావహ బడ్జెట్‌కు ప్రాతిపదిక కనిపించదు.

బడ్జెట్‌ను మరో కోణం నుంచి చూస్తే, గత సంవత్సరం ఆర్థిక శాఖను కూడా నిర్వహించిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు 2019 ఫిబ్రవరిలో రు. 1,82,017 కోట్లతో సమర్పించిన తాత్కాలిక బడ్జెట్‌ను సెప్టెంబర్‌లో పూర్తిస్థాయి బడ్జెట్ సమర్పించినపుడు ఆ బడ్జెట్‌ను రు. 1,46,492 కోట్లకు తగ్గించారు. ఆ తర్వాత రు. 1,37,226 కోట్లకు, తిరిగి రు. 1,42,152 కోట్లకు సవరించారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ రిపోర్టు ప్రకారం 2020 జనవరి చివరి వరకు రాష్ట్ర ఆదాయం రు. 1,05,992 కోట్లు చేరిందని, మిగిలిన రెండు నెలల్లో ఎంతగా పన్నులు వసూలైనా సవరణ అంచనాను చేరుకోలేకపోవచ్చునని స్పష్టం చేసింది. కాబట్టి కొత్త బడ్జెట్ భారీ అంచనాలను అందుకోవడం సాధ్యమేనా? మొత్తంగా బడ్జెట్ ప్రజలను భ్రమల్లో పెట్టి అరచేతిలో వైకుంఠం చూపిస్తోంది.

బడ్జెట్ సమగ్ర స్వరూపం (రు.కోట్లలో)

	2019–20 (బ.అం.)	2019–20 (స.అం.)	2020–21 (బ.అం.)
రెవెన్యూ వసూళ్లు	1,13,099	1,10,928	1,43,152
కేంద్రపన్నుల్లో వాటా	19,718	15,987	16,726
పన్నుల ఆదాయం	69,328	71,327	85,300
పన్నేతర ఆదాయం	15,875	12,275	30,600
గ్రాంట్లు	8,177	11,338	10,525
పెట్టుబడి రాబడులు	33,444	32,344	39,550
మార్కెట్ రుణాలు	31,000	31,000	34,000
బాండ్లపై రుణాలు	100	100	100
కేంద్రం రుణాలు	800	200	400
ఇతర రుణాలు	1,000	500	1,000
డిపాజిట్లు	500	500	4,000
అడ్వాన్సులు	44.86	44.86	50
మొత్తం రాబడులు	**1,46,544**	**1,43,273**	**1,82,701**
రెవెన్యూ వ్యయం	1,11,055	1,10,824	1,38,669
అందులో వడ్డీచెల్లింపు	14,574	14,385	14,615
పెట్టుబడి వ్యయం	17,274	13,165	22,061
అడ్వాన్సుల చెల్లింపు	8,896	8,896	15,662
రుణాల చెల్లింపు	9,265	9,265	6521
మొత్తం వ్యయం	**1,46,492**	**1,42,152**	**1,82,914**
రెవెన్యూ మిగులు	2,044	104	4,482
ద్రవ్యలోటు	24,081	21,913	33,191
ప్రాథమిక లోటు	9,507	7528	18,575

గత ఆరేళ్లుగా మిగులు బడ్జెట్ అని గొప్పలకు పోతున్న రాష్ట్ర ప్రభుత్వం రు. 33.191 కోట్లు ద్రవ్యలోటును తప్పించుకోలేక అసాధారణ రీతిలో పన్నేతర ఆదాయాన్ని సమకూర్చుకుంటామని ఆర్థిక మంత్రి చెప్పడం నేల విడిచి సాము చేయడం లాంటిదే. ప్రస్తుత సంవత్సరం 2019–20లో లక్ష కోట్ల రూపాయల ఆదాయం ఉండగా, అది 2020–21లో రు. 1.43 లక్షల కోట్లకు చేరుతుందని, అంటే ప్రభుత్వ ఆదాయంలో 43 శాతం వృద్ధి సాధ్యమని భావించడం అత్యాశే తప్ప మరొకటి కాదు. ఇక అంతర్గత ఆదాయాలపై దృష్టి పెడుతామని బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి ప్రస్తావించడమంటే ప్రజలపై పన్నుల బాదుడు తప్పదని స్పష్టంగానే సంకేతాలిచ్చాడు. ఈ సంవత్సరం పన్నేతర ఆదాయం రు. 30,600 కోట్లు, రుణాల ద్వారా రు. 35,500 కోట్లు సేకరించ

రంగాల వారిగా పన్నుల ఆదాయ వివరాలు (కోట్లలో)

విభాగం	2018-19	2019-20	2020-21
సేల్స్ ట్యాక్స్	25,942	47,789	54,000
రాష్ట్ర ఎక్సైజ్	10,600	10,901	16,000
స్టాంప్స్, రిజిస్ట్రేషన్స్	4,699	6,146	10,000
వెహికిల్ ట్యాక్స్	3950	3,714	4,300
ఇతర ఆదాయం	11,092	778	700
మొత్తం ఆదాయం	**46,285**	**69,328**	**85,000**

బోతున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలను గమనిస్తే రు.30,600 కోట్ల పన్నేతర ఆదాయాన్ని స్థిరాస్తుల అమ్మకం ద్వారా సమకూర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. అందులో భాగంగానే 2019-20 సవరించిన అంచనాల్లో రు.12,275 కోట్లు ఉన్న పన్నేతర ఆదాయాన్ని ఏకంగా రు.18 వేల కోట్లకు పెంచి 2020-21కి రు.30,600 కోట్లు ప్రతిపాదించారు. ఇందుకోసం నిరర్థక ఆస్తులు, ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టాలని నిర్ణయించింది. 'మనది ధనిక రాష్ట్రం, మిగులు రాష్ట్రం...' అంటూ ఆరేండ్ల నుంచి ప్రకటనల మీద ప్రకటనలు గుప్పించిన ప్రభుత్వ పెద్దలు... తెలంగాణ ప్రజలను ఊరించి, ఊరించి ఒక్కసారిగా ఉస్సూరుమనిపించారు. స్థానికంగా ఆదాయ వనరులను పెంచుకోలేక టిఆర్ఎస్ ప్రభుత్వం పన్నులు పెంచడమే కాకుండా భూములు, ఆస్తులను తెగనమ్మాలని భావించడం దివాళాకోరుతనానికి నిదర్శనం.

హౌసింగ్ బోర్డు, దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హోల్డింగ్స్ లిమిటెడ్(దిల్), రాజీవ్ స్వగృహా వంటి సంస్థలకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వేలాది ఎకరాల భూములు ఆస్తులు ఉన్నాయి. ఇప్పుడు ఆ ఆస్తులను అమ్మి ఆదాయాన్ని ప్రోదిచేసుకునే ప్రయత్నాల్లో ఉన్నది. ఇది ఒకరకమైన ప్రభుత్వ వైఫల్యం, దివాళాకోరుతనంగా చెప్పవచ్చు. ఎక్కడెక్కడ ఎన్ని భూములున్నాయి? ఎటువంటి ప్రాంతాల్లో ఉన్నాయి? వాటిని ఎలాంటి అవసరాలకు ఉపయోగించుకునే అవకాశం ఉంది? ఆ ప్రాంతాల్లో డిమాండ్ ఏ మేరకు ఉంది? ధర ఎలా ఉంది? తదితర కీలకాంశాలపై ఆరా తీస్తోంది. ఇటీవల సుప్రీంకోర్టులో కేసు నెగ్గి ప్రభుత్వం దక్కించుకున్న 4,000 ఎకరాలతో పాటు మరో 2,000 ఎకరాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. తెలంగాణ హౌసింగ్ బోర్డుకు మొత్తం 3,337 ఎకరాలు ఉన్నాయి.

ఆర్థిక సంవత్సరం	అంచనాలు	ఆదాయం
2014-15	94,890	61,840
2015-16	1,09,582	90,818
2016-17	1,26,519	1,14,397
2017-18	1,39,441	1,09,384
2018-19	1,58,823	1,19,728
2019-20	1,42,152	1,05,000 (ఫిబ్రవరి వరకు)

బడ్జెట్ అంటే సామాజిక విలువల స్వరూపమంటూ సూత్రీకరించి, దాని ఆచరణ విషయాన్ని మరిచారు. నిధుల సమీకరణకు ప్రజలపై భారాలు తప్పవన్న సంకేతాలను సిఎం కెసిఆర్ సైతం ఇప్పటికే ఇచ్చారు. బడ్జెట్‌కు ముందు రోజే అసెంబ్లీ సాక్షిగా విద్యుత్, ఆర్‌టిసి ఛార్జీలను పెంచుతామన్న ముఖ్యమంత్రి, తాజా బడ్జెట్ చర్చలో భాగంగా భారాలు ప్రజలు మోయవల్సిందేనని చెప్పారు. ఆదాయవనరులు లేకుండా కేటాయింపులు ఘనంగా చేసి సమతుల్యతా బడ్జెట్ అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించడం హాస్యాస్పదం. ఈ బడ్జెట్‌లో లక్ష్యం, దిశానిర్దేశం రెండూ కనిపించడం లేదు. 2014-15 నుంచి మొదలెడితే 2019-20 బడ్జెట్ల వరకు వాస్తవ అంచనాల మేరకు ఆదాయం రాలేదు. దీన్ని పూడ్చుకోవడానికి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, విద్య, వైద్య పద్దులకు కోతపెట్టడం గమనార్హం.

రాష్ట్ర స్థూల అంతర్గత ఉత్పత్తి(జిఎస్‌డిపి)ని రు.9,69,604 కోట్లుగా అంచనా వేసినట్లు తెలిపిన ఆర్థికమంత్రి, ఆర్థిక మందగమనం కారణంగా వృద్ధిరేటు 2018-19లో 14.3 శాతం కాగ 2019-20లో 12.6 శాతానికి తగ్గినట్లు తెలిపారు. జాతీయ తలసరి ఆదాయం రు.1,35,000 కాగా రాష్ట్ర తలసరి ఆదాయం రు.2,28,215 ఉందని చెప్పారు. తలసరి ఆదాయం చెప్పిన ప్రభుత్వం తలసరి అప్పు రు.91 వేలు ఉందన్న వాస్తవాన్ని చెప్పకుండా దాట వేశారు. దేశంలో, రాష్ట్రంలో పెరుగుతున్న సంపద ప్రజలకు చేరకుండా 1 శాతం సంపన్నుల వద్దకు చేరుతుందని పలు నివేదికలు ఘోషిస్తున్నాయి. 1 శాతం భారతీయ సంపన్నుల వద్ద ఉన్న సంపద దేశంలోని 95 కోట్ల మంది వద్ద ఉన్న సంపదకంటే నాలుగు రెట్లు అధికంగా ఉంది. అందువల్ల తలసరి ఆదాయం ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలకు సూచీ కానేకాదు.

రుణాలు పెరిగినా పెరగని పెట్టుబడి వ్యయం

సుస్థిర అభివృద్ధి, సమగ్రాభివృద్ధి సాధించాలంటే ప్రభుత్వాలు సంక్షేమ రంగాలకు ప్రాధాన్యత ఇస్తూనే పెట్టుబడి వ్యయం పెంచుకోవాల్సి ఉంటుంది. ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర నిర్వహణ వ్యయం కోసం బడ్జెట్‌లో కేటాయింపులు చేయకతప్పని పరిస్థితులుంటాయి. రెవెన్యూ వ్యయం పెరిగితే శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలకోసం పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. ఇది తెలంగాణ రాష్ట్రానికే పరిమితమైన అంశం కాదు. తెలంగాణ ప్రభుత్వం 2014 జూన్ 2న రు.61,711 కోట్ల రుణంతో ప్రారంభమై ఆరేళ్లలో రు.2,29,205 కోట్ల రుణానికి చేరుకుంది. గడిచిన ఆరేళ్లలో ప్రభుత్వం అధనంగా రు.1,67,494 కోట్ల అప్పు చేసింది. అంటే సంవత్సరానికి సగటున రు.28 వేల కోట్లు అప్పు చేసింది.

రాష్ట్ర రుణాల మొత్తం 2020-21 బడ్జెట్ అంచనాల్లో రెండు లక్షల 29 వేల కోట్ల రూపాయలకు పైగానే ఉండగా దీనికి అదనంగా వివిధ పథకాల కింద ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలు 40,241 కోట్ల రూపాయలు కూడా ఇందులో చేర్చాల్సి ఉంటుంది. ఇంకా విద్యుత్ రంగానికి ఇస్తున్న గ్యారంటీ మొత్తం రు.10,406 కోట్లు కూడా కలుపుకోవాలి. అంటే ఆర్థికమంత్రి హరీష్‌రావు శాసనసభకు సమర్పించిన బడ్జెట్ అంచనాల ప్రకారం రాష్ట్రం మొత్తం రుణభారం రు.2,79,852.59 కోట్లకు చేరింది. రుణాలు, గ్యారంటీల పెరుగుదల దామాషాలో పెట్టుబడి వ్యయంలో పెరుగుదల లేకపోవడం ఆందోళనకరమైన విషయం.

బడ్జెట్ పద్దులను పరిశీలిస్తే ఈ ఆరు సంవత్సరాల్లో ప్రభుత్వ పరంగా జరిగిన పెట్టుబడి వ్యయం 95 వేల కోట్లకే పరిమితమవుతున్నది. కాగా కొత్త ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రుణాల వాయిదా చెల్లింపులకు గానూ వడ్డీతో కలిపి రు.14,625.36 కోట్లు చెల్లించాల్సి వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. కార్పొరేషన్‌ల ద్వారా జరిగే వ్యయం పరిగణలోకి తీసుకోనట్లయితే ప్రభుత్వమే నీటిపారుదల రంగానికి చేస్తున్న

వ్యయాన్ని పరిశీలిస్తే కీలక రంగమైన ఇరిగేషన్ పద్దులోనూ ఏటేటా వ్యయం పెరగడం లేదు సరికదా తగ్గిన దాఖలాలున్నాయి. ఈ మేరకు 2016-17 ఆర్థిక సంవత్సరంలో 15,723 కోట్ల 72 లక్షల రూపాయలు ఖర్చు చేయగా, 2017-18లో ఈ వ్యయం తగ్గి, రు.12,994.27 కోట్లకు పడిపోయింది. కాగా 2018-19 ఆర్థిక సంవత్సరంలో కేవలం రు.9,506.84 కోట్లు ఖర్చు చేశారు.ఇక సవరించిన అంచనాల ప్రకారం 2019-20లోనూ ఇరిగేషన్ శాఖలో వ్యయం మరింతగా పడిపోయింది. అసెంబ్లీకి సమర్పించిన బడ్జెట్ పుస్తకాల్లోనే ఈ నిధుల వ్యయం క్షీణత కనిపిస్తున్నది. వరుసగా బడ్జెట్ పరిమాణం గణనీయంగా పెరిగినప్పటికీ నీటిపారుదల రంగానికి కేటాయింపులు తగ్గాయి. ప్రతి సంవత్సరం రాష్ట్ర రుణభారం పెరుగుతుండగా పెట్టుబడి వ్యయం మాత్రం అదే స్థాయిలో పెరగడం లేదనడానికి బడ్జెట్ పద్దుల్లోని గణాంకాలనే వెల్లడిస్తున్నాయి.

ఏటేటా పెరుగుతున్న రుణభారం (రు.కోట్లలో)

సంవత్సరం	రుణాలు
2015-16	93,115.16
2016-17	1,27,829.87
2017-18	1,52,190.12
2018-19	1,75,281.07
2019-20 ఆర్ఇ	1,99,215.30
2020-21బిఇ	2,29,205.16

అప్పు చేసి పప్పు కూడు తినరాదనే సామెత ఎలా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తాను స్వీకరించిన రుణాల స్థాయిలో అయినా పెట్టుబడి వ్యయం చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు బడ్జెట్‌లోని ద్రవ్యలోటును పూడ్చటానికి అప్పులు స్వీకరించేందుకు ఫిజికల్ రెస్పాన్సిబిలిటి అండ్ బడ్జెట్ మేనేజిమెంట్(ఎఫ్ఆర్‌బిఎం) చట్టం కూడా అనుమతిస్తున్నది. తెలంగాణ ప్రభుత్వం ఎఫ్ఆర్‌బిఎం చట్టం అనుమతించిన దానికంటే తక్కువగా రుణాలు తీసుకుంటున్నట్లుగా ప్రకటిస్తున్నప్పటికీ ఈ రుణాలన్నింటినీ పెట్టుబడి వ్యయంగా మార్చుకోలేకపోతుండటం గమనార్హం. ఫలితంగా ప్రజలపై రుణభారం పడక తప్పదు.

విద్యకు అరకొర నిధులు

ఆరు దశాబ్దాల పాటు విద్యాభివృద్ధిలో వివక్షకు గురైన తెలంగాణ, అక్షరాస్యతా శాతంలో దేశంలోని రాష్ట్రాలలోకెల్లా అట్టడుగున ఉంది. అందువలన తెలంగాణ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధి మీద ఎక్కువ శ్రద్ధాసక్తులు పెట్టవలసి ఉంటుంది. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయవలసి ఉంటుంది. ఉమ్మడి ప్రభుత్వం ప్రతి యేటా 14 శాతం నిధులు కేటాయిస్తే తెలంగాణ ప్రభుత్వం 6.63 శాతానికి కుదించింది. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు నూతనంగా నెలకొల్పడానికి బదులు 6000 పాఠశాలలు, అనేక డిగ్రీ కళాశాలలు మూసి వేసింది. ఇక విశ్వవిద్యాలయాలు నిధులు లేక, బోధనకు అధ్యాపకులు లేక కునారిల్లిపోతున్నాయి.

తెలంగాణ ప్రభుత్వ ఆరేళ్ల విద్యా విధానాలను గమనిస్తే ప్రభుత్వ విద్యారంగాన్ని నాశనం చేసి ప్రైవేట్ విద్యారంగాన్ని ప్రోత్సహించాలన్న విధానపరమైన ధృఢ సంకల్పంతో ఉన్నట్లు అర్థమవుతోంది. రాష్ట్రంలో 6-14 సంవత్సరాల మధ్య వయస్సు గల బడి ఈడు పిల్లలు 65 లక్షల మంది ఉంటే 959 గురుకులాల్లో 3 లక్షల మంది విద్యార్థులకు మాత్రమే సరైన విద్య అందిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 27 లక్షల మంది విద్యార్థులను పట్టించుకోవడం లేదు. స్వయంగా ముఖ్యమంత్రే ఉద్యమకాలంలో కెజి టూ పిజి ఉచిత విద్య నా స్వప్నం అని చెప్పారు. ఆరేళ్లు గడిచినా కెజి, పిజి ఊసే లేదు. ఆరేళ్లుగా ఉపాధ్యాయ, అధ్యాపకుల నియామకాలు లేవు. వసతులు లేవు.

ఈ దుస్థితిలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి పాఠశాల విద్యాశాఖకు రు.14 వేల కోట్లు, ఉన్నత విద్యాశాఖకు రు.4 వేల కోట్లు, సాంకేతిక విద్యాశాఖకు రు.700 కోట్లు కలిపి మొత్తం రు.18,700 కోట్లు కేటాయించాలని అధికారులు ప్రతిపాదించినట్టు విశ్వసనీయంగా తెలుస్తోంది. అయితే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో విద్యా రంగానికి రు.12,127.57 కోట్లు మాత్రమే కేటాయించింది. గత ఏడాది మొత్తం బడ్జెట్‌లో విద్యారంగానికి 6.76 శాతం నిధులను కేటాయించగా ఈ సంవత్సరానికి 6.63 శాతమే కేటాయించింది. బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయిస్తున్న నిధుల గణాంకాలను పరిశీలిస్తే ప్రతి యేడాది విద్యారంగానికి నిధులను తగ్గిస్తున్నట్టు అర్థం అవుతోంది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత 2014-15 విద్యా సంవత్సరంలో రు. 1,00,637 కోట్ల బడ్జెట్‌లో విద్యకు 10,963 కోట్లను కేటాయించగా అధి మొత్తం బడ్జెట్‌లో 10.8 శాతంగా ఉంది. అదికాస్త ప్రతి యేడాది తగ్గుతూ 2020-21 ఆర్థిక సంవత్సరం వచ్చేసరికి 6.63 శాతానికి తగ్గింది. అయితే రాష్ట్రంలో అక్షరాస్యతను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో... అందరికీ విద్యలో భాగంగా ఈచ్ వన్ టీచ్ వన్ కోసం 100 కోట్లను ప్రత్యేకంగా కేటాయించారు. విద్యారంగానికి కేటాయించిన నిధుల్లో పాఠశాల విద్యకు 10,405.30 కోట్లు, ఉన్నత విద్యకు 1452.04 కోట్లు. సాంకేతిక విద్యకు 270.23 కోట్లను కేటాయించారు.

విద్యకు కేటాయించిన నిధుల వివరాలు (రు.కోట్లలో)

శాఖ	నిర్వహణాపద్దు	ప్రగతిపద్దు	మొత్తం
పాఠశాల విద్య	9113.10	1292.19	10,105,30
ఉన్నత విద్య	1372.95	79.08	1,452.04
సాంకేతిక విద్య	265.08	5.15	270.23
మొత్తం	**10,751.13**	**1,376.42**	**12,127.57**

ఎప్పటిలాగే యూనివర్సిటీల్లో పరిశోధన, అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో పెద్దగా నిధులను కేటాయించలేదు. సాంకేతిక విద్యలో నిర్వహణ, ప్రగతి పద్దు కింద గతేడాది కంటే ఈసారి నిధులను ప్రభుత్వం తగ్గించింది. యూనివర్సిటీలకు నిర్వహణ పద్దులో గతేడాది కంటే ఈసారి నిధులను పెంచింది. అయితే పెరిగిన నిధులు యూనివర్సిటీల్లో యుజిసి సవరించిన వేతనాల చెల్లింపునకే సరిపోనున్నాయి. సెంట్రల్ పిఆర్‌సి సిఫారసు మేరకు యుజిసి ప్రకటించిన వేతనాలను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు ఆ వేతనాల చెల్లింపులకు అయ్యే అదనపు నిధులను మాత్రమే నిర్వహణ పద్దులో కేటాయించింది. ఈసారి ఉన్నత, సాంకేతిక విద్యకు మొత్తంగా నిర్వహణ పద్దు కింద రు.1,638.04 కోట్లు, ప్రగతి పద్దు కింద రు.85.24 కోట్లు కేటాయించింది. యూనివర్సిటీల్లో ఇంక్యుబేటర్ల ఏర్పాటు, పరిశోధనలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు మొత్తంగా రు.2,500 కోట్ల వరకు బడ్జెట్ కావాలని అడిగినా రు.1,723.27 కోట్లకే పరిమితం చేసింది.

ఆరేళ్లలో విద్యకు చేసిన కేటాయింపులు (రు.కోట్లలో)

ఏడాది	మొత్తం బడ్జెట్	విద్యారంగం	శాతం
2014-15	1,00,367	10,963	10.8
2015-16	1,15,689	11,216	9.69
2016-17	1,30,415	10,738	8.23
2017-18	1,49,646	12,709	8.49
2018-19	1,74,453	13,276	7.61
2019-20	1,82,017	12,220	6.76
2020-21	1,82,914	12,127	6.63

ప్రాధాన్యత కొరవడిన వైద్య ఆరోగ్య రంగం

వైద్యఆరోగ్య రంగానికి డిమాండ్‌కు తగ్గట్టు కేటాయింపులు జరగడం లేదు. 2020-21 బడ్జెట్‌లో కేవలం రు.6,186 కోట్లతో సరిపెట్టారు. గత ఆరేండ్లుగా కేటాయింపులే తక్కువగా ఉంటున్నాయంటే అదీ పూర్తిగా ఖర్చు చేయకపోవడం గమనార్హం. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారిగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రు.4,062 కోట్లు ప్రతిపాదించి, దాన్ని రు.3,539 కోట్లకు సవరించారు. అందులోనూ రు.1161 కోట్లు తక్కువ ఖర్చు చేశారు. ఇక 2015-16లో సవరించిన బడ్జెట్ రు.3,970 కాగా అందులో రు.681 కోట్లు తక్కువగా అంటే రు.3,289 మాత్రమే వ్యయం చేశారు. 2017-18లో రు.5,835 కోట్లు కేటాయింపులకుగాను రు.5,031 కోట్లు ఖర్చు కాగా రు.804 కోట్లు ఖర్చు చేయకుండా వదిలేశారు. ఈ ఏడాది కూడా కేటాయించిన మొత్తంలో ఎంత మేరకు సవరిస్తారు? అందులో ఎంత ఖర్చు చేస్తారనేది ప్రశ్నార్థకమే.

కేటాయించిన రు.6,186 కోట్లలో సగం వరకు రోజువారీ నిర్వహణకు, జీతాలకు పోగా మిగతా సగంతోనే ప్రజావైద్యాన్ని అందించాల్సి ఉన్నది. అంటే వైద్యారోగ్యానికి మూడు నుంచి నాలుగు శాతం బడ్జెట్ మించడం లేదు. ఇప్పటికీ ప్రజావైద్యం ప్రజలకు మెరుగైన సేవలందించలేని పరిస్థితి. సిబ్బంది కొరత, సౌకర్యాల లేమి నిరంతరం వెంటాడుతూనే ఉంది. దీనికి తోడు డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, డయేరియా, స్వైన్ ఫ్లూ లాంటి వ్యాధులు ప్రబలిన సమయాల్లో వచ్చే ఒత్తిడిని తట్టుకుని సేవలందించక చేతులెత్తేసిన వైనం తెలిసిందే. వైద్యారోగ్యరంగంలో ఇప్పటికే దాదాపు 70 శాతం మేర కార్పొరేట్, ప్రైవేటు రంగం ఆక్రమించింది. ఇక మిగిలిన 30 శాతం మేర ప్రజావైద్యాన్ని బలోపేతం చేసుకోవడంతో పాటు విస్తరిస్తే తప్ప కార్పొరేట్ దోపిడీ నుంచి ప్రజలను రక్షించలేం.

ఇంటి వద్దనే వైద్యం అందించే 104 వాహనాల పునరుద్ధరణ, 108 ఉద్యోగుల జీతాల పెంపునకు సంబంధించి ప్రస్తావన లేకపోవడం నిరాశకు గురి చేసింది. కరోనా వైరస్ నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించిన ముఖ్యమంత్రి పెరిగిన టిబి, హెచ్ఐవి కేసుల నియంత్రణ విషయాన్ని పేర్కొనలేదు. పెరిగిన అవసరాలు, డిమాండ్లను పరిగణనలోకి తీసుకోకుండా గతంలో మాదిరిగానే మొక్కుబడి కేటాయింపులు చేశారు. హైదరాబాద్ నలుమూలల 500 పడకల చొప్పున నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, జిల్లాకో నిమ్స్ స్థాయి ఆస్పత్రి, నియోజకవర్గానికి వంద పడకల ఆస్పత్రి నిర్మిస్తామని హామీ ఇచ్చి ఏండ్లు గడుస్తున్నాయి. ఈ బడ్జెట్‌తో ఆ హామీలు కూడా నెరవేరే పరిస్థితి కనిపించడం లేదు. కనీసం 10 శాతం బడ్జెట్ కేటాయిస్తే తప్ప ప్రజావైద్యం మెరుగుపరచడం సాధ్యం కాదు.

హోంశాఖకు భారీగా కేటాయింపులు

రాష్ట్ర బడ్జెట్‌లో హోంశాఖకు కేటాయింపులు 5825 కోట్ల రూపాయలు చేశారు. ఈసారి రు.863 కోట్లు అధికంగా కేటాయించారు. ఇందులో డిజిపి కార్యాలయానికి రు.321.59 కోట్లు , హైదారాబాద్ పోలీసు కమీషనరేట్‌కు రు.236.88 కోట్లు, ఇక సైబరాబాద్ కమీషనరేట్‌కు ఈ ఏడాది 75 కోట్ల రూపాయల నిధులు పెరిగాయి. గత ఏడాది 200 కోట్ల రూపాయల కేటాయింపులు ఉండగా ఈ ఏడాది 275 కోట్లకు పెరిగింది. రాచకొండ పోలీసు కమీషనరేట్‌కు గత ఏడాది 199.46 కోట్ల రూపాయల కేటాయింపులు ఉండగా ఈ ఏడాది 286.90 కోట్ల రూపాయలకు పెరిగాయి. అత్యంత అధునాతన సౌకర్యాలతో ఏక కాలంలో లక్ష కెమెరాలతో నిఘాను పర్యవేక్షించేందుకు వీలుగా బంజారాహిల్స్‌లో నిర్మిస్తున్న కమాండ్ కంట్రోల్ కేంద్రానికి రు.125 కోట్లను కేటాయించారు.

ఉద్యమాల ద్వారా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన అనంతరం ఏ శాఖకు లేని ప్రాధాన్యత రాష్ట్ర పోలీసు శాఖకు పెరిగింది. రాష్ట్ర పోలీసు శాఖలో ఖాళీల భర్తీకి ప్రభుత్వం వెంటవెంట చర్యలు తీసుకుంటుంది. పాక్ ప్రేరేపిత తీవ్రవాదులను ఏరివేసే విభాగానికి కూడా కేటాయింపులు తొమ్మిది కోట్ల రూపాయలు పెరిగాయి. ఈ విభాగానికి గత ఏడాది 12.44 కోట్ల రూపాయల కేటాయింపులు ఉండగా ఈ ఏడాది ఇది 23.60 కోట్లకు పెంచారు. కేటాయింపులు పెరిగిన విభాగాలలో సచివాలయంలోని హోంశాఖ, ఆక్టోపస్, పోలీసు అకాడమీ, ప్రింటింగ్ స్టేషనరీ, ఫైర్ సర్వీసు విభాగాలు ఉన్నాయి.

హామీలు ఇచ్చి నిధులు కేటాయించని రంగాలు

సొంత స్థలం ఉంటే ఇల్లు కట్టుకోవాలనుకునే వారికి ఆర్థిక సాయం చేస్తామని టిఆర్ఎస్ 2018 ఎన్నికల మానిఫెస్టోలో ప్రకటించింది. ఇందుకోసం లబ్ధిదారులకు రు.5 లక్షల నుండి రు.6 లక్షల మేరకు ప్రభుత్వం ద్వారా సాయం అందజేస్తామని పేర్కొంది. ఆ ఎన్నికల్లో గెలిచాక 2019-20 ఓటాన్ అకౌంట్ ప్రవేశపెట్టినప్పుడు అలా ఇళ్లు కట్టుకోవాలనుకునే వారికి ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రకటించారు. దీనికి సంబంధించి శాస్త్రీయ పద్ధతిలో అర్హులను ఎంపిక చేసే ప్రక్రియను చేపడుతామని కూడా సిఎం నాటి ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రసంగంలో స్వయంగా చెప్పారు. అయితే, నిధులు మాత్రం కేటాయించలేదు. ఈ ఏడాది (2019-20) కాలంలో ఆ ఊసే ఎత్తలేదు. తాజాగా 2020-21 ఆర్థిక బడ్జెట్‌లో కూడా లక్ష మంది లబ్ధిదారులకు తమ సొంత స్థలంలో ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తామని బడ్జెట్‌లో ప్రకటించారే తప్ప, ఎలా అమలు చేస్తారో చెప్పలేదు. ఇదే విషయాన్ని బడ్జెట్ అనంతరం ఆర్థిక మంత్రిని మీడియా ప్రశ్నించగా, ఇంకా విధి విధానాలు ఖరారు కాలేదన్నారు.

సంచార జాతుల కులాలు, అత్యంత వెనుకబడిన కులాల వారిని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఎంబిసి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. అధికార యంత్రాంగాన్ని కూడా నియమించింది. ఏ ప్రభుత్వాలూ గుర్తించని ఎంబిసిలను తాము పైకి తీసుకువస్తామని గొప్పగా ప్రచారం కూడా చేసుకున్నది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రు.1000 కోట్లు కేటాయించింది. కానీ ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. 2019-2020 ఆర్థిక సంవత్సరంలో కూడా రు.1000 కోట్లు కేటాయించినప్పటికీ నిధులు విడుదల కాలేదు. వరుసగా రెండుసార్లు మొండిచెయ్యే ఎదురైంది. తాజాగా 2020-21 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో

పసుపు-ఎర్రజొన్న రైతుల్ని దగా చేస్తున్న ప్రభుత్వాలు

అధికారంలోకి రావడానికి ముందు పసుపు బోర్డుకు ఎన్నో వాగ్దానాలు చేసిన టిఆర్ఎస్, బిజెపి ఎన్నికల్లో గెలిచాక పసుపు, ఎర్రజొన్న రైతుల అభ్యర్థనలను పట్టించుకోకుండా దళారులకు వంతపాడుతున్నారని అంటున్నారు **వి. ప్రభాకర్**

ప్రపంచ దేశాల్లో వ్యవసాయ దేశంగా భారతదేశానికి మంచి గుర్తింపు ఉంది. అదేకాక మార్పిడి జరిగిన తొలి రోజుల్లో మన ఆహార దినుసుల ఉత్పాదన సాధించాలని వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించాలని సశ్యవిప్లవ పేరున భారీగా సబ్సిడీలను అందించి ప్రోత్సహించింది. ఆ మేరకు గణనీయంగా ఆహార పంటలు దిగుబడి పెరిగింది. కొంతమేరకు ఆహార కొరతను తీర్చడం జరిగింది. అంతేకాకుండా అప్పటి వరకు సముద్రం వైపు దిగుమతి కోసం ఎదిరి చూసిన మనం ఆ స్థితిని కొంతమేరకు అధిగమించగలిగాం. ఆ రోజుల్లో దేశానికి అన్నంపెట్టే రైతు అంటే గౌరవంగా చూసేది సమాజం. కాని ఈ ఏడు దశబ్దాల కాలంగా ఏలిన ప్రభుత్వాలన్నీ వ్యవసాయ రంగం పట్ల నిర్లక్ష్యం, నిర్లప్తత వహించడం మూలంగా వ్యవసాయ సాగు తగ్గుతూ వచ్చింది.

యుపిఎ, ఎన్‌డిఎ అంతకు ముందు జనతా ప్రభుత్వాలు ప్రపంచ బ్యాంక్ అంతర్జాతీయ సామ్రాజ్యవాద దేశాలతో కుదర్చుకున్న ఒప్పందాల ఫలితంగా వ్యవసాయ రంగం క్షీణిస్తు వస్తోంది. రైతు పండించే పంటకు గిట్టుబాటు ధర లభించక రైతు దివాలతీసి అప్పుల భారం పెరుగుతూ వచ్చింది. అధికార మార్పిడి జరిగి రెండు దశాబ్దాల కాలం దాటే వరకు కూడా 75 శాతం పైగా ఆధారపడి జీవించిన దేశం, నేడు 55 శాతానికి కుచించుకపోయింది. గత రెండు దశబ్దాల కాలం మనం మననం చేసుకొంటే 3 లక్షల 25 వేల రైతులు ఆత్మహత్య చేసుకొన్నారంటే మన దేశ పాలకుల విధానాలకు అద్దం పడుతుంది.

ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో వాణిజ్య పంటలైన పసుపు, ఎర్రజొన్న రైతాంగం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో సుదీర్ఘకాలంగా తమ పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఆర్మూర్లో 'పసుపు బోర్డు' ఏర్పాటు చేయాలని డిమాండ్

ఎంబిసి కార్పొరేషన్‌కు రు. 500 కోట్లు ప్రతిపాదించారు. ఈ సారి నిధుల విడుదలపై కూడా ఎంబిసి సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి.

2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 'నిరుద్యోగ భృతి' రు. 3016లను చెల్లిస్తామని టిఆర్ఎస్ హామీనిచ్చింది. ఇందులో భాగంగానే 2019-20 సంవత్సర ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి నిమిత్తం రు. 1810 కోట్ల నిధులను కేటాయించారు. దీనికి సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు విడుదల అవుతాయని కూడా ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కానీ ఇప్పటి వరకు నిరుద్యోగ భృతికి సంబంధించిన ప్రక్రియనే మొదలు పెట్టలేదు. దీంతో నిరుద్యోగ భృతికి కేటాయించిన నిధులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, పైగా తాజాగా ప్రవేశపెట్టిన ఆర్థిక బడ్జెట్‌లో 'నిరుద్యోగ భృతి' ప్రస్తావనే లేదు. నిరుద్యోగ భృతి పథకాన్ని ఈ సంవత్సరం అమలు జరుపలేమని, ఆర్థిక పరిస్థితి మెరుగుపడితే వచ్చే సంవత్సరంలో ఆలోచిస్తామని ముఖ్యమంత్రి కెసిఆర్ అంతకు ముందు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మాణంపై చర్చకు సమాధానమిస్తూ స్పష్టం చేశారు. అటు ఉద్యోగం రాక, ఇటు భృతి లేకపోవడంతో నిరుద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దళితులకు మూడెకరాల భూమి వాగ్దానాన్ని ఏనాడో మరిచిపోయారు. ఆరేళ్లలో 6414 కుటుంబాలకు 15,414 ఎకరాల భూమి పంచారు.

ముగింపు

మొత్తంగా రాష్ట్ర బడ్జెట్‌ను గమనిస్తే ఓటు బ్యాంకు నిలుపుకునే రైతుబంధు, ఆసరా, కళ్యాణ లక్ష్మి, ప్రసూతి కిట్స్, షాదీ ముబారక్ వంటి పథకాలకు నిధులు తగ్గలేదు. మొత్తంగా వీటికి రు. 40,000 కోట్లు కేటాయించారు. అలాగే కమీషన్లు వచ్చే కంట్రాక్ట్ పనులకు కేటాయింపులు జరిగాయి. ప్రధానంగా చదువుకున్న యువతకు ఉపాధి, దళితులకు మూడు ఎకరాల భూమి-ఉద్యోగాల కల్పన, నిరుద్యోగ భృతి, ఉద్యోగుల వేతన సవరణకు నిధులు కేటాయించలేదు. వాటి అమలు నీటిమీద రాతలే అయ్యాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక వచ్చిన 7 బడ్జెట్లు కూడ 2014 ఎన్నికల మేనిఫెస్టోలో చేసిన వాగ్దానాలు నేటికి అమలు కాలేదు. కాగా ప్రభుత్వ ఉద్యోగాలపై నిరుద్యోగులు ఆశలు పెట్టుకోవద్దని చట్టసభలో సాక్షాత్తు ముఖ్యమంత్రే చెప్పడం కొసమెరుపు. అలాగే గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధికి 10 వేల కోట్లు కెటాయించడం రానున్న ఎన్నికల దృష్టితోనేనన్నది సుస్పష్టం.

తెలంగాణ ప్రభుత్వం గత ఆరు సంవత్సరాలుగా బడ్జెట్‌లో చేసిన కేటాయింపులను ఏనాడు 70 శాతం మించి వ్యయం చేయలేదు. అంకెల గారడీ, మాయ మాటలతో ప్రజలను మభ్య పెడుతున్నారు. ఇక సంక్షేమం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్లతో పోలిస్తే మద్యం అమ్మకాల ద్వారా ఎక్కువ ఆదాయం రాష్ట్ర ప్రభుత్వానికి సమకూరుతుంది. మద్యం వల్ల మహిళల పట్ల ఎన్ని అనర్థకాలు జరుగుతున్నాయో మనం చూస్తూనే ఉన్నాం. సమజానికి అనర్థకమైన మద్యం ప్రభుత్వ ఖజానాకు ఆదాయ వనరుగా మార్చుకోవడం నీతి బాహ్యామైన చర్య తప్ప మరొకటి కాదు. మద్యంపైన మరింత ఆదాయం పెంచడమంటే, బంగారు తెలంగాణ అటుంచి మద్యం తెలంగాణగా మార్చడమే అవుతుంది. తెలంగాణ సమగ్ర సుస్థిర అభివృద్ధికి దశ, దిశ ఈ బడ్జెట్‌లో కనిపించడం లేదు.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఆందోళన చేస్తున్న రైతుల డిమాండ్లు బేషరుతుగా వాగ్దానం చేసిన నాడు టిఆర్‌యస్, నేడు బిజెపి ఎంపిలు ఓట్లు దండుకొని గెలిచి 'ఏరుదాటే దాక ఏరు మల్లన్న – ఎరుదాటినంక బోడి మల్లన్న' అన్న చందంగా నిలువునా మోసం చేస్తున్నారు. గారడి మాటలతో, మోసపూరిత ప్రకటనలతో రైతులను దగా చేస్తున్నారు.

దగాకోరు బిజెపి ప్రభుత్వం

2014లో బిజెపి ఎన్నికల ప్రణాళికలో స్వామినాథన్ కమీషన్ సిఫారసులను అమలు చేస్తామని, రైతులు రెండింతలు ఆదాయం వచ్చే విధంగా మా విధానం ఉంటుందని ప్రగల్భాలు పలికింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన నాటి నుండి వారి ఆచరణను పరిశీలిస్తే సుమారు 100 రకాలకు పైగా పంటలు సాగైతే 26 రకాల పంటలకు నామమాత్రంగా మద్దతు ధర ప్రకటించి చేతులు దులుపుకుంటున్నారు. వాటిని కొనుగోలు చేయకుండా, దళారులను పెద్ద ఎత్తున పెంచి పోషిస్తున్నారు. ఆ 26 రకాల్లో ఎర్రజొన్న, పసుపు పంటలు మాత్రం లేవు. అయినా రైతుల ఆదాయం రెండింతలు చేస్తాం అంటే మనం నమ్మాలి.

ఇటీవల కేంద్ర ఆర్థికశాఖా మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌ను పరిశీలిస్తే వ్యవసాయ రంగంపై, రైతులపై వారి చిత్తశుద్ధి తేట తెల్లమౌతుంది. గత బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి 5.45 శాతం కేటాయిస్తే ఈ సంవత్సరం బడ్జెట్లో వ్యయసాయ రంగానికి పెంచడం అటుంచి 5.20 శాతం తగ్గించింది. అట్లాగే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికై గత సంవత్సరం బడ్జెట్‌లో 9.83 శాతం ఉండగా ఈ సంవత్సరం బడ్జెట్‌లో 9.30 శాతానికి తగ్గించారు. బడ్జెట్ అంకెల గారడితో కనికట్టు చేసి చూయించే ప్రయత్నం చేశారు.

కేటాయింపులు జోరు – ఖర్చు నామమాత్రమే

దేశంలో 22 వేల గ్రామీణ మార్కెట్ల అభివృద్ధి కోసం గత బడ్జెట్‌లో 2 వేల కోట్ల రూపాయలు కేటాయించగా, ఖర్చు చేసింది కేవలం 10 కోట్ల రూపాయలు మాత్రమే. ఇది బిజెపి ప్రభుత్వం చిత్తశుద్ధి. అన్నిరకాల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, రైతులను ఆదుకోవడానికి కనీసం 50 వేల కోట్ల రూపాయలు అవసరం ఉంటుందని ఆర్థిక వేత్తలు అంచనా వేశారు. కానీ కేంద్ర బడ్జెట్‌లో కేవలం 500 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించింది. ఈ విధానాల వలన రైతుకు రెండింతల లాభం ఎలా చేకూరుతుందో మోడీ ప్రభుత్వమే చెప్పాలి.

పసుపు ప్రాముఖ్యత–సాగు రైతులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వాలు

పసుపు కేవలం ఆహార పంటకాలకు మాత్రమే పరిమితం కాదు. పసుపు ముఖ సౌందర్యం కోసం వాడే క్రిమి నిరోధక, రోగ నిరోధక శక్తిని పెంచే విధంగా వాడే మందులకు, రంగులకు వాడతారు. పసుపును ఎన్నో విధాలుగా ఉపయోగించే మనం దేశంలో 14 లక్షల టన్నుల పసుపు ఉత్పత్తి అవుతుంది. మన తెలంగాణ రాష్ట్రంలో 8 లక్షల టన్నుల ఉత్పత్తి అవుతుంది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్‌లోని వంద గ్రామాలకు పైగా పసుపును పండించే రైతులున్నారంటే అతిశయోక్తి కాదు. సుమారు 50 వేల ఎకరాల్లో ఉత్పత్తి ఈ ఆర్మూర్ ప్రాంతంలో చేయబడుతుంది.

దేశంలో ఏ రాష్ట్రంలోనైనా ఏ పంటనైతే అధికంగా సాగు చేస్తారో ఆ పంట ఉత్పత్తి, నాణ్యత, గిట్టుబాటు ధరలు ఆ పంట విస్తరణకై, మార్కెట్‌కై ఆ ప్రాంతంలో ప్రత్యేక బోర్డు ఏర్పాటు ఆనవాయితి, కనీస బాధ్యత. ఉదాహరణకు కేరళలో కొబ్బరి సాగు అధికం కాబట్టి కొకనట్ బోర్డు ఏర్పాటు చేయడం జరిగింది. పశ్చిమ బెంగాల్‌లో, అస్సాంలో తేయాకు అధికం కాబట్టి 'టీ' బోర్డు ఏర్పాటు చేసారు. గుంటూర్‌లో పొగాకు బోర్డు ఏర్పాటు చేయడం జరిగింది.

దేశంలో పసుపు 14 లక్షల టన్నుల పసుపు ఉత్పత్తి అయితే, ఒక్క మన తెలంగాణ రాష్ట్రంలోనే 8 లక్షల టన్నుల ఉత్పత్తి అవుతుంది. అందులో నిజామాబాద్, ఆర్మూర్, జగిత్యాల ప్రాంతంలోనే 80 శాతం ఉత్పత్తి అవుతున్నది. అందుకని ఇక్కడ రైతులు పసుపు బోర్డు కోసం 4 దశబ్దాలుగా అవిరామంగా పోరాడుతునే ఉన్నారు.

పెట్టుబడికి నిండని పసుపు రైతు

తొమ్మిది మాసాలు సాగు చేసి మార్కెటుకు వచ్చే నాటికి 10 నెలలు కాలం పడుతుంది. ఇంత సుదీర్ఘకాలం సాగే పంట మరొకటి లేదు. ఒక ఎకరం పసుపు సాగు చేయాలంటే 1 లక్ష 20 వేల నుండి 1 లక్ష 40 వేల రూపాయల వరకు పెట్టుబడి అవుతుంది. ఈ పెట్టుబడిలో కుటుంబ శ్రమ వెల కట్టలేదు. అట్లాగే పసుపు సాగు చేయడాన్ని స్త్రీలు అనేక నియమాలు పాటించి పసుపు పండిస్తారు. ఈ ప్రాంతాల్లో వారసత్వ పంటగా వస్తుంది. 2–3 దశబ్దాల క్రితం 2 క్వింటాళ్ల పసుపు అమ్మితే 2 తులాల బంగారం వచ్చేదని, అందుకే పసుపుకు పచ్చబంగారం అని అనుకొనే వాళ్లమని రైతులు గత స్మృతులు స్మరించుకుంటారు. కాని నేడు 10 క్వింటాళ్ల పసుపు అమ్మినా 1 తులం బంగారం కొనలేని స్థితి ఏర్పడిందని అంటారు. ఇది పాలకుల, దళారీ సిండికేటు వ్యాపారుల మాయజాలం.

నిజామాబాద్ మార్కెట్ మర్మం

నిజామాబాద్ మార్కెట్‌లో పసుపు వ్యాపారులు 30 మంది ఉన్నారని అధికారులు చెబుతున్నారు. కాని 10 మంది మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు సిండికేటు అయి ధర రావడం లేదుని రైతులు ఆందోళన చేస్తే 'ఈనామ్' మార్కెటు తెచ్చాం, ఇక స్వేచ్ఛా వ్యాపారం జరుగుతుంది, రైతులకు లాభం వస్తది అనుకొంటే 'పెనం మీద నుండి పొయ్యిలో పడ్డ చందం'గా మారింది. రైతులు సేంద్లో 'ఈనామ్'లోకి తెచ్చిన పసుపు కుప్పలను వ్యాపారి రాకుండా, కొత్త వ్యాపారులు ప్రవేశించకుండా మార్కేటు పాలకవర్గం చేతివాటంతో రోజుల తరబడి ఈనాంలో ఉన్న ఖరీదు చేస్తున్న పాపాన పోవడం లేదు. 'ఈనామ్' కు రాని పసుపును దళారులు ఇష్టం ఉన్న రేట్లకు కొనుగోలు చేస్తుంటారు. మరోవైపు ఈనామ్‌లో కూడా ప్రకటించే రేట్లకు కొనుగోలు చేసే రేటు వేరు వేరుగా ఉంటుంది. తుట్టికి పావు సేరు అమ్ముకొంటున్నారు. ఒకేసారి పసుపు మార్కెట్‌కు వచ్చే సరికి ధరలను కృత్రిమంగా తగ్గించి రైతులను దోచుకుంటున్నారు.

అంతేకాదు మన పక్కన మహారాష్ట్రలోని సాంగ్స్ వ్యవసాయ మార్కెట్లో ప్రతి యేడు ఒక క్వింటాల్ పసుపు రెండు వేల నుండి మూడు వేల రూపాయలు అధికంగా ఉన్నా పాలకులు మాత్రం మన నిజామాబాద్ మార్కెటు దోపిడికి 'బార్లా' తెరిచారు.

మార్కెట్ దోపిడికి వ్యతిరేకంగా గిట్టుబాటు ధరలకై, పసుపు బోర్డుకై ఆందోళన చేస్తున్న రైతుల ఓట్లు దోచుకోవడం కోసం 2014లో పార్లమెంట్ ఎన్నికల సమయంలో టిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన కల్వకుంట్ల కవిత తాను గెలిచిన వెంటనే 'పసుపు బోర్డు' ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చింది. భారీ మెజారిటీతో గెలిచింది. కాని ఐదు సంవత్సరాల కాలంలో 'బోర్డు' ఏర్పాటు చేయకపోగా 'స్పైస్ పార్క్'ను చూపించి పసుపు బోర్డు వచ్చిందని కలర్ ఇచ్చే ఆర్భాటం చేసింది. రైతుల కంట్లో మట్టి కొట్టింది. కనీసం తన తండ్రి చేత అసెంబ్లీలో 'బోర్డుకై' తీర్మాణం చేయించలేని కపట రాజకీయానికి అద్దం పట్టింది. గిట్టుబాటు ధరకై రోడ్డెక్కిన రైతులను తీవ్రంగా అణచి అక్రమ కేసులు బనాయించి జైల్లో నిర్బంధించిన కవితకు రాజకీయంగా గుణపాఠం చెప్పి అధికార మదం అణిచారు.

సందట్లో సడేమియా

తమ డిమాండ్లపై కేంద్రం స్పందించాలని 178 మంది రైతులు నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసి రైతుల ఐక్యతను చాటగా 'సందట్లో సడేమియా'గా అవతారమెత్తిన ధర్మపురి అర్వింద్ రైతుల ఓట్లను తనవైపు మలచుకోవడానికి రైతులు అడగకముందే తాను గెలిచిన 5 రోజుల్లో పసుపు బోర్డును నిజామాబాద్‌లో ఏర్పాటు చేస్తానని లేనిపక్షంలో రాజీనామ చేసి రైతు పక్షాన ఉద్యమం చేస్తానని బాండ్ పేపర్ రాసి సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేసుకున్నాడు. అంతేకాక తన ఎన్నికల ప్రచార సభలో బిజెపి కేంద్ర నాయకత్వాన్ని రప్పించి, పసుపు బోర్డు హామిని ప్రకటించి, రైతులను నమ్మించి, రైతు ఓట్లతో గెలిచిన తర్వాత తన వాగ్దానాన్ని నిలబెట్టు కోలేక 180 డిగ్రీల వ్యతిరేకంగా అడ్డగోలు మాటలతో రైతులను అవమానిస్తున్నాడు.

పసుపు బోర్డు మంత్రం జపిస్తూ గెలిచిన అర్వింద్ రైతులకు గారడి మాటలు చెపుా పసుపు బోర్డుకన్న 'స్పైస్ బోరు" చాలా అత్యున్నతమైందని బుకాయించి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేస్తున్నాడు. గెలువక ముందు అర్వింద్ నోట 'స్పైస్ బోర్డు' నుండి పసుపును వేరు చేసి ప్రత్యేక బోర్డు పెట్టాలని వాదించిన ఎంపి నోరు మోర్రైందా? మళ్లీ రివర్స్‌గా స్పైస్ రిజినల్ కార్యాలయంతో మొత్తం పసుపు బంగారం అవుతుందని, అడ్డగోలు వాధనలు చేస్తున్నాడు. ఎన్నికలకు ముందు ఆ జ్ఞానం లేదా? నీకైనా ఆ ఎన్నికల్లో హామీ ఇచ్చిన కేంద్ర మంత్రులు, నాయకులకు అంటూ రైతులు సూటిగా ప్రశ్నిస్తుంటే తెల్లమొకం వేస్తున్నారు.

టిఆర్ఎస్ – బిజెపిలు దొందూ దొందే

2014లో టిఆర్‌యస్ పార్లమెంట్ అభ్యర్థిగా రైతులకు హామీ ఇచ్చి ఓట్లు దోచి గెలిచిన కవిత ఐదు సంవత్సరాలు రైతులను మభ్యపెట్టి మోసం చేశారు. కవితకు వాతపెట్టి రైతులు తగిన గుణపాఠవం చెప్పి అర్వింద్ నమ్మి గెలిపిస్తే గెలిచిన స్థితిని మరిచి వాపును చూసి బలుపు అనుకుంటున్నాడు. అడ్డగోలు వాదనలతో రైతంగాన్ని అవమానిస్తున్నాడు. రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే 'కర్రు' కాల్చి చేతిలో పెట్టి నీ రాజకీయ జీవితానికి చరమగీతం పాడడం ఖాయం. రైతులను వాడుకొని గెలిచిన టిఆర్‌యస్, బిజెపి పార్టీలు దొందు దొందే.

కేంద్రంపై నెట్టేసి చేతులు దులుపుకోవాలని చూస్తున్న కెసిఆర్

ప్రక్కనే ఉన్న తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో పసుపు క్వింటాల్‌కు రు. 6,875 ప్రకారం ప్రభుత్వమే కొనుగోలు చేసే విధానాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ నిర్ణయించినా, తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు జ్ఞానోదయం కల్గడం లేదు. కేంద్ర ప్రభుత్వంపై రాళ్లేసి తన బాధ్యత కాదని తప్పించుకునే ప్రయత్నం చేయడం సిగ్గుచేటు.

ఎర్రజొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చి కనీసం ఒక సంవత్సరమైనా కొనుగోలు చేసి హామీ నిలబెట్టుకోలేదు. ఎర్రజొన్న రైతులను ఆర్మూర్ ప్రాంతంలో 40 మంది వ్యాపారస్తులకు అప్పనంగా అప్పజెప్పి తన బాధ్యత కాదని నిస్సుగ్గుగా మాట్లాడుతున్నాడు. ఎర్రజొన్న రేటు పెరిగినా రైతుకు వ్యాపారస్తులు పెరిగిన ధర చెల్లించకుండా సిండికేట్‌గా మారి దోచుకొంటుంటే ప్రభుత్వం ఏ మాత్రం స్పందించకపోవడం శోచనీయం. ఎర్రజొన్నలను సాగు చేయవద్దని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్న ప్రభుత్వాలు, ఒకవేల చేస్తే మా బాధ్యత కాదని ప్రకటిస్తున్నది. ప్రభుత్వం, అధికారులు ప్రత్యమ్నయం చూడకుండా ఉచిత సలహాలు ఇవ్వడం పూర్తిగా బాధ్యత రాహిత్యం.

మీరు ఏ పార్టీలోనైన కొనసాగండి, ఏ సంఘ సభ్యులైనా అయ్యుండండి ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నాశనం చేయడానికి కంకణం కట్టుకొన్నట్లుగా అవలంబిస్తున్న వారి విధానాలు అర్థం కావడం లేదా? ప్రపంచంలోనే అన్నదాతలుగా బాసిల్లిన మన రైతన్నలకు కనీస ధర లభించకపోవడం, దళారి వ్యవస్థను నియంత్రించక పోవడం వ్యవసాయానికి భారీగా పెట్టుబడులు పెరిగి పండిన పంటలకు ధరలు రాక రైతులు అప్పుల ఊబిలో కూరుకపో తున్నారు. మరోవైపు వ్యవసాయాన్ని వదిలి వలస వెలుతున్నారు. పట్టణాల్లో కార్మికులుగా వేల సంఖ్యలో దుర్భర జీవితాన్ని కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 70 శాతంకు పైగా వ్యవసాయదారులు ఉన్న భారత దేశంలో 50 శాతంకు పడిపోతుందని లెక్కలు చెబుతున్నాయి.

అందుకని వ్యవసాయరంగాన్ని కాపాడుకోవడానికి మనమందరం ఐక్యంగా పోరాటమే మనముందున్న మార్గం. ఇప్పటికే ఆర్మూర్, జగిత్యాల ప్రాంతాల రైతులు తమ శక్తి వంచన లేకుండా పోరాడి పాలకులకు కళ్లు తెరిపించిన చరిత్ర మనకున్నది. మనలో చీలికలు తేవడానికి అనైక్యత ఏర్పడడానికి గెలిచినవాళ్లు, ఓడినవాళ్లు శతవిధాల ప్రయత్నిస్తున్నారు. ఆ కుట్రలను భగ్నం చేయవలసిన బాధ్యత ఐక్య ఉద్యమం ద్వారానే సాధ్యపడుతుంది. జండాలు, ఎజెండాలు పక్కనపెట్టి ఐక్యంగా పాలకుల విధానాలు ఎండగట్టి మన హక్కులను సాధించుకొందామని, రానున్న కాలంలో ఒక వేధికగా ఏర్పడటానికి మనమందరం కలిసి ఒక కార్యచరణ రూపొందించుకొని ముందుకు వెళదామని కోరుతున్నాను.

(రచయిత అఖిల భారత రైతు కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) రాష్ట్ర కార్యదర్శి)

వీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికలు

***ప్రజాభిప్రాయాలతో సంబంధం లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి విషయాన్ని వివాదాస్పదం చేస్తూ ప్రజలను ఆందోళనలకు గురిచేస్తోందనీ, స్థానిక ఎన్నికలు కూడా ఇలాంటి వివాదమేనని అంటున్నారు* చిమ్మె జాన్ బర్నబాస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికలు 'ప్రత్యేక ఆర్డినెన్స్' ద్వారా త్వరగా ఎన్నికలు నిర్వహించాలనే తపనతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియను జరిపించాలని ఎన్నికల సంఘాన్ని కోరడంతో ఎన్నికలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. 2020 మార్చ్ మొదటి వారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై మూడవ వారంలోనే ఎన్నికల తంతు ముగియడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యే నాటి నుండే వివాదాస్పదంగా మారి, అభ్యర్థులను నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకోవడం, అధికారుల సమక్షంలో దాడులు జరగడం, నామినేషన్ పత్రాలను బలవంతంగా లాక్కొని చించివేయడం, దౌర్జన్యాలు చేయడం, పోటీలో నుంచి విరమింపచేయడం జరిగింది. స్థానిక ఎంపిటిసి/జడ్‌పిటిసి ఎన్నికలలో స్థానిక వైకాపా నాయకులు, అధికారులతో కుమ్మక్కై దాదాపు రాష్ట్రంలో 30 శాతం మందిని ఏకగ్రీవం చేసుకున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా ఎన్నికలలో పోటీపడే ఎంపిటిసి/జడ్‌పిటిసి స్థానాల రిజర్వేషన్ల ప్రక్రియనూ మార్చి వేశారు. ఈసారి బిసి రిజర్వేషన్లు, ఎస్‌సి రిజర్వేషన్లు రాష్ట్ర ప్రభుత్వం ఇష్టానుసారం చేసింది. తమకు ఇష్టం వచ్చిన స్థానంలో ఎస్‌సి/బిసి రిజర్వేషన్లు కేటాయించారు. ఎంఎల్‌ఎలు, ఎంపిలు, మంత్రులు తమకు అనుకూలమైన స్థానాలను, గెలుపొందే స్థానాలను ఇష్టమొచ్చిన రిజర్వేషన్ చేయించుకున్నారు. ఇది పూర్తిగా రాజ్యాంగ వ్యవస్థలను అవమానం చేయడమే. రాజ్యాంగ ప్రక్రియను తోసిపుచ్చడమే అవుతుంది. రాజ్యాంగ వ్యవస్థలను అవమానం చేయడం ఒక పరిపాటిగా మారింది.

రాష్ట్ర ప్రభుత్వం చెప్పుచేతల్లో కీలకంగా ఉన్న కొంతమంది అధికారులు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి పూర్తిగా సహకరిస్తూ, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను ఏదో ఒక విధంగా ఇబ్బందులకు గురిచేస్తూ, నామినేషన్ ప్రక్రియలోనే 'ఏకగ్రీవం' అయ్యే విధంగా ప్రయత్నిస్తున్నారు. ఇది శోచనీయం. గుంటూరు జిల్లా మాచర్ల నియోజకవర్గంలోనూ, చిత్తూరు జిల్లా పుంగనూరు, కడప జిల్లాలోని దాదాపు అన్ని చోట్లా స్థానిక సంస్థల ఎన్నికలల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు భయందోళనకు గురయ్యారనేది ఒక వాస్తవం. గుంటూరు జిల్లాలో అభ్యర్థితో నామినేషన్ వేయించడానికి వెళుతున్న న్యాయవాదిపై దాడి జరిగింది. మహిళలను కూడా అడ్డుకొని దాడి చేశారు. ఇవన్నీ కూడా అధికారులు చేస్తూ ఉండగానే జరిగిన సంఘటనలు. వీటిని నివారించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ప్రభుత్వ అధికారులు కేవలం అధికారంలో ఏ పార్టీ ఉంటే వారికి దాసోహమై పనిచేయడమే పరమావధిగా పెట్టుకున్నారు తప్ప తమకంటూ ఒక విలువ, చట్టబద్ధత, న్యాయ వ్యవస్థకు లోబడి పనిచేసే పరిస్థితి ఈ వ్యవస్థలో కనబడడం లేదు. దీనిని మార్చడానికి ప్రయత్నం చేయడానికి ముందుకు వచ్చే శక్తులన్నింటినీ 'పోలీసు' చర్యల ద్వారా అక్రమ కేసులు బనాయిస్తూ జైళ్లలో బందీలుగా మార్చుతున్నారు. పరిస్థితి 'ఎమర్జెన్సీ'ని తలపిస్తోంది.

ఎన్నికలు సజావుగా, ఏమాత్రం అక్రమాలు జరుగకుండా 'ఎన్నికల నియమ నిబంధనావళి'కి లోబడి జరగవలసి ఉంటుంది. దీనికి 'ఎన్నికల కమిషన్' బాధ్యత వహించాలి. రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఇసి) ఈ నియమ నిబంధనావళిని అమలుపరిచే బాధ్యతల్లో ఉంటారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమిషనర్ శ్రీ నిమ్మగడ్డ రమేశ్ కుమార్ ఐఎఎస్ అధికారి యాదృచ్ఛికంగా ఈ రాష్ట్రానికి చెందిన వ్యక్తి కావడం ఇక్కడ కొంత వివాదం అయింది. ప్రతిపక్ష పార్టీ వారి విజ్ఞప్తి మేరకు స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేశాడనే అపవాదు అధికార వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆయనపైన ఒక నింద వేశారు. అంతే కాకుండా ఆ వాయిదా వేయబడిన ఎన్నికలను తిరిగి అదే (పాత) షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలనే డిమాండ్‌తో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ఒక నివేదికను రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఇప్పించి, రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌పై సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ముఖ్యమంత్రి అధికారాలను సైతం చెలాయిస్తున్నాడనే ఒక రాజ్యాంగ పరమైన సంక్షోభానికి దారితీసే విధంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల కమిషన్‌పై సుప్రీంకోర్టుకు వెళ్లారు. సాధారణంగా ఏ ఎన్నికలలోనైనా అధికార పార్టీకి సహకరిస్తున్నారనే నెపంతో ఎన్నికల కమిషన్‌పై సుప్రీంకోర్టుకు ప్రతిపక్ష పార్టీల వారు వెళుతూ ఉంటారు. అయితే ఈసారి అధికార పార్టీ (ముఖ్యమంత్రి) ఎన్నికల కమిషన్‌ను ప్రతివాదిగా చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించడం ఈ రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి. దీనిపై సుప్రీంకోర్టులో 2020 మార్చ్ 16న విచారణ జరిగింది. వాస్తవానికి ఎన్నికల వాయిదా ప్రపంచ వ్యాప్తంగా విజృంభించిన కరోనా వైరస్ వ్యాది భారతదేశంలో వ్యాపించిందనే కారణంతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికలను వాయిదా వేసింది. ఉత్తర భారతదేశంలో ఇప్పటికే కరోనా ప్రభావం ఎక్కువైంది. విమానాశ్రయాలు చాలా మేరకు ఖాళీ అయ్యే పరిస్థితి. సుప్రసిద్ధ దేవాలయాలు, పుణ్యక్షేత్రాలు, సినిమా హాళ్లు మూతపడి పోయాయి. విద్యా సంస్థలన్నీ మూతపడ్డాయి. దీనిపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ తీవ్రమైన నిర్ణయం తీసుకొని స్థానిక సంస్థల ఎన్నికలను 6 వారాల పాటు వాయిదా వేసింది. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయం; ప్రతిపక్ష పార్టీలకు అనుకూలంగా ఉంటుందనే భావనతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్‌కు 'కులం' (కమ్మ) అంటగడుతూ, తెలుగుదేశం పార్టీతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్

కుమ్మక్కయ్యాడని, తీవ్ర పదజాలంతో దూషిస్తూ మాట్లాడారు. ఇది అనవసరమైన చర్చకు దారితీసి, ప్రజలలో చర్చనీయాంశమైంది. దానితో పోనీయకుండా రాష్ట్ర ప్రభుత్వమే వాదిగా మారి సుప్రీంకోర్టును ఆశ్రయించడం, ఎన్నికలను షెడ్యూల్ ప్రకారమే జరగాలనే భావనతో రాష్ట్ర ప్రభుత్వం ఉండడం, తమ తప్పును తామే అంగీకరించినట్లయింది. ఎన్నికలలో అక్రమాలు జరగడం 'సర్వ సాధారణం' అనే భావనకు రాష్ట్ర ప్రభుత్వం వచ్చినట్లు ప్రజలు భావించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి భారత ఎన్నికల సంఘం (బిసిఐ) సాధారణ ఎన్నికలలో అనగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం జరుగుతూ ఉంటుంది. అటువంటిది జిల్లా పరిషత్, మండల పరిషత్, నగర పాలక, మున్సిపాలిటీ ఎన్నికలను వాయిదా వేయడం దాదాపు దేశ ఎన్నికల చరిత్రలో ఇదే ప్రథమం కావచ్చు. కానీ ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయంపై ఒక రాష్ట్ర ప్రభుత్వం ఒక వాదిగా సుప్రీంకోర్టును ఆశ్రయించడం కూడా ఇదే ప్రథమం. వాస్తవానికి ఎన్నికల కమిషన్ 'కరోనా వైరస్' కారణంగా కాకుండా, జరిగిన హింస కారణంగా ఎన్నికలను వాయిదా వేసి ఉండి ఉంటే రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న వాదనలో కొంత నిజం ఉండేది. కానీ అది వాస్తవం కాదు. ఎన్నికల కమిషన్ కూడా రెండు రోజులు ఆలస్యంగా నిర్ణయం తీసుకున్నది. ఎన్నికల కమిషన్ కూడా ఇంత తాత్సారం చేయవలసిన అవసరం లేదు. తనకున్న విస్తృత, విచక్షణాధికారాలను ఉపయోగించవచ్చు. కానీ ఆ విధంగా చేయడంలో కొంత ఆలస్యం చేసిన మాట వాస్తవం.

సుప్రీంకోర్టు – 'కిషన్‌సింగ్ తోమర్ వర్సెస్ మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ది సిటీ ఆఫ్ అహ్మదాబాద్' అనే కేసులో ఒక చారిత్రాత్మకమైన తీర్పును వెల్లడించింది. అది కూడా ఎన్నికల కమిషన్‌కు ఉండే అధికారాలను స్పష్టపరిచింది. ఇది రాజ్యాంగ విస్తృత ధర్మాసనం తీర్పుగా సుప్రీంకోర్టు వెల్లడించింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ రాజ్యాంగబద్ధ సంస్థ. సాధారణ పరిస్థితులలో ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలను నిర్వహించాలి. అదనంగా సంభవించే పరిస్థితులు, ఇబ్బందులు, ఆరోగ్యపరమైన అత్యవసర సమస్యలు ఉత్పన్నమైనప్పుడు ఎన్నికలను వాయిదా వేసే అధికారం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఉందని ఆ తీర్పులో స్పష్టపరిచింది. దేవుని చర్యలు (యాక్ట్ ఆఫ్ గాడ్) చట్ట నిబంధనలను అమలు చేయలేని పరిస్థితులు ఏర్పడినపుడు వాయిదా వేయవచ్చని సూచించింది. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సరైన దిశలో ఎన్నికలు నిర్వహించడం లేదనీ, ఒకవేళ నిర్వహించినా సక్రమంగా ఉండడం లేదన్న కారణంగా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేశారని పేర్కొంది. ఈ పరిస్థితులలోనే రాష్ట్ర ఎన్నికల సంఘాలకు విస్తృతాధికారాలు ఉన్నాయని ఆ తీర్పులో స్పష్టపరిచింది. ఈ తీర్పును భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు పాటించాలనీ, కట్టుబడి ఉండాలనీ పేర్కొన్నారు. ఒకవేళ ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా ఈ తీర్పును ఉల్లంఘించినట్లయితే ఆయా రాష్ట్రాల హైకోర్టులను ఆశ్రయించి తగిన ఆదేశాలు పొందవచ్చని పేర్కొంది. 2006లో అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి వై.కె. సబర్వాల్, న్యాయమూర్తులు కె.జి. బాలకృష్ణన్, ఎస్.ఎచ్. కపాడియా, సి.కె. ధక్కర్, పి.కె. బాల సుబ్రమణ్యన్‌లతో కూడిన విస్తృత ధర్మాసనం ఈ తీర్పును వెల్లడించింది.

ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వాదిగా వేసిన కేసుకు సంబంధించి 2020 మార్చ్ 18న భారత సుప్రీంకోర్టు, రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని సమర్థించింది. అనగా 'కరోనా వైరస్' విస్తృతంగా వ్యాపించిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయడం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయం సరియైనదేనని సుప్రీంకోర్టు ప్రకటించింది. అనగా సరియైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించింది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) ను కూడా ఈ 6 వారాలు అమలులో ఉండదని సుప్రీంకోర్టు స్పష్టపరిచింది. అంతే కాకుండా 6 వారాల పాటు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను వాయిదా వేయడం, దాదాపు 30 శాతం 'ఏకగ్రీవం' (పోటీ లేకుండా) అయిన స్థానాల విషయంలో కూడా చర్యతీసుకునే అధికారం కూడా రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఉన్నట్లు పునరుద్ఘాటించింది. అయితే ఇక్కడ మరొక సమస్య వచ్చింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ భారత హోం మంత్రిత్వ శాఖకు తనకు భవిష్యత్తులో ప్రాణహాని ఉన్నదంటూ ఒక లేఖను రాశారు. తన కుటుంబానికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు అధికారంలో ఉన్న రాజకీయ పార్టీకి చెందిన వారికి ఉన్న ఫ్యాక్షన్ చరిత్ర కారణంగా భవిష్యత్తులో తమ కుటుంబానికి ఎక్కడైనా, ఏ రూపంలోనైనా ప్రాణహాని ఉందని, తననూ తన కుటుంబాన్నీ రక్షించాలని కోరుతూ భారత హోం మంత్రిత్వ శాఖకు విజ్ఞప్తి చేశారు. దీనిపై హోం మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందిస్తూ రాష్ట్ర డిజిపికి వెంటనే ఉత్తర్వులు ఇస్తూ తగిన జాగ్రత్తలు తీసుకొని రక్షణ కల్పించాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ తీవ్ర ఆవేదన చెందుతూ తనకు కుల పక్షపాతం అంటగట్టారని ఆవేదన వ్యక్తపరిచారు. ముఖ్యమంత్రి మొదలు, శాసనసభ స్పీకర్, మంత్రులు, ఎంఎల్ఎలు, ఎంపిలు, ఇతర నాయకులు పత్రికల్లో రాయలేని భాషతో తనను దుర్భాషలాడారనీ, భవిష్యత్తులో ఎన్నికలు సజావుగా నిర్వహించాలంటే ప్రభుత్వ, పోలీసుల, అధికారుల సహకారం లభిస్తుందో లేదో అనే అనుమానం కలుగుతుందని ఆవేదన వ్యక్తపరిచారు. తాను సుప్రీంకోర్టును ఆశ్రయించాననే కోపంతో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై చర్యలు తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నదని రాష్ట్ర ప్రభుత్వంపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు రాసిన లేఖలో పేర్కొన్నారు. జరగవలసిన మలివిడత ఎన్నికలలో అధికారుల సహకారం తనకు లభిస్తుందో లేదో అనే ఆవేదనను ఆయన వెలిబుచ్చారు. తాను అధికార దుర్వినియోగానికి పాల్పడడాన్ని ఏమాత్రం సహించననీ, అధికార పక్షం చెప్పినట్లు తాను ఏమాత్రం చేయననీ, చట్టబద్ధంగా నడుచుకోవడానికి తనకు సరైన సహకారం లభిస్తుందో లేదో అనే ఆవేదనను ఆయన వెలిబుచ్చారు. ఇది ఈ రాష్ట్రంలో నెలకొని ఉన్న రాజకీయ పరిస్థితిని తెలియజేస్తుంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌పై అనవసర వ్యాఖ్యలు చేసి సుప్రీంకోర్టులో వాజ్యం దాఖలు చేసి ఇబ్బందులకు గురయింది. సుప్రీంకోర్టు ఎన్నికల సంఘం నిర్ణయం సరైనదేనని ప్రకటించేసరికి రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం అంతా తలకిందులైంది. స్థానిక సంస్థల ఎన్నికలు బ్యాలెట్ పేపర్ ఉపయోగించి వేసే ఎన్నికలు కావడంతో ప్రజలు పెద్ద ఎత్తున ఎన్నికల బూత్‌లలోనికి చొచ్చుకొని వచ్చే పరిస్థితి ఉంటుంది కాబట్టి 'హూమన్ కాంటాక్ట్' (మానవ తాకిడి) ఉంటుందనే కారణంతో ఎన్నికలను వాయిదా వేయడం సరైనదేనని సుప్రీంకోర్టు నిర్ణయం రాష్ట్ర

భీమా కోరేగాం కేసు అవకతవకల సాక్ష్యాలు

భీమా కోరేగాం కేసులో నేరారోపణలకు ప్రధాన సాక్ష్యాధారంగా పోలీసులు చూపుతున్న రోనా విల్సన్ హార్డ్ డిస్క్ లోని అవకతవకలను ఎత్తిచూపుతున్నారు **మార్తాండ్ కౌశిక్, ఆంజనేయ శివన్**

పుణె పోలీసులు 2018 ఏప్రిల్ 17న ఢిల్లీలో ప్రముఖ ఖైదీల హక్కుల కార్యకర్త రోనా విల్సన్ ఇంటి మీద దాడి చేసి, ఆ సంవత్సరం జనవరిలో భీమా కోరేగాం స్మారక ఉత్సవం సందర్భంగా జరిగిన హింసాకాండతో సంబంధం ఉందని ఆరోపించారు. కొన్ని నెలల తర్వాత, రోనా విల్సన్ కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లో ప్రధాని నరేంద్ర మోడీని హత్య చేయడానికి, "ప్రభుత్వాన్ని కూలదోయడానికి" "నక్సలైట్లు" చేసిన కుట్ర వివరాలు దొరికాయని పోలీసులు ప్రకటించారు. రోనా విల్సన్ దగ్గర దొరికిన హార్డ్ డిస్క్ ప్రతిని పుణె పోలీసులు చట్టప్రకారం న్యాయస్థానానికీ, నిందితులందరికీ ఇవ్వగా, ఆ ప్రతిని ది కారవాన్ పత్రిక సంపాదించి, ఆ హార్డ్ డిస్క్‌లో ఉన్న వివరాలను సైబర్ – ఫోరెన్సిక్ పరీక్షకు గురిచేసింది. మా పరిశోధన ప్రకారం తేలిందేమంటే ఆ హార్డ్ డిస్క్ మాలావేర్ దాడికి గురి అయి ఉంది. ఆ మాలావేర్ గనుక ఏదైనా కంప్యూటర్‌లో ప్రవేశిస్తే, ఆ కంప్యూటర్‌లోకి ఎవరైనా సుదూరం నుంచి కూడ జొరబడి అందులో ఫైల్స్‌ను చేర్చవచ్చు. అది మాత్రమే కాక, ఈ కేసులో సాక్ష్యాధారాలను తారుమారు చేసే ప్రయత్నం జరిగిందని సూచించే అవకతవకలెన్నిటినో కూడ మేం గుర్తించాం.

రోనా విల్సన్ హార్డ్ డిస్క్ మీద దొరికిన ఉత్తరాలతో పాటు, జూన్‌లో అరెస్టు చేసిన మానవహక్కుల న్యాయవాది సురేంద్ర గాడ్లింగ్ దగ్గర జప్తు చేసిన హార్డ్ డిస్క్‌లో దొరికిన ఉత్తరాలను కూడ భీమా కోరేగాం కేసులో దాఖలు చేసిన చార్జిషీట్‌లో పుణె పోలీసులు ప్రాథమిక సాక్ష్యాధారాలుగా చూపారు. ఇప్పటివరకూ, రోనా విల్సన్, సురేంద్ర గాడ్లింగ్‌లతో సహా అరెస్టయిన మొత్తం తొమ్మిది మంది ప్రముఖ కార్యకర్తలు, మేధావులు ఈ ఉత్తరాలు రాశారని, లేదా వారి పేర్లు ఈ ఉత్తరాల్లో ప్రస్తావనకు వచ్చాయని పోలీసులు ఆరోపించారు. రోనా విల్సన్ దగ్గర జప్తు చేసిన హార్డ్ డిస్కు యథాతథ ప్రతినీ, గాడ్లింగ్ దగ్గర జప్తు చేసిన హార్డ్ డిస్క్‌లో ప్రమాదకరమైన ఫైళ్లనూ పోలీసులు న్యాయస్థానానికి అందజేశారు. గాడ్లింగ్ హార్డ్ డిస్కు కూడ మొత్తంగా యథాతథ ప్రతి అందేవరకూ దానిలో మాలావేర్ ద్వారా బైటివారు చొరబడ్డారా లేదా అని చెప్పడం అసాధ్యం.

కాని రోనా విల్సన్ హార్డ్ డిస్క్‌లో ఉన్న సమాచారాన్ని పరీక్షిస్తే, అందులో మేం Win32:Trojan-Gen అనే ఎగ్జిక్యూటబుల్ ఫైలు గుర్తించాం. అది ఒక మాల్‌వేర్. అంటే అది చొరబడిన కంప్యూటర్ నుంచి యూజర్ నేమ్‌లను, పాస్‌వర్డ్‌లను, అటువంటి ముఖ్యమైన సమాచారాన్ని సుదూరంగా ఉన్న కంప్యూటర్ సహాయంతో దొంగిలించడానికి ఉపయోగపడుతుంది. ఆ యూజర్ నేమ్‌లను, పాస్‌వర్డ్‌లను ఉపయోగించి ఈ కంప్యూటర్‌లోకి సుదూరపు కంప్యూటర్ నుంచి కొత్త ఫైళ్లను ప్రవేశపెట్టడానికి వీలవుతుంది. ఈ ఎగ్జిక్యూటబుల్ ఫైల్ కంప్యూటర్ ఆన్ చేయగానే పని చేయడం మొదలుపెడుతుందని, ఆ మాల్‌వేర్ పనిచేస్తుందని ఎవరికీ తెలిసే అవకాశం కూడ లేదని మేం గుర్తించాం. అంటే రోనా విల్సన్ కంప్యూటర్‌లో ఈ మాల్‌వేర్ పుణె

ప్రభుత్వానికి మింగుడు పడడం లేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి విషయాన్ని తలకిందులుగా ఆలోచిస్తున్నాడు. తాను తీసుకున్న నిర్ణయమే సరైనదనే భావన తప్ప మరొకటి ఆయనకు రుచించదు. నియంతృత్వ పోకడలతో ఈ రాష్ట్ర ప్రజలను అయోమయంలో పడేశాడు. గత 90 రోజుల నుంచి నిరాహార దీక్షలు చేస్తున్న 29 రాజధాని గ్రామాల మహిళల – రైతుల నిరాహార దీక్షా శిబిరాలను ఇంతవరకూ తన దూతలు కానీ, తాను కానీ సందర్శించలేదు. వాటిపై తన వైఖరి స్పష్టపరచలేదు. ఇది చాలా శోచనీయం. దాదాపు 100 మంది రైతులు గుండెపోటుతో మరణించారు. మరికొందరు చాలా ఆందోళనతో జీవితం గడుపుతున్నారు. ఎన్నికైన ప్రజా ప్రతినిధులు వారిపై కన్నెత్తి చూడడం లేదు. ప్రజలపై ఇంత కన్నెర్ర చేసిన ప్రభుత్వం ఇంతవరకూ ఈ రాష్ట్ర చరిత్రలో ఇదే కావచ్చు. దాదాపు ప్రతి విధాన నిర్ణయంపైనా రాష్ట్ర హైకోర్టు ఏదో ఒక విధంగా వ్యాఖ్యలు చేస్తూ, ప్రభుత్వానికి చురకలు అంటిస్తున్నప్పటికీ ఈ ప్రభుత్వ వైఖరిలో మార్పు రావడం లేదు. విశాఖ పట్టణానికి 'రాజధాని'ని తరలిస్తారనే ఊహాగానాలు పెద్ద ఎత్తున నడుస్తున్నప్పటికీ, 'ప్రజల ఆమోదం ఉన్నదా లేదా?' అనే విషయాలపై ముఖ్యమంత్రికి జ్ఞానోదయం అయ్యే పరిస్థితి కనపడడం లేదు. ముఖ్యమంత్రికి సలహాలిచ్చేవారు ఎక్కువ సంఖ్యలోనే ఉన్నా సరైన నిర్ణయాలు మాత్రం ఇంతవరకూ వెల్లడి కాలేదు. ప్రజలు ప్రతీ విషయాన్ని రాష్ట్ర హైకోర్టు దృష్టికి తీసుకువచ్చి, రాష్ట్ర ప్రభుత్వానికి మేలుకొలుపు కల్పించడం ఎన్నాళ్లు కొనసాగుతుంది. ప్రజలకు 'సహనం' ఎంతమేరకు ఉందో పరీక్షించే విధంగా ఈ రాష్ట్ర ప్రభుత్వ వైఖరి కొనసాగుతున్నది. స్థానిక సంస్థల ఎన్నికలలో ఒక విధంగా చెప్పాలంటే అధికార పార్టీ ఒక 'యుద్ధకాండ' కొనసాగించింది. కాబట్టి అక్రమాలు జరుగుతూ ఉంటే చూస్తూ ఊరకున్న ప్రతి అధికారినీ తొలగించాలి. మొత్తం ఎన్నికల షెడ్యూలును రద్దుచేసి, కొత్త షెడ్యూలును విడుదల చేయాలి. 'ఏకగ్రీవం' జరిగిన ప్రతిచోట తిరిగి నామినేషన్ వేసే అవకాశం కల్పించాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి.

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

పోలీసులు జప్తు చేయక ముందే ఉన్నదన్న మాట. ఒక కంప్యూటర్‌లో మాలావేర్ ప్రవేశపెట్టడానికి అనేక పద్ధతులున్నాయి. ఇమెయిల్ ద్వారా గాని, మెసేజిల ద్వారా గాని వచ్చే హానికరమైన లింక్ మీద నొక్కితే వెంటనే మాలావేర్ కంప్యూటర్‌లోకి చొరబడుతుంది.

దళిత హక్కుల కార్యకర్త డిగ్రీ ప్రసాద్ చౌహాన్, మానవహక్కుల న్యాయవాది నిహాల్ సింగ్ రాథోడ్‌లతో సహా భీమా కోరేగాం కేసుతో సంబంధంలో ఉన్న ఎంతో మంది న్యాయవాదులు, కార్యకర్తలు అటువంటి ఇమెయిల్స్, మెసేజిలు అందుకున్నారని, వాటిలో వారి కంప్యూటర్ల మీద నిఘా పెట్టగల మాలావేర్ ఉందని డిసెంబర్‌లో వార్తలు వెలువడ్డాయి. అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌కు అనుబంధంగా ఉన్న ఆమ్నెస్టీ టెక్ అనే డిజిటల్ సెక్యూరిటీ బృందం అటువంటి ఇమెయిల్‌లను విశ్లేషించిందని, ఆ ఇమెయిల్‌లు ఇటువంటి మాలావేర్‌లను పొదిగి ఉన్న లింక్‌లు కలిగి ఉన్నాయని ఆ వార్తలు వివరించాయి. "ఈ ఇమెయిళ్లను ప్రత్యేకంగా జర్నలిస్టులను, కార్యకర్తలను ఆకర్షించి, వలలో పడెయ్యడానికి తయారు చేశారు" అని ఆ నివేదిక తెలిపింది. ఉదాహరణకు, అక్టోబర్ 6న రాథోడ్‌కు ముస్కాన్ సిన్హా అనే పేరుతో ఒక ఇమెయిల్ అందింది. ఆ ఇమెయిల్‌లో సబ్జెక్ట్ స్థానంలో "కేస్ నెం. 1621/18 జగదల్‌పూర్ దహనకాండ కేసులో సమన్స్" అని ఉంది. "ఒకసారి మీ ఎలక్ట్రానిక్ పరికరంలోకి మాలావేర్ చొరబడితే, ఆ దాడి చేసినవారికి (ఆ మాలావేర్ పంపించినవారికి) మీ కంప్యూటర్ పూర్తిగా కనబడుతుంది. మీ కంప్యూటర్ వారి అదుపులో ఉంటుంది. అంటే మీ ఫైల్స్‌ను, మీ కెమెరాను వారు ఉపయోగించవచ్చు. వారు మీ స్క్రీన్ షాట్స్ తీసుకోవచ్చు. మీరు మీ కీబోర్డ్ మీద టైప్ చేసేదాన్నంతా వారు రికార్డ్ చేయవచ్చు" అని ఆమ్నెస్టీ టెక్ నివేదిక రాసింది.

ది కారవాన్ పత్రిక దగ్గర రోనా విల్సన్ హార్డ్ డిస్క్ మీద ఇతర సైబర్ – ఫోరెన్సిక్ పరీక్షలు కూడ జరపగా, తీవ్రమైన అవకతవక లున్నాయని బైటపడింది. ఒక కంప్యూటర్ లోపల ఉండే హార్డ్ డిస్క్ ఎంత సమగ్రంగా ఉన్నదో నిర్ధారించడానికి షెల్ బాగ్ సమాచారం అనే సూచిక ఒకటుంటుంది. ఈ సమాచారాన్ని ఏ కంప్యూటర్ అయినా జరిగింది జరిగినట్టుగా నమోదు చేస్తుంది. విండోస్ ఎక్స్ ప్లోరర్ మీద ఏ ఫోల్డర్‌లోనైనా ప్రవేశించి చేసిన ప్రతి పనీ ఈ సమాచారం ద్వారా తెలుస్తుంది. అంటే పుణె పోలీసులు ప్రమాదకరమైనవిగా చెపుతున్న ఫైల్స్‌ను రోనా విల్సన్ ఎప్పుడు చూశాడో, అయన ఎంత విరివిగా ఈ ఫైల్స్ మీద పనిచేశాడో ఈ సమాచారం ద్వారా తెలుస్తుంది. కాని హార్డ్ డిస్క్ మీది నుంచి ఈ సమాచారం పూర్తిగా తొలగించబడి ఉంది. తన మీద నేరారోపణలకు అవకాశమిచ్చే ప్రమాదకర ఫైల్స్ యథాతథంగా ఉంచిన రోనా విల్సన్ ఈ సమాచారాన్ని మాత్రం తానే స్వయంగా తొలగించి ఉంటాడని అనుకోలేం. అలా తొలగించిన సమాచారం కనుక ఉండి ఉంటే ఆ ప్రమాదకర ఫైల్స్ ఉన్న ఫోల్డర్లను రోనా విల్సన్ ఎన్నిసార్లు తెరిచాడో తెలిసి ఉండేది. అంటే అసలు ఆ ఫైల్స్‌ను రోనా విల్సన్ స్వయంగా రాశాడో, లేదా బైటి నుంచి మరొకరెవరో ఆ ఫోల్డర్లలో ప్రవేశపెట్టారో తెలిసి ఉండేది.

ఈ రకంగా దర్యాప్తు సంస్థ స్వయంగా చేసి ఉండగల హానికి సూచికగా పనికొచ్చే సమాచారమంతా పూర్తిగా తొలగించబడి, శుభ్రం చేయబడి ఉన్నదని కూడ మేం గుర్తించాం. ఉదాహరణకు, ఏ విండోస్ కంప్యూటర్ లోనైనా రన్ కమాండ్ ఉంటుంది. కంప్యూటర్ వాడకందారు ఒక ప్రోగ్రాం పేరును టైప్ చేసి, అవసరమైన కమాండ్స్ ఇస్తే ఈ రన్ కమాండ్ ఆ పని చేసి పెడుతుంది. ఇలా ఒక కంప్యూటర్‌లో రన్ కమాండ్‌కు ఇచ్చిన ఆదేశాలన్నీ (లాగ్) వరుసగా మొత్తంగా కంప్యూటర్ రిజిస్ట్రీ అనే చోట నమోదై ఉంటాయి. అయితే, ఆశ్చర్యకరంగా రోనా విల్సన్ కంప్యూటర్‌లో ఈ కంప్యూటర్ రిజిస్ట్రీ సమాచారం కూడ పూర్తిగా తొలగించబడి ఉంది. కంప్యూటర్ వినియోగం ఎప్పుడెప్పుడు ఎందుకోసం జరిగిందో తెలుసుకోవడానికి, ఏవైనా హానికర ప్రోగ్రాంలను ఈ కంప్యూటర్ మీద వాడడం జరిగిందా తెలుసుకోవడానికి ఈ సమాచారం ఉపయోగపడేది.

ఈ సమాచారం ఎప్పుడూ దానంతట అది చెరిగిపోయే అవకాశం లేదు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఆ పని చేయవలసిందే. ఈ సమాచారాన్ని సురక్షితంగా తొలగించాలంటే అది సాంకేతిక నైపుణ్యం, అనుభవం ఉన్నవారికి మాత్రమే సాధ్యమవుతుంది. రిజిస్ట్రీలో, ఇలా తొలగించబడిన రన్ లాగ్‌తో పాటే, కంప్యూటర్ సిస్టమ్ మీద ప్రభావం వేయగల మరెన్నో చిట్టాలు కూడ నిలువ ఉంటాయి. తత్ఫలితంగా, రన్ లాగ్ తొలగించే క్రమంలో రిజిస్ట్రీలోని ఇతర సమాచారమేమైనా తొలగించబడితే, మొత్తంగా సిస్టమ్ పనికి రాకుండా పోతుంది. చాల జాగ్రత్తగా ఈ ఒక్క రన్ లాగ్ మాత్రమే తొలగించబడిందనే వాస్తవమే ఈ కంప్యూటర్ మీద ఏమేమి పని జరిగిందో జాడలు లేకుండా చేసే ప్రయత్నం ఉద్దేశపూర్వకంగా జరిగిందని తెలియజేస్తున్నది.

అలాగే ఈ కంప్యూటర్ మీది నుంచి కనబడకుండా పోయిన ఉపయోగకరమైన సమాచారంలో మరొకటి, స్టార్ట్ బటన్ సహాయంతో సర్చ్ అవకాశం వినియోగించి తాజాగా తెరిచిన డాక్యుమెంట్ల జాబితా. ఆపరేటింగ్ సిస్టమ్ మీద తాజాగా ఏయే ఫైళ్లను సర్చ్ చేయడం జరిగిందో ఇది చెపుతుంది. పోలీసులు చెపుతున్న ప్రమాదకర ఫైళ్ల కోసం రోనా విల్సన్ ఎప్పుడెప్పుడు సర్చ్ చేశాడో, ఎప్పుడు తెరిచాడో, అసలు తెరిచాడో లేదో ఈ జాబితా ఉంటే తెలిసి ఉండేది. తన మీద ఆరోపణలకు అవకాశం ఉన్న ఫైళ్లనే తొలగించని రోనా విల్సన్, తన మీద, సహనిందితులమీద ఆరోపణలనుంచి తప్పించుకోగలిగిన ఈ జాబితాను మాత్రం తొలగించి ఉంటాడని అనడం తర్కానికి నిలవదు.

రోనా విల్సన్ డిస్క్ మీద దొరికాయని పోలీసులు చెపుతున్న ఉత్తరాల్లో ఎక్కువభాగం పిడిఎఫ్ ఫైళ్లు. ఈ పిడిఎఫ్ డాక్యుమెంట్లను చదవగలిగే అడోబీ ఆక్రోబాట్ రీడర్ అనే సాఫ్ట్ వేర్ అసలు ఆ డాక్యుమెంట్లు మొదట ఏ సాఫ్ట్ వేర్ మీద రాయబడ్డాయో కూడ నిర్ధారిస్తుంది. పోలీసులు చెపుతున్న ప్రమాదకరమైన ఫైళ్లను విశ్లేషించగా, విల్సన్ రాశాడని ఆరోపిస్తున్న ఉత్తరాల్లో కొన్ని మైక్రోసాఫ్ట్ వర్డ్ 2010 వర్షన్ మీద రాయబడ్డాయని తేలింది. విల్సన్ వాడిన ఒకే ఒక్క కంప్యూటర్ మీద ఈ సాఫ్ట్ వేర్ 2007 వర్షన్ మాత్రమే ఉంది. ఆ కంప్యూటర్ చరిత్ర చూస్తే దానిలో ఎప్పుడూ 2010 వర్షన్‌ను ఇన్ స్టాల్ చేయలేదని తేలింది.

రోనా విల్సన్, సురేంద్ర గాడ్లింగ్‌ల దగ్గర కంప్యూటర్లు జప్తు చేసేటప్పుడు చట్టబద్ధంగా తప్పనిసరిగా పాటించవలసిన నిబంధనలను పోలీసులు పాటించలేదని ది కారవాన్ పత్రికలో డిసెంబర్ 2019

సంచికలో రాసిన నివేదికలో మేం పేర్కొన్నాం. సాక్ష్యాధారాలను తారుమారు చేసే అవకాశం లేకుండా చేయడానికి అన్ని డిజిటల్ సాక్ష్యాధారాలను భద్రంగా, పారదర్శంగా జప్తు చేయాలని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆక్ట్ 2000 నిర్దేశిస్తున్నది. అందుకోసం, జప్తు చేసే స్థలంలోనే జప్తు చేస్తున్న ఎలక్ట్రానిక్ పరికరాలకు యథాతథ ప్రతులు తయారు చేయడానికి (క్లోనింగ్ అంటారు) అవసరమైన పరికరాలను పోలీసులకు అందుబాటులో ఉంచారు. జప్తు చేసిన సమయంలో పోలీసులు నిందితులకు తాము జప్తు చేసిన వస్తువు యొక్క "హాష్ వాల్యూ" ఇవ్వాలని చట్టం నిర్దేశించింది. హాష్ వాల్యూ అంటే జప్తు చేసిన పరికరంలోని సమాచారపు ఏకైక గుర్తింపు సంఖ్య. ఇది అంకెల వరుస రూపంలో ఉంటుంది. ఒక సమాచారానికి ఒకటే అంకె ఉంటుంది. అది జప్తు చేసిన డిజిటల్ పరికరం మీద ఎలక్ట్రానిక్ సీలుగా పనిచేస్తుంది. జప్తు చేసిన తర్వాత ఆ పరికరాన్ని తెరిచినా, వాడినా, అందులో సమాచారం చేర్చినా, తొలగించినా హాష్ వాల్యూ మారిపోతుంది. అలా మారిస్తే నిందితుడికి ఇచ్చిన హాష్ వాల్యూకూ, న్యాయస్థానంలో సమర్పించిన పరికరపు హాష్ వాల్యూకూ తేడా వస్తుంది. ఒక పరికరానికి జప్తు చేసేటప్పుడు హాష్ వాల్యూ ఇవ్వడానికి ఒక గంట కన్న తక్కువ సమయమే పడుతుంది. రోనా విల్సన్ ఇంటి మీద దాడిని రికార్డ్ చేసిన వీడియో ప్రకారం ఆ దాడి ఏప్రిల్ 17 ఉదయం ఆరు గంటలకు మొదలై, మధ్యాహ్నం రెండు గంటల రెండు నిమిషాల దాకా సాగింది. అయినా, పోలీసులు రోనా విల్సన్‌కు ఆయన దగ్గర జప్తు చేసిన హార్డ్ డిస్కుకు హాష్ వాల్యూ ఆరోజు ఇవ్వలేదు. ఆ హార్డ్ డిస్కును జప్తు చేసిన ఆరు నెలలకు అక్టోబర్‌లో ఆ హాష్ వాల్యూ ఇచ్చారు.

అప్పుడు కూడ పుణెలోని రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబరేటరీ ఆ డిస్క్ మీద ఇచ్చిన నివేదికలో ఆ హాష్ వాల్యూ పేర్కొన్నారు. ది కారవాన్ పత్రిక కనిపెట్టిన మాలావేర్ గురించి గానీ, హార్డ్ డిస్క్‌లో కొంత సమాచారం తొలగించబడి ఉండడం గురించి గాని ఆ నివేదికలో ప్రస్తావించనే లేదు. ఆ తొలగించబడిన సమాచారం ఆ డిస్కను ఎవరెవరు ఎప్పుడెప్పుడు తెరిచారో జాడలు చెప్పి ఉండేది. ఈ చట్టబద్ధ నిబంధనలను ఎందుకు పాటించలేదో వివరించాలని పుణె పోలీసులకూ, రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబరేటరీకీ ది కారవాన్ పత్రిక తరఫున పంపిన ప్రశ్నలకు వారు ఏ సమాధానమూ ఇవ్వలేదు.

భీమా కోరేగాం అరెస్టులు జరిగినప్పుడు మహారాష్ట్రలోనూ, కేంద్రంలోనూ భారతీయ జనతా పార్టీ అధికారమే ఉండింది. జనవరి 2018 హింసాకాండకు బాధ్యులుగా కేసులలో నమోదై ఉన్న హిందుత్వ నాయకులు మిలింద్ ఎక్బోటే, శంభాజీ భిడేలను రక్షించడానికే ఈ కార్యకర్తలను భాజపా ప్రభుత్వాలు ఈ కేసులో ఇరికించాయని అప్పుడు ఎందరో కార్యకర్తలు, రాజకీయ నాయకులు ఆరోపించారు. ప్రతి సంవత్సరం జనవరి 1న లక్షలాది దళితులను ఆకర్షించే భీమా కోరేగాం స్మారక ఉత్సవం మీద దాడి చేయడానికి మహారాష్ట్రలో బలమైన నాయకులైన ఎక్బోటె, భిడే మూకలను పంపించారని ఆరోపణలున్నాయి.

2019 అక్టోబర్‌లో మహారాష్ట్రలో శాసనసభ ఎన్నికలు జరిగాయి. ఏ ఒక్క పార్టీకీ పూర్తి ఆధిక్యత రాలేదు. ప్రభుత్వాన్ని స్థాపించడానికి భాజపా ఎన్నో ప్రయత్నాలు చేసి విఫలమైన తర్వాత, ఆ పార్టీని అధికారం నుంచి తొలగించి, శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్‌ల ఐక్య సంఘటన అధికారానికి వచ్చింది. తత్ఫలితంగా పుణె పోలీసుల మీద భాజపా పట్టు తొలగిపోయింది. సురేంద్ర గాడ్లింగ్ హార్డ్ డిస్క్‌లోని అవకతవకల గురించి ది కారవాన్ నివేదిక ప్రచురితమైన ఆరు రోజులకు, డిసెంబర్ 21న, ఎన్‌సిపి అధ్యక్షుడు శరద్ పవార్ భీమా కోరేగాం కేసు "తప్పుడు" కేసనీ, "ప్రతీకారపు" కేసనీ వ్యాఖ్యానించారు. "పోలీసుల చర్యల మీద దర్యాప్తు జరపడానికి" ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించాలని కోరారు.

కాని, ఒక నెల తర్వాత, జనవరి 24న, భాజపా నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఈ కేసును నేషనల్ ఇన్వెస్టిగేటింగ్ ఏజెన్సీకి బదిలీ చేసింది. ఈ నేషనల్ ఇన్వెస్టిగేటింగ్ ఏజెన్సీ నేరుగా అమిత్ షా నేతృత్వంలోని కేంద్ర హోం శాఖ కింద పనిచేస్తుంది. వెంటనే, మహారాష్ట్ర హోం మంత్రి, ఎన్‌సిపి సభ్యుడు అనిల్ దేశముఖ్ కేంద్రం ఏకపక్షంగా ఈ నిర్ణయం తీసుకున్నదని ఆరోపించారు. "రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండానే భీమా కోరేగాం హింసాకాండ కేసును ఎన్ఐఎకు బదిలీ చేశారు" అని ఆయన పత్రికల వారికి చెప్పారు. కాని ఆ తర్వాత, ఈ విషయం మీద శివసేనకూ, ఎన్‌సిపికీ మధ్య అభిప్రాయభేదాలున్నాయని పత్రికావార్తలు వచ్చాయి. చివరికి శివసేనకు చెందిన ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే కేసు బదిలీని ఆమోదించారు. అప్పటిదాకా భీమా కోరేగాం కేసు విచారణ జరుపుతుండిన పుణె సెషన్స్ కోర్టు ఫిబ్రవరి 14న కేసును ముంబాయిలోని ఎన్ఐఎ ప్రత్యేక కోర్టుకు బదిలీ చేస్తూ లాంఛన ప్రాయమైన ఉత్తర్వులు జారీ చేసింది. ఆ రోజు కూడ, కేసు బదిలీ గురించి కేంద్ర నిర్ణయాన్ని, ఆ నిర్ణయానికి మహారాష్ట్ర ప్రభుత్వ మద్దతును తప్పు పడుతూ పవార్ తన వైఖరి ప్రకటించారు.

ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించాలనే తన డిమాండ్‌కు శరద్ పవార్ ఇప్పటికీ కట్టుబడి ఉన్నారు. పుణె కోర్టు కేసును బదిలీ చేసిన మూడు రోజుల తర్వాత తమ పార్టీ మంత్రులతో సమావేశం జరిపిన ఎన్‌సిపి అధ్యక్షుడు తప్పనిసరిగా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించాలనీ, రాష్ట్ర ప్రభుత్వం సమాంతర దర్యాప్తు జరపడాన్ని ఎన్ఐఎ చట్టం కూడ అనుమతిస్తుందనీ అన్నారు. ఆ సమావేశం తర్వాత పత్రికల వారితో మాట్లాడుతూ, తమ పార్టీ రాష్ట్ర అడ్వకేట్ జనరల్ అభిప్రాయంతో ముఖ్యమంత్రి ఠాక్రేను కలుస్తుందని దేశముఖ్ అన్నారు. "అడ్వకేట్ జనరల్ అభిప్రాయం తెలుసుకుని, మేం మళ్లీ ఒకసారి ముఖ్యమంత్రితో మాట్లాడతాం. ఎస్ఐటి వేయడానికి అనుమతి సంపాదిస్తాం" అని ఆయన అన్నారు. "ఎస్ఐటి వేయాలనే అభిప్రాయానికి మేం కట్టుబడి ఉన్నాం. మా నాయకులలో చాల మంది దానికి అంగీకరిస్తున్నారు" అని ఆయన అన్నారు.

(ది కారవాన్ పత్రికలో 2020 మార్చ్ 12న వెలువడిన వార్తా కథనానికి అనువాదం. రచయితలు మార్తాండ్ కౌశిక్ ది కారవాన్ పత్రికలో సీనియర్ అసిస్టెంట్ ఎడిటర్, ఆంజనేయ శివన్ అదే పత్రికలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్)

(https://caravanmagazine.in/politics/bhima-koregaon-case-rona-wilson-hard-disk-malware-remoteaccess?fbclid=IwAR3cltT7pleRn_bJeBVKT6nE_WsYXt4bODrRrVYITrXzebFzW3HKQkBQOT0)

వీ

కార్పొరేట్‌ల గుత్తాధిపత్యంలోకి మహారత్న కంపెనీలు

***ప్రభుత్వ రంగంలోని ఆయిల్ పరిశ్రమలను ప్రైవేట్ రంగానికి కట్టబెట్టాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకునేలా కార్మికులు, ఉద్యోగులే కాకుండా పౌర సమాజం ఐక్యంగా ఉద్యమించాలని అంటున్నారు* ఎం. శ్రీనివాస్**

భారతదేశంలో ప్రభుత్వరంగం అభివృద్ధి చెందకూడదు. ప్రధానంగా మౌలికరంగ పరిశ్రమలు బలపడి స్థిరత్వం సాధించకూడదు. ఈ లక్ష్యంతో సామ్రాజ్యవాదులు వారి బహుళజాతి సంస్థలు మొదటినుండి ప్రయత్నం చేస్తూ వస్తున్నాయి. కీలక పరిశ్రమలన్నీ ప్రభుత్వ సారధ్యంలో అభివృద్ధి అవుతాయని, రెండవ పంచవర్ష ప్రణాళిక ప్రకటిత సమయాన నాటి కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ నేపథ్యంలో అమెరికాకు చెందిన "ఫోర్డ్ ఫౌండేషన్ టీం" రంగంలోకి దిగింది. దేశ స్వతంత్ర పారిశ్రామిక అభివృద్ధికి, విస్తరణకు తద్వారా దేశంలో వెనుకబడిన ప్రాంతాలలో పారిశ్రామికీకరణ జరిగి ఉపాధి, ఉద్యోగ అవకాశాల పెరుగుదలకు దోహదం చేసే ఈ ప్రకటిత (ప్రభుత్వ ఆధ్వర్యంలో కీలక పరిశ్రమల అభివృద్ధి) లక్ష్యాన్ని బలహీనపరచడానికి తద్వారా పారిశ్రామిక అభివృద్ధిని అడ్డుకోవడానికి "ఫోర్డ్ ఫౌండేషన్ టీం" చాలా ప్రయత్నాలు చేసింది. అందులో భాగంగా కరువు "నివారణ", వ్యవసాయ "అభివృద్ధి" పేరిట వ్యవసాయ సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలని ఒత్తిడి తెచ్చింది. ఇది కేవలం పారిశ్రామిక అభివృద్ధిని అడ్డుకోవడానికే. దేశీయ పారిశ్రామిక అభివృద్ధి విధ్వంస చర్యలను వలసపాలకులు చేపట్టిన తీరు, దాన్ని ప్రతిఘటిస్తూ జాతీయోద్యమంలో భాగంగా సాగిన కార్మికోద్యమం ప్రభావం, ప్రజల ఆకాంక్షల ఫలితంగా భారత దళారీ పాలకవర్గం తొలుత (1950వ దశకం) ప్రైవేటీకరణకు అవసరమైన చర్యలను బాహాటంగా తీసుకోలేకపోయింది. అయితే స్వదేశీ, విదేశీ బడా ఆర్థిక సంస్థల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టికొని అవసరమైన ప్రాతిపదికను (మిశ్రమ ఆర్థిక వ్యవస్థ పునాదిగా రూపు దిద్దుకున్న పారిశ్రామిక విధానం) ఏర్పర్చింది. తర్వాత 80వ దశకం, 90వ దశకంలో ఆర్థిక వ్యవస్థలో వచ్చిన సంస్కరణలు, తదనుగుణంగా వచ్చిన మార్పులు దేశ పారిశ్రామిక రంగంలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు అవసరమైన "విధాన రూపకల్పన" జరిగింది. చర్యలు వేగవంతమయ్యాయి. పాలకులు ఇప్పటికే అంతర్గతంగా ప్రైవేటీకరణకు తెరలేపారు. క్యాజువల్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌ల పేరుతో ఈ ప్రక్రియకు పూనుకున్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలలో ప్రభుత్వ వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ, వాటాల విక్రయం, నూతనంగా పెట్టుబడులు సమకూర్చకపోవడం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు చట్టబద్ధ అవకాశాలు కల్పించడం వంటి చర్యల మూలంగా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణలకు పడిన పునాది బలపడి నిర్మాణాత్మకంగా ముందుకు సాగడానికి దోహదం చేసింది.

2014 తొలిసారి అధికారం చేపట్టిన నాటి నుండే మోడీ ప్రభుత్వం తన మౌలిక విధానంలో భాగంగా ప్రైవేటీకరణను వేగవంతం చేస్తోంది. మరోవైపున అంతర్జాతీయ ద్రవ్య సంస్థ (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్ (డబ్ల్యుబి)ల ఒత్తిడితో ఈ ప్రక్రియను పూర్తిస్థాయిలో అమలు చేయడానికి మరిన్ని చర్యలను చేపట్టింది. అందులో భాగంగానే మంత్రివర్గ పాలనా విభాగాల ద్వారా ఎదురవుతున్న అడ్డంకులను కూడా తొలగించుకొని ముందుకు వెళ్లడానికి పరోక్ష పద్ధతులను అవలంభిస్తుంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిజిన్వెస్ట్‌మెంట్ (పెట్టుబడుల ఉపసంహరణ విభాగం) పేరును డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ & పబ్లిక్ అస్సెట్స్ మేనేజ్‌మెంట్ (డిఐపిఎఎం)గా మార్చారు. అత్యంత వినాశకరమైన "ప్రాజెక్టు ప్రైవేటైజేషన్" పేరుతో ముందుకు తీసుకెళ్లడానికి ప్రధానమంత్రి కార్యాలయం (పిఎంఒ) నీతి ఆయోగ్, ఇది డిఐపిఎఎంలకు పూర్తి అధికారాన్ని ఇచ్చారు. నీతి ఆయోగ్, డిఐపిఎఎంలు సంయుక్తంగా ప్రభుత్వరంగ సంస్థల్లో వ్యూహాత్మక అమ్మకాలకు వీలైన సంస్థలను గుర్తిస్తాయి. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం గతంలోనే కోల్ ఇండియాలో 10 శాతం ఓఎన్‌జిసిలో 5 శాతం వాటాలను విక్రయించింది. ప్రస్తుతం బిపిసిఎల్‌లో ఉన్న 53.29 శాతం వాటా మొత్తాన్ని, షిప్పింగ్ కార్పొరేషన్‌లో ఉన్న 63.75 శాతం వాటా మొత్తాన్ని, కాంకోర్‌లో ఉన్న 30 శాతం వాటా మొత్తాన్ని, నీప్‌కోలో ఉన్న 100 శాతం వాటా మొత్తాన్ని, టిహెచ్‌డిసిలో ఉన్న 75 శాతం వాటా మొత్తాన్ని విక్రయించడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతులను మంజూరు చేసింది. బిపిసిఎల్‌లోని ప్రభుత్వ వాటాను విక్రయించనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి తాజాగా వెల్లడించింది.

ఆయిల్ కంపెనీల జాతీయకరణ నేపథ్యం

1860లో స్కాట్‌ల్యాండ్ కేంద్రంగా బర్మా ఆయిల్ కంపెనీ స్థాపించబడింది. 1871లో దీనిని రంగూన్ ఆయిల్ కంపెనీగా మార్చారు. భారత్‌లో ఆయిల్ అన్వేషణలో భాగంగా 1886లో అస్సాం ఎగువ భాగంలో ఉన్న జయపూర్ వద్ద ఆయిల్, గ్యాస్‌ను కనుగొన్నారు. 1889లో దిగ్బాయి నుండి అస్సాం రైల్వే అండ్ ట్రేడింగ్ కార్పొరేషన్ ద్వారా ఆయిల్‌ను ఉత్పత్తి చేయడం ప్రారంభించారు. బ్రిటిష్ వ్యాపార సంస్థ బర్మా ఆయిల్ కంపెనీ 1903లో ఇండియాలో తన వ్యాపారాన్ని ప్రారంభించింది. 1928లో ఆసియాటిక్ పెట్రోలియం ఇండియా కంపెనీ, బర్మా ఆయిల్ కంపెనీలు విలీనం అయ్యాయి. రాయల్ డచ్ షెల్, బర్మాషెల్ ఆయిల్ స్టోరేజ్ అండ్ డిస్ట్రిబ్యూటింగ్ కంపెనీ ఆఫ్ ఇండియాగా ఏర్పడినాయి. ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా 1952లో బర్మాషెల్ రిఫైనరీస్‌ను ముంబైలో స్థాపించారు. ఈ క్రమంలో 1947 అధికార మార్పిడి తర్వాత కూడా ఆయిల్ కంపెనీల నిర్వహణ విదేశీ బహుళజాతి

సంస్థల చేతుల్లోనే ఉన్నాయి.

జాతీయోద్యమ ఆకాంక్షల సాకారం కోసం భారత కార్మికవర్గం తిరిగి 1950లో విదేశీ బహుళజాతి సంస్థలు నడుపుతున్న ఆయిల్ కంపెనీలను జాతీయం చేయాలన్న డిమాండ్‌తో నిర్మించిన మహా ఉద్యమం, సాగించిన సుదీర్ఘ చారిత్రాత్మక పోరాటం వలన విదేశీ బహుళజాతి ఆయిల్ కంపెనీలు జాతీయం చేయబడ్డాయి. ఈ పూర్వ రంగంలో సాధించిన గొప్ప విజయమే ప్రభుత్వ రంగంలో దేశీయ ఆయిల్ రంగంలోని దిగ్గజ సంస్థలయిన బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్‌లు ఏర్పడ్డాయి. ఆర్థిక, రాజకీయ కోణంలో నిర్వహించిన ఇటువంటి పోరాటాల ద్వారా విదేశీ కంపెనీలను వెనక్కి కొట్టగలిగారు. 50వ దశకంలో ఆరంభమైన ఈ ఉద్యమాన్ని అణచివేయడానికి కార్మికుల ఆధ్వర్యంలో ప్రజలు సాగించిన పోరాటాలన్నీ నీరు గార్చడానికి బహుళజాతి సంస్థలు తీవ్రంగానే ప్రయత్నం చేశాయి. యాజమాన్యాలు కార్మికుల పైన ప్రజలపైన అనేక దారుణాలకు పాల్పడ్డారు. కార్మికుల జీవనాధారమైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలను దెబ్బ తీయడానికి, ఆయిల్ డిపోలను, కర్మాగారాలను మూసివేశారు. కార్మికులను తొలగించారు. జీతాలు, ఇతర సౌకర్యాలలో కోత విధించారు. రిటైర్‌మెంట్ వయసు 45 సంవత్సరాలకే కుదించారు. ఈ చర్యలకు వ్యతిరేకంగా కార్మికులవైపు నుండి తీవ్ర ప్రతిఘటన ఎదురయ్యింది. ఈ ఉద్యమంలో భాగంగా 1967లో కలకత్తాలోని చిత్తరంజన్ ఎవెన్యూలో ఉన్న కాల్టెక్స్ కంపెనీ వద్ద వేలాది మంది కార్మికులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో 1976లో వచ్చిన విదేశీ ఆయిల్ కంపెనీల జాతీయకరణ చట్టం ఆధారంగా 1974 – 77 మధ్యకాలంలో విదేశీ ఆయిల్ కంపెనీలయిన ఎస్సో, బర్మాషెల్, కాల్టెక్స్‌లను భారత ప్రభుత్వం జాతీయం చేసింది.

1976, జనవరి 24న భారత ప్రభుత్వం బర్మాషెల్ కంపెనీని స్వాధీనం చేసుకుంది. భారత్ రిఫైనరీస్ లిమిటెడ్‌ను నెలకొల్పింది. తర్వాత అంటే 1977, ఆగస్టు 1న దీని పేరును భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్)గా మార్చారు. ఈ క్రమంలోనే రష్యా సహకారంతో బాంబే హై ఆఫ్ షోర్ డీప్ సీ ఆయిల్ ఫీల్డ్‌లో ఓఎన్‌జిసి కనుగొన్నది. దేశీయంగా ఉత్పత్తి చేసిన ముడిసమురులు శుద్ధిచేసే కర్మాగారమిది. 1952లో ఏర్పాటైన స్టాండర్డ్ వాక్యూమ్ రిఫైనింగ్ కంపెనీ, 1962లో ఎస్సో (ఇఎస్‌ఎస్‌ఓ) స్టాండర్డ్ రిఫైనింగ్ కంపెనీగా మారింది. 1974లో ఎస్సో కంపెనీ ల్యాబ్ ఇండియా కంపెనీలు విలీనమయ్యాయి. తర్వాత ఈ కంపెనీలను జాతీయం చేసి హెచ్‌పిసిఎల్‌గా ఏర్పాటు చేశారు. ఈ విధంగా ఏర్పడిన బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్ సంస్థల వెనుక జాతీయోద్యమ ఆకాంక్షలున్నాయి. చారిత్రాత్మక ఉద్యమ నేపథ్యం ఉంది. త్యాగాలు, బలిదానాలు ఉన్నాయి. కార్మిక వర్గ సారధ్యంలో ప్రజలు నిర్వహించిన వీరోచితమైన పోరాటాల నుండి ఆవిర్భవించిన ఈ ప్రభుత్వ రంగ ఆయిల్ దిగ్గజ సంస్థలయిన బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్‌లు ఆర్థిక వ్యవస్థలో కీలకమయిన విశేష ప్రాధాన్యత కలిగి ఉన్నాయి. తమ అత్యద్భుతమైన పనితీరు, నిర్వహణ సామర్ధ్యాన్ని ప్రదర్శించి ఉత్పాదకతను నిరంతరం తెంచుకుంటుంది. ఆర్థిక పరంగా కూడా భారీగా స్థిరాస్తులను సృష్టించుకున్నాయి.

బిపిసిఎల్ – హెచ్‌పిసిఎల్ – ఐఓసిఎల్ సంస్థల అభివృద్ధి విస్తరణ

మన దేశంలో భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్), హిందుస్తాన్ పెట్రోలియమ్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పిసిఎల్) సంస్థలకు "బ్రాండ్ నేమ్" ఉన్నది. ఈ సంస్థలను కార్పొరేట్ దిగ్గజాల గుత్తాధిపత్యానికి అప్పగించడానికి మోడీ ప్రభుత్వం నిర్ణయించింది. నవరత్న కంపెనీలలో మహారత్న కంపెనీలయిన ఈ రెండు సంస్థలను స్వదేశీ కార్పొరేట్ దిగ్గజాలయినా ఆదానీ, అంబానీలకు, విదేశీ బహులజాతి సంస్థలకు అప్పగించడానికి రంగం సిద్ధం చేసింది. బహులజాతి సంస్థల, స్వదేశీ కార్పొరేట్ దిగ్గజాల దృష్టి ఈ సంస్థలపై పడటంలో కారణాలు లేకపోలేదు. ఈ కంపెనీలు, పెట్రోలియం మార్కెట్‌లో వరుసగా 24 శాతం, 22 శాతం అమ్మకాలను కలిగి ఉన్నాయి. బిపిసిఎల్ వద్ద రూ. 34,400 కోట్లు రిజర్వ్ నిధులున్నాయి. రూ. 2 లక్షల కోట్లకుపైగా స్థిరాస్తులున్నాయి. గత ఐదేళ్లుగా ప్రతి యేటా రూ. 8 వేల కోట్లలో లాభాలను అర్జిస్తూ వస్తున్నది. 2017–18 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వానికి పన్నుల రూపంలో రూ. 96 వేల కోట్లు చెల్లించింది. అంతేకాదు, బిపిసిఎల్ దేశంలోనే రెండవ అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ. ఇది సంవత్సరానికి 38.3 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడి చమురును శుద్ధి చేయగల వ్యవస్థాపక సామర్థ్యం కలిగిన నాలుగు రిఫైనరీలు (కాచీ, ముంబై, బినా, సుమాలీగడ్) ఉన్నాయి. ఈ రిఫైనరీలకు సమీపంలోని స్టోరేజ్ గిడ్డంగులు, పంపిణీ సౌకర్యాలు కలిగి ఉన్నది. బిపిసిఎల్‌కు 75 పెద్ద చమురు నిర్మాణాలు, పెట్రోలియం ఉత్పత్తులు నిలువ చేసుకునే గిడ్డంగులు, పంపిణీ సదుపాయాలు, 55 వంట గ్యాస్ నింపే ఫ్యాక్టరీలు, 2241 కి.మీ పొడవున పైప్ లైన్లు విమానాశ్రయాలలో విమానాలకు ఇందనం నింపే 56 ఇంధన స్టేషన్లు, నాలుగు లూబ్రికేంట్ ఫ్యాక్టరీలు గోడౌన్‌లతో పాటు ప్రధాన ఓడరేవుల్లో చమురు దిగుమతి ఎగుమతులకు అవసరమైన సౌకర్యాలున్నాయి. ఇవి కాక, మన దేశంలోనూ, విదేశంలోనూ 11 అనుబంధ కంపెనీలు, 22 జాయింట్ వెంచర్ కంపెనీలు ఉన్నాయి. దేశమంతటా 15078 పెట్రోల్‌బంక్‌లు, 6004 వంట గ్యాస్ పంపిణీ ఏజెన్సీలను ఈ సంస్థ కలిగి ఉన్నది. అదే విధంగా దేశం మొద్దం మీద రూ. 48182 కోట్ల ఖర్చుతో కూడిన ప్రాజెక్టులను అమలు చేస్తుంది. 2014 – 15లలో దీని టర్నోవర్ రూ. 2.47 లక్షల కోట్లు కాగా 2018–19 నాటికి బిపిసిఎల్ టర్నోవర్ రూ. 3.39 లక్షల కోట్లకు పెరిగింది. ఈ కాలంలో సాధించిన మొత్తం లాభం రూ. 50576 కోట్లు. హెచ్‌పిసిఎల్ సంస్థ 18 మిలియన్ల మెట్రిక్ టన్నుల ముడిచమురును శుద్ధి చేసే వ్యవస్థాపక సామర్థ్యం కలిగి ఉన్నది. దేశవ్యాప్తంగా 15,127 పెట్రోల్ బంక్‌లను నిర్వహిస్తుంది. 2019లో ఈ సంస్థ రు. 3 లక్షల కోట్ల టర్నోవర్‌లతో రు. 7,218 కోట్ల లాభాలను అర్జించింది. అదే విధంగా 1958లోనూ, 1959లోనూ వరుసగా ఏర్పడిన ఇండియన్ రిఫైనరీస్, ఇండియన్ ఆయిల్ కంపెనీలు కలిసి 1964 సెప్టెంబర్‌లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసిఎల్)గా ఏర్పడింది. ప్రస్తుతం ఈ సంస్థ సంవత్సరానికి 60.2 మిలియన్ల మెట్రిక్ టన్నుల వ్యవస్థాపక సామర్థ్యం కలిగి ఉన్నది. దేశవ్యాప్తంగా 35 వేల అమ్మకపు కేంద్రాలను కలిగి, 7,735 పైపు లైన్ల ద్వారా 167 బల్క్ స్టోరేజ్‌లను, టర్మినల్స్, 101 విమానయాన ఇందన స్టేషన్లు, 89 ఇండియన్ గ్యాస్ డిపోలకు సరఫరా చేస్తుంది. దేశవ్యాప్తంగా విస్తృతమైన నెట్‌వర్క్ కలిగి 18,278 పెట్రోల్, డీజిల్ కంపెనీలు కలిగి ఉన్నది. 53 మిలియన్ల గృహాలకు 5 వేల డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా చేస్తుంది. రైల్వే, స్టేట్ రోడ్ రవాణా, పారిశ్రామిక, వ్యవసాయ, ఓడ రేవులలో అధికశాతం మార్కెట్ షేర్ కలిగి ఉన్నది.

ఉపాధి ఉద్యోగ అవకాశాల కల్పనలో అగ్రగామి సంస్థలివి

1977లో ఏర్పడిన భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) సంస్థలు 12 వేల మంది పర్మినెంట్, 20 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు 1974 తర్వాత ఆవిర్భవించిన హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పిసిఎల్) సంస్థలో 11 వేల మంది పర్మినెంట్, 31 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులున్నారు. దేశమంతటా ఈ రెండు సంస్థల్లో రిజర్వుడ్ క్యాటగిరికీ, వెనుకబడిన తరగతులకు చెందిన వేలాదిమందికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయి. ఉద్యోగ అవకాశాల కల్పనలో ప్రైవేట్ రంగ సంస్థల కన్నా ప్రభుత్వ రంగ సంస్థలే ముందు భాగంలో ఉన్నాయి. ప్రధానంగా బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్ సంస్థలు ఉపాధి ఉద్యోగాల కల్పనలో కీలకంగా ఉన్నాయి. కేంద్ర కార్మిక ఉపాధి మంత్రిత్వశాఖ విడుదల చేసిన 2011-12 నివేదిక ప్రకారం ప్రభుత్వ రంగ సంస్థలు 17.6 మిలియన్ల మందికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించగా దానికి భిన్నంగా ప్రైవేట్ రంగ కంపెనీలు 11.9 మిలియన్ల మందికి మాత్రమే ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించాయి. అదే విధంగా ఉద్యోగ భద్రత, కంపెన్సేషన్ ప్యాకేజ్, పనిస్థలాల్లో రక్షణ ప్రజాస్వామిక వాతావరణం వంటి విషయాలలో ప్రైవేట్ రంగ పరిశ్రమల కంటే ప్రభుత్వ రంగంలోనే చాలా మెరుగ్గా ఉన్నది.

వేగవంతమైన చమురు కంపెనీల ప్రైవేటీకరణ

90వ దశకం ఆరంభం నుండి స్వదేశీ, విదేశీ బడా కార్పొరేట్ ఆర్థిక సంస్థలు ఆయిల్ రంగాన్ని కైవసం చేసుకోవడానికి దృష్టి పెట్టాయి. నాటి పాలకుల సానుకూల విధానాలు అవలంబించినప్పటికి నిర్దిష్టంగా 2002లో వాజ్‌పేయ్ ప్రభుత్వం (ఎన్‌డిఎ) బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్ సంస్థలను ప్రైవేటీకరించడానికి చర్యలను మొదలుపెట్టింది. ఐఒసిఎల్‌కు చెందిన మొత్తం ఆయిల్ మార్కెటింగ్ వ్యవస్థను ప్రైవేట్ రంగానికి అమ్మాలని నిర్ణయించింది. "రిలయన్స్ ఇండస్ట్రీస్", "బ్రిటిష్ పెట్రోలియం" (ఇంగ్లాండ్), "పెట్రోనాస్", "సెల్ సౌదీ ఆరాంకో" (మలేషియా) జాయింట్‌గా, ఎస్సార్ ఆయిల్ కంపెనీలు బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్ సంస్థలను కొనుగోలు చేయడానికి ముందుకు వచ్చాయి. కార్మికవర్గం నిర్వహించిన శక్తివంతమైన పోరాటం, సుప్రీంకోర్టు తీర్పులతో ఆ ప్రయత్నం నుండి నాటి ఎన్‌డిఎ ప్రభుత్వం వెనక్కి తగ్గింది. తిరిగి ఈ ప్రయత్నాలకు 2014 తర్వాత మోడీ ప్రభుత్వం ఆజ్యం పోసింది. ప్రభుత్వ రంగ ఆయిల్ సంస్థలను ప్రైవేటీకరించడానికి వ్యూహాత్మక ఎత్తుగడలను అమలు చేయడం మొదలుపెట్టింది. 2016లో వచ్చిన "రిపీలింగ్ అండ్ అమెండింగ్ యాక్ట్ - 2016" ముసాయిదాను పార్లమెంట్ చేత ఆమోదింపచేసుకున్నది. దీని ఆధారంగా మోడీ ప్రభుత్వం "పనికిమాలిన", "వ్యవహారంలో లేని" చట్టాలంటూ 187 చట్టాలను రద్దు చేసింది. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే 1976లో జాతీయం చేసిన బర్మాషెల్ కంపెనీకి సంబంధించిన చట్టం కూడా దీనిలోనే ఉన్నది.

ఈ నేపథ్యంలో భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పిసిఎల్) సంస్థలను పూర్తి స్థాయిలో ప్రైవేటీకరించాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించింది. 2017 నుండే ఈ ప్రయత్నాలు తీవ్రంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ప్రోత్సాహకాల వల్ల విదేశీ ఆయిల్ దిగ్గజాలు మన దేశ ఆయిల్ పెట్రోలియం రంగంలోకి ప్రవేశించాయి. ఇటీవల ఫ్రాన్స్‌కు చెందిన అతిపెద్ద ఆయిల్ కంపెనీ "టోటల్ ఎస్ఎ" ఆదాని గ్యాస్ కంపెనీలో 37.4 శాతం వాటాలను కొనుగోలు చేయబోతున్నది. ఈ కంపెనీ (ఆదాని గ్యాస్ సంస్థ) దిగుమతులకు అవసరమయ్యే టర్మినల్స్‌ను, దేశవ్యాప్తంగా పెట్రోల్ బంక్‌లను అభివృద్ధి పరచడం, ఆటోమొబైల్ వాహనాలకు కంప్రెస్ చేసి గ్యాస్ సరఫరా చేయడం, నివాస గృహాలకు పైపుల ద్వారా గ్యాస్‌ను ఇవ్వడం జరుగుతుంది. ఓఎన్‌జిసి చమురు అన్వేషణలోనూ, ముడిచమురు ఉత్పత్తుల్లోనూ అమెరికాకు చెందిన పెద్ద పెట్రోలియం సంస్థ "ఎక్సాన్ మొబిల్"తో కలిసి పనిచేయడానికి 2018 అక్టోబర్‌లో ఒప్పందం చేసుకున్నది. కేంద్ర ప్రభుత్వం "రిలయన్స్ ఇండస్ట్రీస్" నిర్వహిస్తున్న ఆయిల్, గ్యాస్ బ్లాకులో 30 శాతం వాటాను బిపిసిఎల్‌సి చేత సేకరింపచేసింది. దీనితో పాటు దేశవ్యాప్తంగా 5500 పెట్రోల్ బంకులను ఏర్పాటు చేసి జాయింట్ వెంచర్‌ను మొదలుపెట్టారు. 2019 తొలి మాసాల్లో కెనెడాకు చెందిన "బ్రూక్‌ఫీల్ అసెట్ మేనేజ్‌మెంట్స్ ఇండియా ఇన్ఫ్రా స్ట్రక్చర్ ట్రస్ట్" నష్టాల్లో కొనసాగుతున్న రిలయన్స్‌కు చెందిన "ఈస్ట్ వెస్ట్ పైప్‌లైన్" అనే కంపెనీని రు.13 వేలకు కొనుగోలు చేసింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి)ను ప్రతికూల పరిస్థితిలోకి నెట్టే వ్యూహాత్మక పాలసీని మోడీ ప్రభుత్వం అనుసరిస్తుంది. అందులో భాగంగానే కర్ణాటకలోని పాదూరు వద్ద ఉన్న 4.6 మిలియన్ బారెళ్ల ముడి చమురును వ్యూహాత్మకంగా నిలువ చేసుకునే సౌకర్యాన్ని సౌదీ అరేబియాకు చెందిన ఆయిల్ దిగ్గజం ఆరాంకోకు కల్పించింది. ఈ చర్య రిల్ ఆరాంకోకు ప్రయోజనం చేకూరబోతుంది. అంటే రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (రిల్), సౌదీకి చెందిన ఆరాంకో సంస్థలకు అధిక ప్రాధాన్యత మోడీ ప్రభుత్వం కల్పిస్తుంది.

రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్ సంస్థలను అప్పగిస్తే రిల్‌కు ఉన్న చమురు శుద్ధి సామర్థ్యం సంవత్సరానికి 120 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెరిగి నిర్ణయాత్మక చమురు శుద్ధి కంపెనీగా ఆవిర్భవిస్తుంది. ఈ రెండు సంస్థలకు కీలక ప్రాంతాల్లో ఉన్న 30, 500 పెట్రోల్ బంక్‌లు రిల్ చేతిలోకి వెళ్తే ఆయిల్, పెట్రోలియం వ్యాపారాల్లో నిర్ణయాత్మక ఆధిపత్యం వస్తుంది. ప్రభుత్వ రంగ ఆయిల్ సంస్థలయిన బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్, ఐఒసిఎల్‌లు ఆయిల్ మార్కెటింగ్‌లు 75 శాతానికి పైగా వ్యాపార సామర్థ్యం కలిగి ఉన్నాయి. ఇవి వాటి వ్యాపార సామర్థ్యాన్ని కోల్పోతాయి. ప్రైవేట్ సంస్థలు ప్రధానంగా రిల్, ఇతర విదేశీ బహుళజాతి సంస్థల చేతుల్లోకి మార్కెట్ వెళ్తే ప్రభుత్వ నియంత్రణకు అవకాశం ఉండదు. దేశంలో పెట్రోలియం, ఉత్పత్తుల ధరలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. ధరలు అదుపు తప్పుతాయి. కీలకమైన వ్యూహాత్మక ప్రాధాన్యత గల ఇంధన భద్రత, ఇంధన ఆర్థిక వ్యవస్థ స్వదేశీ, విదేశీ కార్పొరేట్ ఆయిల్ దిగ్గజాల గుత్తాధిపత్యంలోకి వెళ్తుంది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఇది అత్యంత ప్రమాదకరంగా ఉంటుంది. కార్మికులు, ఉద్యోగులు పొందుతున్న సౌకర్యాలు కోల్పోతారు. శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగ అవకాశాలు ఉండవు. నిర్దిష్ట కాలపరిమితి (ఫిక్స్‌డ్ టర్మ్)తో కాంట్రాక్ట్ కార్మికుల నియామకం ఉంటుంది. తక్కువ వేతనాలు చెల్లించబడతాయి. ఉద్యోగ భద్రతకు, సాంఘిక భద్రతకు గ్యారెంటీ ఉండదు. అందువల్ల ప్రభుత్వ రంగంలోని ఆయిల్ పరిశ్రమలను కాపాడుకోవల్సిన బాధ్యత కార్మికులు, ఉద్యోగుల మీదనే కాదు, భారత పౌర సమాజం మీద ఉన్నది. నాటి జాతీయోద్యమ స్ఫూర్తి, 60వ దశకంలో వచ్చిన ఆయిల్ పరిశ్రమల జాతీయకరణ మహోద్యమం ప్రేరణతో బలమైన నిర్మాణాత్మక ప్రజా ఉద్యమ నిర్మాణమే ఏకైక మార్గం.

(రచయిత ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) వీ

లెనిన్ ఐక్య సంఘటన ఎత్తుగడలు - సమకాలీన విప్లవోద్యమాలు

ఇవాళ్టి ప్రపంచంలో విప్లవ శక్తులు సాధించవలసిన ఐక్య సంఘటనకు ఏ ఎత్తుగడలు అనుసరించాలో లెనిన్ నుంచి నేర్చుకోవచ్చునంటున్నారు **కొండూరి వీరయ్య**

ఏప్రిల్ 22 లెనిన్ 150వ జయంతి. ఈ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు ఉద్యమానికి లెనిన్ సామ్రాజ్యవాద దశలోని పెట్టుబడిదారీ విధానాన్ని అర్ధం చేసుకోవడానికి మార్క్సిజాన్ని సృజనాత్మకంగా అన్వయించటంలో లెనిన్ సాగించిన విశేష ప్రజ్ఞ గురించి చర్చలు జరుగుతున్నాయి. లెనిన్ గుణగణాలు, త్యాగనిరతి, నిర్మాణదక్షత, సైద్ధాంతిక కృషి, సామ్రాజ్యవాద దశలో పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్గత వైరుధ్యం, సంపన్న దేశాల్లో విప్లవం రాకముందే ఓ వెనకబడిన దేశంలో విప్లవం సాధించటం, ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్యవాద దశకు చేరుకున్న సమయంలో ఒక దేశంలో సోషలిస్టు ఆర్ధిక వ్యవస్థ నిర్మాణం, విశ్వ విప్లవ వ్యూహానికీ వలస దేశాల విముక్తికి మధ్య ఉన్న సంబంధం వంటి అనేక అంశాల గురించి ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం, వామపక్ష శక్తులు మరోసారి మననం చేసుకోనున్నాయి. నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట అధ్యయనం అన్నది లెనినిజానికి పునాది. ఈ సూత్రాన్ని భౌతిక రాజకీయ పరిస్థితులను అధ్యయనం చేయటానికి, అంచనా వేయటానికి రాజకీయ వ్యూహాన్ని రూపొందించటానికి ఉపయోగించిన తీరు గురించి ఎన్నో ఉదాహరణలు చదివాం. విన్నాం. తెలుసుకున్నాం. ఈ నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట అధ్యయనం సూత్రాన్ని పార్టీ నిర్మాణం, ఎత్తుగడల విషయంలో లెనిన్ ఎలా అమలు చేశాడో ఈ సందర్భంగా పునఃశ్చరణ చేసుకోవటం సమకాలీన విప్లవోద్యమాలకు ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నాను.

ఐక్య సంఘటన నిర్మాణం, దానికి కావల్సిన ఎత్తుగడలు లెనినిజంలో ఓ కీలక భాగం. బోల్షివిక్ విప్లవంలో లెనిన్ జయప్రదంగా అనుసరించిన ఎత్తుగడలే నిర్దిష్ట పరిస్థితులను ఎంత నిర్దిష్టంగా అధ్యయనం చేయగల ఆయన సామర్థ్యానికి దర్పణం. ఈ ఎత్తుగడలు పార్టీలో ప్లెఖనోవ్, ట్రాట్స్కీ, ఆక్సెల్రాడ్, మార్టోవ్, కౌట్స్కీ, రోజా లగ్జెంబర్గ్ వంటి నేతలతో ఉన్న భిన్నాభిప్రాయాలను అధిగమించటం మొదలు నాటి వలస దేశాలు (నేటి వర్ధమాన దేశాలు) సోషలిస్టు శిబిరం మధ్య ఉండాల్సిన ఐక్య సంఘటన వరకు విస్తరించాయి. లెనిన్ అనుసరించిన ఐక్య సంఘటనలు ముక్కుసూటిగా ఎప్పుడూ లేవు అన్న చారిత్రక వాస్తవాన్ని మనం మర్చిపోరాదు. ఆయా దశల్లో విప్లవోద్యమంలో తలెత్తిన నిర్దిష్ట అవసరాల నేపథ్యంలో వివిధ మోతాదుల్లో, వివిధ స్థాయిల్లో ఈ ఐక్యసంఘటన ఎత్తుగడలు అమలు జరిగాయి. ఈ ఎత్తుగడల కాలవ్యవధి కూడా ఒకేరీతిగా లేదన్నది వాస్తవం. సామ్రాజ్యవాద స్వభావాన్ని గుత్తకు తీసుకున్న ద్రవ్య పెట్టుబడిదారీ (ప్రపంచీకరణ) దశలో వివిధ దేశాల్లోనూ ప్రత్యేకించి భారతదేశంలోనూ విప్లవోద్యమం పెట్టుబడిదారీ వ్యతిరేక శక్తుల ఐక్య సంఘటన నిర్మాణం దిశగా అడుగులు వేస్తున్న తరుణం ఇది. అందువల్లనే లెనిన్ నాయకత్వంలో రష్యన్ సోషల్ డెమొక్రటిక్ లేబర్ పార్టీ (బోల్షివిక్) వివిధ సందర్భాల్లో అనుసరించిన ఐక్యసంఘటన ఎత్తుగడలను, నాటి వాటి నేపథ్యాన్ని సంక్షిప్తంగా తెలుసుకునే ప్రయత్నం ఇది. నేటికీ పెట్టుబడిదారీ విధానం విశ్వవ్యాప్త విధానంగా ఎదిగినా కొన్ని దేశాలు ప్రజాతంత్ర విప్లవ దశ సాధన దశలోనే ఉండిపోయాయి. ఐక్య సంఘటన ఎత్తుగడల గురించిన గందరగోళం కార్మికవర్గ విప్లవ దశలో ఉన్న దేశాల్లో కంటే ప్రజాతంత్ర విప్లవ దశలో ఉన్న దేశాల్లో ఎక్కువగా ఉంది.

లెనిన్ రచనలను వల్లె వేయగల సామర్థ్యం ఉన్న నాయకత్వానికి భారత విప్లవోద్యమ ప్రస్థానంలో కొరత ఏమీ లేదు. ఏ రచనను అయినా ఆయా చారిత్రక రాజకీయ నేపథ్యం నుండి చూసినప్పుడు మాత్రమే సదరు రచయిత చెప్పదల్చుకున్న సారం పాఠకులకు అందుతుంది. మనం అధ్యయనం చేసేటప్పుడు ఈ మౌలిక సూత్రాన్ని తరచూ విస్మరిస్తూ ఉంటాము. అందుకే ఒకే పుస్తకంలోని ఒకే వాక్యం ఒక్కొక్కరికి ఒక్కోరకంగా అర్ధమవుతుంది. ప్రత్యేకించి మార్క్సిజాన్ని అధ్యయనం చేసేటప్పుడు 19,20 శతాబ్దాల నాటి మేధో చర్చలను విస్మరిస్తే మార్క్సిజం కూడా మనకు మరోలా కనపడుతుంది. అందుకే తొలితరం కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలు ఆధునిక యూరోపియన్ చరిత్ర, తత్వశాస్త్ర పరిణామం, అర్ధశాస్త్ర పరిణామక్రమం చదువుతూ మార్క్సిజాన్ని చదివారు కాబట్టి సారాన్ని వడపోసి ఆ మార్గదర్శనంలో ఉద్యమాలు నిర్మించగలిగారు.

పెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్యవాద దశలో ప్రవేశించినప్పుడు ప్రపంచ విముక్తి ఉద్యమం సాధించిన పెద్ద విజయమే బోల్షివిక్ విప్లవం. నాటి జారిస్టు రష్యాలోని నిర్దిష్ట పరిస్థితులకు మార్క్సిజాన్ని అన్వయించే ప్రయత్నంలో ఆయన సాగించిన నిర్దిష్ట అధ్యయన ఫలితమే సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ అన్న రచన. ఈ రచనను పూర్తి చేసే సందర్భంలో వచ్చిందే ప్రపంచ సామ్రాజ్యవాదపు గొలుసులో జారిస్టు రష్యా బలహీనమైన లింక్‌గా ఉందన్న నిర్ధారణ. కూడా. ఈ బలహీనమైన లింకును తెగ్గొట్టడమే అక్టోబర్ విప్లవానికి నాంది అన్న సూత్రీకరణ. ఈ కర్తవ్యాన్ని నెరవేర్చేందుకు బోల్షివిక్ పార్టీని సన్నద్ధం చేసే క్రమంలో లెనిన్ దఫదఫాలుగా వ్యూహం, ఎత్తుగడలు, నినాదాలు మార్చుకుంటూ వచ్చాడు. కొన్ని సందర్భాల్లో గతంలో తాను పూర్తిగా వ్యతిరేకించిన నినాదాలను సైతం విప్లవోద్యమ పురోగమనం ఆవశ్యకత దృష్ట్యా అంగీకరించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్యవాద దశకు చేరుకున్న సమయంలో ఒక దేశ విప్లవోద్యమం, కార్మికోద్యమంతో పాటు ప్రపంచ కార్మికోద్యమం సమస్యలు కూడా కీలక ప్రాధాన్యత సంతరించుకున్నాయి. లెనిన్ నాయకత్వంలో అటు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోనూ, దేశీయంగా రష్యాలోనూ అమలు జరిగిన వ్యూహం, ఎత్తుగడలు, పోరాట రూపాలు, మిత్రులు - శత్రువులను గుర్తించటం, వారి బలాబలాల గురించిన అంచనా, విప్లవ వ్యూహం వంటి వాటన్నింటినీ ఎప్పటికప్పుడు తాజా పర్చుకోవటంలో లెనిన్

పాటించిన ప్రమాణమే నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట అధ్యయనం. ప్రధానంగా 1905 నుండి 1917 వరకు లెనిన్ అనుసరించిన ఐక్యసంఘటన ఎత్తుగడలు, రష్యా విప్లవం, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం, వలస దేశాల విముక్తి ఉద్యమాలపై వాటి ప్రభావం తెలుసుకోటానికి కొన్ని ఉదాహరణలు, కొన్ని చారిత్రక అనుభవాలు పరిశీలిద్దాం.

ప్రజాతంత్ర విప్లవ దశలో ఐక్యసంఘటన ఎత్తుగడలు

ఏ సమాజంలోనైనా పాలక వర్గం సంఖ్యరీత్యా పరిమితమే. కానీ ఉత్పత్తి సాధనాలు, మార్కెట్‌పై వీళ్లదే పెత్తనం కావటంతో మొత్తం వ్యవస్థ వీళ్ల చెప్పు చేతల్లో ఉన్నట్లు, కనుసన్నల్లో నడుస్తున్నట్లు కనిపిస్తుంది. సమాజ స్వభావం మారే కొద్దీ ఈ పరిమిత సంఖ్యలో ఉన్న ఆధిపత్య వర్గం చేతుల్లో నుండి ఉత్పత్తి సాధనాలపై పెత్తనం కొత్త వర్గం చేతుల్లోకి చేరుతుంది. ఈ క్రమంలో ఆధిపత్య స్థానానికి రావాలని కాంక్షించే కొత్త వర్గం విశాల జనబాహుళ్యంతో జట్టు కట్టాల్సిన అవసరం సమాజ పురోగమనంలో తరచూ ముందుకొస్తుంది. భూస్వామ్య వ్యవస్థపై తిరగబడ్డ బూర్జువావర్గం అప్పటి వరకు భూస్వామ్య వర్గం చేతుల్లో నష్టపోయిన వారినందరినీ కూడగట్టిందన్నది ఆధునిక యూరప్ విప్లవాల చరిత్ర. బూర్జువా వర్గం ఓ సారి పాలకవర్గంగా అవతరించిన తర్వాత అప్పటి వరకు భూస్వామ్య వ్యవస్థపై పోరాటంలో తనతో జట్టుకట్టిన వారిని కూడా ఉపేక్షించదు. వాళ్లను కూడా దోపిడీ చేస్తుంది. ఈ దోపిడీ క్రమం రానురాను పెట్టుబడిదారీ వ్యవస్థ పరిధిలోనే అనేక ఉత్థానపతనాలతో సాగుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ పరిధిలో తన పట్టును నిలిపి ఉంచుకునేందుకు జరిగే అన్ని ప్రయత్నాలు, ప్రయోగాలు పూర్తయ్యాక ఓ నూతన దశలోకి ప్రవేశిస్తుంది. సామ్రాజ్యవాదం అటువంటి ఓ నూతన దోపిడీ చట్రం.

సామ్రాజ్యవాదం అంటేనే పీడితులపై సాగే దోపిడీ నూతన దశకు చేరటం. నూతన రూపాలు సంతరించుకోవటం. పెట్టుబడి ఆధిపత్యాన్ని బలయ్యే పీడితుల సంఖ్య కూడా విస్తరించటం. అంటే పెట్టుబడి ఆధిపత్యాన్ని వ్యతిరేకించాల్సిన శక్తుల సంఖ్య, ప్రభావం, సమాజంలో వారి శాతం పెరగటం. కొన్ని కొన్ని సందర్భాల్లో (ప్రత్యేకంగా పెట్టుబడిదారీ సంక్షోభాల సమయంలో) చిన్న చిన్న పెట్టుబడిదారులు, మధ్యతరగతి, వ్యాపారస్తులు, ధనిక రైతాంగం కూడా సామ్రాజ్యవాద దశకు చేరుకున్న గుత్త పెట్టుబడి ప్రభావానికి దివాళా తీస్తారు.

ఈ పరిణామం (పెట్టుబడి కారణంగా నష్టపోయిన ప్రజల సంఖ్య పెరగటం) మరోసారి ప్రజాతంత్ర కూటమి అవసరాన్ని ముందుకు తెస్తుంది. ఈ వాస్తవాన్ని తరచు కమ్యూనిస్టు ఉద్యమం విస్మరిస్తోంది. వీరంతా పెట్టుబడి కారణంగా దివాళా తీస్తున్నారు, నష్టపోతున్నారు కాబట్టి అనివార్యంగా పీడితుల్లోనే పీడితులైన కార్మికవర్గ స్వభావాన్ని సంతరించుకుంటారనీ, అందువల్ల కార్మికవర్గ పోరాటాలే ఏకైక లక్ష్యమని వాదిస్తారు. కానీ ఈ విధంగా నష్టపోతున్న వర్గాలు తమ మౌలిక వర్గ స్వభావాన్ని అంత తేలిగ్గా వదులుకోరనీ, సాధ్యమైనంత వరకు దోపిడీ వ్యవస్థ నిర్మాణంలోనే తమ స్థానాన్ని పట్టుకుని వేళ్లాడేందుకు గల అవకాశాలు వెతుక్కుంటారన్న వాస్తవాన్ని గుర్తించాలి. పెట్టుబడి ఆధిపత్యానికి బలై కొత్తగా పీడితుల కోవలో చేరే భిన్న సామాజిక తరగతుల నిర్దిష్ట పరిస్థితిని గమనించటంలో ఉండే ఈ ఏమరుపాటు పోరాటాలు, విప్లవ నినాదాల రూపకల్పనలో, తదనుగుణమైన ఎత్తుగడలు రూపొందించడంలో ఒంటెత్తుపోకడలకు దారితీస్తుంది.

ఈ ఏమరుపాటుకు గురికాకుండా ఉండాలంటే ప్రజాతంత్ర విప్లవ సమయంలోనే (1905 నాటి విప్లవం) లెనిన్‌కు, మెన్షివిక్కులకు, సోషలిస్టు రివల్యూషనరీలకు మధ్య జరిగిన మేథో సంవాదాన్ని పరిశీలించాలి. ఈచర్చల్లో లెనిన్ కూడా రివిజనిస్టు అన్న ముద్రను భరించక తప్పింది కాదు. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో రివిజనిజం గురించిన చర్చ గణనీయంగానే కనిపిస్తుంది. కాలక్రమంలో రివిజనిస్టులు అన్న పదం భిన్న మార్క్సిస్టు స్రవంతులకు చెందిన వారిని దుయ్యబట్టేందుకు వాడే సాధారణ పదంగా దిగజారింది. ఒకే ఉద్యమ నిర్మాణంలో ఉంటూ కూడా ఒకరికొకరు ఈ ముద్రలు వేసుకున్న సందర్భాలూ చూశాము. అందువల్ల ఎవరు, ఎవరికి ఈ బిరుదు ఇస్తున్నారు, దానికి ముందు ఇరుపక్షాల మధ్య ఉన్న సైద్ధాంతిక విబేధాలేమిటి అన్న విషయాలు లోతుగా తెలుసుకోకుండా ఒక నాయకుడు మీద ఉన్న గురుత్వ ధోరణితో ఆ నాయకుడు ఫలానా నాయకుడిని రివిజనిస్టు అనో లిక్విడేషనిస్టు అనో ముద్ర వేసినప్పుడు కార్యకర్తలు, పాఠకులు దాన్ని యథాతథంగా స్వీకరిస్తే అంతకన్నా విప్లవోద్యమానికి జరిగే నష్టం మరోటి ఉండదు. అందుకే కార్యకర్తలు, నాయకుల మధ్య గురుత్వ ధోరణి స్థానంలో గతితార్కిక సంబంధాలు ఉండేలా పార్టీ నిర్మాణం ఉండాలి. ఎందుకంటే రివిజనిస్టు, సామ్రాజ్యవాదుల ఏజెంట్ అన్న ముద్ర లెనిన్ లాంటి వాడికి కూడా తప్పలేదు.

1905 నాటి బూర్జువా ప్రజాతంత్ర విప్లవం సాధన కోసం ఐక్యసంఘటన ప్రతిపాదించినప్పుడు మెన్షివిక్కులు లెనిన్‌ను రివిజనిస్టుగా ముద్ర వేశారు. బూర్జువా ప్రజాతంత్ర విప్లవంలో కార్మిక వర్గానికి ఎటువంటి పాత్ర ఉండదన్నది వారి అవగాహన. బూర్జువా వర్గమే ఆ కర్తవ్యాన్ని జయప్రదంగా నిర్వహించుకుంటే తదనంతరం ఏర్పడే సమాజంలో ప్రశాంతంగా కార్మికవర్గ రాజకీయాలు నిర్వహించవచ్చన్నది మెన్షివిక్కుల అవగాహన. కాస్త భిన్నమైనది ట్రాట్స్కీ అవగాహన. శాశ్వత విప్లవ సాధన క్రమంలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవం ఓ తాత్కాలిక మజిలీ కాబట్టి దాని గురించి మనం పట్టించుకోనవసరం లేదనీ, శాశ్వత విప్లవం కోసమే కృషి చేయాలన్నది ఆయన ప్రతిపాదన. ఈ రెండు అవగాహనలకంటే భిన్నమైనది లెనిన్ అవగాహన. బూర్జువా ప్రజాతంత్ర విప్లవంలో కార్మికవర్గం భాగస్వామి కావటం ద్వారా దీర్ఘకాలంలో బూర్జువా విప్లవంపై కార్మికవర్గం ఆధిపత్యం సంపాదించడానికి అవకాశం ఉంటుందని లెనిన్ భావించాడు.

ఈ విమర్శలకు సమాధానంగా రెండు ఎత్తుగడలు అన్న లేఖలో సామ్రాజ్యవాద దశలో ఏ ఒక్కరమూ ప్రజాత్రంత్ర ఉద్యమాల నుండి ఒంటరి కాకూడదని హెచ్చరిస్తాడు. బూర్జువాతో సహా సమాజంలోని అన్ని వర్గాలు తరగతులతో ఈ దశలో కార్మికవర్గం సహకరించాలని ప్రతిపాదిస్తాడు. "ఇక్కడ మనకు మిగలిన వాళ్లకు ఉన్న తేడా ఒక్కటే. ఈ విప్లవోద్యమంలో మనం ఇతర విప్లవకారులతో పూర్తిగా విలీనమై మన ఉనికిని కోల్పోకుండా సమాంతరంగా నడుస్తాము. మెన్షివిక్కులు, సోషలిస్టు రివల్యూషనరీలు ఈ పోరాటంలో బూర్జువాలు, ఉదారవాదులతో కలిసి నడుస్తారు. ఇదే తేడా" అని గుర్తు చేస్తాడు. విశేషమేమంటే ఎత్తుగడలకు సంబంధించిన ఈ చర్చంతా కార్మికవర్గ పత్రికల్లోనే జరిగింది. తద్వారా నేరుగా కార్మికవర్గం ఈ చర్చలో భాగస్వామి అయ్యింది. తన అవగాహనను మరింత పటిష్టపరుస్తూ లెనిన్ కార్మికులు, రైతాంగం మధ్య ఐక్య సంఘటన ఎత్తుగడను ప్రతిపాదిస్తాడు. ఈ ఐక్యసంఘటనకు 1905 నాటి విప్లవంలో బీజాలు పడితే 1917 నాటి విప్లవం నాటికి ఈ ఐక్యసంఘటన పరిపక్వతను సాధించింది. బోల్షివిక్ విప్లవాన్ని విజయపథంలో నడిపించింది. ఫ్రాన్స్‌లో

వర్గపోరాటం, పారిస్ కమ్యూన్‌లను విశ్లేషించేటప్పుడు సూక్ష్మస్థాయిలో మార్క్స్, ఏంగెల్స్‌లు ఈ ఐక్యసంఘటనను ప్రతిపాదిస్తే లెనిన్ బోల్షివిక్ విప్లవంలో ఈ ఎత్తుగడకు పరిపూర్ణతను సంతరించి పెట్టాడు.

సామ్రాజ్యవాద వ్యతిరేక వలసవాద వ్యతిరేక ఐక్యసంఘటన

బోల్షివిక్ విప్లవం నూతన ప్రపంచాన్ని ఆవిష్కరించింది. సామ్రాజ్యవాద శక్తుల ఐక్యసంఘటనలో కొన్ని లింకులు తెగ్గొట్టగలిగింది. రష్యాలో కార్మిక కర్షక రాజ్యం ఆవిర్భావంతో పాటు నాటి వలస దేశాల్లో జరుగుతున్న విముక్తి ఉద్యమాలు సామ్రాజ్యవాద శక్తుల ఐక్యసంఘటనను బలహీనపర్చటంలో సఫలమయ్యాయి. వలస విముక్తి ఉద్యమాలు ప్రపంచవ్యాపిత స్వభావాన్ని సంతరించుకున్నాయి. సామ్రాజ్యవాదం ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక వర్గాన్నే కాక నేటి వర్ధమాన దేశాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధినీ ఆటంకపర్చింది. అందువల్లనే వలసవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న బూర్జువా ప్రజాతంత్ర విప్లవంలో ఆయా దేశాల బూర్జువావర్గం క్రియాశీల నాయకత్వ పాత్ర పోషించింది. ఈ దిశగా ఐక్యసంఘటన ఎత్తుగడలను అంతర్జాతీయం చేసే ప్రయత్నంలోనే మూడో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌లో లెనిన్ వలస దేశాల్లో విముక్తి ఉద్యమాల పట్ల తీసుకోవాల్సిన వైఖరి గురించిన సిద్ధాంత చర్చకు తెరతీశాడు. ఈ ఎత్తుగడలే భారత స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టుల పాత్రను విస్తరించటానికి దోహదం చేశాయి.

వలస దేశాల్లో సాగుతున్న విముక్తి ఉద్యమాలు బోల్షివిక్ విప్లవం నుండి స్ఫూర్తి పొందుతాయి. ఆయా దేశాల్లోని విముక్తి ఉద్యమాల ప్రతినిధులు, నాయకులు, ప్రజలు బోల్షివిక్ విప్లవానికి సంఘీభావం ప్రకటించారు. అనేక దేశాల నేతలు విప్లవ రష్యాలో పర్యటిస్తారు. ఈ పరిణామాలన్నింటినీ పరిశీలించిన లెనిన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అంతార్జాతీయ ఐక్య కూటమి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని భావించాడు. మూడో ఇంటర్నేషనల్ రెండో మహాసభలో వలసవాదం గురించి సిద్ధాంత పత్రాన్ని చర్చకు పెట్టాడు. ఈ చర్చలో వలస దేశాల్లోని శ్రామికవర్గ ప్రతినిధులు బూర్జువావర్గ ప్రతినిధులతో కలిసి విముక్తి ఉద్యమాల్లో పాల్గొనాలా లేదా అన్నదే ఈ చర్చలో ప్రధానాంశం. లెనిన్ ప్రతిపాదనలతో విబేధిస్తూ ఎం ఎన్ రాయ్ ఓ ప్రత్యామ్నాయ పత్రాన్ని ఈ సమావేశాల్లోనే ప్రతిపాదిస్తాడు.

కొన్ని వలస దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు తమ శక్తిని ఎక్కువగా ఊహించుకుని ప్రజాతంత్ర విప్లవంతో పని లేకుండా నేరుగా కార్మికవర్గ విప్లవం సాధించగలమన్న అవగాహనతో ఉండేవి. ఈ అంచనాలతో ఉన్న కమ్యూనిస్టు పార్టీలు చిన్న మధ్యతరగతి బూర్జువా వర్గాన్ని కూడా శతృశిబిరంలోకి నెట్టాయి. ఆయా దేశాల్లోని కమ్యూనిస్టు ఉద్యమం, ప్రజా చైతన్యం ఉన్న నిర్దిష్ట దశతో పాటు దోపిడీ సమాజ నిర్మాణంలో ఆయా వర్గాల స్థానం ఏమిటి, తక్షణం వారికున్న స్థానం ఏమిటన్నది అధ్యయనం చేయకుండా ఫలానా వర్గం మన విప్లవ వ్యూహంలో ఫలానా స్థానంలో ఉంది కాబట్టి లేదా వారికి ఊగిసలాట ఎక్కువ కాబట్టి వారి తక్షణ స్థితిలో ఎదురయ్యే నిర్దిష్ట డిమాండ్లకు మన విప్లవోద్యమంలో స్థానం లేదని వాదించాయి. ఈ క్రమం అనేక వలస దేశాల్లో కమ్యూనిస్టు ఉద్యమాలు జాతీయ ప్రధాన ఉద్యమ స్రవంతి నుండి వేరుపడి ఒంటరిగా మిగిలిపోయే పరిస్థితికి దారితీశాయి. ఏ దేశంలో ఏ స్థాయిలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవాలు చోటు చేసుకున్నా కమ్యూనిస్టులు, కార్మికవర్గం ఈ ఉద్యమాల్లో పాల్గొనాలన్నది లెనిన్ అవగాహన. తద్వారానే ఆయా దేశాలు భవిష్యత్తులో కార్మికవర్గ విప్లవ దశకు చేరుకున్నపుడు ప్రజాతంత్ర విప్లవ దశలో అనుసరించిన ఐక్యసంఘటన ఎత్తుగడల్లో నేర్చుకున్న పాఠాలే పెట్టుబడిగా మారతాయన్నది లెనిన్ ఆశాభావం. అందువల్లనే 1922లో మూడో ఇంటర్నేషనల్ నాల్గోమహాసభ సందర్భంగా వలస దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు స్వతంత్ర వర్గపోరాటాల నిర్మాణం పేరుతో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజాతంత్ర శక్తుల నాయకత్వంలో జరుగుతున్న పోరాటాల్లో పాలుపంచుకోక పోవటం దారుణమైన అవకాశవాదమని విమర్శిస్తాడు.

ఐక్యసంఘటన వ్యూహం – ఎత్తుగడలు

ఏ పేరుతో పిలవబడుతున్నా (వలసవాదం, సామ్రాజ్యవాదం, ప్రపంచీకరణ, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, ద్రవ్యపెట్టుబడి ప్రపంచీకరణ దశ వంటి పేర్లు) సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కొనేందుకు కమ్యూనిస్టులు విశాల ప్రాతిపదికన ఐక్యసంఘటన ఎత్తుగడలు అనుసరించాల్సిన పరిస్థితిని తెస్తుంది. ఈ విశాల శక్తులను సమీకరించలేకపోతే సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కోవటంలో కమ్యూనిస్టుల కృషి విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకెళ్లే దిశగా సాగదు. అన్ని దేశాల్లోనూ పాలకవర్గ కూటముల్లో సామ్రాజ్యవాదానికి అనుంగు మిత్రులు ఉంటారు. ఆయా దేశాల్లో పాలకవర్గ కూటమికి వ్యతిరేకంగా పోరాడేందుకు కూడా కమ్యూనిస్టులకు ఐక్య సంఘటన ఎత్తుగడలు అవసరం. బోల్షివిక్ విప్లవం నేపథ్యంలో ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ విప్లవోద్యమాలు పురివిప్పే అవకాశం ఉందన్న అంచనాల్లోని పొరపాట్లను గుర్తు చేస్తూ రాసిందే వామపక్ష కమ్యూనిజం : ఓ బాలారిష్టం అన్న లెనిన్ రచన. వలస దేశాల్లో ఎత్తుగడలు, వ్యూహానికి సంబంధించిన విషయాల్లో ఈ గ్రంథం ప్రామాణికమైనది. ఈ రచనలో ఐక్యసంఘటన ఎత్తుగడలు, రాజకీయ వ్యూహాలు, కార్మికవర్గ ప్రతినిదులు పార్లమెంట్‌లో ప్రవేశించాల్సిన అవసరం, ప్రవేశించాక చట్టసభల్లో అనుసరించాల్సిన ఎత్తుగడలు గురించిన చర్చ ఈ రచనలో కనిపిస్తుంది. వర్ధమాన దేశాల్లో అప్పుడే పురుడు పోసుకుంటున్న కమ్యూనిస్టు ఉద్యమం, శక్తులు బోల్షివిక్ విప్లవం స్ఫూర్తితో వలస దేశాల్లో కూడా కార్మిక వర్గ విప్లవానికి సన్నద్ధమవ్వాలన్న తప్పుడు అభిప్రాయాలకు గురికావటాన్నే లెనిన్ బాలారిష్టమని విశ్లేషిస్తాడు.

కమ్యూనిస్టు పార్టీలు వర్గపోరాటాల మీద కేంద్రీకరించే క్రమలో సాధారణంగా కొన్ని తప్పుడు అవగాహనలతో పొరపాట్లు చేస్తుంటాయని హెచ్చరిస్తాడు. ఈ పొరపాట్లలో ఎన్నికల్లో పాల్గొనరాదని నిర్ణయించటం, బూర్జువా పార్లమెంట్ వేదికల్లో పాలుపంచుకునే ప్రతిపాదనలు తిరస్కరించటం, ఇతర పార్టీలతో ఏ విధమైన ఐక్యసంఘటనలకు సిద్ధం కాకపోవటం, ప్రత్యేకించి బూర్జువా పార్టీలతో ఐక్య సంఘటనలకు సుతరామూ తిరస్కరించటం, పార్టీ స్వతంత్రత కాపాడుకోవడమన్న లక్ష్యాన్ని ముందుకు తెచ్చి భావసారూప్యత కలిగిన మిత్రులను సమీకరించుకోవటం పట్ల విముఖత ప్రదర్శించటం, అసలు రాజీ అంటేనే పార్టీని లిక్విడేషనిజం వైపు నడిపించటంగా ప్రచారం చేయటం వంటి పొరపాట్లు తరచు జరుగుతుంటాయని లెనిన్ క్రోడీకరించాడు. ఈ పొరపాట్లకు మూలం ఆయా దేశాల్లోని విప్లవోద్యమంలో మోహరించిన శక్తులు, వర్గాల బలాబలాలు, సంకీర్ణ నిర్మాణాల తీరుతెన్నులు, నిర్దిష్ట సమయంలో నిర్దిష్ట వర్గాల నిర్దిష్ట డిమాండ్లు, ఈ డిమాండ్ల సాధన కోసం జరిగే పోరాటం విప్లవోద్యమానికి దగ్గరగా తీసుకెళ్తుందా వంటి కీలక విషయాల పట్ల శాస్త్రీయ అవగాహన లేకపోవటమే. బోల్షివిక్‌తరహా విప్లవం సాధించాలన్న తపనలో అత్యుత్సాహం ప్రదర్శించే పార్టీలు ఒంటెత్తు పోకడలకు పాల్పడతాయని, ఎన్నికల రంగంలో సానుకూల

పరిస్థితులు ఏర్పడేందుకు అవకాశం ఉన్నా అందులో భాగస్వాములై ఆ పరిస్థితులను కార్మికోద్యమ విప్లవ పంథా దిశగా నడిపించటానికి ప్రయత్నం చేయరన్నది లెనిన్ విమర్శ.

జర్మనీలో రాజ్యాంగ సంస్కరణల గురించి వ్యాఖ్యానిస్తూ ఏంగెల్స్ జర్మనీ కమ్యూనిస్టులను విమర్శిస్తూ " జర్మన్ కమ్యూనిస్టులు చారిత్రక పరిణామ క్రమంలో అందుబాటులోకి వచ్చే మధ్యంతర విప్లవ దశల్లో భాగస్వాములు కావటానికి అంగీకరించరనీ, ఏకాఎకిన అంతిమ లక్ష్యమైన కార్మికవర్గ విప్లవం కోసం మాత్రమే పని చేస్తార"న్న వాక్యాలను వలస దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీలకు వర్తింపచేస్తాడు లెనిన్. కార్మికవర్గ విప్లవమే అంతిమ లక్ష్యం కదా అని కూర్చుంటే సదరు లక్ష్యసాధన దిశగా అడుగులు ముందుకేయటానికి బదులు మరింత దూరమవుతారని హెచ్చరించాడు.

బూర్జువా పార్టీలతో రాజీ-పోరాటం కమ్యూనిస్టు పార్టీలు అనుసరించాల్సిన ఎత్తుగడల గతితర్కమేనని వాదిస్తాడు లెనిన్. విప్లవ సాధన లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో బోల్షివిక్ పార్టీ రాజీ పడ్డ సందర్భాలను కూడా ఆయన వివరిస్తాడు. ఇందులో భాగంగా 1905 విప్లవయత్నం విఫలమయ్యాక 1906 ఏప్రిల్‌లో జరిగిన రష్యన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ నాల్గో మహాసభలో మెన్షివిక్కు బోల్షివిక్కు విభాగాలను విలీనం చేయటం ఓ ఉదాహరణగా మనకు కనిపిస్తుంది. ఈ విలీనాన్ని లెనిన్ వ్యక్తిగతంగా వ్యతిరేకించినా మహాసభ విలీనానికే మొగ్గు చూపుతుంది. ఈ మహాసభ గురించి జినోవీవ్ మరో సందర్భంలో మాట్లాడుతూ " దిగువనున్న ప్రజా శ్రేణుల నుండి వచ్చిన ఒత్తిడికి తలొగ్గి ఇరు పక్షాలు విలీనానికి అంగీకరించయా"ని చెప్తాడు. తర్వాత జరిగిన డ్యూమా ఎన్నికల్లో పాల్గొనరాదన్న నిర్ణయాన్ని లెనిన్ వ్యతిరేకించినప్పటికీ మెజారిటీ కేంద్ర కమిటీ ఎన్నికల బహిష్కరణకే సుముఖంగా ఉంటారు. చివరకు తొలి డ్యూమాలో కానిస్టిట్యూషనల్ డెమొక్రటిక్ పార్టీ ప్రధాన శక్తిగా అవతరించటంతో కేంద్ర కమిటీలోని మెన్షివిక్ బృందం తన పొరపాటును గుర్తిస్తుంది. ఈ విధంగా ప్రతి రాజీ సందర్భం విప్లవ శక్తులకు పాఠం నేర్చుకునే సందర్భమేనని లెనిన్ ఆచరణలో రుజువు చేశాడు. కొన్ని సందర్భాల్లో ఇటువంటి రాజీల కారణంగా ఆరెస్డీఎల్పీ నష్టపోయినా మెజారిటీ సందర్భాల్లో పురోగమించిందని, వర్గ శత్రువును బలహీనం చేయగలిగింది. పీడిత వర్గాలు జారిస్టు రష్యాను బోల్షివిక్ రష్యాగా మారుస్తుంది. ఇది లెనిన్ ఎత్తుగడల సాఫల్యత. దాని వెనక ఉన్న నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట అధ్యయనం. జర్మనీలో సోషల్ డెమొక్రాట్లు ఇతర ప్రజాతంత్ర శక్తులతో కలిసి పని చేయటానికి నిరాకరించిన సందర్భంలోనూ, ఇంగ్లాండ్‌లో లేబర్ పార్టీతో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేయటానికి తిరస్కరించిన సందర్భంలోనూ లెనిన్ ఆ పార్టీలను ఘాటుగా విమర్శిస్తాడు. రష్యాలో బోల్షివిక్కులు తీవ్రమైన ఊగిసలాటతో ఉన్న వారితో కూడా కలిసి పని చేశారని గుర్తు చేస్తాడు. జార్ నియంతృత్వానికి వ్యతిరేకంగా శైశవ దశలో ఉన్న రష్యా బూర్జువావర్గంతో రాజీ పడటానికి బోల్షివిక్ పార్టీ ఏనాడూ తిరస్కరించలేదన్న విషయాన్ని కూడా లెనిన్ ప్రస్తావిస్తాడు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఐక్య సంఘటన

ఈ ఐక్య సంఘటన ఎత్తుగడలే ఫాసిజంపై పోరాటంలో ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి ప్రధాన సాధనంగా మారాయి. సరైన పంథాలో ఐక్య సంఘటన ఎత్తుగడలు అమలు చేసిన అన్ని సందర్భాల్లోనూ, అన్ని దేశాల్లోనూ కమ్యూనిస్టు ఉద్యమం పురోగమించిందని చరిత్ర చెప్తోంది. 1920 దశకం నాటికి మొదలై 30 దశకం నాటికి తీవ్రరూపం దాల్చిన సామ్రాజ్యవాద సంక్షోభం ఫాసిజానికి పునాదులు వేసింది. ఫాసిజం ప్రమాదాన్ని ఎదుర్కోవటానికి అనుసరించాల్సిన ఎత్తుగడల విషయంలో కొమిన్‌టర్న్ సమావేశాల్లో వివిధ దేశాల పార్టీల మధ్య తీవ్ర భిన్నాభిప్రాయాలు తలెత్తాయి. ఈ పరిస్థితుల్లో లెనిన్ స్ఫూర్తితో క్లారా జెట్కిన్, టొగ్లియాట్టి, రజనీపామే దత్, డిమిట్రోవ్‌లు ఐక్యసంఘటన వ్యూహం, ఎత్తుగడల ప్రతిపాదనలు ముందుకు తెచ్చారు. క్లారా జెట్కిన్ మొదలు డిమిట్రోవ్ వరకు కొమిన్‌టర్న్ మహాసభలు ఫాసిస్టు వ్యతిరేక ఎత్తుగడల విషయంలో పెట్టిన ప్రతిపాదనలు అధ్యయనం చేయటమే ఓ ప్రత్యేక విశ్లేషణ అవుతుంది. కొమిన్‌టర్న్ ఆరో మహాసభల్లో జర్మన్ కమ్యూనిస్టు పార్టీ, జర్మన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీల మధ్య ఐక్యసంఘటనకు అంగీకారం కుదిరి ఉంటే రాజ్యాంగపరమైన సంక్షోభం తలెత్తేది కాదు, హిట్లర్ జర్మనీలో అధికారానికి వచ్చేవాడు కాదు అన్నది వాస్తవం. హిట్లర్ అధికారానికి రావటానికి ముందు ఈ రెండు పార్టీలకు వచ్చిన ఓట్లు సీట్లు కలిపి చూసుకుంటే నాజీ పార్టీకంటే ఎక్కువ ఉన్నాయి. జర్మన్ అనుభవాల తర్వాత మిగిలిన యూరోపియన్ దేశాలు, ప్రధానంగా ఇటలీ, ఫ్రాన్స్, స్పెయిన్లు ఐక్య సంఘటన ఎత్తుగడలను అమలు చేస్తాయి. ఫాసిజం రాజ్యాంగబద్ధంగా అధికారానికి వచ్చే అవకాశాలను కట్టడి చేశాయి.

చైనా, వియత్నాంల విముక్తి పోరాటాలు ఐక్య సంఘటన ఎత్తుగడల ప్రాధాన్యత గురించి మరిన్ని విలువైన పాఠాలు నేర్పుతున్నాయి. వివిధ దేశాల ప్రత్యేకతలు, ఆయా దేశాల్లో కమ్యూనిస్టు, సోషలిస్టు పార్టీల ఆవిర్భావంలో ఉన్న ముందు వెనకలు, వివిధ దేశాలపై వలసాధిపత్యంలో ఉన్న వ్యత్యాసాలు పరిగణనలోకి తీసుకోకుండా సరళరేఖ వంటి ఎత్తుగడలు సాధ్యమని చెప్పటం ఇక్కడ నా ఉద్దేశ్యం కాదు. భారతదేశంలో కూడా స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా ఉనికిలోకి వచ్చిన కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నాయకులందరూ తర్వాతి కాలంలో భారత కమ్యూనిస్టు పార్టీ నాయలకులయ్యారన్న విషయాన్ని మనం మర్చిపోకూడదు.

నేడున్న ప్రపంచం మక్కికి మక్కి లెనిన్ కాలం నాటిది కాదు. సామ్రాజ్యవాదం కూడా లెనిన్ నాటి కాలంలో ఉన్నంత నగ్నంగా లేదు. అదే విధంగా మితవాద ఫాసిస్టు శక్తులు కూడా 1920 దశకంలో ఉన్నంత స్థాయిలో నగ్నంగా నిరంకుశ విధానాలకు పాల్పడలేని రీతిలో రాజ్యంగ వ్యవస్థలు, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థల నడుమ నేటి ప్రపంచం ఉంది. పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంత నాజూకుగా, పారదర్శకంగా కనిపిస్తుందో అంత గాఢమైన దొంతరల నడుమ తన దోపిడీ స్వభావాన్ని దాచి ఉంచింది. లెనిన్ నాటికి ప్రపంచ దేశాలపై భౌతికాధిపత్యం కోసం బరితెగించిన ద్రవ్య పెట్టుబడి నేడు ప్రపంచీకరణ దశలో ప్రవేశించి ప్రపంచ దేశాలన్నింటిలోనూ తరతమ స్థాయిల్లో ఉత్పత్తి సంబంధాలను, ఉత్పత్తి శక్తుల అభివృద్ధినీ నియంత్రిస్తోంది. మరోవైపున సమాంతరంగా మితవాద నయా ఫాసిస్టు శక్తులు రూపంలో పాలకవర్గాలు దేశాల సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక జీవితంపై తమ గుత్తాధిపత్యాన్ని మరింత సంఘటితం చేసుకుంటున్నాయి. భారతదేశంలో జరుగుతున్న పరిణామాలు ఈ కోవకు చెందినవే. ఫాసిజం లక్షణాలు వ్యక్తీకరణలు వేర్వేరు దేశాల్లో వేర్వేరు రూపాల్లో కనిపిస్తాయి. ఆయా దేశాల సాంస్కృతిక వారసత్వం కూడా ఫాసిజానికి ప్రత్యేక లక్షణాలు అద్దటంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ పరిస్థితుల్లో ప్రపంచం ముందు, భారతదేశంలోనూ ముందుకొస్తున్న ఫాసిజం ప్రమాదాన్ని అధిగమించేందుకు ఐక్యసంఘటన ఎత్తుగడల దిశగా అడుగులు వేయటమే లెనిన్ 150వ జయంతి సందర్భంగా మనం అర్పించే నివాళి.

(రచయిత సీనియర్ పాత్రికేయులు) వీ

సామాజిక న్యాయానికి సుప్రీం గొడ్డలిపెట్టు

***రాజ్యాంగంలో ప్రవేశపెట్టిన సమానత్వం ప్రాథమిక హక్కయినప్పుడు ఆ లక్ష్యాన్ని సాధించే ఏ ఏర్పాటు అయినా కూడా ప్రాథమిక హక్కుల్లో భాగం అవుతుంది తప్ప ప్రభుత్వ దయా దాక్షిణ్యం కాదంటున్నారు* సతీష్ బైరెడ్డి**

ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు ఉత్తరాఖండ్‌కు సంబంధించిన ఒక కేసులో తీర్పును వెలువరిస్తూ ప్రమోషన్లలో కోటా, రిజర్వేషన్లు ప్రాథమిక హక్కు కాదని పేర్కొన్నది. ఏ రాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా ఆయా వెనుకబడిన సామాజిక వర్గాలకు ప్రధానంగా షెడ్యూల్ క్యాస్ట్, షెడ్యూల్ ట్రైబ్స్‌కు సంబంధించి వారి వెనుకబాటుతనాన్ని, పదోన్నతుల్లో వారికి చాలినంత ప్రాతినిధ్యం లభించడం లేదని నిరూపించే లెక్కల వివరాలు ఉంటే తప్ప రిజర్వేషన్స్ అందించమని ఒత్తిడి చేయజాలమని స్పష్టం చేసింది. పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వాల విచక్షణాధికారం కిందికే వస్తుంది కానీ రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల కిందికి రాదని సర్వోన్నత న్యాయస్థాన ధర్మాసనం తీర్పును వెలువరించడం దేశవ్యాప్తంగా రిజర్వేషన్ల రాజ్యాంగ బద్ధత పైన తీవ్రమైన చర్చకు దారి తీసింది. రాజ్యాంగబద్ధతతో పాటు భారతీయ సామాజిక వ్యవస్థ పునాది స్వభావ స్పృహను కోర్టు ప్రదర్శించ లేదనే విమర్శలు తీవ్రంగానే వినిపిస్తున్నాయి.

ఈ తీర్పుతో రిజర్వేషన్లు రాజ్యాంగ బద్ధమైన హక్కుగా కాకుండా పాలకవర్గాల భిక్షగా, వారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి, సామాజిక న్యాయ సాధనలో ఉపకరణం అయిన రిజర్వేషన్ల అంశాన్ని పలుచన చేసే ప్రయత్నంలా ఉన్నదనే భావన బలంగానే కలుగుతున్నది. అంతరాల సామాజిక వ్యవస్థలో శతాబ్దాలుగా సామాజిక వివక్షకు, పీడనకు గురైన బహుజన సామాజిక సమూహాలకు సమున్నతమైన స్థాయిని అందించే సుదీర్ఘమైన, విస్తృతమైన గొప్ప లక్ష్యసాధనలో భాగమైన అనేక అంశాలను రాజ్యాంగంలో పొందుపరచడం జరిగింది. రాజ్యాంగంలో మూడవ భాగంలో ఆర్టికల్ 14 నుండి ఆర్టికల్ 30 వరకు ప్రాథమిక హక్కులను తెలియపరిచేవే. చట్టం ముందు అందరూ సమానులే అని 14వ ఆర్టికల్, వివక్షలను నిషేధించిన ఆర్టికల్ 15, అందరికీ సమాన హక్కుల ప్రాతిపదికన అవకాశాలను అందించాలన్న 16 (1), ఉద్యోగ నియామక అంశాల్లో ఎలాంటి వివక్ష చూపరాదన్న 16(2), విద్యాలయాల్లో ప్రవేశాన్ని ఏ విధమైన వివక్షతతో నిరాకరించకూడదని 29(2) ఆర్టికల్ స్పష్టం చేస్తున్నది. అదే మూడవ భాగం లోని 16(4) ఆర్టికల్ ప్రకారం ప్రభుత్వం ఏ సామాజిక సమూహానికైనా వెనుకబాటుతనం ప్రాతిపదికన రిజర్వేషన్లను కల్పించడాన్ని మరే ఇతర ఆర్టికల్స్ అడ్డుకోజాలవని పేర్కొనబడింది.

335 ఆర్టికల్ అయితే షెడ్యూలు కులాలు, తెగలకు మిగతా వర్గాలతో సమాన స్థాయిని ఉపాధి ఉద్యోగ రంగంలో కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిర్దేశిస్తున్నది. 15(4),16(4) ఆర్టికల్స్ సమానత్వాన్ని నిర్దేశించే మరే ఇతర ప్రకరణలు కూడా చారిత్రకంగా సామాజిక, విద్యాపరమైన వెనుకబాటుతనానికి గురైన వర్గాలకు రిజర్వేషన్లను కల్పించడాన్ని నిరోధింప జాలవు అని విస్పష్టంగా పేర్కొంటున్నవి. 16(4ఎ) ఆర్టికల్లో అయితే ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు ఎంతకాలం అయితే సముచితమైన, చాలినంత ప్రాతినిధ్యం ఉద్యోగ రంగంలో లభించదో అంతకాలం పదోన్నతుల్లో రిజర్వేషన్లు కొనసాగుతాయని పేర్కొనబడింది.

శతాబ్దాలుగా భారతీయ సమాజంలో వ్యవస్థీకృతమైన సామాజిక అంతరాలు, పీడన, పుట్టుకతోనే మనుషుల్ని వర్గీకరించి కొన్ని సమూహాలని అంటరాని తనానికి గురిచేసి మరికొన్ని శ్రేణులకు అనేక వృత్తులను అంటగట్టి వాటికి నీచత్వాన్ని ఆపాదించి మిగతా కొద్దిపాటి సామాజిక సమూహాలు అన్ని జీవన రంగాల్లో పెత్తనాన్ని చెలాయించడమే కాకుండా అధికారం, సంపద, జ్ఞానం వంటి వాటిని ఉత్పత్తి వర్గాలకు దక్కనీయకుండా చేశాయి. ఇంతగా వేళ్లూనుకునిపోయిన సామాజిక అంతరాలను అంతమొందించి, సమానత్వాన్ని సాధించడానికి రిజర్వేషన్లు అనే పనిముట్టును రాజ్యాంగంలో ప్రవేశపెట్టడం జరిగింది. సమానత్వం ప్రాథమిక హక్కు అయినప్పుడు ఆ లక్ష్యాన్ని సాధించే, సామాజిక న్యాయాన్ని అందించే ఏ ఏర్పాటు అయినా కూడా ప్రాథమిక హక్కుల్లో భాగం అవుతుంది తప్ప ప్రభుత్వాల దయా దాక్షిణ్యపు చర్య కాజాలదు.

సుప్రీంకోర్టు తీర్పు సరిగ్గా సమానత్వ లక్ష్యానికి, సామాజిక న్యాయ భావనకు గొడ్డలి పెట్టుగా ఉన్నది. 16(4),16(4ఎ) ప్రకరణలు ద్వారా పదోన్నతుల్లో రిజర్వేషన్లు పొందడాన్ని ప్రాథమిక హక్కుల్లో భాగమని భావించకూడదని ఉన్నత న్యాయస్థానం పేర్కొన్నది. ప్రభుత్వాలు మాత్రమే తీసుకోవాల్సిన నిర్ణయం అని రిజర్వేషన్లు కల్పించాలనే అనివార్య స్థితిలోకి వాటిని నెట్టివేయలేమని అని కూడా పేర్కొన్నది. ఒకవేళ రిజర్వేషన్లు కల్పించడం అనివార్యమైతే ఆయా వర్గాలకు తగినంత ప్రాతినిధ్యం లభించలేదనే ఖచ్చితమైన గణాంకాలను తేల్చాకే అలా చేయవచ్చని కూడా కోర్టు తీర్పునిచ్చింది. అందుకే తక్షణమే తాము ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని రిజర్వేషన్లను పాటించమని ఆదేశించ జాలమని కూడా పేర్కొన్నది. నిజానికి నాగరాజు వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా 2006 కేసు తీర్పు ద్వారానే ప్రమోషన్లలో రిజర్వేషన్లు పాటించకూడదు అని పేర్కొన్నది. పదోన్నతుల్లో రిజర్వేషన్లు విధానం పాటించాలంటే ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు ఉద్యోగాలు పొందడంలో న్యాయం జరగలేదని, ఇంకా వెనుకబాటుతనంలో ఉన్నారని, వారి వాటా వారికి దక్కలేదనే గణాంకాలు తేలితేనే ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించవచ్చని తీర్పులో ప్రకటించింది. క్రిమిలేయర్ భావనకు పునాదులు వేసింది కూడా ఈ తీర్పే. ఈ తీర్పు నేపథ్యంలో రాజ్యాంగ సవరణ 77 ద్వారా 16(4ఎ)ను ప్రవేశపెట్టి ప్రమోషన్లలో రిజర్వేషన్ల నిబంధనను పొందుపరిచారు. 81వ

సవరణ ద్వారా వారికి కేటాయించిన ఉద్యోగ ఖాళీలు భర్తీ కాని సందర్భంలో వాటిని ఇతర వర్గాల వారికి కేటాయించే వీలులేకుండా, మొత్తం 50 శాతం మాత్రమే రిజర్వేషన్ అనే నియమం వర్తించకుండా నిబంధనలు ఏర్పరచడం జరిగింది. ఉత్తరాఖండ్ ప్రభుత్వం పబ్లిక్ వర్క్స్ శాఖలో సహాయక ఇంజనీర్స్ నియామకాలకై రిజర్వేషన్ల ప్రమేయం లేకుండానే ప్రకటన విడుదల చేయడం దానిని ఉత్తరాఖండ్ హైకోర్టులో సవాలు చేయడం ఆ నియామక ప్రకటన చెల్లదని కూడా 2012లో ఉత్తరాఖండ్ హైకోర్టు తీర్పునివ్వడం జరిగింది. ఈ తీర్పును బిజెపి ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాల్ చెయ్యడం ద్వారా సుప్రీంకోర్టు ఇంత ప్రమాదకరమైన తీర్పునిచ్చింది.

సుప్రీం కోర్టు తన తీర్పులో విస్పష్టంగా ప్రకటించిన అంశాలు రెండు. గణాంకాల ఆధారాలతో ఆయా వర్గాల వెనుకబాటుతనాన్ని, ఉద్యోగ రంగంలో చాలినంత ప్రాతినిధ్యం లభించలేదనే వివరాలు ఉంటేనే రిజర్వేషన్లు ప్రకటించవచ్చునని, 16(4) 16 (4ఎ) అధికారం కల్పించే నిబంధనలు(ఎనాబ్లింగ్ ప్రొవిసన్స్) మాత్రమే అని ప్రాథమిక హక్కులకు సంబంధించిన అంశం కాదని, పరిస్థితులు అనివార్యమైతేనే రిజర్వేషన్లు కల్పించే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది తప్ప తాము ఆదేశించాలమని చెప్పింది. ఇలా వ్యాఖ్యానించడం మొత్తం సామాజిక న్యాయ భావన పురోగమనానికి ఎదురుదెబ్బ. రిజర్వేషన్ల విధానాన్ని గందరగోళపరిచి అనిశ్చితిలోకి నెట్టివేసేలా ఉన్నది. వెనుకబాటుతనపు గణాంకాల సాక్షాలు అనే అంశాన్ని ప్రభుత్వాలకు వదిలివేయాలి అనటం సుప్రీంకోర్టు ఆయా వర్గాలకు ఇప్పటికే చాలినంత న్యాయం జరిగిందని భావిస్తున్నట్టు అనుకోవాల్సి వస్తుంది.

నిజానికి ఎప్పుడో బ్రిటిష్ వాళ్ల కాలంలో 1935లో కుల ఆధారిత జనగణన జరిగింది కానీ ఏనాడు నేటి వరకు ఏ ప్రభుత్వము కూడా అటువంటి చర్యకు ఉపక్రమించలేదు. అసలు సుప్రీంకోర్టు పేర్కొన్న "పరిమాణాత్మక సమాచారం" అనే అంశం అంటూ రాజ్యాంగంలో ఎక్కడా లేదు. ఇంతా చేస్తే 70 ఏళ్ల 'స్వతంత్ర' భారతంలో ఎస్‌సి ఎస్‌టి వర్గాలకు ఉద్యోగాల్లో దక్కిన వాటా కేవలం మూడు శాతం మాత్రమే. పాలనా సమర్థతను దెబ్బతీసేలా రిజర్వేషన్లు ఉండరాదనే సుప్రీంకోర్టు వ్యాఖ్యలు మొత్తంగా ఈ వర్గాలు ఉద్యోగస్వామ్యంలో భాగం అవ్వడం వలన పాలనా నాణ్యత తగ్గుతుందనేల ఉండటం తీవ్ర అభ్యంతరకరమైనదే కాదు, రాజ్యాంగ విరుద్ధమైనది కూడా. ఏ రాష్ట్ర కేసులోనైతే తీర్పు చెప్పిందో సుప్రీంకోర్టు ఆ రాష్ట్రంలోనే 18 శాతం ఎస్‌సి జనాభా ఉన్నది.

అస్పృశ్యతను పాటిస్తున్న రాష్ట్రాల్లో అదే ఉత్తరాఖండ్ మొదటి వరుసలో ఉన్నది. అమిత్ తోరట్ అనే విద్యావేత్త ఇటీవలి కాలంలో జరిపిన సర్వేలో ఆ రాష్ట్రంలో 47 శాతం మంది ఇంకా అంటరానితనాన్ని పాటిస్తున్నట్టు అంగీకరించారు. అగ్రకులాలుగా చెప్పబడుతున్న వాళ్లలో సగానికిపైగా ఈ నేరపూరిత ఆచరణ కొనసాగుతున్నదని అంగీకరించారు. బ్రాహ్మణులలో గ్రామీణ ప్రాంతాల్లో 68 శాతం, పట్టణ ప్రాంతాల్లో 77 శాతం ఇంకా ఈ దుర్మార్గాన్ని కొనసాగిస్తున్నట్టు ఒప్పుకున్నారు. ఇలాంటి అమానవీయ సామాజిక స్థితి ఇంకా కొనసాగుతుంటే దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో రిజర్వేషన్ కొటాలో నిండాల్సిన ఉద్యోగ ఖాళీలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. భూమి లేనివారు, ఇల్లు లేని వారు, పౌర హక్కులు నిరాకరించబడిన వారు, నిరక్షరాస్యులు, కడు పేదలు పౌష్టికాహారం లభించని వారు, సామాజిక వెలికి, అత్యాచారాలకు గురైనవారు మెజారిటీగా దళిత సమూహమే అనే సత్యం కాదనలేనిది. దేశంలో మొత్తం దళిత జనాభా 17 శాతం వరకు ఉంటే ఈ దేశ సంపదలో కేవలం ఐదు శాతం మాత్రమే వారి చేతుల్లో ఉంది. దేశంలోని మొత్తం వ్యవసాయ రంగంలో దళితుల వాటా కేవలం ఐదు శాతం మాత్రమే. మొత్తం దేశ సహజ సంపదలో ఆధిపత్య కులాల వాటా 39 శాతం, మొత్తం భూమిలో 41 శాతం, భవన సముదాయాల సంపద 39 శాతం. పట్టణ ప్రాంతాలలో మొత్తం సంపదలో నాలుగు శాతం, ఆరు శాతం భూమి, 2.6 శాతం భవన సముదాయాలు దళితుల చేతుల్లో ఉన్నాయి. 45 శాతం భూమి, 76 శాతం బిల్డింగులు అగ్ర కులాల ఆధీనంలో ఉన్నాయి. జనాభాలో 21 శాతం ఉన్న అగ్రకులాల చేతుల్లో ఎంత ఎక్కువ సంపద పోగయ్యిందో అర్థం అవుతుంది.

ఉన్నత విద్యా రంగంలో ప్రవేశించిన దళితులు 20 శాతం మాత్రమే. అదే ఆధిపత్య కులాల వాటా 43 శాతం. 'అంటరాని' కులంలో పుట్టిన వారందరినీ బానిసలుగా భావించి 'ఉన్నత' కులాలకు ఊడిగం చేయించిన శతాబ్దాల చారిత్రక వాస్తవం మరుగునపడేది కాదు కదా. ఇప్పటికీ మనుషుల మలమూత్రాలను చేతులతో(మాన్యువల్ స్కావెంజింగ్) ఎత్తి పోస్తున్నది ఎవరో లోకానికంతా తెలుసు! మునిసిపాలిటీ మురికి కూపాలను శుభ్రపరుస్తున్న లక్షలాది కార్మికులంతా ఏ సామాజిక సమూహాల నుండి వచ్చారో వేరే చెప్పాల్సిన అవసరం లేదు. అప్పటికే సామాజిక న్యాయం జరిగింది అన్నట్టు సుప్రీం కోర్టు ప్రాథమిక హక్కుల్లో భాగమైన రిజర్వేషన్లను పాలక వర్గాల దయాదాక్షిణ్యాలపై వదిలేస్తే ఎలా?

ఇటీవల వస్తున్న సుప్రీంకోర్టు తీర్పులు, వ్యాఖ్యానాలు సామాజిక న్యాయ ఉద్యమ స్ఫూర్తిని, రాజ్యాంగ లక్ష్యాలను కాలరాసే విధంగా ఉంటున్నవి. ఎస్‌సి ఎస్‌టిలపై అత్యాచారాల నిరోధక చట్టాన్ని నీరుగార్చేలా ఇచ్చిన తీర్పు, గతంలో ప్రమోషన్లలో రిజర్వేషన్లు రద్దు, క్రిమిలేయర్ వంటివి ఆ కోవలోకి చెందినవే. రిజర్వేషన్లను అందించడం ద్వారా పాలనా దక్షిత పలచబడి పోకుండా చూసుకోవాలని వ్యాఖ్యానించడం, బయట సమాజంలో రిజర్వేషన్ల హక్కును వ్యతిరేకిస్తూ ప్రతిభ పాడైపోతుందని మాట్లాడే ఆధిపత్య, బ్రాహ్మణీయ శక్తుల వ్యాఖ్యల వంటివే. అవకాశాలను నిరాకరించిన వ్యవస్థే ప్రతిభ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉంటుంది. వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకొని ఆధిపత్యం చేస్తు దాన్నే ప్రతిభ అనుకోవడం ముమ్మాటికీ మెజారిటీ ప్రజల ఉత్పత్తి ప్రతిభను, స్వాభిమానాన్ని తీవ్రంగా అవమానించడమే. ఆధిపత్య కులాలు ఏర్పరచిన ప్రత్యేకించి బ్రాహ్మణీయ తాత్వికత రాజ్యమేలే సమాజంలో వారి విలువల ఆధారంగా ప్రతిభను కొలవడం, అంచనా వేయడం దుర్మార్గమైనది. శతాబ్దాలుగా తమ శ్రమ ప్రతిభతో సమస్త రంగాల్లో రాణించి సకల సంపదలను కూడేస్తే ఆ శ్రమను దోచే వర్గాలు వారి ప్రతిభకు మార్కులు ఇవ్వడం, తీర్పు ఇవ్వడం పెద్ద సామాజిక నేరం. ప్రకృతిని పరిరక్షించడంలోనూ సంపద సృష్టించడంతో పాటు ప్రకృతికి మనిషికి గాఢమైన సజీవ సంబంధాన్ని ఏర్పరచింది ఈ దేశపు మూలవాసులు. వారిని పాలనకు దూరంగా నెట్టివేసి రాజ్యాధికారం తమ చెప్పుచేతుల్లో పెట్టుకున్న వర్గాల దయా దాక్షిణ్యాల పైన రిజర్వేషన్ల హక్కును వదిలివేయడం అంటేనే సుప్రీం కోర్ట్ ఏ భావజాలాన్ని వంటబట్టించుకున్నది, ఎవరివైపు నిలబడుతుందో అర్థం అవుతున్నది. సామాజిక అసమానత్వాన్ని పెంచి పోషించిన కుల వ్యవస్థలో

జైలుకు వెళ్లేముందు ఆనంద్ తేల్తుంబ్డే లేఖ

బిజెపి – ఆర్‌ఎస్‌ఎస్ కూటమి, దానికి ఊడిగం చేస్తున్న ప్రచార సాధనాలు సాగిస్తున్న ఉద్దేశపూర్వక రణగొణ ధ్వనిలో నా ఈ లేఖ పూర్తిగా మునిగిపోతుందని నాకు తెలుసు. అయినా నాకు మరొక అవకాశం దొరుకుతుందో లేదో తెలియని స్థితిలో మీతో మాట్లాడడం అవసరమనే అనుకుంటున్నాను.

ఆగస్ట్ 2018లో గోవా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజిమెంట్ అధ్యాపకుల గృహ సముదాయంలో ఉన్న నా ఇంటి మీద పోలీసులు దాడి చేసినప్పటి నుంచి నా ప్రపంచం పూర్తిగా తలకిందులైపోయింది. నా జీవితంలో ఇటువంటి ఘటనలు జరుగుతాయని నేను నా అతి ఘోరమైన పీడకలలో కూడ ఊహించలేదు. నా ప్రసంగాల నిర్వాహకులను, ముఖ్యంగా విశ్వవిద్యాలయాలను, పోలీసులు ప్రశ్నిస్తున్నారని, నాగురించి దర్యాప్తు చేస్తూ బెదిరిస్తున్నారని నాకు అప్పటికే తెలిసినప్పటికీ, వాళ్లు నా సోదరుడి గురించి వెతుకుతూ పొరపాటున నా వెంట పడుతున్నారని అనుకున్నాను. నా సోదరుడు ఎన్నో సంవత్సరాల కిందనే మా కుటుంబం వదిలి వెళ్లిపోయాడు. నేను ఖరగ్‌పూర్ ఐఐటిలో అధ్యాపకుడిగా ఉన్నప్పుడు ఒక బిఎస్ఎన్ఎల్ అధికారి నాకు ఫోన్ చేసి నా అభిమానిననీ, శ్రేయోభిలాషిననీ పరిచయం చేసుకుని, నా ఫోన్ మీద నిఘా ఉందని తెలియజేశాడు. నేనాయనకు కృతజ్ఞతలు చెప్పాను గాని దాని గురించి ఏమీ చేయలేదు. చివరికి నా సిమ్ కార్డ్ కూడ మార్చలేదు. ఈ చొరబాట్ల గురించి నేను ఆందోళనపడ్డాను గాని ఎన్ని దర్యాప్తులు చేసుకున్నా నేను ఒక సాధారణ వ్యక్తిననీ, నా ప్రవర్తనలో చట్ట వ్యతిరేకత ఏమీ లేదనీ పోలీసులే అర్థం చేసుకుంటారని అనుకుని ఊరుకున్నాను. పౌరహక్కుల కార్యకర్తలు పోలీసులను ప్రశ్నిస్తారు గనుక సాధారణంగా పౌరహక్కుల కార్యకర్తల పట్ల పోలీసులు కన్నెర్ర వహిస్తారని, నేను కూడ ఎంతో కొంత పౌరహక్కుల కృషిలో ఉన్నందువల్ల పోలీసులు ఇలా చేస్తున్నారని నేననుకున్నాను. అయితే నా ఉద్యోగ విధుల్లోనే కాలమంతా కరిగిపోతుండడం వల్ల నేను ఆ పౌరహక్కుల పని కూడ సరిగ్గా చేయడం లేదని పోలీసులు తెలుసుకుంటారులే అనుకుని సంతృప్తి పడ్డాను.

కాని ఒకరోజు పొద్దున్నే మా ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ నాకు ఫోన్ చేసి పోలీసులు క్యాంపస్ మీద దాడి చేశారని, నాకోసం వెతుకుతున్నారని చెప్పినప్పుడు కొన్ని క్షణాలపాటు నేను అవాక్కయ్యాను. కొద్ది గంటల కిందనే అధికారిక కార్యక్రమం మీదనే నేను ముంబాయి వచ్చాను. నా భార్య అంతకుముందే ముంబాయి వచ్చి ఉంది. ఆ రోజే కొందరు వ్యక్తుల ఇళ్ల మీద దాడులు జరిగాయని, వారిని అరెస్టు చేశారని నాకు తెలిసినప్పుడు, నేను వెంట్రుక వాసిలో అరెస్టు తప్పించుకున్నానని తెలిసి వణికిపోయాను. పోలీసులకు నేను ఎక్కడున్నానో తెలుసు, నన్ను కూడ అరెస్టు చేయగలిగి ఉండేవారే, కాని కారణాలేమిటో వాళ్లకే తెలియాలి గాని ఆ పని చేయలేదు. పోలీసులు మా యూనివర్సిటీ సెక్యూరిటీ గార్డ్ దగ్గరినుంచి బలవంతాన డుప్లికేట్ తాళం చెవి తీసుకుని మా ఇల్లు తెరిచారు. లోపల వీడియో రికార్డ్ చేసి మళ్లీ తాళం వేశామంటున్నారు. ఇక అప్పటి నుంచి మా ఇక్కట్లు మొదలయ్యాయి. మా న్యాయవాదుల సలహా మేరకు, నా భార్య వెంటనే గోవా వెళ్లి మేం ఇంట్లో లేని సమయంలో పోలీసులు మా ఇంటి తాళం తెరిచి లోపలికి వెళ్లారని, వారు లోపల ఏవైనా వస్తువులు పెట్టి ఉంటే మేము బాధ్యత వహించబోమని గోవాలోని బిచోలిం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు దాఖలు చేసింది. పోలీసులు దర్యాప్తు జరపదలచుకుంటే మాకు ఫోన్ చేయవచ్చునని మా ఫోన్ నంబర్లు ఇచ్చి వచ్చింది.

ఆశ్చర్యకరంగా, పోలీసులు ఆ వెంటనే పత్రికా సమావేశాలు ఏర్పాటు చేసి, మావోయిస్టులతో సంబంధాల కథలు చెప్పడం మొదలుపెట్టారు. తాము చెప్పిందల్లా రాసే, వినిపించే ప్రచార సాధనాల సహాయంతో నాకూ, ఇతర నిర్బంధితులకూ వ్యతిరేకంగా ప్రజల్లో దుష్ప్రచారం సాగించడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారనేది స్పష్టమయింది. 2018 ఆగస్ట్ 31న అటువంటి ఒక పత్రికా సమావేశంలో ఒక పోలీసు అధికారి ఒక ఉత్తరం చదివి వినిపించాడు. అది అంతకు ముందు నిర్బంధించిన వారిలో ఒకరి కంప్యూటర్‌లో దొరికిందని అన్నారు. ఆ ఉత్తరాన్ని నా మీద సాక్ష్యంగా చెప్పారు. అడ్డగోలుగా రాయబడిన ఆ ఉత్తరంలో నేను

సమానత్వాన్ని ప్రాథమిక హక్కుగా రాజ్యాంగంలో చేర్చి సమానత్వ లక్ష్య సాధనంగా రిజర్వేషన్లు ఏర్పరచటం ప్రాథమిక హక్కుల్లో భాగమే అవుతుంది. ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఆమోదయోగ్యం కాకపోతే సమానత్వ హక్కును కూడా ప్రాథమిక హక్కుగా ఆమోదించినట్లేనా!? సామాజిక న్యాయం, ఆర్థిక రాజకీయ ఎదుగుదల, సౌభ్రాతృత్వం, స్వాభిమానంతో జీవించేలా రాజ్యవ్యవస్థ పరిస్థితులను కల్పించాలని రాజ్యాంగంలోని 38వ ఆర్టికల్ నిర్దేశిస్తున్నది.

సమాజంలోని అన్ని వర్గాలకు ప్రత్యేకించి చారిత్రకంగా అన్యాయానికి గురైన వారికి ప్రత్యేక హక్కులు కల్పించి వారి ఊర్ధ్వ ముఖ ఎదుగుదల ఉండేలా చేస్తూ, పాలనా వ్యవస్థలో భాగం చేయడం ద్వారానే దానికొక సమ్మిలిత స్వభావం చేకూరి సమానత్వం సాధ్యమవుతుంది. సరిగ్గా ఈ ప్రక్రియనే బంగపరిచేలా, ధ్వంసం అయ్యేలా సుప్రీం తీర్పు పరిణమించింది. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ ధర్మాసనానికి అప్పీలు చేయడం అనే అంశాన్ని పరిశీలిస్తూనే శాసన పరమైన చర్యలు చేపట్టడానికి రాజకీయ సంకల్పాన్ని ప్రదర్శించాలి. రిజర్వేషన్లు ఏవో కొన్ని సమూహాలకి, వ్యక్తులకు ఇవ్వబడిన విడి విడి హక్కులు మాత్రమే కావు మొత్తం సమాజ పరివర్తనకై, సామాజిక సమానత్వ లక్ష్య సాధనకై భారత ప్రజలు తమకు తాము భుజాల మీద వేసుకున్న బృహత్తర బాధ్యత. అగ్రకుల పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం ప్రదర్శించిన పట్టుదల, ఉబలాటాన్ని అంతకంటె ఎక్కువ ప్రధానమైన రాజ్యాంగ లక్ష్యమైన, మానవీయ సమాజపు చారిత్రక అవసరమైన సమానత్వాన్ని సాధించే రిజర్వేషన్లను కాపాడటంలో ప్రదర్శించాలి.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

హాజరైన ఒక అంతర్జాతీయ విద్యా సంబంధమైన సదస్సు ప్రస్తావన ఉంది. అమెరికన్ యూనివర్సిటీ ఆఫ్ పారిస్ వెబ్ సైట్ మీద ఆ సదస్సు సమాచారమంతా ఉంటుంది. ఆ తప్పుడు ఆరోపణ విని మొదట నేను నవ్వేశాను. కాని ఆ తర్వాత ఆ పోలీసు అధికారి మీద సివిల్, క్రిమినల్ పరువు నష్టం దావా వేయడానికి నిర్ణయించుకుని, ఆ దావా వేయడానికి అనుమతించవలసిందిగా 2018 సెప్టెంబర్ 5న మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకున్నాను. అది చట్టబద్ధ పద్ధతి. కాని ఇవాళ్టివరకూ ప్రభుత్వం నుంచి నాకు జవాబే రాలేదు. అయితే ఈలోగా హైకోర్టు పోలీసులను అభిశంసించడంతో పత్రికా సమావేశాలు ఆగిపోయాయి.

ఈ మొత్తం వ్యవహారంలో ఆర్ఎస్ఎస్ హస్తం బహిరంగంగానే ఉంది. ఆర్ఎస్ఎస్ నాయకులలో ఒకరైన రమేశ్ పతంగే, వారి అధికార పత్రిక పాంచజన్యలో 2015 ఏప్రిల్‌లోనే నేరుగా నన్ను లక్ష్యంగా చేసుకుని ఒక వ్యాసం రాశాడని నా మరాఠీ మిత్రులు చెప్పారు. ఆ వ్యాసంలో ఆయన నన్ను అరుంధతీ రాయ్, గెయిల్ ఆంవెడ్ట్ లతో కలిపి 'మాయావి అంబేద్కర్ వాది' అని ప్రస్తావించాడు. హిందూ పురాణాలలో మాయావి అంటే చంపవలసిన రాక్షసుడు. నేను సుప్రీంకోర్టు రక్షణలో ఉన్నప్పటికీ నన్ను చట్టవ్యతిరేకంగా పుణె పోలీసులు అరెస్టు చేసినప్పుడు హిందుత్వ సైబర్ ముఠా నా వికీమీడియా పేజిలో చొరబడి దాన్ని ధ్వంసం చేసింది. అది బహిరంగంగా అందరికీ అందుబాటులో ఉండే పేజి. అది ఉందని కూడ ఎన్నో సంవత్సరాలు నాకు తెలియదు. ఈ మూక మొదట ఆ పేజిలో ఉండే సమాచారాన్నంతా తొలగించి "ఇతను ఒక మావోయిస్టుకు సోదరుడు.... ఇతని ఇంటిని పోలీసులు సోదాచేశారు... మావోయిస్టులతో సంబంధాలున్నాయని ఇతణ్ని అరెస్టు చేశారు" వగైరా వాక్యాలు అక్కడ రాసిపెట్టారు. ఈ రాతలను తొలగించి అసలు పేజిని పునరుద్ధరించడానికి ఎన్నిసార్లు ప్రయత్నించినా, ఆ మూక వెంటనే చొరబడి, అసలు పేజిని తొలగించి, ఈ నిందాపూర్వకమైన మాటలతో నింపారని నా విద్యార్థులు ఆ తర్వాత చెప్పారు. చివరికి వికీమీడియా యాజమాన్యం జోక్యంతో పేజిని స్థిరీకరించడం జరిగింది గాని ఇప్పటికీ వారు పెట్టిన వ్యతిరేక సమాచారం అలాగే ఉంది.

మరొకవైపు నక్సల్ వ్యవహారాల నిపుణులు అనబడే ఆర్ఎస్ఎస్ వారి ద్వారా అనేక అబద్ధాలను ప్రచార సాధనాలలో హోరెత్తించారు. ఆ ఛానళ్ల మీద నా ఫిర్యాదులకూ, చివరికి ఇండియా బ్రాడ్ కాస్టింగ్ ఫౌండేషన్‌కు చేసిన ఫిర్యాదులకూ ఎటువంటి జవాబూ లేదు. ఆ తర్వాత నాతో సహా, ఎంతో మంది ఫోన్లలో ప్రభుత్వమే ప్రమాదకరమైన స్పైవేర్‌ను ప్రవేశపెట్టిందని పెగాసస్ కథనం 2019 అక్టోబర్‌లో బైటపడింది. పత్రికలలో కొద్ది రోజులపాటు గగ్గోలు వినబడింది గాని అంత తీవ్రమైన విషయం కూడ అర్థాంతరంగా ముగిసి పోయింది.

నేనొక మామూలు మనిషిని. తన భుక్తి తాను నిజాయితీగా సంపాదించుకునే మనిషిని. తన జ్ఞానంతో రచనల ద్వారా ప్రజలకు వీలైనంతవరకు సహాయం చేయాలనుకునే మనిషిని. కార్పొరేట్ ప్రపంచంలో, అధ్యాపకుడిగా, పౌరహక్కుల కార్యకర్తగా, ప్రజా మేధావిగా అనేక రకాలుగా ఈ దేశానికి దాదాపు ఐదు దశాబ్దాలుగా సేవ చేస్తున్న మచ్చలేని చరిత్ర ఉన్న వ్యక్తిని. ముప్పైకి పైగా పుస్తకాలు, అంతర్జాతీయంగా అచ్చయిన లెక్కలేనన్ని పత్రాలు, వ్యాసాలు, వ్యాఖ్యలు, శీర్షికలు, ఇంటర్వ్యూలు కలిసిన నా అపారమైన రచనలలో హింసనూ, ఏదైనా విధ్వంసక ఉద్యమాన్నీ సమర్థించే ఒక్క సూచనైనా దొరకదు. కాని నా జీవితపు చివరి రోజుల్లో నామీద భయానకమైన యుఎపిఎ చట్టం కింద ఘోరమైన నేరాలు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వమూ, దానికి విధేయంగా ఉన్న ప్రచారసాధనాలూ చేసే ఉధృత ప్రచారాన్ని నా వంటి వ్యక్తి ఎదిరించడం సాధ్యం కాదు. ఈ కేసు వివరాలు ఇంటర్నెట్ మీద ఎక్కడైనా దొరుకుతాయి. అది ఒక గందరగోళపు, హింసాతత్వపు కల్పన అని ఎవరికైనా అర్థమవుతుంది. ఆ కేసు గురించి సంక్షిప్త వివరణ ఆల్ ఇండియా ఫోరం ఫర్ రైట్ టు ఎడ్యుకేషన్ వెబ్ సైట్ మీద ఉంది. దాని సారాంశం ఇక్కడ ఇస్తాను:

ఈ కేసులో అరెస్టయిన ఇద్దరు వ్యక్తుల కంప్యూటర్లలో దొరికాయని పోలీసులు చెపుతున్న 13 ఉత్తరాల్లో ఐదు ఉత్తరాల ఆధారంగా నన్ను ఈ కేసులో ఇరికించారు. నా దగ్గర దొరికిన ఆధారమేదీ లేదు. ఆ ఉత్తరంలో 'ఆనంద్' అనే పేరు ఉంది. భారతదేశంలో ఆ పేరు అతి సాధారణమైన పేరు. కాని పోలీసులు మాత్రం ఎటువంటి సందేహాలు లేకుండా అది నాదే అంటున్నారు. ఆ ఉత్తరాలను ఇప్పటికే ఎందరో నిపుణులు, చివరికి ఒక సుప్రీం కోర్టు న్యాయమూర్తి కూడ కొట్టివేశారు. మొత్తం న్యాయవ్యవస్థలో ఇప్పటివరకూ సాక్ష్యాధారాల స్వభావం గురించి మాట్లాడిన ఏకైక న్యాయమూర్తి ఆయనే. సరే, ఆ ఉత్తరాల రూపమూ సారమూ ఎలా ఉన్నప్పటికీ, వాటిలో ఉన్న విషయాలేవీ కూడ అతి మామూలు నేరం అనబడేదానికి సుదూరంగా కూడ రావు. కాని ఒక వ్యక్తికి ఎటువంటి రక్షణ కల్పించని, నిస్సహాయుడిగా మార్చే యుఎపిఎ చట్టంలోని అతి భయంకరమైన నిబంధనల సహాయంతో నన్ను జైలు పాలు చేస్తున్నారు.

మీకు సులభంగా అర్థం అయ్యేందుకు ఈ కేసును వివరిస్తాను: హఠాత్తుగా ఒక పోలీసు బలగం మీ ఇంటి మీద పడుతుంది. ఎటువంటి వారంట్ చూపకుండానే మీ ఇంటిని చిందర వందర చేస్తారు. చివరికి మిమ్మల్ని అరెస్టు చేసి ఒక లాకప్‌లో పడేస్తారు. తర్వాత, ఫలానా స్థలంలో ఒక దొంగతనం కేసునో, మరేదో ఫిర్యాదునో పరిశోధిస్తున్నప్పుడు పోలీసులకు ఫలానా వ్యక్తి దగ్గర ఒక పెన్ డ్రైవో, కంప్యూటరో దొరికిందనీ, దానిలో ఏదో ఒక నిషిద్ధ సంస్థకు చెందినవాడని భావించబడుతున్న ఫలానా వ్యక్తి రాసిన ఉత్తరాలు దొరికాయనీ, అందులో ఫలానా వ్యక్తి పేరు ఉందనీ, ఆ ఫలానా వ్యక్తి మీరేననీ పోలీసులు కోర్టుకు చెపుతారు. ఒక బ్రహ్మాండమైన కుట్రలో ఒకానొక భాగంగా మిమ్మల్ని చూపుతారు. హఠాత్తుగా మీ ప్రపంచమంతా తలకిందులైపోతుంది. మీ ఉద్యోగం పోతుంది. కుటుంబానికి నిలువనీడ పోతుంది. ప్రచార సాధనాలలో మీ మీద దుష్ప్రచారం సాగుతుంది. మీరు వాటికి జవాబు చెప్పుకునే అవకాశం కూడ ఉండదు. మీమీద ప్రాథమిక సాక్ష్యాధారాలున్నాయనీ, అందువల్ల మిమ్మల్ని కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించవలసి ఉన్నదనీ జడ్జిలను ఒప్పించడానికి పోలీసులు "సీల్డ్ కవర్లు" సమర్పిస్తారు. అసలు సాక్ష్యాధారాలే లేవనీ, ఉన్నవి కల్పితమైనవనీ మీరు వాదించినా జడ్జిలు ఆ మాట వినరు. అదంతా విచారణ సమయంలో చూడవచ్చునంటారు. కస్టడీలో ఇంటరాగేషన్ తర్వాత మిమ్మల్ని జైలుకు పంపుతారు. మీరు బెయిల్ కోరుతూ దరఖాస్తుల మీద దరఖాస్తులు పెట్టుకుంటారు. కాని కోర్టులు వాటిని నిరాకరిస్తాయి. ఇటువంటి నిందితులకు బెయిల్ రావడానికో, కేసు కొట్టుడుబోయి బైటికి రావడానికో సగటున 4 నుంచి 10 సంవత్సరాలు పడుతుందని ఇప్పటికి ఉన్న సమాచారం. ఇది అక్షరాలా ఎవరి విషయంలోనైనా జరగగల వ్యవహారం.

గౌతమ్ నవ్లాఖా రాసిన 'స్వేచ్ఛా గీతం'

ఢిల్లీలోని ఎన్ఐఎ ప్రధాన కార్యాలయంలో సరెండర్ అవడానికి వెళ్లబోతూ, ఈ వారం బైట గడపడానికి, నాకొక వారం స్వేచ్ఛ ఇవ్వడానికి ఏప్రిల్ 8న జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఇందిరా బెనర్జీ ఇచ్చిన తీర్పుకు సంతోషపడుతున్నాను. ఇప్పుడు నేనున్న పరిస్థితుల్లో, ఈ లాక్ డౌన్ సమయంలో కూడ, ఒక వారం రోజుల స్వేచ్ఛ అంటే చాల విలువైనది. ముంబాయిలోని ఎన్ఐఎ కార్యాలయంలో ఏప్రిల్ 6న నేను సరెండర్ కావాలని, దేశంలోని అత్యున్నత న్యాయస్థానం మార్చ్ 16న ఇచ్చిన ఉత్తర్వులను పాటించే దుస్థితిని ఎలా ఎదుర్కోవాలా అని నేను మథన పడుతున్నప్పుడు, ఈ వారం రోజుల పొడిగింపు ఉత్తర్వు వచ్చింది. పాత సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం నేను ముంబాయి వెళదామనుకున్నా లాక్ డౌన్ వల్ల ప్రయాణ సౌకర్యాలు లేవు. అటువంటి పరిస్థితుల్లో నేను ఏం చేయవలసి ఉంటుందో ఎన్ఐఎ ముంబాయి నుంచి ఎటువంటి ఉత్తర్వులూ రాలేదు. ఇప్పుడు నేను ఢిల్లీలోని ఎన్ఐఎ ప్రధాన కార్యాలయంలో సరెండర్ కావచ్చునని స్పష్టత వచ్చింది.

కొవిడ్19 మహమ్మారి మనకు విసిరిన సవాలును భారత ప్రధాన మంత్రి "జాతీయ అత్యవసర పరిస్థితి"గా అభివర్ణించారు. ఈలోగా, సర్వోన్నత న్యాయస్థానం కూడ ఇటీవలనే జైలు పరిస్థితుల విషయంలో జోక్యం చేసుకుని కిక్కిరిసిన జైళ్లలో ఖైదీలకూ, నిర్బంధితులకూ, జైలు సిబ్బందికీ, జైలు బాధ్యతల్లో ఉన్న ఇతరులకూ రానున్న ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని, అనుసరించవలసిన మార్గదర్శక సూత్రాలను ఇచ్చింది.

ఆ ప్రమాదం అలాగే ఉన్నప్పటికీ, జైళ్లలో కొవిడ్19 అంటువ్యాధి సోకిన సమాచారమేదీ ఇప్పటికి రాలేదు గనుక నాకు కాస్త ఊరట ఉంది. కాని కొవిడ్19 మధ్యలో నేను బందీగా ఉంటే ఏమవుతుందో అని నా ఆత్మీయులూ సన్నిహితులూ అనుభవిస్తున్న భయం నన్ను కూడ ప్రభావితం చేస్తున్నది.

కాని నిరాశ పడడం తప్ప నేను చేయగలిగిందేమీ లేదు. ఎందుకంటే, భారతదేశంలో మనందరినీ, ప్రపంచాన్నంతా ఆ మహమ్మారి చుట్టుముట్టినప్పటికీ, ఏప్రిల్ 8న సుప్రీం కోర్టు ఇచ్చిన క్లుప్తమైన ఆదేశంలో కొవిడ్19 మహమ్మారి గురించి మాట కూడ మాట్లాడలేదు.

ఏది ఏమైనా, నేనిప్పుడు వాస్తవ చట్ట ప్రక్రియను ఎదుర్కోవడం మొదలు పెట్టవలసి ఉంది. అంటే చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధ) చట్టం – యుఎపిఎ – నిబంధనలను ఎదుర్కోవలసి ఉంది. అటువంటి చట్టాలు సాధారణ చట్ట ప్రక్రియనూ, న్యాయ శాస్త్రాన్నీ తలకిందులు చేస్తాయి. 'నేరస్తుడిగా రుజువయ్యేవరకూ ఒక వ్యక్తిని నిర్దోషిగానే భావించాలి' అనే సాధారణ న్యాయ సూత్రం ఇంకెంతమాత్రమూ వర్తించదు. ఇటువంటి చట్టాల ప్రకారం, "నిర్దోషిగా తేలేంతవరకూ ప్రతి నిందితుడూ నేరస్తుడే."

యుఎపిఎలో అత్యంత కఠినమైన శిక్షలు విధించే దుర్మార్గమైన నిబంధనలున్నాయి గాని, సాక్ష్యాధారాల విషయంలో, ప్రత్యేకించి ఎలక్ట్రానిక్ సాక్ష్యాధారాల విషయంలో అనుసరించే పద్ధతులు మాత్రం అంతే కఠినంగా, కచ్చితంగా లేవు. మామూలుగా ఏ న్యాయ విచారణలోనైనా సాక్ష్యాధారాల విషయంలో కఠినంగా, కచ్చితంగా ఉండే పద్ధతులను, ఈ చట్టాల కింద మాత్రం ఎటువడితే అటు సాగదీయగలిగేలా మార్చారు. ఇటువంటి రెండంచెల దాడి వల్ల, జైలే సాధారణమూ, బెయిల్ మినహాయింపూ అవుతుంది. ఈ అధివాస్తవిక ప్రపంచంలో విచారణా ప్రక్రియే శిక్ష అవుతుంది.

ఇప్పుడిక నాకూ నా సహనిందితులకూ వేగవంతమైన, న్యాయమైన విచారణ అందుతుందనే ఆశ మాత్రమే మిగిలింది. అటువంటి వేగవంతమైన, న్యాయమైన విచారణ జరిగినప్పుడు మాత్రమే ఇందులో నుంచి నా పేరు తొలగించుకోవడానికీ, మళ్లీ స్వేచ్ఛగా బైట తిరగడానికీ వీలవుతుంది. ఈలోగా నేనింతకాలం చేసుకున్న అలవాట్లను తొలగించుకోవడానికి జైలు జీవితం వీలు కల్పిస్తుంది.

అలా బైటికి వచ్చినప్పుడు మళ్లీ కలుద్దాం.

అప్పటివరకూ బాబ్ మార్లే పాడినట్టుగా,

"మీరు నాకొక సాయం చేయరూ...
నేనీ స్వేచ్ఛాగీతాలు పాడడానికి
సాయం చేయరూ...
ఎందుకంటే
నేనింతదాకా చేసినది
విముక్తి గీతాలు పాడడమే
విముక్తి గీతాలు...
స్వేచ్ఛా గీతాలు....

మీ
గౌతమ్ నవ్లాఖా
ఏప్రిల్ 14, 2020,
న్యూ ఢిల్లీ

వీ

అమాయకమైన వ్యక్తుల స్వేచ్ఛలను, రాజ్యాంగ హక్కులను ఈ రకంగా కొల్లగొట్టే భయానకమైన చట్టాలను 'దేశం' పేరు మీద రాజ్యాంగ బద్ధమైనవిగా తీసుకువస్తున్నారు. భిన్నాభిప్రాయాన్ని ధ్వంసం చేయడానికి, ప్రజలను చీల్చడానికి రాజకీయ వర్గం దేశం, దేశభక్తి అనే పదాలను దురహంకారపూరిత ఆయుధాలుగా వాడుకుంటున్నది. ఈ మూక మనస్తత్వం హేతుబద్ధ ఆలోచనను సంపూర్ణంగా రద్దు చేసింది. సాధారణ పదాల అర్థాలను తలకిందులుగా మార్చివేసింది. ఇప్పుడిక దేశాన్ని ధ్వంసం చేస్తున్నవాళ్లు దేశభక్తులుగా పిలవబడుతున్నారు. నిస్వార్థమైన ప్రజా సేవకులు దేశద్రోహులుగా పిలవబడుతున్నారు. నా భారతదేశం ఇలా విధ్వంసం పాలవుతుండగా చూస్తున్న నేను ఈ విచారకర సమయాన ఒక బలహీనమైన ఆశతో మీకీ ఉత్తరం రాస్తున్నాను. సరే, నేనిక నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ కస్టడీకి వెళుతున్నాను. ఎప్పటికి మళ్లీ మీతో మాట్లాడగలనో తెలియదు. కాని, మీ వంతు రాకముందే మీరు మాట్లాడతారని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను. వీ

కవి వరవరరావు ప్రాణాలు కాపాడండి

మోడీకి 40 మంది సుప్రసిద్ధ భారతీయ కవుల విజ్ఞప్తి

గౌరవనీయ భారత ప్రధాన మంత్రి గారూ,

మన దేశం చరిత్రలోకెల్లా అత్యంత దారుణమైన క్లిష్ట సమయాన్ని ఎదుర్కొంటున్నది. కరోనా వైరస్ వ్యాప్తి మనందరి మీద అప్పటికే ఉన్న సామాజిక, రాజకీయ, ఆర్థిక సవాళ్లకు తోడుగా ఒక బృహత్తర బాధ్యతను పెట్టింది. ఈ సమయంలో మన ప్రజానీకంలో కనీస మనుగడ కోసమే తక్షణమే పట్టించుకోవలసిన, సహాయ సహకారాలు అందించవలసిన సమూహాలెన్నో ఉన్నాయి. అటువంటి సమూహాలలో ఒకటి జైళ్లలో నిర్బంధితుల సమూహం. వారి జైలు జీవిత స్థితి వారిని ప్రమాద తీవ్రతకు గురి చేస్తున్నది.

2018 నవంబర్ నుంచి జైలులో ఉన్న కవి శ్రీ వరవరరావు పక్షాన ఒక ఆర్ద్రమైన విజ్ఞప్తి ఇదివరకే వెలువడింది. ఆయనను, ఆయనతో పాటు తొమ్మిది మంది ప్రజా మేధావులను భీమా కోరేగాం కేసులో ఇరికించి యుఎపిఎ చట్టంలోని అనేక నిబంధనల కింద నేరారోపణలు చేశారు. ఈ నిర్బంధితులకు న్యాయం ఇమ్మనీ, తక్షణమే బెయిల్ మీద విడుదల చేయమనీ దేశంలోనూ, అంతర్జాతీయంగానూ ఎన్నో ప్రచార ఆందోళనలు జరుగుతున్నాయి. ప్రభుత్వానికీ, అధికారవర్గాలకూ భిన్నాభిప్రాయం ప్రకటించినందుకూ, విమర్శించినందుకూ వారి గొంతులను నులిమే ప్రయత్నంలో భాగంగానే వారి మీద ఈ కేసులు తయారుచేశారని ఎన్నో వాదనలు వచ్చాయి.

శ్రీ వరవరరావు సుప్రసిద్ధ కవి, రచయిత. ఆధునిక తెలుగు కవిత్వంలో మార్పు తెచ్చిన వైతాళికుడు. ఎనభై సంవత్సరాల పెద్దమనిషి. ఆ వయసు వల్ల, దిగజారుతున్న ఆరోగ్యం వల్ల, జైలులో ఖైదీలు కిక్కిరిసి ఉన్నందువల్ల ఆయనకు వ్యాధులు అంటుకునే ప్రమాద తీవ్రత హెచ్చు. ఆయనతో పాటు ఉన్న మరొక నిర్బంధితులు శ్రీ వర్నన్ గోంజాల్వెస్ న్యాయవాదికి పంపించిన ఒక సమాచారంలో వరవరరావు గారి ఆరోగ్యస్థితి ఆందోళనాకరంగా ఉన్నదని మా దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో సహాయం అందించమనే విజ్ఞప్తిని మేము అత్యంత తీవ్రమైన ఆందోళనతో పరిగణిస్తున్నాం.

అందువల్ల, భారతదేశంలోని వివిధ భాషలకు చెందిన కవులమైన మేము కవి వరవరరావు ప్రాణాలను కాపాడేందుకు ఆయనను తక్షణమే విడుదల చేయవలసిందిగా భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేస్తున్నాము.

కరోనా వైరస్ మహావిపత్తు సందర్భంలో ప్రమాద తీవ్రత హెచ్చుగా ఉన్న ఇతర నిర్బంధితులందరినీ కూడ విడుదల చేసే విషయం పరిగణనలోకి తీసుకోవలసిందిగా మేము ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాము.

సత్యంలో, న్యాయంలో అత్యంత విశ్వాసంతో,

మీ

1) గుల్జార్ (ఉర్దూ/పంజాబీ)	2) అశోక్ వాజపేయి (హిందీ)	3) మంగ్లేశ్ దబ్రాల్ (హిందీ)
4) సచ్చిదానందన్ (మలయాళం)	5) కె శివారెడ్డి (తెలుగు)	6) కె జి శంకర పిళ్ళై (మలయాళం)
7) యుమ్లెంబం ఇబోమ్చా (మణిపురి)	8) రాబిన్ గాంగోమ్ (ఇంగ్లిష్/ మణిపురి)	9) మమంగ్ దాయి (ఆది/ఇంగ్లిష్)
10) చంద్రకాంత్ పాటిల్ (మరాఠీ/హిందీ)	11) గౌహర్ రజా (ఉర్దూ)	12) కేకి ఎం దారూవాలా (ఇంగ్లిష్)
13) ప్రబోధ్ పారిఖ్ (గుజరాతీ)	14) సుకుమారన్ (తమిళం)	15) జీత్ థాయిల్ (ఇంగ్లిష్)
16) ప్రతిభా నందకుమార్ (కన్నడం)	17) నవీన్ వాసిరెడ్డి (తెలుగు)	18) వి ఎం గిరిజ (మలయాళం)
19) హేమంత్ దివాటే (మరాఠీ)	20) నీలిం కుమార్ (అస్సామీ)	21) తరన్నుం రియాజ్ (ఉర్దూ)
22) ఆరంబం మెంచోబి (మణిపురి)	23) సుబోధ్ సర్కార్ (బెంగాలీ)	24) పి పి రామచంద్రన్ (మలయాళం)
25) ఇవి రామకృష్ణన్ (ఇంగ్లిష్)	26) రఫీఖ్ అహ్మద్ (మలయాళం)	27) సల్మా (తమిళం)
28) మేనకా శివదాసాని (ఇంగ్లిష్)	29) కె ఆర్ టోనీ (మలయాళం)	30) ఎస్ జోసెఫ్ (మలయాళం)
31) అన్వర్ అలీ (మలయాళం)	32) అనితా తంపి (మలయాళం)	33) జీబన్ నారా (అస్సామీ)
34) అనుభవ్ తులసి (అస్సామీ)	35) మోనికా కుమార్ (హిందీ/పంజాబీ)	36) పి ఎన్ గోపీకృష్ణన్ (మలయాళం)
37) మమతా సాగర్ (కన్నడం)	38) కుట్టి రేవతి (తమిళం)	39) మీనా కందసామి (ఇంగ్లిష్)
40) శ్రీదలా స్వామి (ఇంగ్లిష్)		

వీ

మాడపాటి సత్యవతి కన్నుమూత

ఆల్ ఇండియా రేడియోలో మూడున్నర దశాబ్దాలు న్యూస్ రీడర్, న్యూస్ ఎడిటర్‌గా పనిచేసిన మాడపాటి సత్యవతి(84) మార్చ్ 4న హైదరాబాద్‌లో మృతిచెందారు. హైదరాబాద్ విమోచన ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన మాడపాటి రామచందర్‌రావు కుమార్తె అయిన సత్యవతి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎంఎ తెలుగులో పట్టా పొందారు. ఆల్ ఇండియా రేడియో విజయవాడ, హైదరాబాద్‌లో పలు విభాగాల్లో సేవలందించారు.

పొత్తూరి వెంకటేశ్వరరావు మృతి

ప్రముఖ పాత్రికేయులు పొత్తూరి వెంకటేశ్వరరావు(86) కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మార్చ్ 5న హైదరాబాద్‌లోని విజయనగర్‌కాలనీలో మరణించారు. పొత్తూరి వెంకటేశ్వరరావు 1934 ఫిబ్రవరి 8న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పొత్తూరులో జన్మించారు. ఆంధ్రజ్యోతి వ్యవస్థాపక సంపాదకుడు నార్ల వెంకటేశ్వరరావు రచనల ప్రేరణతో, 1957లో ఆంధ్రజనత పత్రిక ద్వారా పాత్రికేయ వృత్తిలోకి వచ్చారు. ఆంధ్రభూమి సహాయ సంపాదకుడిగా, ఈనాడు, అంధ్రప్రభ, ఉదయం పత్రికల్లో సంపాదకుడిగా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా వ్యవహరించారు. నాటి పత్రికల–మేటి విలువలు తదితర గ్రంథాలు రాశారు. ఆయన పరిశోధనా గ్రంథం 'ఆంధ్రజాతి అక్షర సంపద – తెలుగు పత్రికలు' రాశారు. ప్రభుత్వాన్ని, నక్సలైట్లను శాంతి చర్చలకు ఒప్పించడంలో పౌరస్పందన వేదికసభ్యుడిగా కీలకపాత్ర పోషించారు.

పసుపు బోర్డు కోసం రైతుల ధర్నా

పసుపు పంటకు మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ పసుపు రైతులు రైతు ఐక్యవేదిక అధ్వర్యంలో జగిత్యాల కలెక్టర్ కార్యాలయం ఎదుట మార్చ్ 5న ధర్నా చేశారు. తహసీల్దార్ చౌరస్తా నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. పసుపుకు క్వింటాకు రు. 15 వేల మద్దతు ధర, 2 వేల బోనస్, పసుపు బోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు.

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమిషనర్ తొలగింపు

ఆంధ్రప్రదేశ్‌లో కరోనా వైరస్ కారణంగా స్థానిక ఎన్నికలను వాయిదా వేసిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్ కుమార్ పదవి కాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్‌తో మూడేళ్లకే కుదించింది. ఇప్పటివరకు రిటైర్డ్ ఐఎఎస్‌లను నియమిస్తున్న ఆ పదవిలో హైకోర్టు రిటైర్డ్ జడ్జీలను నియమించేలా మరో మార్పు తీసుకొచ్చింది. ఏప్రిల్ 10న ఆన్‌లైన్‌లో రాష్ట్ర మంత్రులతో కేబినెట్ సమావేశం నిర్వహించి ఆర్డినెన్స్ ఆమోదించింది. దీనిని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ కూడా ఆమోదించారు.

కరోనా పై అభ్యంతరకర పోస్టుల పేరుతో కేసులు

మతకల్లోలాలను ప్రేరేపించేలా ఫేస్‌బుక్‌లో పోస్టులు చేసిన శాతవాహన యూనివర్సిటీ ప్రొ. సూరేపల్లి సుజాతపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ వన్‌టౌన్ సిఐ విజయ్‌కుమార్ తెలిపారు. కరోనా బాధితులు ఒకే వర్గానికి చెందినవారనే అర్థం వచ్చేలా ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని తెలిపారు. ఏప్రిల్ 2న వివిధ చట్టాల కింద సుమోటోగా కేసు నమోదు చేశామన్నారు. సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టిన వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం నాగులపల్లికి చెందిన పి. రాంరెడ్డి, మధుకర్‌లపై పోలీసులు కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రజాస్వామిక వాదుల విడుదల కోరుతూ నిరసన

ప్రొ. ఆనంద్ తేల్తుంబ్డేపై పెట్టిన కేసును ఎత్తివేసి ఉపా చట్టాన్ని రద్దుచేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. అరెస్ట్ చేసిన మేధావులు ఆనంద్ తేల్తుంబ్డే, గౌతమ్ నవ్లాఖా, వరవరరావు తదితరులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పాలమూరు అధ్యయన వేదిక కార్యకర్తలు తమ ఇళ్లలో ఏప్రిల్ 14న నిరాహార దీక్షలు చేశారు.

మార్పు సీతారామయ్య మృతి

రైతు ఉద్యమ నేత మార్పు సీతారామయ్య(82) అనారోగ్యంతో ఏప్రిల్ 19న శ్రీకాకుళం జిల్లాలోని మదనాపురంలో మృతిచెందారు. ఆ జిల్లాలో తొలితరం కమ్యూనిస్టు, స్వాతంత్ర సమర యోధుడు, రైతు ఉద్యమ నేత, పౌర హక్కుల నాయకులుగా ఈయన ప్రసిద్ధి చెందిన వారు. తన పద్నాలుగో యేటనే తండ్రితోపాటు జైలు జీవితాన్ని గడిపారు. 1984లో సోంపేట–మందస రైతాంగం ఐక్య కార్యాచరణగా సాగించిన పోరాటానికి సీతారామయ్య మందస మండలం బాలిగాం–హరిపురం కూడలిలో నిరాహార దీక్షలో రెండు వారాలపాటు కూర్చొని అప్పటి ప్రభుత్వం కళ్లు తెరిపించారు. తాగునీటి కోసం కళింగదళ్, దబార్సింగి నీటి పారుదల ప్రాజెక్టుల సాధనకు సీతారామయ్య ఉద్యమించి ప్రాజెక్టుల జలాలను పొలాలకు మళ్లించే పోరాటంలో కీలక పాత్రను నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘానికి శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్షునిగా బాధ్యత వహించారు. 1996 మార్పు పద్మనాభం స్మారకంగా నెలకొల్పిన 'మార్పు గ్రంథాలయ' నిర్వహణలో ప్రధాన పాత్రను నిర్వహించారు.

గిరిజనులకు 100 శాతం కోటా చట్టవిరుద్ధం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో షెడ్యూల్డ్ ప్రాంతాలలోని పాఠశాలల్లో టీచింగ్ పోస్టులలో గిరిజనులకు 100 శాతం రిజర్వేషన్లు అమలుచేయడం చట్ట విరుద్ధమని, ఆమోదయోగ్యం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో గిరిజనులకు 100 శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని సవాలు చేస్తూ చేబ్రోలు లీలా ప్రసాద్ రావు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఏప్రిల్ 22న తుది తీర్పు వెల్లడించింది.

యురేనియం సర్వే అడ్డగింత

నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ నల్లమల అడవిలో యురేనియం సర్వేకు వచ్చిన సిపిఎఫ్, యుసిఐఎల్ కేంద్ర బృందాలను సిపిఐ(ఎం) నాయకులు గోపాలు, ఇతర ప్రజా సంఘాల నాయకులు అడ్డుకోగా.. పోలీసులు వారిని అరెస్టు చేశారు. తాము కేవలం శాంపిల్స్ కోసమే వచ్చామంటూ కేంద్ర బృందం చెప్పింది. నల్లమలలో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా వచ్చిన నిరసల కారణంగా కొంతకాలం ఆగినా.. కేంద్ర ప్రభుత్వం చాపకింద నీరులా మొదలుపెట్టిందంటున్నారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో అటవీ ప్రాంతంలో విస్తృతంగా రహదారులు వేసి యురేనియం తవ్వకాలు చేపట్టేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తుందన్నారు.

విశాఖ ఎల్జీ పాలిమర్స్‌లో ప్రమాదం

విశాఖ జిల్లా గోపాలపట్నం మండలంలో ఉన్న ఎల్జీ పాలిమర్స్ కంపెనీలో రెండు ట్యాంకుల్లో నిల్వ ఉంచిన 2500 లీటర్ల స్టైరిన్ గ్యాస్ మే 7 తెల్లవారుజామున నుంచి లీకైంది. దీంతో రసాయన ఆవిరి చుట్టుపక్కల ఉన్న వెంకటాపురం, ఆర్‌ఆర్ వెంకటాపురం, నందమూరి నగర్, పద్మనాభ నగర్, ఎస్‌సి, బిసి కాలనీ, జనతా కాలనీ, కంపరపాలెం గ్రామాల్లోకి ప్రవేశించింది. అప్పటికి ప్రజలంతా నిద్రలో ఆ వాయువు పీల్చి కొందరు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఘాటైన వాసనతో ఊపిరాడక చాలామంది మేల్కొని భయంతో ఊరికి దూరంగా పరుగులు తీశారు. ఈ ప్రయత్నంలో కొందరు దారిలోనే స్పృహ కోల్పోయారు. ఈ ఘటనలో పదకొండు మంది మరణించగా, 316 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

తెలుగు రాష్ట్రాల్లో కరోనా ప్రభావం

కరోనా వైరస్ బారిన పడి ఆంధ్రప్రదేశ్‌లో మే 9 వరకు 1,320 కేసులు నమోదు కాగా 44 మంది మృతిచెందారు. తెలంగాణలో కరోనా వైరస్‌తో బాధపడుతున్న వారి సంఖ్య 1,163 కాగా మరణించిన వారు 30 మంది. మే 9న ఒక్కరోజే 31 కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. లాక్‌డౌన్ కొనసాగుతూనే ఉన్నా కేసులు పెరుగుతూనే ఉన్నాయి. తెలంగాణలో ప్రభుత్వం మే 29 వరకు లాక్‌డౌన్ ప్రకటించింది. వీ

సిఎఎ నిరసనకారులపై ఢిల్లీలో దాడులు

పౌరసత్వ చట్టానికి నిరసనగా ఢిల్లీలోని జాఫ్రాబాద్‌లో ఆందోళన చేస్తున్న నిరసనకారులపై ఫిబ్రవరి 23న ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి కార్యకర్తలు జైశ్రీరాం నినాదాలు చేస్తూ రాళ్ల దాడికి పాల్పడ్డారు. సిఎఎకు అనుకూలంగా మౌజ్‌పూర్‌లో కపిల్ మిశ్రా ఆధ్వర్యంలో ర్యాలీ నిహించారు. సిఎఎ నిరసనకారులను లక్ష్యంగా చేసుకొని ఫిబ్రవరి 23 నుంచి మార్చ్ 1న వరకు ఈశాన్య ఢిల్లీలోని మౌజ్‌పూర్, జాఫ్రాబాద్‌లోని మైనారిటీల ఇళ్లు, మసీదులు, దుకాణాలు, వాహనాలు, పెట్రోల్ బంకులకు నిప్పు పెట్టారు. ఈ దాడుల్లో 42 మంది మరణించగా 350 మందికి పైగా గాయపడ్డారు. వేలాది మంది కట్టుబట్టలతో శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్నారు.

హర్యానాలోని కెమికల్ ఫ్యాక్టరీలో ప్రమాదం

హర్యానాలోని బహదుర్గ్‌లోని పారిశ్రామిక ప్రాంతంలోని కెమికల్ ఫ్యాక్టరీలో ఉన్న బాయిలర్ అధిక ఉష్ణోగ్రత కారణంగా పేలింది. ఫిబ్రవరి 28న జరిగిన ఈ ఘటనలో ఆరుగురు మృతిచెందగా 28 మంది గాయపడ్డారు. కంపెనీకి సమీపంలో ఉన్న ఏడు భవనాలు దెబ్బతిన్నాయి.

నిర్భయ దోషులకు అమలయిన ఉరిశిక్ష

నిర్భయ సామూహిక హత్యాచార దోషులను ఏడు సంవత్సరాల తరువాత అధికారులు ఉరి తీశారు. దోషులు ఉరిశిక్షపై స్టే ఇవ్వాలని కోరుతూ పెట్టుకున్న పిటిషన్‌పై సుప్రీంకోర్టు మార్చ్ 20 తెల్లవారుజామున 2:30 గంటల వరకు విచారణ జరిపి స్టే ఇచ్చేందుకు నిరాకరిస్తూ ఉరిశిక్షను యథావిధిగా అమలు చేయాలని ఆదేశించింది. నిర్భయ కేసులో దోషులుగా ఉన్న పవన్ గుప్తా(26), వినయ్ శర్మ(26), అక్షయ్ కుమార్(31), ముఖేష్ కుమార్(32)లను ఢిల్లీలోని తీహార్ జైలులో మార్చ్ 20 ఉదయం 5 గంటలకు ఉరితీసినట్లు తీహార్ జైలు డరెక్టర్ జనరల్ సందీప్ గోయల్ తెలిపారు.

మధ్యప్రదేశ్‌లో దొడ్డిదారిన అధికారంలోకి బిజెపి

మధ్యప్రదేశ్‌లో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆరుగురు మంత్రులు, 22 మంది ఎంఎల్‌ఎలు రాజీనామా చేయడంతో కాంగ్రెస్ పార్టీ మైనారిటీలో పడింది. దీంతో గవర్నర్ లాల్జీ టాండన్ నిర్ణయం మేరకు మార్చ్ 16న కాంగ్రెస్ బలపరీక్ష ఎదుర్కోవాల్సి ఉన్నప్పటికీ కరోనా కారణంతో స్పీకర్ ఎన్‌పి ప్రజాపతి దాన్ని మార్చ్ 26కు వాయిదా వేశారు. బల పరీక్షకు ముందే కమల్‌నాథ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. దీంతో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా శివరాజ్ సింగ్ చౌహాన్ నాల్గవసారి పదవి చేపట్టారు. మార్చ్ 23న గవర్నర్ లాల్జీ టాండన్ శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయించారు.

కశ్మీర్ స్థానికతను మార్చిన కేంద్రం

కరోనా వైరస్ భయంతో ఇళ్లకే పరిమితమైన కాలంలో కశ్మీర్ స్థానికతను కేంద్ర ప్రభుత్వం మార్చివేసింది. ఇప్పటివరకు ఆ రాష్ట్ర చట్టాల్లో ఉన్న 'పర్మనెంట్ రెసిడెన్స్' అన్న పదాన్ని కేంద్రం ఏప్రిల్ 1న విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ 'డొమిసెల్'గా మార్చింది. కశ్మీర్‌లో ఎవరైతే పదిహేనేళ్లకన్నా ఎక్కువ సంవత్సరాలు నివసిస్తే ఇకపై వారంతా స్థానికులే. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ ఉద్యోగులు, బ్యాంకు తదితర ప్రభుత్వ సంస్థల్లో పదేళ్లు పనిచేస్తే వారు స్థానికులు కావడంతో పాటు వారి పిల్లలకు కూడా అది సహజంగానే వర్తిస్తుంది. ఈ నిర్ణయాన్ని కశ్మీర్ పార్టీలు, స్థానిక ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

మీడియాపై కక్ష సాధింపు చర్యలు ఆపాలి

దేశవ్యాప్తంగా భారీ వలసలకు, వలస కూలీల్లో భయాందోళనలకు మీడియానే కారణమంటూ సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయడం తమకు తీవ్ర కలవరం కలిగించిందని ఎడిటర్స్ గిల్డ్ ప్రకటించింది. ప్రస్తుత సంక్షోభ సమయంలో కేంద్ర ప్రభుత్వ చర్య వార్తల ప్రసారానికి ఆటంకం కలిగిస్తుందన్నారు. సుప్రీం కోర్టు కరోనా వైరస్ పరిణామాల్లో ప్రభుత్వ అధికారిక ప్రకటనను తప్పనిసరిగా ప్రచురించాలనినే ఆదేశం అవాంఛనీయం, అనవసరమని వ్యాఖ్యానించింది. ది వైర్ వెబ్‌సైట్ సంపాదకుడు సిద్దార్థ వరదరాజన్ మీద ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం క్రిమినల్ సెక్షన్ల కింద ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడం మీడియాని బెదిరించడమేనని ఎడిటర్స్ గిల్డ్ ఏప్రిల్ 3న ప్రకటించింది.

ప్రొ. ఆనంద్ తేల్తుంబ్డే, గౌతమ్ నవ్లాఖాల అరెస్టు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ 129వ జయంతి రోజునే ప్రొ. ఆనంద్ తేల్తుంబ్డే, గౌతమ్ నవ్లాఖాలను ఉపా చట్టం కింద ఏప్రిల్ 14న అరెస్ట్ చేశారు. ఆనంద్ తేల్తుంబ్డే ఈ దేశ దళితులకు సమానహక్కుల సాధనకు పోరాడుతున్నారు. 'ఎనిహిలేషన్ ఆఫ్ కేస్ట్'తో సహా ఆయన పలు పుస్తకాలను రాశారు. గోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా, ఖర్గపూర్ ఐఐటి మొదలైన ఉన్నత విద్యా సంస్థల్లో ప్రతిష్ఠాత్మక బాధ్యతలు నిర్వహించారు. గౌతమ్ నవ్లాఖా ప్రముఖ పాత్రికేయుడు. పీపుల్స్ యూనియన్ ఆఫ్ డెమొక్రాటిక్ రైట్స్‌లో క్రియాశీల సభ్యుడు. కశ్మీర్, ఛత్తీస్‌గఢ్‌లలో మానవహక్కుల పరిరక్షణ ఉద్యమాలలో చురుగ్గా పాల్గొన్నారు.

కరోనా కాలంలో కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్‌లు

ఉత్తర కశ్మీర్‌లోని హంద్వారా ప్రాంతంలోని చంగిముల్లా గ్రామంలో స్థానికులను ఓ ఇంట్లో మిలిటెంట్లు బంధించారన్న సమాచారంతో మే 3న కల్నల్ అశుతోష్ శర్మ నేతృత్వంలో 21వ రాష్ట్రీయ రైఫిల్స్, జమ్మూకశ్మీర్ పోలీసులు అక్కడికి వెళ్లారు. ఈ ఆపరేషన్‌లో ఇద్దరు మిలిటెంట్లు మరణించగా, భద్రతా బలగాలకు చెందిన ఒక మేజర్ సహా ఐదుగురు భద్రతా సిబ్బంది మృతిచెందారు. మే 4న కుప్వారా జిల్లా వాంగమ్ ఖాజియాబాద్ మధ్య సిఆర్‌పిఎఫ్ చెక్‌పోస్టు వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక బాలుడితో సహా ముగ్గురు జవాన్లు మృతిచెందారు. మే 6న దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామా జిల్లా అవంతి పోరాలోని బీఘ్‌పోరా, షార్సల్లి గ్రామాల్లో కశ్మీర్ మిలిటెంట్లు, భద్రతా సిబ్బంది మధ్య జరిగిన కాల్పుల్లో బీఘ్‌పోరాలో రియాజ్ నైకూతో పాటు అతని అనుచరుడు, షార్సల్లిలో మరో ఇద్దరు మిలిటెంట్లు మరణించారు.

ఛత్తీస్‌గడ్‌లో ఎన్‌కౌంటర్‌ల పరంపర

ఛత్తీస్‌ఘడ్‌లోని సుక్మా జిల్లా చింతల్‌నార్ అటవీ ప్రాంతంలో మార్చ్ 22న కూంబింగ్‌కు వెళ్లిన భద్రతా బలగాలకు మావోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో 17 మంది జవాన్లు మృతిచెందగా 15 మంది గాయపడ్డారు. ముగ్గురు మావోయిస్టులు మృతిచెందినట్లుగా పోలీసులు ప్రకటించారు. గడ్చిరోలి జిల్లా జరవండి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో రాగో(48) మరణించిందని మహారాష్ట్ర పోలీసులు మే 2న తెలిపారు. ఛత్తీస్‌గడ్ అడవుల్లో మే 9న మావోయిస్టులు, సాయుధ పోలీసులకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరు, నలుగురు మావోయిస్టులు మరణించారు. మన్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పర్దోనీ గ్రామ సమీపంలోని అడవుల్లో సాయుధ పోలీసులు గాలిస్తుండగా ఈ ఘటన జరిగినట్లుగా పోలీసు అధికారులు వెల్లడించారు.

రైలు ప్రమాదంలో 16 మంది వలస కూలీల మృతి

లాక్‌డౌన్ కారణంగా 45 రోజులుగా ఉపాధిలేక వలస కూలీలు సొంత గ్రామాలకు కాలినడకన పయనమయ్యారు. రైలు పట్టాల వెంబడి 40 కిలోమీటర్లు ప్రయాణించి అలసిపోయి లాక్‌డౌన్‌లో రైలు రావని పట్టాలపైనే పడుకున్నారు. మే 7న తెల్లవారుజామున ఓ గూడ్స్‌రైలు వారిపై నుంచి పోవడంతో 16 మంది అక్కడికక్కడే చనిపోయారు. ఈ ప్రమాదం మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జిల్లా కర్మద్ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. మృతులంతా మధ్యప్రదేశ్‌లోని భుసావల్ పరిసర ప్రాంతాలకు చెందిన వారు.

దేశంలో కరోనా మృతులు

దేశం మొత్తం మీద కరోనా కేసులు మే 9 నాటికి 59,662 కాగా, మృతులు 1981గా అధికారిక లెక్కలు తెలియజేస్తున్నాయి. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం: ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషుల కోసం ఇంకాస్త బాధ్యతగానూ, జాగ్రత్తగానూ వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(మార్చ్ 1 నుండి మార్చ్ 31, 2020 వరకు తెలంగాణలోని 8 జిల్లాలు (838), ఆంధ్రప్రదేశ్‌లోని 10 జిల్లాలలో (726) అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 1564)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు									పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
				స్త్రీ	పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.									
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	–	2	–	16	19	12	6	4	3	3	2	1	1	4	32	34	–	–	–	3	–
హైదరాబాద్	–	–	–	17	28	4	9	5	3	5	5	7	7	7	33	14	–	–	–	2	–
కరీంనగర్	–	2	1	6	8	4	7	3	2	4	2	3	2	4	21	13	–	–	–	–	–
ఖమ్మం	వివరాలు అందలేదు																				
మహబూబ్‌నగర్	వివరాలు అందలేదు																				
మెదక్	–	12	3	6	7	4	2	2	1	3	4	4	4	12	19	29	–	–	–	3	1
నల్గొండ	–	2	–	4	5	3	5	3	2	4	3	6	2	3	26	11	–	–	–	1	2
నిజామాబాద్	–	–	–	3	4	4	8	2	1	2	2	3	1	3	13	12	–	–	–	–	–
వరంగల్	–	9	2	3	2	4	3	2	2	3	4	3	2	19	13	29	–	–	–	2	1
రంగారెడ్డి	–	3	–	6	8	4	6	3	5	4	3	5	4	7	26	18	–	–	–	–	3
తెలంగాణ	**-**	**30**	**6**	**61**	**81**	**39**	**46**	**24**	**19**	**28**	**29**	**32**	**23**	**59**	**183**	**160**	**-**	**-**	**-**	**11**	**7**
అనంతపురం	వివరాలు అందలేదు																				
చిత్తూరు	–	2	–	6	9	9	11	–	2	3	3	4	10	3	31	7	–	–	–	–	
కడప	వివరాలు అందలేదు																				
గుంటూరు	–	1	–	6	4	3	4	2	2	3	2	4	3	4	18	13	–	–	–	–	–
కృష్ణా	–	2	–	3	4	3	3	2	1	2	2	3	1	4	16	12	–	–	–	–	–
కర్నూలు	–	3	–	3	5	2	5	2	1	3	2	4	2	4	26	14	–	–	–	–	2
తూర్పు గోదావరి	–	–	–	2	3	4	6	1	–	2	2	3	2	2	25	24	–	–	–	–	–
ప్రకాశం	–	2	–	4	6	3	5	1	2	4	2	3	1	3	19	12	–	–	–	–	1
శ్రీకాకుళం	వివరాలు అందలేదు																				
పశ్చిమ గోదావరి	–	–	–	3	4	2	2	1	1	1	1	3	2	4	17	11	–	–	–	–	3
నెల్లూరు	–	3	–	5	7	3	6	2	2	4	3	4	1	4	22	14	–	–	–	–	2
విజయనగరం	–	–	–	3	4	4	4	3	1	1	1	2	3	6	13	9	–	–	–	–	4
విశాఖపట్నం	–	–	–	11	13	–	–	–	–	6	4	1	3	2	22	10	–	–	–	16	–
ఆంధ్రప్రదేశ్	**-**	**13**	**-**	**46**	**59**	**33**	**46**	**14**	**12**	**29**	**22**	**31**	**28**	**36**	**209**	**120**	**-**	**-**	**-**	**16**	**12**